# శ్రీ రామాయణ ప్రశ్నావళి

రచయిత

శ్రీ మారెళ్ళ వెంకట శేషారెడ్డి

ఇ. ప్రచురణ

తిరుమల తిరుపతి దేవస్థానములు

తిరుపతి.

2025

# శ్రీరామాయణము – ప్రశ్నావళి గురించి

ఆదిరామాయణ కర్త వాల్మీకి మహర్షి తన ఘంటము ద్వారా, ఏ శుభ సమయాన శ్రీమద్రామాయణాన్ని ప్రారంభించినాడో కాని, ఆయన చేసిన ప్రయత్నం వలన, ఈనాడు ప్రపంచమానవాళి అంతటికి రామచరిత్రను నరనరాన జీవింపజేశాడు. రామాయణం ఎప్పటికప్పుడు కొత్తగానే ఉంటుంది. కొన్ని వేల సంవత్సరాల నుండి అనేక మంది ఉద్దండులైన కవులు వ్రాసిన కావ్యాలన్నింటిలోనూ రామాయణపు ఛాయలు కనిపిస్తాయి. కాళిదాసాది మహాకవుల నుండి నేటి వరకుగల అనేక మంది రామాయణాన్ని చదివి విద్వత్తు ఉన్న ప్రతి వ్యక్తి రామాయణాన్ని అనువదించడమో లేక రామాయణాధారంగా చేతనైన వారు చేతనైనంతగా అనేక కావ్యాలను వెలయించినారు. అనగా సంక్షిప్త రామాయణాలు, భజనలు, కోలాటాలు, పాటలు, పద్యాలుగా, నాటకాలుగా, సినిమాలుగా, టి.వి. సీరియళ్ళుగా, ఇంకా అనేక విధాలుగా రామాయణం జన బాహుళ్యంలోకి వెళ్ళింది.

అందులో భాగంగా నేనుకూడా ఇంతకు ముందు వ్రాసిన మహాభారతము – ప్రశ్నావళి శ్రీ భాగవతము – ప్రశ్నావళి మాదిరిగానే శ్రీరామాయణము – ప్రశ్నావళి అను గ్రంథాన్ని వ్రాయడం జరిగింది. వాల్మీకి మహర్షి ఆరుకాండలతో, (535) అయిదు వందల ముప్పది ఐదు సర్గలతో వ్రాసినట్లుగా, గోవిందరాజీయ వ్యాఖ్యానము ననుసరించి అనువదించిన గీతాప్రెస్ వారి శ్రీమద్రామాయణము అనే గ్రంథములో ప్రచురింపబడినది.

ఈ గ్రంథము ఆధారముగా నేను తెలుగులో రామాయణాన్ని కావ్యంగా వ్రాయడం జరిగింది. ఈ కావ్యము ఆధారంగా రామాయణము – ప్రశ్నావళి అను గ్రంథాన్ని వ్రాయడానికి పూనుకొని రామాయణంలోని ఐదువందల ముప్పది ఐదు సర్గలను తొంబది తొమ్మిది అధ్యాయాలుగా విభజించి ఒక్కొక్క అధ్యాయానికి ఐదు ప్రశ్నల వంతున వ్రాయడం జరిగింది. ఈ ఐదు ప్రశ్నలలో రెండు ప్రశ్నలకు నాలుగేసి రాయితీ పదాలను ఇచ్చి,

అందులో సరియైన జవాబును చెప్పగలగాలి. పిమ్మట ఒక్క ప్రశ్నకు రాయితీ పదాలు ఏవీలేకుండా నేరుగా జవాబు చెప్పాలి. అనంతరం రెండు ప్రశ్నలకు చెప్పే సమాధానాలు, ఆ అధ్యాయంలోని సమగ్ర సారాంశం సంక్షిప్తంగానైనా తెలపాలి. ఈ విధమైన నా ప్రయత్నం ద్వారా చదువరులకు రామాయణముపై ఎంత అవగాహన, పట్టు ఉందో తెలుస్తుంది. కాగా ఈ పుస్తకం రామాయణముపై జరిగే క్విజ్ కార్యాక్రమాలలో పాల్గొనేందుకు, ఇంకనూ విద్యార్థినీ విద్యార్థులకు, రామాయణముపై కొంత అవగాహన ఏర్పడడానికి, కొన్ని ముఖ్యమైన ప్రశ్నలకు జవాబులు తెలుసుకోవడానికి ఎంతో ఉపయోగంగా ఉంటుందని నేను విశ్వసిస్తున్నాను.

ఇట్లు

రచయిత

**మారెళ్ళ వెంకట శేషారెడ్డి**

# విషయ సూచిక


| వ.సంఖ్య | విషయము | పేజీ నెం. |
|---|---|---|
| 1. | బాల కాండము - ఒకటవ అధ్యాయము | 11 |
| 2. | బాల కాండము - రెండవ అధ్యాయము | 13 |
| 3. | బాల కాండము - మూడవ అధ్యాయము | 15 |
| 4. | బాల కాండము - నాలుగవ అధ్యాయము | 17 |
| 5. | బాల కాండము - ఐదవ అధ్యాయము | 19 |
| 6. | బాల కాండము - ఆరవ అధ్యాయము | 21 |
| 7. | బాల కాండము - ఏడవ అధ్యాయము | 24 |
| 8. | బాల కాండము - ఎనిమిదవ అధ్యాయము | 26 |
| 9. | బాల కాండము - తొమ్మిదవ అధ్యాయము | 28 |
| 10. | బాల కాండము - పదియవ అధ్యాయము | 30 |
| 11. | బాల కాండము - పదకొండవ అధ్యాయము | 32 |
| 12. | బాల కాండము - పండ్రెండవ అధ్యాయము | 35 |
| 13. | బాల కాండము - పదమూడవ అధ్యాయము | 37 |
| 14. | అయోధ్యా కాండము - పదునాలుగవ అధ్యాయము | 40 |
| 15. | అయోధ్యా కాండము - పదునైదవ అధ్యాయము | 42 |
| 16. | అయోధ్యా కాండము - పదహారవ అధ్యాయము | 44 |
| 17. | అయోధ్యా కాండము - పదునేడవ అధ్యాయము | 46 |
| 18. | అయోధ్యా కాండము - పద్దెనిమిదవ అధ్యాయము | 49 |
| 19. | అయోధ్యా కాండము - పందొమ్మిదవ అధ్యాయము | 51 |
| 20. | అయోధ్యా కాండము - ఇరువదియవ అధ్యాయము | 54 |
| 21. | అయోధ్యా కాండము - ఇరువది ఒకటవ అధ్యాయము | 56 |
| 22. | అయోధ్యా కాండము - ఇరువది రెండవ అధ్యాయము | 58 |
| 23. | అయోధ్యా కాండము - ఇరువది మూడవ అధ్యాయము | 61 |
| 24. | అయోధ్యా కాండము - ఇరువది నాలుగవ అధ్యాయము | 63 |

25. అయోధ్యా కాండము - ఇరువది ఐదవ అధ్యాయము 66
26. అయోధ్యా కాండము - ఇరువది ఆరవ అధ్యాయము 68
27. అయోధ్యా కాండము - ఇరువది ఏడవ అధ్యాయము 71
28. అయోధ్యా కాండము - ఇరువది ఎనిమిదవ అధ్యాయము 73
29. అయోధ్యా కాండము - ఇరువది తొమ్మిదవ అధ్యాయము 76
30. అయోధ్యా కాండము - ముప్పదియవ అధ్యాయము 78
31. అయోధ్యా కాండము - ముప్పది ఒకటవ అధ్యాయము 81
32. అయోధ్యా కాండము - ముప్పది రెండవ అధ్యాయము 83
33. అరణ్య కాండము - ముప్పది మూడవ అధ్యాయము 86
34. అరణ్య కాండము - ముప్పది నాలుగవ అధ్యాయము 89
35. అరణ్య కాండము - ముప్పది ఐదవ అధ్యాయము 91
36. అరణ్య కాండము - ముప్పది ఆరవ అధ్యాయము 94
37. అరణ్య కాండము - ముప్పది ఏడవ అధ్యాయము 96
38. అరణ్య కాండము - ముప్పది ఎనిమిదవ అధ్యాయము 99
39. అరణ్య కాండము - ముప్పది తొమ్మిదవ అధ్యాయము 101
40. అరణ్య కాండము - నలుబదియవ అధ్యాయము 104
41. అరణ్య కాండము - నలుబది ఒకటవ అధ్యాయము 106
42. అరణ్య కాండము - నలుబది రెండవ అధ్యాయము 109
43. అరణ్య కాండము - నలుబది మూడవ అధ్యాయము 111
44. అరణ్య కాండము - నలుబది నాలుగవ అధ్యాయము 114
45. అరణ్య కాండము - నలుబది ఐదవ అధ్యాయము 116
46. అరణ్య కాండము - నలుబది ఆరవ అధ్యాయము 119
47. కిష్కింధా కాండము - నలుబది ఏడవ అధ్యాయము 122
48. కిష్కింధా కాండము - నలుబది ఎనిమిదవ అధ్యాయము 124
49. కిష్కింధా కాండము - నలుబది తొమ్మిదవ అధ్యాయము 127
50. కిష్కింధా కాండము - ఏబదియవ అధ్యాయము 129
51. కిష్కింధా కాండము - ఏబది ఒకటవ అధ్యాయము 132

52. కిష్కింధా కాండము - ఏబది రెండవ అధ్యాయము 134
53. కిష్కింధా కాండము - ఏబది మూడవ అధ్యాయము 137
54. కిష్కింధా కాండము - ఏబది నాలుగవ అధ్యాయము 139
55. కిష్కింధా కాండము - ఏబది ఐదవ అధ్యాయము 142
56. కిష్కింధా కాండము - ఏబది ఆరవ అధ్యాయము 144
57. కిష్కింధా కాండము - ఏబది ఏడవ అధ్యాయము 147
58. కిష్కింధా కాండము - ఏబది ఎనిమిదవ అధ్యాయము 149
59. సుందరా కాండము - ఏబది తొమ్మిదవ అధ్యాయము 152
60. సుందరా కాండము - అరువదియవ అధ్యాయము 154
61. సుందరా కాండము - అరువది ఒకటవ అధ్యాయము 157
62. సుందరా కాండము - అరువది రెండవ అధ్యాయము 159
63. సుందరా కాండము - అరువది మూడవ అధ్యాయము 162
64. సుందరా కాండము - అరువది నాలుగవ అధ్యాయము 164
65. సుందరా కాండము - అరువది ఐదవ అధ్యాయము 167
66. సుందరా కాండము - అరువది ఆరవ అధ్యాయము 170
67. సుందరా కాండము - అరువది ఏడవ అధ్యాయము 173
68. సుందరా కాండము - అరువది ఎనిమిదవ అధ్యాయము 175
69. సుందరా కాండము - అరువది తొమ్మిదవ అధ్యాయము 177
70. సుందరా కాండము - డెబ్బదియవ అధ్యాయము 180
71. సుందరా కాండము - డెబ్బది ఒకటవ అధ్యాయము 182
72. సుందరా కాండము - డెబ్బది రెండవ అధ్యాయము 185
73. సుందరా కాండము - డెబ్బది మూడవ అధ్యాయము 187
74. యుద్ధ కాండము - డెబ్బది నాలుగవ అధ్యాయము 190
75. యుద్ధ కాండము - డెబ్బది ఐదవ అధ్యాయము 192
76. యుద్ధ కాండము - డెబ్బది ఆరవ అధ్యాయము 195
77. యుద్ధ కాండము - డెబ్బది ఏడవ అధ్యాయము 197
78. యుద్ధ కాండము - డెబ్బది ఎనిమిదవ అధ్యాయము 199

| | | |
|---|---|---|
| 79. | యుద్ధ కాండము - డెబ్బది తొమ్మిదవ అధ్యాయము | 202 |
| 80. | యుద్ధ కాండము - ఎనుబదియవ అధ్యాయము | 204 |
| 81. | యుద్ధ కాండము - ఎనుబది ఒకటవ అధ్యాయము | 206 |
| 82. | యుద్ధ కాండము - ఎనుబది రెండవ అధ్యాయము | 208 |
| 83. | యుద్ధ కాండము - ఎనుబది మూడవ అధ్యాయము | 210 |
| 84. | యుద్ధ కాండము - ఎనుబది నాలుగవ అధ్యాయము | 212 |
| 85. | యుద్ధ కాండము - ఎనుబది ఐదవ అధ్యాయము | 215 |
| 86. | యుద్ధ కాండము - ఎనుబది ఆరవ అధ్యాయము | 217 |
| 87. | యుద్ధ కాండము - ఎనుబది ఏడవ అధ్యాయము | 220 |
| 88. | యుద్ధ కాండము - ఎనుబది ఎనిమిదవ అధ్యాయము | 222 |
| 89. | యుద్ధ కాండము - ఎనుబది తొమ్మిదవ అధ్యాయము | 225 |
| 90. | యుద్ధ కాండము - తొంబదియవ అధ్యాయము | 227 |
| 91. | యుద్ధ కాండము - తొంబది ఒకటవ అధ్యాయము | 229 |
| 92. | యుద్ధ కాండము - తొంబది రెండవ అధ్యాయము | 232 |
| 93. | యుద్ధ కాండము - తొంబది మూడవ అధ్యాయము | 234 |
| 94. | యుద్ధ కాండము - తొంబది నాలుగవ అధ్యాయము | 237 |
| 95. | యుద్ధ కాండము - తొంబది ఐదవ అధ్యాయము | 239 |
| 96. | యుద్ధ కాండము - తొంబది ఆరవ అధ్యాయము | 242 |
| 97. | యుద్ధ కాండము - తొంబది ఏడవ అధ్యాయము | 244 |
| 98. | యుద్ధ కాండము - తొంబది ఎనిమిదవ అధ్యాయము | 246 |
| 99. | యుద్ధ కాండము - తొంబది తొమ్మిదవ అధ్యాయము | 249 |

ఓం

శ్రీరామ

శ్రీ వెంకటేశ్వర పరబ్రహ్మణే నమః

# శ్రీ రామాయణము - ప్రశ్నావళి

## 1. బాల కాండము

### 1, 2, 3, 4, 5, 6 సర్గలు

### ఒకటవ అధ్యాయము

1. ప్రశ్న : శ్రీమన్నారాయణుడు కల్పాదియందు సృష్టి ప్రారంభించ నెంచి, ముందుగా తన సంకల్ప మాత్రం చేత ఎవరిని సృష్టించాడు ?

జవాబు : 1. వైవశ్వత మనువును 2. చతుర్ముఖ బ్రహ్మను

3. మరీచిని 4. నారద మహర్షిని

2. ప్రశ్న : అడవిలో నిషాదుడు క్రౌంచపక్షుల జంటలో ఒకదానిని నేలకూల్చిన దృశ్యాన్ని చూసిన వాల్మీకి మహర్షి ఆ సమయంలో ఏ నదీ తీరాన స్నానానికై వెళ్ళి అక్కడ ఉన్నాడు ?

జవాబు : 1. గంగానది 2. యమునానది

3. నర్మదానది 4. తమసానది

3. ప్రశ్న : నారద మహర్షిచేత తన సందేహ నివృత్తి చేసుకొన్న వాల్మీకి మహర్షి బ్రహ్మదేవుని అనుగ్రహంతో తాను వ్రాసిన రామాయణాన్ని మొదటగా ఎవరిచేత లోకంలో ప్రచారం చేయించాడు ?

జవాబు : జవాబుల కాలంలో ఉంది.

4. ప్రశ్న : కుశలవులు అయోధ్యలో రామాయణ గానం చేయడానికి, వారికి గల అర్హత ఏమిటి ?

జవాబు : వాల్మీకి మహర్షి తన తపస్సంతా ధారపోసి రచించిన రామాయణాన్ని తన శిష్యులైన కుశలవులకు బోధించి నేర్పించాడు. కుశలవులు సామవేదాన్ని చక్కగా అధ్యయనం చేసి, సంగీత పరంగా మంచి జ్ఞానం కలవారు కావడం వలన రామాయణ కావ్యాన్ని మహర్షి ఆమోదంతో, భాషార్థాలు, భావగాంభీర్యాలను సంగీతాన్ని జోడించి చక్కగా గానం చేశారు. ఆ విధంగా వాల్మీకి మహర్షి వద్ద కావ్య

గానానికి సంబంధించిన మెలకువలన్నీ గ్రహించిన కుశలవులు అచటచట ఉన్న ఋషి వాటికలలో యాగ నిర్వహణా సందర్భాలలో రామాయణాన్ని గానం చేసి విను వారికి శ్రవణానందాన్ని కలిగించే వారు. ఆవిధంగా ఆనందించిన ఋషులు కుశలవులపై ప్రశంశల జల్లు కురిపించే వారు. అటు పిమ్మట కుశలవులు ఒకానొక సందర్భంలో అయోధ్యానగర వీధులలో రామాయణ గానం చేస్తూండగా, వినిన శ్రీరాముడు తన అశ్వమేధయాగ సందర్భంగా వారిని తన వద్దకు రప్పించుకొని, వారిచేత రామాయణ కావ్యాన్ని గానం చేయించుకొని విన్నాడు.

5. ప్రశ్న : ధశరథ మహారాజు పరిపాలనలో కోసలదేశ రాజధాని, అయోధ్యా నగరం ఎంతటి వైభవం కలిగి ఉండింది?

జవాబు : సరయూనదీ తీరాన ఉన్న కోసల రాజ్యం ధన ధాన్యాదుల తోనూ, సకల సంపదల తోనూ తులతూగుతూ ఉండేది. వైవస్వత మనవు అనే ప్రజాపతిచే నిర్మించబడిన అయోధ్యా నగరం ఈ దేశానికి రాజధాని. కోసల రాజ్యాన్ని ధశరథడనే రాజు పాలిస్తున్న కాలంలో అయోధ్యా నగరం శత్రుదుర్భేధ్యమై, చుట్టూ ఎత్తయిన ప్రహరీ గోడలతోనూ, ప్రహరీకి వెలుపల లోతైన కందకముల తోనూ, కోటకు నాలుగు వైపులా విశాలమైన రాజ మార్గాలతోనూ, ఆ మార్గాల కిరువైపులా అంగళ్ళతోనూ చూచుటకది నయన మనోహరంగా ఉండేది. ఆ నగరం విద్వాంసులతోనూ, యోధులతోనూ, నిత్యాగ్ని హోత్రులతోను, శమదమాది గుణ సంపన్నుల తోనూ వేదాధ్యయన పారంగతుల తోనూ, సత్యవాదుల తోనూ నిండి ఉండేది. ధశరథ మహారాజు వేదార్ధాలను బాగా ఎరిగినవాడు. ధన ధాన్యాదులచే శూరులను పండితులను ఆదరించి, తన వశమందు ఉంచుకొనే వాడు. భావి పరిణామాలను బాగుగా ఎరిగినవాడు. ఆ అయోధ్యా నగరంలోని ప్రజలు వారి వారి ధర్మాలను ఆచరించటంలో అనురక్తులై ఉండేవారు. అటువంటి శుభలక్షణ సంపన్నయైన కోసల సామ్రాజ్యలక్ష్మిని చతురంగబల సమన్వితుడైన దశరథ మహారాజు ధర్మబద్ధంగా పరిపాలింప సాగాడు.

## ఒకటవ అధ్యాయము

జవాబులు : 1.2. చతుర్ముఖ బ్రహ్మ          2.4. తమసా నది

3. కుశలవులు

# బాల కాండము

## 7, 8, 9, 10, 11, 12 సర్గలు

## రెండవ అధ్యాయము

1. ప్రశ్న : కోసల రాజ్యాన్నేలే దశరథ మహారాజుకు ఎంత మంది మంత్రులుండే వారు ?

జవాబు : 1. ఏడుగురు 2. పది మంది
3. ఎనిమిది మంది 4. తొమ్మిది మంది

2. ప్రశ్న : సంతానలేమి కారణంగా దశరథుడు తనకు పుత్ర ప్రాప్తికై చేయ సంకల్పించిన యాగానికి ముందుగా ఋష్యశృంగుని ఆహ్వానించి తీసికొని రమ్మని దశరథునికి ఎవరు సలహా ఇచ్చారు ?

జవాబు : 1. సుమంత్రుడు 2. వసిష్ఠుడు
3. విశ్వామిత్రుడు 4. జాబాలి

3. ప్రశ్న : దశరథ మహారాజు తన వారందరితో గూడి ఋష్యశృంగ మహర్షిని అయోధ్యకు ఆహ్వానించ డానికై వెళ్ళు సమయానికి ఋష్యశృంగ మహర్షి ఎక్కడ ఉన్నాడు ?

జవాబు : జవాబుల కాలంలో ఉంది.

4. ప్రశ్న : అయోధ్యకు ఋష్యశృంగుని రాక ఏవిధముగా జరిగింది ?

జవాబు : దశరథ మహారాజు తన రాణులందరి తోనూ, రాజ పరివారం తోనూ, బయలుదేరి వెళ్ళి, అంగదేశపు రాజు రోమపాదుని దర్శించి విశేష పూజలందు కొన్నాడు. పిమ్మట ఋష్యశృంగ మహర్షిని దర్శించు కొన్నాడు. అనంతరమా మహారాజు అంగదేశంలో ఒకవారం రోజులుండి, రోమపాదునితో మహారాజా! నీ కూతురు శాంతను, అల్లుడైన ఋష్యశృంగుని నా నగరానికి పంపించు. అచట ఒక మహత్కార్యం జరుగవలసి ఉంది. అందు పాల్గొనుటకై ఈ దంపతులను ఆహ్వానిస్తూన్నాను అన్నాడు. దశరథుని ఆహ్వానాన్ని మన్నించిన రోమపాద మహారాజు ఋష్యశృంగునితో ఓ మహర్షీ దశరథ మహారాజు ఆహ్వానాన్ని మన్నించి, నీ భార్యయైన

శాంతతోగూడి, దశరథుని వెంట బయలుదేరి అయోధ్యకు వెళ్ళమని చెప్పాడు. ఆ మాటలను ఋష్యశృంగుడు ఆమోదించి తన భార్యతోగూడి దశరథుడు వెంట బయలుదేరి అయోధ్యకు చేరుకొన్నాడు. తన అంతఃపురానికి వచ్చిన ఋష్యశృంగుని దశరథుడు భక్తితో పూజించాడు. శాంతా ఋష్యశృంగులు ఆనందంగా అయోధ్యలో కొంతకాలమున్నారు.

5. ప్రశ్న : దశరథ మహారాజు తాను తలపెట్టిన యాగానికి ఏవిధమైన ఏర్పాట్లను చేశాడు ?

జవాబు : వసంత ఋతు ప్రారంభవేళ దశరథ మహారాజు అశ్వమేధ యాగాన్ని ప్రారంభించ నెంచి, మొదటగా ఋష్యశృంగ మహర్షికి నమస్కరించి, తన వంశాభి వృద్ధికై చేయు యజ్ఞానికి, ప్రధాన ఋత్త్విక్కుగా ఉండుటకై ఆయనను అభ్యర్థించాడు. రాజు అభ్యర్ధనను ఋష్యశృంగుడు ఆమోదించి, యజ్ఞ ద్రవ్యాలను సిద్ధపరచు కొమ్మని చెప్పాడు. అంతట దశరథుడు సంతోషించి, తన ఆంతరంగిక మంత్రి సుమంత్రుని పిలిపించి, నీవు వెంటనే వసిష్ఠాది గురు పురోహితులను పిలుచుకొని రమ్మన్నాడు. రాజాజ్ఞ ప్రకారం, సుమంత్రుడు త్వరగా వెళ్ళి వారందరిని వెంట బెట్టుకొని వచ్చాడు. వచ్చిన గురు పురోహితులను దశరథ మహారాజు ఉచితరీతిని పూజించి, వసిష్ట మహర్షితో మునిలోక పూజ్యా! మా వంశోన్నతి కోరే మీరు, నేను తలపెట్టిన యజ్ఞ కార్యాన్ని నిర్విఘ్నంగా జరిపించమని కోరాడు. అప్పుడు వారంతా మహారాజుతో మీ ఆజ్ఞాను సారమే జరుగును గాక! అని యజ్ఞ కార్య నిర్వహణలో తమవంతు చేయదగిన కార్యక్రమాలను, ఋష్యశృంగ మహర్షితో కలిసి నిర్వహించేందుకు అందరూ అంగీకరించారు.

## రెండవ అధ్యాయము

జవాబులు : 1.3. ఎనిమిది మంది 2.1. సుమంత్రుడు

3. అంగదేశంలో

# బాల కాండము

## 13, 14, 15, 16, 17, 18 సర్గలు

## మూడవ అధ్యాయము

1. ప్రశ్న : దశరథుడు యజ్ఞ విధులన్నింటిని నిర్వహించి ఋత్విజులు నిశ్చయించిన ఏ తిథి యందు యాగాశ్వాన్ని విడిచి పెట్టాడు ?

జవాబు : 1. చైత్రశుద్ధ నవమి 2. చైత్రశుద్ధ పూర్ణిమ
3. చైత్రశుద్ధ దశమి 4. చైత్రశుద్ధ ఏకాదశి

2. ప్రశ్న : యాగాశ్వం తిరిగి వచ్చిన పిమ్మట దశరథుడు శాస్త్ర విధిని అనుసరించి అశ్వమేథ యాగాన్ని పూర్తి చేసిన అనంతరం పుత్రప్రాప్తికై ఏ యాగాన్ని చేశాడు ?

జవాబు : 1. విశ్వజిత్ యాగం 2. వాజపేయ యాగం
3. పుత్రకామేష్టి యాగం 4. ఇష్టి యాగం

3. ప్రశ్న : యజ్ఞ వేదిక యందు దివ్యపురుషుడు ప్రత్యక్షమై దశరథునికి యజ్ఞ ఫలితాన్ని ఏ రూపంగా అందించాడు ?

జవాబు : జవాబుల కాలంలో ఉంది.

4. ప్రశ్న : దశరథుడు ఇచ్చిన హవిస్సులతో సంతృప్తి చెందిన దేవతలు, భవిష్యత్ పరిణామాల కనుగుణంగా ఏరీతిగా నిర్ణంచు కొన్నారు ?

జవాబు : దశరథుడు యజ్ఞ సందర్భంగా అక్కడకు చేరిన దేవతలంతా రాక్షసుల విపరీత ఆగడాలను గురించి ఆలోచించి నారాయణుని శరణు వేడారు. అప్పుడా దేవతలందరి కోరికపై నారాయణుడు, రావణాది రాక్షసులను సంహరించి, భక్తులను రక్షించడానికే భూనుకొన్నాడు. ఆయనకు సహాయకంగా దేవతలందరిని మీమీ అంశలతో జన్మించండి అని బ్రహ్మదేవుడు ఆజ్ఞాపించాడు. ఆ విధంగా వేల కొలది వానర, భల్లూక, కొండముచ్చు జాతులవారు దేవతాంశలతో జన్మించారు. మహావిష్ణువు నాలుగు రూపాలతో దశరథునికి పుత్రులుగా జన్మించడానికి నిశ్చయించాడు. యజ్ఞం ముగిసిన పిమ్మట గర్భవతులైన ముగ్గురు దేవేరులతో దశరథుడు సంతోషంగా ఉంటుండగా ఒక సంవత్సర కాలం గడిచింది.

5. ప్రశ్న : దశరథుని పుత్రోత్సాహము ఏరీతిగా సాగింది ?

జవాబు : నిండు చూలాండ్రుగా ఉన్న ముగ్గురు దేవేరులలో పెద్ద భార్యయైన కౌసల్య వసంత ఋతువు ప్రారంభం, చైత్రశుద్ధ నవమి పునర్వసు నక్షత్ర నాలుగవ పాదం, కర్కాటక లగ్నమందు ఒక మగశిశువుకు జన్మనిచ్చింది. పిమ్మట చైత్రశుద్ధ దశమినాడు కైకేయిదేవి ఒక మగ శిశువుకు జన్మనిచ్చింది. అనంతరం అదేరోజు సుమిత్రాదేవికి ఇద్దరు మగశిశువులు జన్మించారు. పుత్రులు కలిగిన పదకొండు రోజులకు దశరథుడు జాతకర్మ నామోత్సవాలను జరిపించి, అర్హులైన వారికి విశేష దానాదుల నిచ్చి సంతోషించాడు. వసిష్ట మహర్షి వచ్చి నలుగురు పిల్లలో పెద్దవాడికి రాముడని, కైకేయి సుతునకు భరతుడని, సుమిత్రా సుతులకు లక్ష్మణ, శత్రుఘ్నులని నామకరణం చేశాడు. చాలా కాలం సంతానం లేక కలిగిన నలుగురు కొడుకులతో పరమానందంగా దశరథుడు కాలం గడుపు తున్నాడు. ఆ నలుగురిలో ఆయనకు పెద్దవాడైన రామునిపై ప్రాణంకన్నా ప్రేమ ఎక్కువ. నలుగురు రాకుమారులను గురువు వద్ద వేద శాస్త్రాలను అభ్యసింప జేశాడు. వారు ధనుర్విద్య యందు ఆరితేరారు. ప్రజాహిత మందు వారు అనురక్తులైనారు. రఘు వంశంలో మహా తేజశ్శాలియైన రాముడు అమోఘమైన పరాక్రమం కలవాడు. అన్నయగు రాముని యందు బాల్యము నుండి లక్ష్మణుడు అనురక్తి కలిగి యుండేవాడు. చక్కని శుభలక్షణ శోభితులైన తన నలుగురు కొడుకులతో గూడి దశరథుడు పరమానంద భరితుడై ఉండేవాడు. రాముని బాల్యం తన తమ్ములతో, ఆనంద మయంగానూ, విద్యా వినయ సంపదలతోనూ జరిగి, వారంతా యుక్త వయస్కు లయ్యారు. ఇట్లుండగా ఒకనాడు సభ దీరియున్న దశరథుని కొలువు లోనికి విశ్వామిత్ర మహర్షి వచ్చాడు. వచ్చిన మహర్షికి దశరథుడు స్వాగతం పలికి ఉచిత రీతిని పూజించాడు.

## మూడవ అధ్యాయము

జవాబులు : 1.2. చైత్రశుద్ధ పూర్ణిమ 2.3. పుత్రకామేష్టియాగం

3. పాయసరూపంగా

# బాల కాండము

## 19, 20, 21, 22, 23, 24 సర్గలు

## నాలుగవ అధ్యాయము

1. ప్రశ్న : తాను తలపెట్టిన యాగ సంరక్షణార్థం తన వెంట ఎవరిని పంపించమని విశ్వామిత్రుడు దశరథ మహారాజును కోరాడు ?

జవాబు : 1. శత్రుఘ్నుని 2. లక్ష్మణుని
3. భరతుని 4. రాముడిని

2. ప్రశ్న : విశ్వామిత్రుని కోరిక ప్రకారం తన జ్యేష్ఠపుత్రుడైన రాముని పంపించడానికి తన అశక్తతను తెలియ జేసిన దశరథుడు ఎవరి ఉపదేశాన్నను సరించి అంగీకరించాడు ?

జవాబు : 1. సుమంత్రుడు 2. వసిష్టుడు
3. జాబాలి 4. కౌసల్యాదేవి

3. ప్రశ్న : విశ్వామిత్రుని అనుసరించి వెళ్తున్న రామ లక్ష్మణులను సరయూ నదికి దక్షిణాన ఒక ప్రదేశంలో ఆపిన ఆ మహర్షి వారికి ఉపదేశించిన విధ్యల పేరేమిటి ?

జవాబు : జవాబుల కాలంలో ఉన్నది.

4. ప్రశ్న : సరయూ నదీ తీరాన్నే విశ్రమించిన రామ లక్ష్మణులు, మహర్షి సుప్రభాతంతో నిద్రలేచి, కొంతదూరం ప్రయాణించి, ఒక ప్రదేశాన్ని చేరి వారు అడిగిన సందేహానికి విశ్వామిత్రుడు ఏరీతిగా సమాధానం చెప్పాడు ?

జవాబు : గురువుగారి వెంట ప్రయాణం చేస్తున్న ఆ రామ లక్ష్మణులు, పవిత్రమైన సరయూ, గంగా సంగమ ప్రదేశాన్ని చూశారు. అచట మహర్షులు వేలకొలది సంవత్సరాలుగా తపో నియమంలో ఉన్నారు. అప్పుడు ఆ రాజ కుమారులు విశ్వామిత్రునితో మహర్షీ! ఈ పుణ్యాశ్రమం ఎవరిది? ఇక్కడ నివశించు మహాపురుషు లెవ్వరు? దీని పూర్వ చరిత్రను తెలుపుమని అడిగారు. అంతట ఆ మునీశ్వరుడు ఓ రామా! పూర్వం పరమ శివుడు ఇక్కడ తపస్సు చేస్తుండేవాడు. ఒకప్పుడు శంకరుని తపో భంగమునకై మన్మథుడు ప్రయత్నించాడు.

శంకరుడు కోపంతో చూశాడు. ఆ కంటి మంటలలో మన్మథుడు కాలి భూడిదై పోయాడు. అది మొదలు మన్మథుడు అశరీరుడై అనంగుడైనాడు. కాముడు తన అంగాలను త్యజించిన కారణంగా ఈ ప్రాంతం అంగదేశ మయ్యింది. ఇక్కడ తపస్సు చేసే తపో ధనులంతా శివభక్తి పరాయణులే. ఓ రాజ కుమారులారా! ఈ పవిత్ర గంగా, సరయూ నదుల సంగమ ప్రదేశాననే ఈ రాత్రి గడుపుదాము. రేపు గంగను దాటవచ్చును అని వారంతా అచట విశ్రమించారు.

5. ప్రశ్న : గంగా నదిని దాటిన రామ లక్ష్మణులు కొంతదూరం ప్రయాణించి, ఒక భయంకరమైన అడవిని చూసి, విశ్వామిత్రునితో ఆ అడవి చరిత్రను అడుగగా మహర్షి ఏ రీతిగా చెప్పాడు ?

జవాబు : విశ్వామిత్ర మహర్షి రామునితో నాయనా! పూర్వం ఈ ప్రదేశం 'మలదము' - 'కరూశము' అను రెండు దేశములు. ధన, ధాన్య సంపదలతో తులతూగు తూండేవి. కొంత కాలం తరువాత, పుట్టినప్పటి నుండి వేయి ఏనుగుల బలం కలిగిన ''తాటక'' అను యక్షిణి కామ రూపిణియై తిరుగు తుండేది. ఆమె బలశాలియైన సుందుని భార్య. ఈమెకు మారీచుడు అను పుత్రుడు కలిగాడు. ఇతడు ఇంద్రు నంతటి బలశాలి. దుర్మార్గురాలైన తాటక ఈ 'మలద', 'కరూశ' అను రెండు జనపధాలను నిత్యమూ ధ్వంసం చేస్తూ, ఈ రెండు దేశాలయందును జనసంచారం లేకుండా చేసింది. అప్పటి నుండి ఈ ప్రాంతం నిర్జనారణ్యంగా మారిపోయింది. రామా! భయపడకు నీకు క్షేమమగును. మన మిపుడు ఈ తాటకా వనాన్ని దాటాలి. అని పలికి విశ్వామిత్రుడు ముందుకు నడిచాడు. రామ లక్ష్మణులు అనుసరించారు.

## నాలుగవ అధ్యాయము

జవాబులు : 1.4. రాముడిని     2.2. వసిష్టుడు

3. బల, అతిబల అనే విధ్యలు

# బాల కాండము

## 25, 26, 27, 28, 29, 30 సర్గలు

## ఐదవ అధ్యాయము

1. ప్రశ్న : యక్షిణియైన తాటకి కారాణాంతరాల వలన తనను భక్షించుటకు రాగా, ఆమెను నీవు భయంకర రాక్షసివై నరమాంసమే తిని బ్రతుకుతూ వుండు, అని శపించిన మహర్షి ఎవరు ?

జవాబు : 1. అగస్త్యుడు 2. విశ్వామిత్రుడు
3. వసిష్ఠుడు 4. జమదగ్ని

2. ప్రశ్న : విశ్వామిత్ర మహర్షి ఆదేశాన్ననుసరించి రాముడు తాటకను ఏ సమయంలో సంహరించాడు ?

జవాబు :
1. మధ్యాహ్న సమయం సమీపిస్తుండగా
2. తొలి సంధ్యా సమయం సమీపిస్తుండగా
3. మలి సంధ్యా సమయం సమీపిస్తుండగా
4. రాత్రివేళ యందు

3. ప్రశ్న : తాటకా సంహారంతో ఎంతో సంతోషించిన విశ్వామిత్రుడు ప్రసన్నుడై శ్రీరామునికి తనవద్ద ఉన్న వివిధములగు అస్త్రాలను ప్రయోగ, ఉపసంహార మంత్రాలతో సహా ఇచ్చాడు. పిమ్మట లక్ష్మణునికి ఆ అస్త్రాలన్ని ఎవరు ఉపదేశించారు ?

జవాబు : జవాబుల కాలంలో ఉంది.

4. ప్రశ్న : రాముడు సిద్ధాశ్రమ వృత్తాంతాన్ని అడుగగా విశ్వామిత్రుడు ఏ రీతిగా ఆయనకు తెలిపాడు ?

జవాబు : విశ్వామిత్రుడు రాముడు అడిగిన మీదట సిద్ధాశ్రమాన్ని గురించి తెలుపుతూ రామా! భగవంతుడు శ్రీమహావిష్ణువు ఈ ప్రదేశంలో యుగాల పర్యంతం తపస్సు చేశాడు. మహా తపస్వి కాశ్యపుడు ఇక్కడే తపస్సుచేసి సిద్ధిని పొందాడు. అతిథి కశ్యపులకు మహావిష్ణువు వామనుడుగా పుట్టి, బలిచక్రవర్తిని మూడడుగుల నేలను యాచించింది ఇక్కడే. అటు పిమ్మట త్రివిక్రముడై సర్వాంతర్యామియైన పరమాత్మ అంతటా తానేయై, తన ప్రభావంచే బలిని రసాతలానికి పంపి,

ఇంద్రునికి స్వర్గాన్ని కట్టబెట్టాడు. మహాత్ముడైన వామనుని పాద స్పర్శచే పవిత్రమైన ప్రదేశమిది. కనుకనే ఈ ప్రదేశాన్ని సిద్ధాశ్రమము అని పిలుస్తారు. కావుననే నేను ఈ ప్రదేశాన్ని ఆశ్రయించాను. నాయనా! రామా! విఘ్న కారకులైన రాక్షసులు ఈ ఆశ్రమానికి వస్తూ ఉంటారు. ఆ దుర్మార్గులను హతమార్చ వలసింది ఇక్కడే. అని విశ్వామిత్ర మహర్షి ఆశ్రమంలో ప్రవేశించగానే ఆ సిద్ధాశ్రమ నివాసులైన మునులు విశ్వామిత్ర మహర్షికి, రామ లక్ష్మణులకు స్వాగత సత్కారాలు చేశారు.

5. ప్రశ్న : రామ లక్ష్మణులు విశ్వామిత్రుడు నిర్వహించే యాగాన్ని ఏ విధంగా సంరక్షించారు.

జవాబు : రామ లక్ష్మణులు యజ్ఞ దీక్షితుడైన విశ్వామిత్రునితో ఓ బ్రహ్మర్షీ! యాగ విఘ్న కారకులైన రాక్షసులు ఎప్పుడు వస్తారు. వారిని నిలువ రించడానికై మేము సావధానులమై ఉంటాము. అని పలుకగా అచటి మునులు సంతోషించి, వారితో నేటి నుండి ఆరు దినములు విశ్వామిత్ర మహర్షి మౌనదీక్షలో ఉంటారు. ఓ రాజ కుమారులారా! మీరు అప్రమత్తులై ఈ ఆరు రోజులు యజ్ఞాన్ని రక్షిస్తూ ఉండాలి అన్నారు. అంతట ఆ రామ లక్ష్మణులు ధనుర్బాణాలు ధరించి యాగాన్ని రక్షిస్తూ ఐదు రోజులు గడిపారు. ఆరవ రోజు యజ్ఞం వేదమంత్ర పూర్వకంగా యధావిధిగా జరుగు తూండగా, ఆకాశం నుండి ఒక భయంకర శబ్దం వినబడింది. భయంకరమైన మారీచ సుబాహులనే రాక్షసులు తమ అనుచరులతో తమ మాయలు ప్రయోగిస్తూ అచటికి వచ్చి రక్త మాంసాలను యజ్ఞ వేదికపై పోశారు. అంతట ఆ రఘు రాముడు ''శీతేషువు'' అనే మానవాస్త్రాన్ని ప్రయోగించి, మారీచుని సముద్రంలో పడేట్లు కొట్టాడు. పిమ్మట ఆగ్నేయాస్త్రాన్ని ప్రయోగించి సుబాహుని హతమార్చాడు. ఈ విధంగా శ్రీరాముడు ఇంకనూ యజ్ఞ విఘ్న కారకులైన ఇంకొందరిని కూడా హతమార్చిన పిమ్మట యజ్ఞవేదికపై చల్లిన రక్త మాంసాదులు అన్నీ రాక్షసుల మాయలు కాబట్టి అవి మాయమై కనిపించకుండా పోయాయి. యజ్ఞం నిర్విఘ్నంగా జరిగిన పిమ్మట విశ్వామిత్రుడు రామ లక్ష్మణులను అభినందించి, దీవించాడు. ఈ రీతిగా రాముడు యాగ సంరక్షణం చేశాడు.

## ఐదవ అధ్యాయము

జవాబులు : 1.1. అగస్త్యుడు 2.3. మలి సంధ్యా సమయం సమీపిస్తుండగా

3. రాముడు

# బాల కాండము

## 31, 32, 33, 34, 35, 36 సర్గలు

## ఆరవ అధ్యాయము

1. ప్రశ్న : యజ్ఞ పరిసమాప్తి అయిన తరువాత విశ్వామిత్రుని సూచన మేరకు రామలక్ష్మణులు మిథిలా నగరంలో జరిగే సీతా స్వయంవరానికి బయలు దేరారు. వారంతా ఆ సిద్ధాశ్రమం నుండి ఏ దిక్కుగా ప్రయాణించారు.

జవాబు : 1. తూర్పు 2. దక్షిణం

3. పడమర 4. ఉత్తరం

2. ప్రశ్న : విశ్వామిత్రునితో కలిసి ప్రయాణిస్తున్న వారంతా ఆ రోజు సాయం సమయానికి శోణనదీ తీరానికి చేరి, అక్కడ విశ్రాంతి తీసికొన్నారు. అప్పుడు రాముడు విశ్వామిత్రునికి నమస్కరించి, గురుదేవా! మనమిప్పుడు ఉన్న ప్రదేశం ఎవరి పాలనలోనిది? అని అడుగగా విశ్వామిత్రుడు ఆ ప్రదేశం ఎవరి పాలనలో ఉన్నదని తెలిపాడు ?

జవాబు : 1. కుశుడు 2. కుశనాభుడు

3. వసువు 4. అధూర్తరజుడు

3. ప్రశ్న : రాముడు అడిగిన దానికి సమాధానం చెబుతూ విశ్వామిత్రుడు తన వంశము వారైన కుశనాభుని కుమార్తెల చరిత్ర చెప్పే క్రమంలో తమ వంశపు మూలపురుషుడు ఎరుగా తెలిపాడు ?

జవాబు : జవాబుల కాలంలో ఉంది.

4. ప్రశ్న : శోణ నదీతీరాన విశ్వామిత్ర మహర్షి రాముడితో తన వంశీయుల చరిత్రను ఏ రీతిగా వివరించాడు ?

జవాబు : ఓ రామా! బ్రహ్మ మానసపుత్రుడు కుశుడు. ఈయన కుమారుడు కుశనాభునికి కలిగిన నూరుగురు కుమార్తెలను, కాంపిల్య నగరాధిపతి భగదత్తునికిచ్చి పెండ్లిచేసి, వారిని అత్త వారింటికి పంపించిన

అనంతరం, ఆ రాజు పుత్రులు లేనిలోటు తీర్చుకోడానికై పుత్రకామేష్టి యాగం చేశాడు. కొంతకాలం తరువాత కుశనాభుడు తన భార్య అయిన 'ఘృతాచి' యందు 'గాధి' అను కుమారుని పొందాడు. ఈ గాధి పరమ ధార్మికుడు. ధర్మాత్ముడైన గాధి మహారాజు నా తండ్రి. నేను కుశ వంశమందు జన్మించిన కారణంగా నన్ను కౌశికుడని కూడా పిలుస్తారు. ఓ రామా! సత్యవతి యనునామె నాకు అక్క. ఆమెకు ఋచీకుడను మహర్షితో వివాహం జరిగింది. మా అక్కయు కుశుని వంశంలోనే జన్మించి నందున ఆమెను కౌశికి అని కడా పిలుస్తారు. ఈమె మహా పతివ్రతయైన కారణంగా పతిని అనుసరించి సశరీరంతో స్వర్గానికి వెళ్ళింది. పిమ్మట పరమోదార కౌశికి అనే పేరుతో మహానదియై ఈ భూతలంలో ప్రవహిస్తూ ఉంది. మా అక్కగారిపై నాకు గల ప్రేమకొలది, నేను ఆకౌశికీ నదీతీరాన్నే నివశిస్తున్నాను. ఓ రామా! క్రతు నిర్వహణ నిమిత్తమై ఆ ప్రాంతం నుండి ఇచటికి వచ్చాను. సిద్ధాశ్రమంలో నీ పరాక్రమం చేత, నేను కృతార్థుడనై తిరిగి వెళ్తున్నాను. నీవడిగిన ఈ ప్రాంత విశేషాలను గురించి చెప్పడంలో నా వంశాన్ని గురించి కూడాచెప్పాను. అని తెలిపి మహర్షి ముగించాడు.

5. ప్రశ్న : విశ్వామిత్రుడు శ్రీరామునికి గంగా, పార్వతుల విశేషాలను ఎక్కడ, ఏ రీతిగా వివరించాడు ?

జవాబు : విశ్వామిత్రుని అనుసరించి, వెళ్తున్న రామాదులు కొంత దూరం ప్రయాణించి, మధ్యాహ్న సమయానికి పవిత్ర గంగానది తీరానికి చేరుకొన్నారు. వారంతా ఆ పవిత్ర గంగా నదిలో స్నానాధికములు పూర్తిచేసుకొని, పితృ దేవతలకు తర్పణాలు వదిలిన పిమ్మట రాముడు ఆ గంగా వృత్తాంతాన్ని గురించి అడుగగా విశ్వామిత్రుడు ఓ రామా! మేనకా, హిమవంతులకు ఇద్దరు కుమార్తెలు. వారిలో పెద్ద కూతురు గంగాదేవి, రెండవ కుమార్తె పార్వతీదేవి. ఒకప్పుడు దేవతలు తమ ప్రయోజనార్థమై గంగను తమకు అప్పగించుమని హిమవంతుని కోరారు. ధర్మాత్ముడైన హిమవంతుడు లోకహితార్థమై ఎక్కడకైనా

సాగిపోవు గంగను వారికప్పగించాడు. రెండవ కుమార్తె పార్వతీ దేవి, కన్యగా ఉండియే తీవ్రమైన తపస్సు చేసి, తాను తన వ్రతనిష్టతో శంకరుని భర్తగా పొందాలని కోరింది. హిమవంతుడు కూతురు కోరిక మేరకు పరమశివుని కిచ్చి వివాహం చేశాడు. హిమవంతునికి కూతురుగా జన్మించి, దివికి చేరిన పావన గంగయే, ఈ గంగానది. అని విశ్వామిత్రుడు తెలిపిన గంగా వృత్తాంతానికి సంతసించిన రాముడు మహర్షీ! ఈ గంగా నది త్రిపథగా ఎట్లు పేరు గాంచింది? అని అడుగగా, కౌశికుడు కుమారస్వామి జన్మ వృత్తాంతాన్ని తెలిపి భగీరథుని కారణంగా గంగ దివినుండి భువికి చేరడాన్ని కూడా తెలిపాడు. ఈ విధంగా విశ్వామిత్రుడు రాముడు అడిగిన గంగా వృత్తాంతాన్ని పూర్తిగా తెలిపాడు.

## ఆరవ అధ్యాయము

జవాబులు : 1.2. ఉత్తర దిక్కు 2.3. వసువు

3. కౌశికుడు

# బాల కాండము

## 37, 38, 39, 40, 41, 42 సర్గలు

## ఏడవ అధ్యాయము

1. ప్రశ్న : దేవతలందరి కోరికపై బ్రహ్మదేవుడు వారికి సేనానాయకునిగా ఎవరిని నియమించాడు ?

జవాబు : 1. విఘ్నేశ్వరుడు 2. కుమారస్వామి
3. నందీశ్వరుడు 4. విశ్వక్సేనుడు

2. ప్రశ్న : సగర చక్రవర్తి తనకు సంతానంలేని కారణంగా హిమవత్పర్వతాలకు తన ఇద్దరు భార్యలతోగూడి వెళ్ళి, అచట ఎవరిని గురించి తపస్సు చేశాడు ?

జవాబు : 1. పరమశివుని 2. బ్రహ్మదేవుని
3. భృగు మహర్షిని 4. నారాయణుని

3. ప్రశ్న : అశ్వమేథయాగ సందర్భంగా సగర చక్రవర్తి వదలిన అశ్వాన్ని ఎవరు అపహరించారు ?

జవాబు : జవాబుల కాలంలో ఉంది.

4. ప్రశ్న : యాగాశ్వం అపహరణకు గురి అయిన పిమ్మట, సగరుడు అశ్వాన్వేషణకై ఎటువంటి ప్రయత్నం చేశాడు ?

జవాబు : యాగాశ్వం లేకుండా, యజ్ఞ పరిసమాప్తి కాకుండా ఉంటే, అరిష్టం జరుగుతుందని తెలిపిన ఋత్విక్కుల మాటలు ప్రకారం సగరుడు తన అరువది వేలమంది కుమారులను పిలిచి నాయనలారా! నేను యజ్ఞ దీక్షలో ఉన్న కారణంగా రాకూడదు. కావున మీరు వెళ్ళి యాగాశ్వాన్ని వెదకండి. భూమి యందంతటా వెదకి కనబడకుంటే భూమిని త్రవ్వి పాతాళానికి వెళ్ళి అయినా వెదకండి. మీకు శుభమగు గాక. అని పంపించి వేశాడు. వారంతా బయలుదేరి వెళ్ళి భూమి యందంతటా వెదికారు. కాని గుర్రపుజాడ వారికి కనబడలేదు. అప్పుడు వారంతా ఒక్కొక్కరు ఒక్కొక్క యోజనాన్ని పంచుకొని, భూమిని త్రవ్వి పాతాళానికి చేరారు. అచట కపిల మహర్షి ఆశ్రమ ప్రాంతలో ఉన్న యాగాశ్వాన్ని చూసి, అశ్వాన్ని అపహరించిన వాడు ఈ మహర్షియే అని తలంచి, వారంతా ఆ కపిలాచార్యుని దూషించారు. వారి దురుసు

మాటలకు, ప్రవర్తనకు కపిల మహర్షి రోషావేశంతో హుంకరించాడు. కపిలుని హుంకారానికి సగరపుత్రులు భస్మమై పోయారు. ఈ విధంగా సగరుని ప్రయత్నం విఫలమయ్యింది.

5. ప్రశ్న : సగరుని యాగాశ్వాన్ని ఎవరు, ఏ రీతిగా తీసికొని వచ్చి, యజ్ఞాన్ని పూర్తి చేశారు? భస్మరాసులుగా పడి ఉన్న సగరపుత్రుల గతి ఏమైంది?

జవాబు : సగర మహారాజు తన బిడ్డలు ఎంత కాలానికీ తిరిగి రానందున దిగులుపడి, తన మనుమడైన అంశుమంతుని పిలిచి నాయనా! నీ పిన తండ్రులు, యాగాన్వేషణకై వెళ్ళి ఎంతకు తిరిగి రాలేదు. నీవు వెళ్ళి నీ పిన తండ్రులను, యాగాశ్వాన్ని వెదకి తీసికొనివచ్చి యజ్ఞాన్ని పూర్తి గావించాలి అన్నాడు. వెంటనే అంశుమంతుడు తాతగారి ఆదేశాన్నను సరించి తన పిన తండ్రులు భూమిని త్రవ్వి పాతాళానికి వెళ్ళిన మార్గాన్నే వెళ్ళి పాతాళంలో కపిల మహర్షి ఆశ్రమంలో భస్మరాసులుగా పడియున్న తన వారందరినీ చూసి, అచట గరుత్మంతుని సూచన మేరకు యాగాశ్వాన్ని తీసికొని వెళ్ళి యాగాన్ని పూర్తి చేశాడు. పిమ్మట అంశుమంతుడు తన పిన తండ్రులు కపిలుని కోపాగ్నికి భస్మరాసులు కావడాన్ని, వారికి పితృలోక ప్రాప్తిని కలుగ జేయడానికై పావన ఆకాశ గంగను భువికి తీసికొని రావలసి ఉంది. అని తన తాత గారైన సగరునికి తెలిపాడు. పిమ్మట సగరుడు తన పుత్రుల ఊర్ధ్వలోక ప్రాప్తిని గురించి ఆలోచిస్తూనే స్వర్గస్తు డయ్యాడు. అనంతరం అంశుమంతుడు దిలీపుడు వరసగా తమ పితరుల స్వర్గప్రాప్తికై గంగను భువికి తీసికొని రావడానికై చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. చివరకు దిలీపుని కుమారుడైన భగీరథుడు బ్రహ్మదేవుని, గంగను, ఈశ్వరుని ప్రార్థించగా, ఆయన చేసిన తపస్సుకై పరమేష్టి గంగను భరించి, భువిపైకి వదిలాడు. గంగ భగీరథుని అనుసరించి, ఆ మహారాజు పితృదేవతల భస్మరాసులను తడిపి, వారికి పితృలోకాలను ప్రాప్తింప జేసింది. ఆ విధంగా భగీరథుని కారణంగా తన పితృ దేవతలు ఊర్ధ్వలోకాలకు వెళ్ళారు.

## ఏడవ అధ్యాయము

జవాబులు : 1.2. కుమారస్వామి 2.3. భృగు మహర్షిని
3. ఇంద్రుడు

# బాల కాండము

## 43, 44, 45, 46, 47, 48, 49 సర్గలు

## ఎనిమిదవ అధ్యాయము

1. ప్రశ్న : భగీరథుని మెరాలకించిన పరమశివుడు, తన జటాజూటం నుండి గంగను వదలిపెట్టిన ప్రదేశం ?

జవాబు : 1. కాంచన గంగ 2. కైలాసగిరి
3. బిందు సరోవరం 4. కేదారనాదం

2. ప్రశ్న : గంగా నదిని దాటిన విశ్వామిత్రాదులు ఉత్తర దిశగా ప్రయాణించి ఒక నగరాన్ని చేరుకొన్నారు. పిమ్మట శ్రీరాముని కోరికపై విశ్వామిత్రుడు వివరించి చెప్పిన నగరం పేరేమి ?

జవాబు : 1. కాశీనగరం 2. అవంతీనగరం
3. ద్వారకానగరం 4. విశాలానగరం

3. ప్రశ్న : దేవేంద్రుని చంపగల కుమారుని పొందడానికై దితీదేవి తన భర్తయైన కశ్యప ప్రజాపతి అనుజ్ఞతో గర్భాన్ని ధరించింది. అది తెలిసిన దేవేంద్రుడు ఆమె గర్భంలో ప్రవేశించి, ఆ పిండాన్ని ఏడు ముక్కలు చేశాడు. అనంతరం ఆ పిండపు శరీరభాగాలు దేవేంద్రుని అనుగ్రహంతో దేవతలైనారు. వారిని లోకంలో ఏ పేరుతో పిలుస్తారు ?

జవాబు : జవాబుల కాలంలో ఉంది.

4. ప్రశ్న : గౌతమాశ్రమాన్ని గురించి అడిగిన రామునికి విశ్వామిత్రుడు ఏరీతిగా వివరించి చెప్పాడు ?

జవాబు : విశాలానగరం నుండి మిథిలా నగరం వైపుగా ప్రయాణిస్తున్న విశ్వామిత్రాదులకు ఒక ప్రాచీనమైన ఆశ్రమం కనిపించింది. అది చూసిన రాముడు విశ్వామిత్రునితో మహాత్మా! ఈ పురాతన ఆశ్రమం ఎవరిది? అని అడుగగా విశ్వామిత్రుడు ఓ నరశ్రేష్ఠా! ఇది మహాత్ముడైన గౌతమ ముని ఆశ్రమము. ఇది ఒకప్పుడు దివ్యశోభలతో విలసిల్లుతూ, దేవతల చేత పూజలందు కొన్నట్టిది. ఒకప్పుడు గౌతమ ముని తన భార్యయైన అహల్యతో గూడి ఈ ఆశ్రమంలో ఎన్నో ఏండ్లు తపస్సు

చేశాడు. గౌతమముని ఆశ్రమంలో లేని సమయంలో దేవేంద్రుడు గౌతముని వేషంలో వచ్చి, అహల్యతో సాంసారిక సుఖాన్ని అనుభవించాడు. అది తెలిసికొన్న గౌతమ మహర్షి ఇంద్రుని వృషణహీనుడవు కమ్మని శపించాడు. అహల్యతో నీవు కొన్ని సంవత్సరాలు ఇక్కడ ఎవరి కంటా బడకుండా తపస్సు చేసుకో. తరువాత దశరథ మహారాజు కుమారుడు శ్రీరాముడు ఈ ఆశ్రమానికి వస్తాడు. అతడు ఈ ఆశ్రమంలో అడుగు పెట్టగానే నీవు పరిశుద్ధు రాలవవుతావు. అప్పుడు నీలోని లోభమోహాలన్ని తొలగి పరిశుద్ధు రాలవై నన్ను చేరుకొంటావు. అని పలికి గౌతమ మహర్షి తాను హిమాలయాలకు వెళ్ళి తపస్సు చేసుకొంటున్నాడు. అని విశ్వామిత్రుడు గౌతమాశ్రమాన్ని గురించి రాముడికి తెలిపాడు.

5. ప్రశ్న : అహల్యా శాప విముక్తి ఏ విధంగా జరిగింది ?

జవాబు : గౌతమాశ్రమాన్ని గురించి వివరించిన విశ్వామిత్రుడు రామునితో రాజ పుత్రా! నీవు అహల్యకు శాప విమోచనాన్ని కలిగించు అన్నాడు. అప్పుడు రాముడు విశ్వామిత్రుని ఆజ్ఞ ననుసరించి లక్ష్మణునితో గూడి విశ్వామిత్రుని వెంట గౌతమాశ్రమం లోనికి ప్రవేశించాడు. పిమ్మట శ్రీరాముడు వాయుభక్షణాది కఠోర నియమాలతో కాంతి మయంగా ఉన్న అహల్యాదేవిని చూశాడు. గౌతమ మహర్షి శాప కారణంగా ఆమెకు శ్రీరాముని దర్శనమగు వరకు ఆమె ఎవరికీ కనబడకుండా ఉన్నది. శ్రీరాముని దర్శనమై నంతనే ఆమెకు శాప విముక్తి కలిగి అచటి వారందరికీ కనిపించింది. అనంతరం అహల్య రామ లక్ష్మణులకు నమస్కరించి, అర్ఘ్యపాద్యాది సత్కారాలు చేసింది. అంతట గౌతమ మహర్షి కూడా ప్రత్యక్షమై అహల్యా సహితుడై శ్రీరాముని పూజించి సంతోషించాడు. పిమ్మట గౌతమ మహర్షి అహల్యతో గూడి తన ఆశ్రమమునందే తపోమయ జీవనాన్ని కొనసాగించాడు. అనంతరం శ్రీరాముడు లక్ష్మణునితో గూడి విశ్వామిత్రుని వెంట మిథిలా నగరానికి బయలు దేరాడు.

## ఎనిమిదవ అధ్యాయము

జవాబులు : 1.3. బిందు సరోవరం 2.4. విశాలానగరం
3. సప్తమరుత్తులు

# బాల కాండము

## 50, 51, 52, 53, 54, 55, 56 సర్గలు

## తొమ్మిదవ అధ్యాయము

1. ప్రశ్న : విశ్వామిత్రుని వెంట మిథిలాపురం చేరిన రామ లక్ష్మణులు, జనక మహారాజు చేసిన అతిథి సత్కారాలను స్వీకరించి అక్కడ అహల్యా గౌతముల కుమారుని దర్శించారు. ఆయన పేరేమి ?

జవాబు : 1. సుధామనుడు 2. శతానందుడు 3. సుమంత్రుడు 4. జాబాలి

2. ప్రశ్న : మిథిలానగరంలో విశ్వామిత్రుని పూర్వ చరిత్రను శ్రీరామునికి తెలిపినది ఎవరు ?

జవాబు : 1. శతానందుడు 2. జనకుడు 3. కుశధ్వజుడు 4. సుధామనుడు

3. ప్రశ్న : విశ్వామిత్ర మహారాజు తన పరివారంతో వసిష్ఠాశ్రమానికి వచ్చి, ఆ మహర్షి ఇచ్చిన ఆతిథ్యాన్ని స్వీకరించి సంతసించి, తమకు ఇంతటి ఆతిథ్యాన్నివ్వడానికి కారణ భూతమైన గోవును తనకిమ్మని వసిష్ఠుని కోరాడు. ఆవిధంగా కోరబడిన గోవు పేరేమి ?

జవాబు : జవాబుల కాలంలో ఉంది.

4. ప్రశ్న : వసిష్ఠుడు ధేనువును నిరాకరించగా విశ్వామిత్రుడు ఏమి చేశాడు? తదనంతర పరిణామం ఏ రీతిగా జరిగింది ?

జవాబు : విశ్వామిత్రుడు తనకు తన పరివారానికి వసిష్ఠుడు సంకల్ప మాత్రం చేతనే భోజన సదుపాయాలు ఏర్పరచ డాన్ని చూసి, ఆశ్చర్యపడి, ఇందుకు కారణభూతమైన 'శబల' అనే కామధేనువును తనకిమ్మని, అందుకు ప్రతిగా లక్షగోవుల నిస్తానని చెప్పాడు. వసిష్ఠుడు అందుకు అంగీకరించ నందున, బలవంతంగా నైనా ఆ ధేనువును తన స్వంతం చేసుకోవడానికి విశ్వామిత్రుడు ప్రయత్నించాడు. వసిష్ఠానుమతితో శబల వేలకొలది సైన్యాలను తన హంబారవం నుండి సృష్టించింది. విశ్వామిత్రుడు చూస్తుండగానే తన సైన్యమంతా శబల సృష్టించిన సేన చేతిలో నశింప సాగారు. విశ్వామిత్రుడు రథ మధిరోహించి వివిధాస్త్రాలను ప్రయోగించి, శబల సృష్టించిన సేనలను చెల్లాచెదరు

చేశాడు. ఆ కామధేనువు తన శరీర అవయవాల నుండి అమిత బలవంతులైన సేనను సృష్టించింది. వారంతా విశ్వామిత్రుని సేనను నాశనం చేశారు. అది చూసిన విశ్వామిత్రుని కుమారులు నూరుగురు వసిష్టునిపైకి వెళ్లారు. మహర్షి హుంకారంతో వారంతా భస్మమై పోయారు. ఈ విశ్వామిత్రుని ప్రయత్నం విఫలమైంది.

5. ప్రశ్న : వసిష్టుని చేతిలో భంగపడిన విశ్వామిత్రుడు తదనంతరం ఏమిచేశాడు?

జవాబు : విశ్వామిత్రుడు తన కుమారులతో సహా సకల బలాలు నశించిపోగా, కోరలు తీసిన పాములాగా, శక్తిహీను డయ్యాడు. నిర్వేదం ఆవహించి, తన రాజ్యానికి వెళ్ళి, క్షాత్రధర్మాన్ని అనుసరించి ఉన్న ఒక్క కొడుకుకు రాజ్యాన్ని అప్పగించి, తాను తపస్సుకు వెళ్ళి, హిమవత్పర్వత ప్రాంతంలో శంకరుని గురించి ఘోర తపస్సు చేశాడు. ఆయన తపోతీవ్రతకు శంకరుడు ప్రసన్నుడై ఏమి కాలాలో కోరుకోమన్నాడు. అప్పుడు విశ్వామిత్రుడు ఉపనిషద్ర హస్యాలను ప్రసాదించి, ధనుర్విధ్యలో దేవతలు, దానవులు, మహర్షులు, గంధర్వులు, యక్షులు, రాక్షసులు మొదలగు వారి యందు గల అస్త్రపటిమ నాకు అబ్బునట్లు అనుగ్రహించ మనికోరి, పరమశివుని వలన ఆ వరాన్ని పొంది వరగర్వంతో వసిష్టునిపై పగతీర్చు కోవడానికై వసిష్టాశ్రమానికి వెళ్ళాడు. అచట తన అస్త్రబలాన్ని ఉపయోగించి వసిష్టాశ్రమాన్ని ద్వంసం చేశాడు. అదిచూసి మునులు, వసిష్ఠ శిష్యులు నలు దిక్కులకు పరుగు తీశారు. అంతట వసిష్టుడు కోపంతో ఓరీ! మూర్ఖుడా! ఎంతో కాలంగా పూల మొక్కలతోనూ, ఫల వృక్షాలతోనూ, కళకళ లాడుతున్న ఆశ్రమాన్ని ధ్వంసం చేశావు. అని ఆ మహర్షి బ్రహ్మ బలం ముందు నీక్షాత్ర బలమెంత? అని తన బ్రహ్మదండాన్ని చేతబట్టి నిలిచాడు. విశ్వామిత్రుడు కోపించి, తన ఆధీనమందున్న అస్త్రాలన్నింటిని ఒకటొకటిగా ప్రయోగించాడు. కాని విశ్వామిత్రుని అస్త్రసంపద అంతా వసిష్టుని బ్రహ్మదండపు ఛాయలో నిర్వీర్యమై పోయింది. అదిచూసిన విశ్వామిత్రుడు 'ఛీ!' క్షత్రియ బలం ఒక బలమా? బ్రహ్మతేజో బలమే నిజమైన బలము అని క్షత్రియ రోషాన్ని త్యజించి మనో ఇంద్రియాలను నిగ్రహించి, తీవ్రంగా తపస్సు చేస్తాను అని తపోమయ జీవనానికై వెళ్ళాడు.

## తొమ్మిదవ అధ్యాయము

జవాబులు : 1.2. శతానందుడు 2.1. శతానందుడు

3. శబల

# బాల కాండము

## 57, 58, 59, 60, 61, 62 సర్గలు

## పదియవ అధ్యాయము

1. ప్రశ్న : విశ్వామిత్రుడు వసిష్ఠునితో కలిగిన వైరం కారణంగా కలత చెంది, స్థిరమైన నిర్ణయంతో, దక్షిదిశగా వెళ్ళి ఒకచోట బ్రహ్మదేవుని గురించి తీవ్రంగా తపస్సు చేశాడు. పితామహుడు ప్రత్యక్షమై నిన్ను ఏ ఋషిగా గుర్తిస్తున్నాను అని పలికాడు ?

జవాబు : 1. బ్రహ్మర్షిగా 2. రాజర్షిగా
3. దేవర్షిగా 4. మహర్షిగా

2. ప్రశ్న : అయోధ్యాధి పతియైన త్రిశంకు మహారాజు తాను సశరీరంతో స్వర్గానికి వెళ్ళే విదంగా యజ్ఞం చేయమని కోరగా, అందుకు అంగీకరించక, ఆగ్రహించిన వసిష్ఠ పుత్రులు ఆ రాజును ఏరీతిగా శపించారు ?

జవాబు : 1. చండాలుడవు కమ్మని 2. మృగరూపివి కమ్మని
3. శిలారూపివి కమ్మని 4. రాజ్యభ్రష్టుడవు కమ్మని

3. ప్రశ్న : గురుపుత్రుల శాపాన్ని పొందిన త్రిశంకుడు ఎవరిని ఆశ్రయించాడు?

జవాబు : జవాబుల కాలంలో ఉంది.

4. ప్రశ్న : తనను ఆశ్రయించిన త్రిశంకుడిని విశ్వామిత్రుడు ఏరీతిగా ఆదరించాడు ?

జవాబు : వసిష్ట, వసిష్ట కుమారులచేత నిరాదరింపబడిన త్రిశంకువు, విశ్వామిత్రుని శరణువేడాడు. తన శత్రువుచేత నిరాకరింపబడిన త్రిశంకుడిని విశ్వామిత్రుడు చేరదీసి, ఆతని కోరిక ప్రకారం యజ్ఞం చేయ నిశ్చయించాడు. వెంటనే తన కుమారులను పిలిచి, త్రిశంకుడు నన్ను అర్థించి, తాను సశరీరంతో స్వర్గానికి వెళ్ళే విధంగా కోరినాడు. ఆతని కోరిక మన్నించి మనం యాగాన్ని నిర్వహించాలి. కావున

అందుకు కావలసిన సాధన సామగ్రిని సమీకరించండి. అని ఆజ్ఞ ఇచ్చాడు. పిమ్మట తన శిష్యులను పిలిచి, మీరు సకల ఋషిగణాన్ని, వారి శిష్యులను, ఋత్విజులను, వేదశాస్త్ర పండితులను నా ఆజ్ఞగా చెప్పి ఆహ్వానించి రండి, అని చెప్పి వారిని పంపించాడు. అనంతరం విశ్వామిత్రుని ఆజ్ఞానుసారం అందరూ వచ్చారు. వారందరితో మనమందరం యజ్ఞాన్ని నిర్వహించి, ఆ యజ్ఞ ప్రభావంతో ఈ త్రిశంకుడిని సశరీరంతో స్వర్గానికి పంపించాలి అన్నాడు. పిమ్మట విశ్వామిత్రుని మాటలను వారంతా అంగీకరించి, యజ్ఞాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఫలితంగా త్రిశంకువు సశరీరంతో స్వర్గానికి వెళ్ళాడు. అక్కడ దేవేంద్రుడు గురు శాపకారణంగా నీవు స్వర్గానికి అనర్హుడవు అని త్రిశంకుని, స్వర్గం నుండి తల క్రిందులుగా పడత్రోశాడు. అది తెలిసిన విశ్వామిత్రుడు తన బలంతో త్రిశంకుడిని ఆకాశము నందే నిలిపి, వేరొక స్వర్గాన్ని సృష్టించి, ఈ స్వర్గము త్రిశంకుడి నివాస స్థానమగును గాక, ఇందుకు దేవతలందరూ అంగీకరింతురుగాక అన్నాడు. అందుకు దేవత లందరూ అంగీకరించారు. త్రిశంకుడుని తాను సృష్టించిన స్వర్గ మందుంచి, విశ్వామిత్రుడు తన యాజమాన్యంతో యజ్ఞాన్ని పరిసమాప్తం చేశాడు?

5. ప్రశ్న : అంబరీష మహారాజుకు బలిపశువుగా వెళ్తున్న శునస్సేపుని విశ్వామిత్రుడు ఏ విధంగా కాపాడాడు ?

జవాబు : ఒకప్పుడు అయోధ్యాధిపతియైన అంబరీషుడు ఒక యజ్ఞాన్ని ప్రారంభించాడు. ఆ యజ్ఞ పశువును ఇంద్రుడు అపహరించాడు. అప్పుడు యజ్ఞ నిర్వహణ చేస్తున్న పురోహితుడు రాజుతో మీ ఏమరు పాటు కారణంగా యజ్ఞ పశువు దొంగలింప బడింది. ఆ యజ్ఞ పశువును తెప్పించ లేకపోతే, గోవులను ప్రతి ఫలంగా ఇచ్చి ఒక మానవుడిని యజ్ఞ పశువుగా పొందవచ్చు, అందుకు తగిన ప్రయత్నం చేయుమని చెప్పాడు. ఆ విధమైన ప్రయత్నంలో భాగంగా అంబరీషుడు ఋచీక మహర్షిని దర్శించి, ఆయనకు లక్ష గోవులనిచ్చి

ఆయన రెండవ కుమారుడు సునశ్శేపుని యజ్ఞ పశువుగా పొంది వస్తున్న సమయంలో, త్రోవలో శునశ్శేపుడు తన మేన మామయైన విశ్వామిత్రుని శరణు వేడాడు. ఆ మహర్షి ఇచ్చిన మంత్ర ప్రభావంతో, యజ్ఞ పరిసమాప్తి సమయంలో శునశ్శేపుడు అగ్నిని ఆరాధించి, ఇంద్రుని, ఉపేంద్రుని స్థుతించాడు. అంతట దేవేంద్రుడు ప్రసన్నుడై శునశ్శేపునకు దీర్ఘాయువును, అంబరీషునకు యజ్ఞ ఫలాన్ని ఇచ్చాడు. ఆ విధంగా విశ్వామిత్రుని ఉపదేశం వలన శునశ్శేపుడు ప్రాణాపాయం నుండి బయట పడ్డాడు.

## పదియవ అధ్యాయము

జవాబులు : 1.2. రాజర్షిగా 2.1. చండాలుడవు కమ్మని
3. విశ్వామిత్రుని

..........

# బాల కాండము

## 63, 64, 65, 66, 67 సర్గలు

## పదకొండవ అధ్యాయము

1. ప్రశ్న : పుష్కర తీర్థంలో విశ్వామిత్రుడు తపస్సు చేస్తుండగా ఆయన తపస్సు భగ్నం చేసిన, నిరుపమాన సౌందర్యవతి యైన అప్సరస ఎవరు ?

జవాబు : 1. పుంజకస్థల 2. ఊర్వశి
3. మేనక 4. తిలోత్తమ

2. ప్రశ్న : శతానందుడు శ్రీరామునికి విశ్వామిత్రుని గాథను వివరిస్తూ, బ్రహ్మదేవుడు విశ్వామిత్రుని బ్రహ్మర్షిగా ప్రకటించాడు అని చెప్పాడు. ఆ ప్రకటన విశ్వామిత్రుడు ఏ దిక్కున తపస్సు చేస్తుండగా జరిగింది ?

జవాబు : 1. దక్షిణం 2. పడమర
3. ఉత్తరం 4. తూర్పు

3. ప్రశ్న : బ్రహ్మర్షిత్వాన్ని అనుగ్రహించిన బ్రహ్మదేవునితో విశ్వామిత్రుడు,

తనను బ్రహ్మర్షీ! అని ఎవరు పిలిస్తే తాను తపస్సు విరమిస్తాను అని చెప్పాడు.

జవాబు : జవాబుల కాలంలో ఉంది.

4. ప్రశ్న : జనక మహారాజు విశ్వామిత్రునితో శివధనస్సు చరిత్రను, సీతా స్వయంవర ప్రకటనను గురించి ఏ రీతిగా వివరించి చెప్పాడు ?

జవాబు : విశ్వామిత్ర మహర్షి జనక మహారాజుతో ఓ రాజా! నీ ఇంట నున్న శివధనస్సును, అయోధ్యా రాకుమారులైన ఈ రామ లక్ష్మణులు చూడగోరుతున్నారు. చూపించండి అన్నాడు. అంతట జనకుడు మహర్షికి నమస్కరించి వినయంతో బ్రహ్మర్షీ! ఈ శివ ధనస్సును, పూర్వం దక్షయజ్ఞం ధ్వంసంచేస్తూ కోపించిన పరమ శివుడిని, దేవతలు ప్రార్థించి ప్రసన్నం చేసికొన్నారు. ఆ రీతిగా ప్రసన్నుడైన శంకరుడు తన చేతనున్న ధనస్సును దేవతల కిచ్చాడు. వారు మా నిమి వంశంలోని ఆరవ వాడైన దేవరాతునికి న్యాసముగా ఇచ్చారు. అప్పటి నుండి ఈ ధనస్సు మా ఇంటనే పూజలందు కొంటూన్నది. మునిలోక పూజ్యా! ఒకప్పుడు నేను యాగ నిమిత్తమై భూమిని దున్నుతుండగా నాగటిచాలు నుండి ఒక బాలిక ఉద్భవించింది. ఆమెకు 'సీత' అనే నామకరణం చేసి పెంచు కొంటున్నాను. కాగా యుక్త వయస్కురాలైన నా కూతురు సీతకు పరాక్రమమే శుల్కంగా, పరాక్రమ వంతుడే నా కుమర్తెను వివాహ మాడగలడు. అని ప్రకటించాను. నా ప్రకటనను విని ఎందరో రాకుమారులు వచ్చి, తమ పరాక్రమాన్ని ప్రదర్శించారు. కాని ఏ ఒక్కరు కూడా శివ ధనస్సును ఎక్కుపెట్టలేక పోయారు. కాని బ్రహ్మర్షీ ఎంతో ప్రభావంగల ఈ శివధనస్సును మీ అనుమతితో రామలక్ష్మణులకు చూపిస్తాను. ఈ ధనస్సును ఎక్కుపెట్టిన వారికి నా కుమార్తెను సమర్పిస్తాను. అని జనకుడు విశ్వామిత్రునికి వివరించాడు.

5. ప్రశ్న : సీతా స్వయంవర సందర్భంలో శివ ధనుర్భంగం ఏరీతిగా జరిగింది ?

జవాబు : జనక మహారాజు ఆజ్ఞ మేరకు, ఆయన మంత్రులు శివధనస్సు ఉన్న

పేటికను బలమైన భటులచేత సభాస్థలికి తీసికొని వచ్చారు. అంతట మహారాజు విశ్వామిత్ర మహర్షితో గురుదేవా! ఇదిగో శివధనస్సును ఇక్కడకు తెప్పించాను. మీ వెంట ఉన్న రాజ కుమారులు దీనిని చూడవచ్చు అన్నాడు. అంతట విశ్వామిత్రుడు, నాయనా రామా! ఈ ధనస్సును చూడు అన్నాడు. అంతట ఆ రఘువరుడు ధనస్సు ఉన్న పేటిక వద్దకు చేరి, ఆ ధనస్సును చూసి, గురుదేవా! ఈ మహా ధనస్సును చేతితో తాకి, దానిని పైకెత్తి, అల్లెత్రాటిని సందింతును అన్నాడు. అందుకు జనకుడు, విశ్వామిత్రుడును 'సరే' అన్నారు. అంతటా శ్రీరాముడు వేలకొలది సదస్సులు చూస్తుండగా ముని ఆజ్ఞ ననుసరించి, ధనస్సు మధ్య భాగాన్ని పట్టుకొని, అవలీలగా పైకెత్తి నిలబెట్టాడు. అప్పుడా నరశ్రేష్ఠుడు వింటినారిని సంధించి, దానిని ఆకర్ణాంతము లాగాడు. వెంటనే ఆవిల్లు 'ఫెళ్ళు'న విరిగింది. ఆ ధనుర్భంగ ధ్వనికి గంటలు ఘల్లు మన్నాయి. సంభ్ర మాశ్చర్యాలతో సీతాదేవి దేహం పులకించింది. అప్పుడా జనకరాజు మహర్షీ! దశరథ పుత్రుడైన శ్రీరాముని పరాక్రమాన్ని కన్నులారా చూశాను. ఇంతటి వీరోచిత కార్యాన్ని నేను ఊహించ లేదు. నా కుమార్తె సీత శ్రీరాముని భర్తగా పొంది ఇరు వంశాలకు కీర్తి తెస్తుంది అన్నాడు. అంతట విశ్వామిత్రుని, శ్రీరాముని అనుమతితో జనకుడు తన మంత్రులను అయోధ్యకు పంపించి, సీతా స్వయంవర విశేషాలను దశరథ మహారాజుకు తెలిపి, వారిని మిథిలకు ఆహ్వానించాడు. ఈ విధంగా శివ ధనుర్భంగ వార్త ఇటు మిథిలా నగర వాసులకు, అయోధ్యానగర వాసులకు తెలిసి అందరూ సంతోషించారు.

## పదకొండవ అధ్యాయము

జవాబులు : 1.3. మేనక    2.4. తూర్పు దిక్కున
3. వసిష్ఠుడు

# బాల కాండము

## 68, 69, 70, 71, 72 సర్గలు

## పండ్రెండవ అధ్యాయము

1. ప్రశ్న : జనకమహారాజు సందేశాన్ని తీసికొని, మంత్రులు, దూతలు రాత్రింబవళ్ళు ప్రయాణించి, అయోధ్యకు ఎన్ని రోజులలో చేరుకొన్నారు ?

జవాబు : 1. రెండు రోజులు 2. మూడురోజులు
3. నాలుగు రోజులు 4. ఐదు రోజులు

2. ప్రశ్న : జనకుడు శతానందుని పిలిచి సాంకాశ్యపురాన్నేలే నా సోదరుని, వివాహ శుభ సందర్భంగా కుటుంబ సమేతంగా ఆహ్వానించేట్లుగా ఏర్పాట్లు చేయ్యమని ఆజ్ఞాపించాడు. మరి ఆ జనకరాజు తమ్ముని పేరేమి?

జవాబు : 1. మహారోముడు 2. దేవరాతుడు
3. హ్రస్వరోముడు 4. కుశధ్వజుడు

3. ప్రశ్న : కల్యాణవేదిక వద్ద అందరూ సుఖాసీనులైన పిమ్మట దశరథ మహారాజు, తన వంశక్రమాన్ని ఎవరి ద్వారా వినిపించాడు.

జవాబు : జవాబులకాలంలో ఉన్నది.

4. ప్రశ్న : ఇక్ష్వాకు, విదేహరాజ వంశాల ప్రవరలు ఏ రీతిగా వివరించ బడ్డాయి?

జవాబు : ఇరుపక్షాల పెండ్లివారు కల్యాణ వేదిక వద్దకు వచ్చి ఆసీనులైన పిమ్మట, దశరథుని విన్నపం మేరకు వసిష్టుడు ఇక్ష్వాకు వంశక్రమాన్ని తెలుపుతూ, బ్రహ్మదేవుని మానసపుత్రుడు మరీచి, ఈయనకు కాశ్యపుడు కాశ్యపునికి వైవస్వత మనువు, ఆ మనువుకు ఇక్ష్వాకువు జన్మించారు. ఇక్ష్వాకువే తొట్టతొలి అయోధ్యాధిపతి. ఇక్ష్వాకువు కుమారుడు కుక్షి ఈ విధంగా సాగిన ఇక్ష్వాకు వంశంలో త్రిశంకుడు, మాందాత, భరతుడు, సగరుడు, భగీరథుడు, కకుత్సువు, రఘు మహారాజు అంబరీషుడు, నహుషుడు, యయాతి అను ప్రముఖులైన మహారాజులు ప్రభవించారు. అటు పిమ్మట యయాతికి నాభాగుడు

పుత్రుడుగా జన్మించాడు. నాభాగునకు అజుడు పుత్రుడు కాగా, అజమహారాజుకు దశరధుడు పుత్రుడు, ఈ దశరథ మహారాజుకు నలుగురు కుమారులు. వారు రాముడు, భరతుడు, లక్ష్మణుడు, శత్రుఘ్నుడు. ఓ జనక రాజేంద్రా! ఈ ఇక్ష్వాకు వంశం మొదటి నుండి అతి పవిత్రమైనది అని పలికాడు. పిమ్మట జనక మహారాజు మహర్షీ! మా వంశం కూడా వాసికెక్కినదే. వధువు తండ్రి తన వంశ క్రమాన్ని కూడా తెలుపుకోవాలి కావున, నేను మా వంశక్రమాన్ని గురించి తెలుపు కొంటున్నాను వినండి. ముల్లోకాల యందు ప్రసిద్ధుడైన 'నిమి' మహారాజు మా వంశానికి మూల పురుషుడు. ఈయన కుమారుడు మిథి. ఇతడే మిథిలానగర నిర్మాత. మొదటి జనకుడు. ఈయన వలననే మా వంశం జనక వంశ మయ్యింది. అటు పిమ్మట ప్రవర్ధమానమైన మా వంశం, దేవరాతుడు, బృహద్రథుడు, హర్యశ్వుడు, కీర్తిరాతుడు, మహారోముడు, స్వర్ణరోముడు వంటి ఎందరో ప్రసిద్ధులతో పునీత మైనది. మా తండ్రి గారైన హ్రస్వరోముడు, రాజ్యాన్ని నా కప్పగించి ఆయన వానప్రస్థాన్ని స్వీకరించాడు. అని తన వంశక్రమాన్ని తెలుపు కొన్నాడు.

5వ ప్రశ్న : లక్ష్మణ, భరత, శత్రుఘ్నుల వివాహాలు ఏ విధంగా నిశ్చయించారు?

జవాబు : జనక మహారాజు ఆహ్వానం మేరకు దశరథ మహారాజు సకుంటుంబ, సపరివార సమేతంగా మిథిలకు చేరుకొన్న పిమ్మట, అందరూ కలిసి ఆనందంగా ఉన్న సమయంలో వసిష్ట మహర్షి జనక మహారాజుతో ఓ రాజా! ఇక్ష్వాకు వంశ సంజాతులైన ఈ రామ లక్ష్మణులకు మీ కుమార్తెలైన సీతా-ఊర్మిళలను ఇచ్చి వివాహం జరిపించి నట్లైన ఎంతో బాగుండును, అని పలికిన వసిష్ట మహర్షికి జనకుడు నమస్కరించి తన అంగీకారాన్ని తెలియజేశాడు. అనంతరం ఇరువురి ప్రవరలు చెప్పుకొన్న పిమ్మట జనక రాజుతో విశ్వామిత్రుడు రాజా! ఇక్ష్వాకు, విదేహరాజ వంశాలు రెండునూ సాటిలేని వైభవములు కలిగినవే. మీ ఈ రెండు వంశాలమధ్య ఏర్పడనున్న ఈ వైవాహిక సంబంధాలు అన్ని విధాల తగి ఉన్నాయి. కాగా నేనొక మాట చెప్పదలచు కొన్నాను విను. నీ తమ్ముడైన కుశధ్వజుని ఇరువురు కుమర్తెలను భరత శత్రుఘ్నులకిచ్చి వివాహం జరిపిస్తే బాగుండును అని నేను మిమ్ములను కోరుచున్నాను. దశరథ పుత్రులందరూ రూప

యౌవనులు. కనుక మీ ఇరువంశాల వారికి ఈ వివాహ సంబంధం శ్రేయోదాయకం అన్నాడు. వసిష్ఠుని సమ్మతితో పలికిన విశ్వామిత్రుని మాటలు విని జనక మహారాజు వినయంతో అంజలి ఘటించి, ఓ మునీశ్వరులారా! మా శ్రేయస్సును కోరి పలికే మీ మాటలు నిజమగును గాక. అట్లే కానిండు. పరాక్రమ శాలురైన ఈ నలుగురు రాకుమారులు ఈ రాకుర్తెలను ఒకేరోజున పరిణయ మాడుదురు గాక. అని తన అంగీకారాన్ని తెలిపాడు.

### పండ్రెండవ అధ్యాయము

జవాబులు : 1.2. మూడు రోజులు 2.4. కుశధ్వజుడు
3. వసిష్ఠుని ద్వారా

...........

# బాల కాండము

## 73, 74, 75, 76, 77 సర్గలు

### పదమూడవ అధ్యాయము

1. ప్రశ్న : దశరథ మహారాజు తన కుమారులను, ఋషులందరినీ వెంట బెట్టుకొని వివాహ మండపం వద్దకు వచ్చాడు. అప్పుడు జనకుడు సర్వాలంకార భూషితలైన తన కుమార్తెలను వెంట బెట్టుకొని, పెండ్లి వేదిక వద్దకు వచ్చి, ఋషు లందరితో గూడి వివాహ కృత్యా లన్నింటిని మీరే నిర్వహించండి, అని ఎవరిని ప్రార్థించాడు?

జవాబు : 1. విశ్వామిత్రుడుని 2. శతానందదుని
3. వసిష్ఠుడుని 4. వామదేవుడుని

2. ప్రశ్న : సీతారాముల కళ్యాణం పూర్తి అయిన పిమ్మట మరుసటి రోజు విశ్వామిత్ర మహర్షి వధూవరు లందరినీ ఆశీర్వదించి ఎక్కడకు వెళ్ళాడు?

జవాబు : 1. హిమవత్పర్వత ప్రాంతాలకు 2. విండ్య పర్వతానికి
3. గాంధార దేశానికి 4. మహేంద్రగిరికి

3. ప్రశ్న : దశరథ మహారాజు తన నలుగురు కొడుకులతోనూ, నలుగురు కోడళ్ళతోనూ, సపరివారంతో బయలుదేరి అయోధ్యకు వెళ్తుండగా, తమ ప్రయాణాన్ని అడ్డకొని నిలిచిన మహర్షి ఎవరు?

జవాబు : జవాబుల కాలంలో ఉంది.

4. ప్రశ్న : సీతా, ఊర్మిళా, మాండవీ, శ్రుతకీర్తుల వివాహం ఏరీతిగా జరిగింది?

జవాబు : సుగంధ పుష్పాలతోనూ, మామిడి తోరణాలతోనూ, కల్యాణ మండపాన్ని అలంకరింప జేశారు. వివాహ కృత్యానికి కావలసిన సాధన సామగ్రి నంతటిని వేదికపైకి చేర్చారు. ఋషులందరి సహకారంతో వసిష్ట మహర్షి వివాహ కార్యక్రమాన్ని నిర్వహించడానికి పూనుకొని, సర్వ మంగళకరం గానూ, శాస్త్రోక్తంగానూ, సమంత్ర పూర్వకం గానూ నిర్వహించాడు. జనక మహారాజు చేత సీత, ఊర్మిళ కన్యాదాన కర్తృత్వాన్ని పూర్తిచేసి, తన తమ్ముడైన కుశధ్వజుని చేత మాండవీ శ్రుతకీర్తుల కన్యాదాన కర్తృత్వాన్ని జరిపించాడు. పిమ్మట జనకుని మాటలు ఆమోదించి, ఆ నలుగురు సోదరులును వసిష్ఠుని ఆమోదంతో తమతమ వధువుల చేతులు పట్టుకొని అగ్నికిని, వేదికకును, జనక మహారాజుకును, ఋషు లందరికినీ ప్రదక్షిణ పూర్వకంగా నమస్కరించారు. పిమ్మట శాస్త్రోక్తంగా, కల్పసూత్రాల ననుసరించి వసిష్ట మహర్షి వివాహ కార్యక్రమాన్ని కొనసాగించాడు. ఆ విధంగా జరిగిన రఘువంశీయుల వివాహానికి ఆకాశాన దేవతలు పుష్పవృష్టి కురిపించారు. అట్టి కల్యాణ వేడుకను చూసిన పుణ్యస్త్రీ, పురుషులు తమ జన్మలు ధన్యమైనాయని ఒకరికొకరు చెప్పుకొన్నారు. ఆ విధంగా తేజో మూర్తులైన ఆ నవ దంపతులు ఒకరి చిటికెన వేలును ఒకరు పట్టుకొని కొంగు ముడులతో మూడు పర్యాయాలు అగ్నికి ప్రదక్షిణంచేసి, వివాహ కార్యక్రమాన్ని పూర్తి చేసుకొన్నారు. పిమ్మట ఆ నలుగురు నవదంపతుల జంటలు తమ తమ విడిది గృహాలకు వెళ్ళారు.

5. ప్రశ్న : పెండ్లి వేడుకలు ముగించుకొని అయోధ్యకు వెళ్తున్న శ్రీరామునికి పరశురాముని రూపంలో వచ్చిన ప్రమాదం ఏ రీతిగా తప్పిపోయింది?

జవాబు : నలుగురు కొడుకులతోనూ, కోడళ్ళతోనూ అయోధ్యకు బయలుదేరిన దశరథుడు, జనక రాజాదులను వీడ్కొలిపి, కొంత దూరం ప్రయాణించాడు. అప్పుడు ఒక భుజాన పరశువును, ఒక చేత వైష్ణవ ధనస్సును చేతబట్టి ఎదురు వచ్చిన పరశు రామునికి వసిష్టాదులు నమస్కరించి, రాముని చేత అర్చింపజేశారు. అప్పుడు పరశురాముడు ఓ రామా! నీవు శివధనస్సును భగ్నం చేశావని విన్నాను. నేనింకో వేద ధనస్సును తెచ్చాను. ఇదిగో ఈ వైష్ణవ ధనస్సును నారాయణుడు మా తాత ఋచీకుల వారి వద్ద ఉంచాడు. దీనిని నీవు చేతబట్టి శరసందానం చేసి నీ బలాన్ని ప్రదర్శించు, నీ సామర్థ్యాన్ని చూసి నీతో ద్వంద్వ యుద్ధం చేస్తాను. అని పలికిన పరశురాముని మాటలకు దశరథుడు భయపడి అంజలి ఘటించి, ప్రార్థించాడు. అప్పుడు రాముడు ఓ భార్గవా! శివధనుర్భంగం క్షత్రియ ధర్మాన్ననుసరించి ఎక్కుపెట్టడమే నేను చేసినది. ధనుర్భంగ మనేది దైవేచ్ఛ మాత్రమే. కాగా నీవు నన్ను అశక్తునిగా భావించి మాట్లాడావు. దీనిని నేను ఒప్పుకోను. ఇదిగో నా పరాక్రమాన్ని చూడు, అని పలికి దశరథరాముడు, పరశురాముని చేతనున్న వైష్ణవ ధనస్సును తీసికొని శరసంధానం చేశాడు. సంధించిన బాణాన్ని వృధాగా పోకూడదు కావున పరశురాముడు కష్టపడి తపస్సు చేసి సంపాదించిన పుణ్యలోకాన్ని కొట్టాడు. అప్పుడు పరశురాముడు చేసేదిలేక ఈతడు మహా విష్ణువేనని తలచి, మనో వేగంతో మహేంద్రగిరికి వెళ్ళాడు. పిమ్మట దశరథాదు లందరూ సంతోషంతో అయోధ్యకు చేరుకొన్నారు.

## పదమూడవ అధ్యాయము

జవాబులు : 1.3. వసిష్టుడుని 2.1. హిమవత్పర్వత ప్రాంతాలకు
3. పరశురాముడు

## బాలకాండము సమాప్తము

# 2. అయోధ్యా కాండము

## 1, 2, 3, 4, 5, 6 సర్గలు

## పదునాలుగవ అధ్యాయము

1. ప్రశ్న : దశరథ మహారాజు శ్రీరాముడిని యువరాజుగా పట్టాభిషేకం చేయనెంచి, తన సభలోని వారందరి సమ్మతిని అడిగే సమయానికి, భరతుడు తన మేనమామగారి ఇంట ఉన్నాడు. కాగా భరతుని మేనమామగారి పేరేమిటి?

జవాబు : 1. సీరధ్వజుడు 2. కుశధ్వజుడు 3. యుధాజిత్తు 4. శతానందుడు

2. ప్రశ్న : శ్రీరామ పట్టాభిషేక కార్యనిర్వహణా బాధ్యతను దశరథుడు ఎవరికి అప్పగించాడు?

జవాబు : 1. విశ్వామిత్రుడు 2. వసిష్ఠుడు 3. జాబాలి 4. జాబాలి

3. ప్రశ్న : సుమంత్రుని చేత శ్రీరాముడిని తన వద్దకు పిలిపించు కొన్న దశరథుడు, నాయనా! రేపటి శుభనక్షత్రాన నీవు పట్టాభిషిక్తుడవు కావాలి. అని పలికిన శుభ నక్షత్రం పేరేది?

జవాబు : జవాబుల కాలంలో ఉంది.

4. ప్రశ్న : పట్టాభిషేక సందర్భంగా సీతారాముల ఉపవాస దీక్ష ఏ రీతిగా సాగింది?

జవాబు : దశరథుడు వశిష్టునితో మహర్షీ! శ్రీరామునికి ఉపవాస దీక్షను తీసికొమ్మని నేను చెప్పాను. మీరు కూడా వెళ్ళి రామునితో పాటు సీతాదేవిని కూడా ఉపవాస దీక్షను తీసుకొమ్మని చెప్పండి. అని పలికిన దశరథుని మాటల ప్రకారం వసిష్ఠుడు రాముని అంతః పురానికి వెళ్ళి, సీతారాములకు సమంత్రకంగా ఉపవాస దీక్షను ఇచ్చి వెళ్ళాడు. అప్పుడు రామ మందిరం సంతోషంతో పొంగిపోవుచున్న స్త్రీ, పురుషులతో కళకళలాడు చున్నది. వశిష్ఠ మహర్షి వెళ్ళిన పిమ్మట శ్రీరాముడు స్నానాదికాలు పూర్తిచేసుకొని, నిశ్చల మనస్కుడై, తన ధర్మపత్నియైన సీతాదేవితోగూడి శ్రీమన్నారాయణుని సేవించాడు. పిమ్మట హవిస్సులతో గూడిన పాత్రను శిరస్సుపై దాల్చి, అగ్నికి ప్రదక్షిణం చేసి శ్రీ మహావిష్ణువు

నుద్దేశించి, జ్వలించుచున్న అగ్నియందు శాస్త్ర ప్రకారం హోమం చేశాడు. అప్పుడు హోమం చేయగా మిగిలిన హవిస్సును స్వీకరించాడు. పరమ దైవమైన మహావిష్ణువును ధ్యానిస్తూ, మౌనంగా మనోనిగ్రహంతో ఆ మందిరంలో చక్కగా పరుచబడిన దర్భశయ్యపై వారిరువురూ శయనించారు. ఈ విధంగా సీతారాముల ఉపవాస దీక్ష కొనసాగు చున్నది.

5. ప్రశ్న : అయోధ్యాపుర ప్రజలు శ్రీరాముని పట్టాభిషేక వార్తవిని ఏ విధంగా సంబరాలు చేసుకొన్నారు?

జవాబు : శ్రీరామ పట్టాభిషేక శుభవార్తను విన్న పౌరజానపదులు, అమితానందంతో, నగర వీధులన్నీ శుభ్రపరచి, కళ్ళాపిచల్లి రంగవల్లులు తీర్చిదిద్దారు. ద్వార తోరణాలతో పూలమాలలతో అలంకరించి నగరాన్ని శోభాయమానంగా తీర్చిదిద్దారు. పట్టాభిషేక శుభ సమయం దగ్గర పడుతుండడంతో నగరంలోని స్త్రీలు, పురుషులు తమ ప్రాంగణములలో ముచ్చటించు కొంటూ మురిసిపోయారు. అన్ని ప్రదేశాలలో నటీనటులు ప్రదర్శించు చక్కటి దృశ్యాలను, ఆహ్లాదకరమైన నర్తకుల నాట్యభంగిమలు, గాయనీ గాయకుల మధుర గానాలు విని, చూసి ప్రజలు ఆనందించారు. పట్టాభిషేక మహోత్సవాన్ని పురస్కరించుకొని పౌరులందరూ రాజమార్గముల యందు రంగు రంగుల పూలను చల్లారు. ధూపములతోను సుగంధ లేపనాలతోనూ మార్గములన్నీ పరిమళములతో గుబాళింప జేసారు. వైభవోపేతంగా అలంక రించిన ప్రజలు దశరథ మహారాజును కొనియాడారు. ఇక్ష్వాకు వంశ వర్ధనుడైన ఈ మహారాజు తన వార్ధక్యాన్ని గుర్తించి శ్రీరామునికి పట్టాభిషేకం చేయడం చాలా గొప్ప విషయంగా ప్రజలు కీర్తించారు. లోకులందరి మంచి చెడ్డలు బాగా ఎరిగిన వాడైన శ్రీరాముడు మనకు ప్రభువు కాబోతున్నాడు. ఇక అతడే మనకు చిరకాల రక్షకుడు. మనకు అబ్బిన ఈ అదృష్టం దైవానుగ్రహ ఫలితమేనని ప్రజలందరూ ఆనందాతిరేకాన్ని ఒకరి కొకరు తెలుపు కొన్నారు.

## పదునాలుగవ అధ్యాయము

జవాబులు : 1.3. యుధాజిత్తు    2.2. వసిష్ఠుడు

3. పుష్యమీ నక్షత్రం

# అయోధ్యా కాండము

## 7, 8, 9,10, 11, 12 సర్గలు

## పదునైదవ అధ్యాయము

1. ప్రశ్న : శ్రీరామ పట్టాభిషేక వార్తను దశరథుని భార్యలలో ఒకతెయైన కైకేయికి మొదటగా తెలిపినది ఎవరు?

జవాబు : 1. దశరథుడు 2. దాసి మందర
3. వామదేవుడు 4. కౌసల్య

2. ప్రశ్న : పూర్వం దశరథుడు ఎవరితో చేసిన యుద్ధ సమయంలో కైకాదేవికి రెండు వరములను న్యాసముగా యిచ్చి ఉన్నాడు?

జవాబు : 1. శంబరాసురుడు 2. మారీచుడు
3. సుబాహుడు 4. సుందుడు

3. ప్రశ్న : పట్టాభిషేక శుభవార్తను తెలుపుటకై దశరథ మహారాజు కైకేయిదేవి అంతః పురంలో ప్రవేశించు సమయానికి కైకేయీదేవి ఎక్కడ ఉన్నది?

జవాబు : జవాబుల కాలంలో ఉంది.

4. ప్రశ్న : కైకాదేవి దశరథ మహారాజును ఏ రీతిగా ఏ విధమైన వరములను కోరింది?

జవాబు : కోపగృహంలో, కటిక నేలపై పడియున్న కైకాదేవిని దశరథ మహారాజు చూసి, ఈమె ఏదైనా కోరుకొంటున్నదా? లేక అనారోగ్యము పాలైనదా? అని ఆలోచిస్తూ ఆమెకు దగ్గరగా వెళ్ళి అనునయ వాక్యాలతో ఓ కళ్యాణీ! నీవు ఈ విధంగా దుమ్ములో పడియుండుట వలన నా మనస్సు చాలా బాధపడుతూంది. ఇట్లెందుకు చేశావు? నీ యిష్టమేదైనా నేను నిరాకరింపను. నీ మనస్సులోని మాటను నిశ్శంకోచంగా తెలియజెయ్యి. అని పలికిన మహారాజుతో రాణి ప్రభూ! నాకొక కోరిక ఉంది. దానిని నీవే తీర్చాలి. అట్లు చేయదలచినచో ప్రమాణ పూర్వకంగా నాకు మాట యివ్వు. అని పలికిన కైకేయితో మహారాజు నేనెప్పుడైనా నీ మాట కాదన్నానా? దేవీ! స్త్రీలలో నీవే నాకు ప్రియమైన దానవు.

పురుషులలో నరోత్తముడైన రాముడే నాకు ప్రియతముడు. నా ప్రాణములకంటే మిన్నయైన రామునిపై ఒట్టుపెట్టకొని చెప్పుచున్నాను. నా పుణ్యములపై ఆన. నీ యిష్టప్రకారమే, నీకు కావలసిన వరాలను అడుగుమని పలికిన తన భర్తతో కైకేయి మహారాజా! లోగడ శంబరాసుర యుద్ధ సమయంలో నీవు నాకు న్యాసముగా రెండు వరములను యిచ్చి యున్నావు. వాటిని ఇప్పుడు అడుగుతున్నాను. అందులో మొదటిది శ్రీరాముని కొరకై ఏర్పాటు చేయబడిన సాధన సామగ్రితో భరతునకి పట్టాభిషేకం జరగాలి. కాగా రెండవది రాముడు నారచీరలు ధరించి జటాధారియై దండకారణ్యానికి నేడే వెళ్ళి పదునాలుగు సంవత్సరములు వనవాసం జరపాలి. నీవు సత్య వాక్పాలకుడ వైతే నాకు యిచ్చిన వరాలను నెరవేర్చు అన్నది. ఆ మాటలకు దశరథ మహారాజు నిశ్చేష్టుడయ్యాడు.

5. ప్రశ్న : కైకేయి దేవి కోరిన వరములను విని దశరథ మహారాజు ఏవిధంగా పరితపించాడు?

జవాబు : కైకేయిదేవి కోరిన వరములను విని మహారాజు నిశ్చేష్టుడై కొంత సేపటికి తేరుకొని, ఇది కలయా? లేక నా చిత్త భ్రమయా? నా మనస్సుకేమైనా ఉన్మాదం ఏర్పడిందా? అని పలు విధాలుగా దుఃఖించ సాగాడు. పిమ్మట స్పృహను కోల్పోయిన దశరథుడు కొంతసేపటికి తేరుకొని, తన చూపులతో కైకను దహించి వేస్తున్నట్లుగా చూస్తూ, ఓసీ! క్రూరురాలా! రాముడు నీకు చేసిన అపకారమేమి? నేను చేసిన దోషమేమి? అటువంటి కోరిక కోరుటకు నీకు నోరెలా వచ్చింది? లోకమంతా రాముని గుణ గణాలను కీర్తిస్తుంటే, అతడు ఏ అపరాధం చేశాడని, నా బిడ్డను నేను వదులుకోను? ఒక్క క్షణమైనా రాముని విడిచి నా ప్రాణాలు నిలువవు. వనవాసాలకు పంపే ఆలోచనను నీ మనస్సు నుండి తొలగించుకో, కైకా! శిరసు వంచి నీ పాదాలకు నమస్కరిస్తాను. ఈ ధీనుని కనికరించు. నాకు భరతునిపై ప్రేమ ఉన్నదో? లేదో? తెలిసికోగోరి ఇట్లంటున్నావా? ఓ దేవీ! ఈ సముద్రపరీత భూవలయాన్నంతటినీ నీకు ధారపోస్తాను. కానీ, రాముని విషయంలో క్రోధాన్ని విడిచిపెట్టు. అంటూ ప్రాధేయపడి వేడుకొంటున్నా, ఆమెలో ఏ మార్పు రాలేదు. అప్పుడు ఓ

మహారాజా! రామునకు గాక, భరతునకు పట్టము గట్టుట ధర్మమో, అధర్మమో, నాకు తెలియదు. నాకిచ్చిన వాగ్దానమునకు వ్యతిరేకంగా జరుగుటకు వీలులేదు. అని నిర్దయగా పలుకుతున్న తన భార్యకు నమస్కరిస్తూ దశరథ మహారాజు తీరని ఆవేదనతో పరితపిస్తూ కూలబడి పోయాడు.

### పదనైదవ అధ్యాయము

జవాబులు : 1.2. దాసి మందర 2.1. శంబరాసురుడు
3. కోపగృహంలో

.......

# అయోధ్యా కాండము

## 13, 14, 15,16, 17, 18 సర్గలు

## పదహారవ అధ్యాయము

1. ప్రశ్న : పట్టువీడని కైకాదేవిని చూసి, దశరథ మహారాజు తన కుమారుడు దూరమగునని శోక వివసుడై ఎక్కడ పడిఉన్నాడు?

జవాబు : 1. ఉచితాసనముపై 2. కైకాదేవి వడిలో
3. హంసతూలికా తల్పంపై 4. కటిక నేలపై

2. ప్రశ్న : కైకాదేవి చేసిన వత్తిడి మేరకు దశరథ మహారాజు ధర్మపాశబద్ధుడై తెలతెలవారు తుండగా, ఎవరిని పంపించి రాముడిని తన వద్దకు పిలిపించు కొన్నాడు?

జవాబు : 1. సుమంత్రుడుని 2. వసిష్టుడుని
3. ప్రతీహారిని 4. జాబాలిని

3. ప్రశ్న : కైకేయీ మందిరంలో నున్న తండ్రి పిలుపు మేరకు రాముడు వెంటనే బయలుదేరి ఏ వాహనంపై వెళ్ళాడు?

జవాబు : జవాబుల కాలంలో ఉంది.

4. ప్రశ్న : పట్టాభిషేక నిర్వహణా బాధ్యత కలిగిన వసిష్టమహర్షి అయోధ్యా నగరానికి ఏ విధంగా వచ్చాడు? వచ్చిన మహర్షి నగరంలో ఏమి చేశాడు?

జవాబు : సూర్యుడుదయించి, పట్టాభిషేక శుభ ముహూర్తం దగ్గర పడుతుండగా, వసిష్ట మహర్షి తన శిష్యులతో గూడి, అభిషేక సామగ్రిని సమకూర్చుకొని, ఆశ్రమం నుండి బయలుదేరి అయోధ్యా నగరానికి వచ్చాడు? ఆయన వచ్చే సరికే నగరం శోభాయమానంగా అలంకరింపబడి ఉన్నది. శ్రీరామ పట్టాభిషేక దర్శన కాంక్షతో ఉన్న ప్రజలు వీధుల నిండా క్రిక్కిరిసి ఉన్నారు. చందనం, అగరు ధూపాలతో పరిమళ భరితమై ఉన్నది. అప్పుడు శిష్యపరివృతుడైన వసిష్ఠుడు అంతః పురంలోకి వెళుతుండగా సుమంత్రుడు ఎదురు వచ్చాడు. అప్పుడు వసిష్ఠుడు సుమంత్రునితో, నేనిచట ఉన్నానని రాజుగారికి విన్నవించు మని చెప్పాడు. ఇంకనూ సుమంత్రునికి తాను సేకరించి తెచ్చిన, పట్టాభిషేక శుభకార్యానికి కావలసిన సాధన సామగ్రిని అంతటిని చూపించాడు. అప్పుడు సుమంత్రుడు సంతసించి వసిష్టాదేశం ప్రకారం మహారాజుకు జయము పలుకుచూ, ఆయన మందిరంలో ప్రవేశించాడు. ఆయన పరిస్థితి తెలయని వాడవటం వలన సుమంత్రుడు ఎప్పటిలాగే మహారాజుకు సుప్రభాతం పలికాడు. వసిష్టాదులు వచ్చిఉన్నారని, మీరు స్నానాదికములు పూర్తి చేసుకొని పట్టాభిషేక కార్యక్రమానికి సిద్ధపడాలి కదా! అన్నాడు. ఆవిధంగా వసిష్టాదేశం ప్రకారం వచ్చిన సుమంత్రుడు మహారాజు కడ నిలిచాడు.

5. ప్రశ్న : కైకేయీ మందిరంలో తన తండ్రిని దర్శించిన రాముడు, అచట కైకేయీమాత ద్వారా ఎటువంటి వార్తను విన్నాడు?

జవాబు : శుష్కించిన ముఖంతో ధీనుడై ఉన్న దశరథుడు బంగారు తల్పంపై కూర్చొని యుండగా ప్రక్కన కైకేయీమాత ఉండగా రాముడు చూసి తండ్రి పాదాలకు నమస్కరించాడు. అప్పుడు దీనుడై ఉన్న దశరథుని నోట తండ్రీ! రామా! అనే మాటలు వెలువడి నంతనే ఆయన కన్నులు అశ్రుపూరితాలై గొంతు మాట్లాడుటకు పెగలక, కన్నులు చూడలేక పోయాడు. అది చూసిన రాముడు దిగ్భ్రాంతు డయ్యాడు. అప్పుడు రాముడు కైకేయికి నమస్కరించి అమ్మా! మా తండ్రి కుపితుడై ఇట్లు కనబడుచున్నా డేమి? నా వలన ఏమైనా

అపరాధం జరిగిందా? అని అర్థించిన రామునితో కైకేయి రామా! మహారాజుకు నీవు అత్యంత ప్రియమైన వాడవు. అట్టి నీతో అప్రియ వచనాలు పలుకుటకు నోరు రావటం లేదు. ప్రతిజ్ఞా పూర్వకంగా ఆయన నాకొక మాట ఇచ్చి యున్నాడు. ఆపని నీ వలననే సాధ్యము. శుభా శుభాలతో ప్రమేయం లేకుండా, దానిని నేను తప్పక పాటింతును అని నీవు నాకు మాట ఇచ్చినచో ఆ విషయాన్ని నేను నీకు పూర్తిగా వివరిస్తాను. మహారాజు దానిని నీతో స్వయంగా చెప్ప లేకున్నాడు. అని పలికిన కైకేయి మాటలకు రాముడు అమ్మా! రాజాజ్ఞ అయినచో నేనగ్నిలో దూకుటకైనా సిద్ధమే. పితృవాక్య పాలనకై నేను తీవ్రమైన విషాన్ని సేవించ డానికైనా సిద్ధమే. అని పలికిన రాముని ప్రతిజ్ఞా బద్ధునిచేసి, కైకేయిదేవి రామా! పూర్వము నీ తండ్రి నాకు ఇస్తానన్న వరాలను ఇప్పుడు కోరాను. వాటిలో మొదటిది భరతునికి పట్టాభిషేకం జరిపించడం, రెండవది ఈ రోజే నీవు వనవాసానికి వెళ్ళి, అక్కడ పద్నాలుగు సంవత్సరాల కాలం గడపడం. అను ఈ రెండు వరాలను నీ తండ్రి నాకు ప్రతిజ్ఞా పూర్వకంగా ఇచ్చాడు. నీవు నీ తండ్రి చేసిన సత్య ప్రతిజ్ఞను నిలబెట్టు. అని పలికిన పిన తల్లి మాటలకు రాముడు ఎట్టి వికారానికి లోనుకాకుండా నిలబడ్డాడు.

### పదహారవ అధ్యాయము

జవాబులు : 1.4. కటిక నేలపై 2.1. సుమంత్రుడిని
3. రథముపై

..........

# అయోధ్యా కాండము

## 19, 20, 21, 22, 23, 24 సర్గలు

## పదునేడవ అధ్యాయము

1. ప్రశ్న : రాజ్యాధికారం వదలివేసి వనాలకు వెళ్ళడానికి సుముఖుడై యున్న శ్రీరాముడు కైకేయి మాతతో తాను ఎవరి వద్ద సెలవు తీసికొని వెళతాను అని చెప్పాడు?

జవాబు : 1. వసిష్టుడు 2. కౌసల్యామాత
3. సుమంత్రుడు 4. లక్ష్మణుడు

2. ప్రశ్న : శ్రీరాముడు తన వనవాస గమనాన్ని గురించి తన అసమ్మతిని తెలియ జేస్తున్న లక్ష్మణునితో రాజ్యాధికారం తన చేతికి చిక్కినట్లే చిక్కి, జారిపోవడాన్ని గురించి, తన వనవాసప్రాప్తిని గురించి ప్రధానంగా ఎవరిని కారణంగా తెలిపాడు?

జవాబు : 1. దైవం 2. తండ్రి
3. కైకేయి 4. మందర

3. ప్రశ్న : శ్రీరాముడు తన వనవాస గమనాన్ని గురించిన విషయాన్ని తన తల్లికి తెలపడానికై కౌసల్యామాత మందిరానికి వచ్చు సమయానికి ముందే, కౌసల్యాదేవికి ఆ వార్తను గురించిన వివరాలు తెలుసా? తెలియదా?

జవాబు : జవాబుల కాలంలో ఉంది.

4. ప్రశ్న : వనవాస గమనాన్ని గురించి లక్ష్మణుడు ఏ విధంగా ఆలోచించాడు? అందుకు రాముడు తన తమ్ముడిని ఏ రీతిగా సమాధాన పరచాడు?

జవాబు : శ్రీరాముడు తాను పట్టాభిషేకాన్ని వీడి, వన గమనానికి వెళ్ళడానికి కారణం, విధిప్రేరణే తప్ప వేరు కాదు. అని పలుకు తూండగా, లక్ష్మణుడు తన అన్న ధర్మానికి కట్టుబడి నందుకు ఆనందం, రాజ్యాన్ని వదలి వెళ్తున్నందుకు దుఃఖము, ఈ రెండింటి మధ్య ఊగిసలాటకు గురియైనాడు. అప్పుడు దెబ్బతిన్న మహా సర్పంవలె రోషంతో లక్ష్మణుడు అన్నయా! కైకేయి, దశరథులు ఇద్దరూ స్వార్ధ ప్రవృత్తి గలవారు. వారు నీకు చెడుపునే చేస్తారు. వారు తల్లిదండ్రుల రూపంలో ఉన్న శత్రువులు. అటువంటివారి కోరికలు మన్నించుటకై నీవు మనస్సులో గూడ ఇష్ట పడకూడదు. అన్నా! ఇది అంతా వారు బుద్ధి పూర్వకంగా చేసింది కాదు. అది కేవలం దైవికమేనని నీవు భావించడం సరికాదు. దైవశక్తి పురుష సామర్ధ్యం ఈ రెండింటిలో ఏది గొప్పదో ఇప్పుడు తెలుస్తుంది. సమస్త దిక్పాలకులు, ముక్కోటి దేవతలు ఎదురై వచ్చినా, ఈనాడు ఈ రాముని పట్టాభిషేకాన్ని ఆపలేరు. బలశాలినైన నన్ను ఎదిరించినవాడు, తీవ్రమైన నా పౌరుషంధాటికి అంతులేని దుఃఖంలో మునిగిపోక తప్పదు. అప్పుడు దైవంకూడా వాడిని రక్షింపలేడు. హే ప్రభూ! నేను నీ దాసుడను. ఈ భూమండలం నీ స్వాధీనమగుటకు నేనేమి చెయ్యాలో శాసించు. అని పలికిన లక్ష్మణుని

మాటలు వినిన రాముడు తమ్ముడూ! తల్లిదండ్రుల ఆజ్ఞను త్రికరణశుద్ధిగా పాటించు. వారిని నన్నుగా తెలిసికో. ఇదిఏ సత్పురుషుల మార్గం. అని శ్రీరాముడు తన తమ్ముడిని సమాధాన పరచాడు.

5. ప్రశ్న : కౌసల్యాదేవి తన ఆవేదనను ఏరీతిగా శ్రీరాముని ఎదుట వెలిబుచ్చింది? రాముడు ఏవిధంగా శాంతపరచి, నచ్చజెప్పాడు?

జవాబు : తండ్రి ఆజ్ఞను పాటించడానికి కృతనిశ్చయుడై యున్న రాముని మనోభావాలను తెలిసికొన్న కౌసల్యాదేవి సంతతధారగా కన్నీరు కార్చుచూ, బొంగురు పోయిన గొంతుకతో నాయనా! రామా! నీవు నా కన్నుల ఎదుట లేకుండా నేను ఉండలేను. తండ్రి ఆజ్ఞ ప్రకారం నీవు అడవికి వెళ్ళుటకే నిశ్చయించు కొంటే నన్నుగూడా నీ వెంట తీసికొని వెళ్ళు. నీ సమీపంలో వన జీవనానికి అలవాటుపడి ప్రశాంతంగా ఉంటాను. అని కుమిలి పోవుచున్న తల్లిని జూసి రాముడు అమ్మా! స్త్రీకి పతియే దైవం. మహారాజు ఇప్పుడు నిన్నును, నన్నును శాసించువాడు. భరతుడును ధర్మాత్ముడు. ధర్మ నిరతుడైన అతడు నీకు విధేయుడై ఎల్లప్పుడు నిన్ను అనుసరించే ఉంటాడు. ఇది నా పరమ విశ్వాసం. నేను అయోధ్యను వీడిన పిమ్మట రాజు పుత్ర శోకంతో పరితపించ కుండా నీవు ఆయనను జాగ్రత్తగా చూసుకోవాలి. ఈ దుర్భరమైన శోకంతో ఆయనను కృంగిపోకుండా నీవు అప్రమత్తురాలవై ఆయనను సేవిస్తూండు. పతిసేవలో కాలం గడుపుతూ, నేను వనవాసం ముగించుకొని వచ్చే వరకు ఓపికతో నిరీక్షిస్తూండు. అని పలికిన శ్రీరాముడు వినమ్ర వచనాలకు కౌస్యల్య కన్నీరు మున్నీరుగా విలపిస్తూ నాయనా! వనాలకు వెళ్ళి తీరాలన్న నీ దృఢ నిశ్చయాన్నుండి నిన్ను మరల్చుడానికి నాకు శక్తి చాలదు. విధి నిర్ణయం ఎలా ఉంటే అలా జరుగుతుంది. కుమారా! సరే జాగ్రత్తగా వెళ్ళిరా! అని రాముడిని కౌసల్యాదేవి తదేక దృష్టితో జూసి, ఆయనకు శుభ పరంపరలు జరగాలని సాదరంగా ఆశీర్వదించింది.

## పదునేడవ అధ్యాయము

జవాబులు : 1.2. కౌసల్యామాత    2.1. దైవం

3. తెలియదు

# అయోధ్యా కాండము

## 25, 26, 27, 28, 29, 30 సర్గలు

## పద్దెనిమిదవ అధ్యాయము

1. ప్రశ్న : తల్లియైన కౌసల్యా దేవికడ శుభాశీస్సులు పొందిన రాముడు, అచట నుండి ఎవరి సన్నిధికి వెళ్ళాడు?

జవాబు : 1. వసిష్టుని సన్నిధికి 2. సుమిత్రాదేవి సన్నిధికి
3. వామదేవుని సన్నిధికి 4. సీతాదేవి సన్నిధికి

2. ప్రశ్న : శ్రీరాముడు సీతాదేవితో దేవీ! నేను మా తండ్రి గారి ప్రతిజ్ఞను త్రికరణ శుద్ధిగా పాటిస్తూ ఏ వనాలకు వెళ్తున్నాను అని తెలిపాడు?

జవాబు : 1. తాటకా వనప్రాంతానికి 2. తపోవనానికి
3. దండకారణ్య వనానికి 4. అశోకవన ప్రాంతానికి

3. ప్రశ్న : సీతాదేవిని తనవెంట వన గమనానికి రాకుండా అయోధ్యలోనె ఉండమని, రాముడు అనేక రీతులా చెప్పి చూశాడు. చివరకు తనను రాముని వెంట అరణ్యాలకు వెళ్ళడానికి నిరాకరిస్తే ఆమె రాముని ఎడబాటును సహించలేక దేనిని త్యాగం చేస్తాను. అనిపలికింది?

జవాబు : జవాబుల కాలంలో ఉంది.

4. ప్రశ్న : రాముడు సీతాదేవిని తనతో వన గమనానికి రాకుండా ఉండేందుకు ఏ విధంగా ప్రయత్నించాడు?

జవాబు : కౌసల్యామాత వద్ద దీవెనలందుకొని రాముడు సీతాదేవి మందిరానికి కాలినడకన వచ్చాడు. వచ్చిన భర్త చింతామగ్నుడుగా ఉండటాన్ని జూసిన సీతాదేవి ప్రభూ! మీ ముఖం ప్రసన్నతను కోల్పోయి వివర్ణమై ఉంది. ఇట్టి స్థితిని ఇంతకు ముందెన్నడూ నేను చూసి యుండలేదు. అని పరితాప వచనాలు పలికిన తన భార్యతో రాముడు జానకీ పూజ్యులైన మా తండ్రిగారు నన్ను వనాలకు పంపబోవు చున్నారు. కనుక రాజాజ్ఞను తలదాల్చి నేను దండకారణ్యాలకు వెళ్ళాలి. నీవు అయోధ్యలోనె ఉండి మా తల్లి దండ్రులను వినయంతో, ఆదర పూర్వకంగా సేవించు, నీవు నాయందే అనురాగం కలిగి, ధృఢమైన

మనస్సుతో ఓరిమి కలిగి ఉండు. యధావిధిగా దైవపూజలు చేస్తూ, వ్రతోపవాస నియమాలను ఆచరిస్తూండు. భరతుడు యువరాజై నప్పటి నుండి అతడే సర్వాధికారి. అతని ఏలుబడిలో నీవు సాధారణ బంధురీతిలోనే ఉండాలి. ఊర్మిళా, శృతకీర్తుల కంటే మించిన మర్యాదలు నీవు ఆశించ వద్దు. తోటి వారి మధ్య నీవు అనుకూల వతివై మసలుకో. నేను మాత్రం పితృవాక్య పరిపాలనార్ధం, ఈరోజే వనాలకు వెళ్ళబోతున్నాను. నీవు ఈ అయోధ్యలోనె ఉండి ఎవరికీ అప్రియాన్ని కలిగించక, నా ఈ మాటలను పాటించుమని శ్రీరాముడు సీతాదేవికి ధర్మ విశేషాలను తెలిపాడు. అప్పుడు రాముడు పలికిన మాటలు, సహజ మృధు స్వభావియైన సీతాదేవిని నొప్పించాయి. అప్పుడామె ఓ ఆర్యపుత్రా! ఇదేమి?. ఇట్లు అర్ధ రహితాలైన మాటలు మాట్లాడు తున్నావు. ఇంతకు ముందెన్నడూ నీనోటి నుండి ఇటువంటి మాటలు వచ్చి యుండలేదు. ఓ మహావీరా! భార్యభర్తకు అర్ధాంగి. కావున భర్త యొక్క అర్ధఫలాన్ని పొందుటకు అర్హురాలు. మహారాజు గారు మీకిచ్చిన ఆదేశం నాకును వర్తిస్తుంది కదా! కనుక మీతో గూడి నేనును వనవాసం చేయవలసి ఉన్నది. అని సీతాదేవి తన నిశ్చితాభిప్రాయాన్ని రామునితో తెలిపింది.

5. ప్రశ్న : తన వెంట వనగమనానికి రాముడు అంగీక రించేందుకు సీతాదేవి ఏ రీతిగా ధర్మ వివేచన చేసింది ?

జవాబు : తన వెంట వన గమనానికే సిద్దపడి మాట్లాడుతున్న జానకితో రాముడు సీతా! తొందర పాటుతో కూడిన దుఃఖావేశపు ఆలోచనలు చేయవద్దు. నేను చెప్పే మాటలు విను. అడవిలో ముళ్ళుంటాయి, రాళ్ళుంటాయి. నడవడాకి త్రోవలుండవు. సమయానికి ఆహారముండదు. ఎండ కన్నెరుగని రాజ భోగాలనుభవిస్తున్న నీవు ఆ అడవిలో కష్టాలను భవించలేవు, అరణ్యం నిరంతరం దుఃఖ నిలయమే, అని పలికిన రాముని మాటలు సీతాదేవి తనను శ్రీరాముడు వనాలకు తీసికొని వెళ్ళడం ఇష్టంలేదని గ్రహించి ఇంతసేపు దుఃఖించింది. ఆమె కన్నీరు కార్చుతూ ప్రభూ! ఏ భార్య అయినా భర్తకు దూరంగా ఉండి జీవించడం దుర్భరం. నాకు మీరే ప్రత్యక్ష దైవం. ఇహపర లోకము లందును నీ సాహచర్యాన్నే నేను ఇష్టపడతాను. ప్రఖ్యాతి గాంచిన బ్రాహ్మణోత్తములు చెప్పిన విధంగా, తల్లి దండ్రులచే దాన జల పూర్వకంగా కన్యాదానం చేసిన తరువాత ఈ లోకము నందేగాక పరలోకము నందును నేను

నిన్ననుసరించాలి గదా! శృతి ప్రమాణాన్ని అనుసరించి నా తండ్రి జనకుడు దాన జల పూర్వకంగా నన్ను నీకు ధారపోశాడు గదా! నేను సౌశీల్యవతిని, పతిసేవా పరాయణను. నీ సుఖ దుఃఖాలలో భాగస్వామినిని. ఓ ఆర్యపుత్రా! వనవాస సమయంలో కష్ట సుఖాలను రెండింటినీ నేను సమానంగా భావిస్తాను. కాబట్టి నన్ను నీవెంట తీసికొని వెళ్ళు. నీవు ఆ విధంగా సమ్మతింపనిచో నేను ప్రాణ త్యాగం చేస్తాను అని పలికిన సీతాదేవితో రాముడు, ఓ సీతా! ఏది ఏమైనా నీవు నాతో వన గమనానికే సిద్ధపడి ఉన్నావు. కావున నన్ను అనుసరించి నీ పతివ్రతా ధర్మాన్ని నెరవేర్చుకొమ్మని ఆయన సమ్మతించాడు.

### పద్దెనిమిదవ అధ్యాయము

జవాబులు : 1.4. సీతాదేవి సన్నిధికి 2.3. దండకారణ్య వనానికి
3. ప్రాణత్యాగం

........

# అయోధ్యా కాండము

## 31, 32, 33, 34, 35, 36 సర్గలు

## పందొమ్మిదవ అధ్యాయము

1. ప్రశ్న : సీతారాములు వనవాసానికే సిద్ధపడి ఉన్నారని గ్రహించిన లక్ష్మణుడు తానుకూడా శ్రీరాముడిని అనుసరించి వనాలకు వస్తాను అని తన అన్నగారిని ఒప్పించాడు. ఆ విధంగా సీతాలక్ష్మణ సమేతుడై అడవులకు వెళ్తున్న రాముడు తనవద్ద ఉన్న సంపదనంతా ఏమి చేశాడు ?

జవాబు : 1. కోశాగారానికి అప్పగించాడు 2. వసిష్ఠునికి అప్పగించాడు
3. అర్హులకు దానం చేశాడు 4. తల్లికి అప్పగించి వెళ్ళాడు

2. ప్రశ్న : సీతాలక్ష్మణ సహితుడై అడవులకు వెళ్తున్న రాముడు ముందుగా ఎవరిని దర్శించడానికి వచ్చాడు

జవాబు : 1. దశరథుని 2. వసిష్ఠుని
3. కైకేయిని 4. సుమిత్రాదేవిని

3. ప్రశ్న : తాను దర్శించ వచ్చినట్లుగా శ్రీరాముడు తన తండ్రికి ఎవరి ద్వారా తెలియ పరచాడు?

జవాబు : జవాబుల కాలంలో ఉంది.

4. ప్రశ్న : శ్రీరాముడు దుఃఖిస్తున్న తన తండ్రిని ఏ రీతిగా ఓదార్చి, ఆయన వద్ద సెలవు తీసికొని వెళ్ళాడు?

జవాబు : దశరథుడు తనను దర్శించ వచ్చిన రాముని జూసి శోక సముద్రంలో మునిగిపోయాడు. అప్పుడు రాముడు అంజలి ఘటించి మహారాజా! మీరు మా అందరికీ ప్రభువులు. వన వాసార్థమై దండ కారణ్యాలకు వెళ్ళుమని నన్ను నీ చల్లని చేతులతో దీవించి పంపండి. లక్ష్మణుడును, సీతయును వనాలకు వచ్చి నన్ను అనుసరింప గోరుచున్నారు. ఎన్ని విధాలుగా వారించినా వారు వినడంలేదు. కావున వారిని గూడ నాతో వచ్చుటకు అనుమతించండి. మాకై మీరు ఏ మాత్రము దుఃఖించ వద్దు. అని పలికి మహారాజు అనుమతికై నిరీక్షిస్తున్న రాముని జూసి దశరథ మహారాజు ఓ రఘు రామా! కైకేయికి ఇచ్చిన వరాల కారణంగా నేను మోసపోయాను. నా మాటను త్రోసిపుచ్చి నీవే స్వయంగా కోసల రాజ్యాధిపత్యాన్ని చేపట్టు. అని పలికిన దశరథునితో రాముడు తండ్రీ! మీ మాటను వమ్ముచేయటం నాకు ధర్మం కాదు. అందువలన నేను అరణ్యాలకు వెళ్తాను. పదునాలుగు సంవత్సరాలు అక్కడ గడిపివచ్చి నీకు సేవలు చేస్తాను. అని పలికిన కుమారునితో నాయనా! రఘునందనా! నా మాట నిలుపుట ద్వారా, నన్ను సత్యమునందు నిలుపుటకై మనవారందరిని విడిచి నీవు వనాలకు వెళుతున్నావు. ఇది నీకుతప్ప ఎవరికీ సాధ్యం కానిపని. నాయనా! నీ సంకల్పం నుండి నిన్ను మరల్చలేను. కాని ఈ రాత్రి ముగియు వరకైనా ఇచటనే ఉండు. ఈ ఒక్క రోజైనా నిన్ను చూస్తూ సుఖంగా గడుపుతాను. నీవు రేపు వెళ్ళవచ్చు అన్నాడు. అంతట రాముడు తండ్రీ! నేనిచట ఈ రాత్రి గడిపినా, రేపు ఈ రాజభోగాలు లభించవు గదా! కావున కోరికలను ప్రక్కన బెట్టి ఇప్పుడే వనాలకు

వెళ్ళేందుకు నేను ఇష్ట పడుతున్నాను. నన్ను ఆశీర్వదించి పంపించు అన్నాడు. అంతట దశరథుడు నాయనా! నీవు ధర్మనిరతుడవు. సత్యసంధుడవు అని నాకు బాగా తెలుసును. సరియే ఇక నీవు వెళ్ళిరమ్ము నీకు ఇహపర సుఖాలు సిద్ధించును గాక! అని దీవించి పంపించాడు.

5. ప్రశ్న : కైకేయిదేవి దుర్మార్గానికి పరాకాష్టగా దేనిని నిర్వచింపవచ్చు?

జవాబు : దశరథుడు తన ప్రతిజ్ఞకు ఎంతో బాధపడుతూ, సుమంత్రునితో మహా మంత్రీ! చతురంగ బలాలను సుసంపన్నం చేసి రాముని వెంట పంపించు. వారి వెంట వినోదాన్ని, ఆహ్లాదాన్ని కలిగించేందుకు, నర్తకీ మణులను, మల్లయుద్ధ ప్రదర్శనలు నిర్వహించే వారిని ఆసేనల వెనుక పంపించు. వివిధ రకాలైన సువర్ణ, రత్నా భరణాదులు, వస్త్రాలు, వారికి ఈ పద్నాలుగు సంవత్సరాలకు సరిపడునట్లుగా పంపించు. ముఖ్యమైన ఆయుధాలను, ఆహార పదార్థాలతో గూడిన బండ్లను, అడవిలో దారి చూపడానికి తగిన ఆటవీకులను రామునికి తోడుగా పంపించు. శ్రీరాముడు అడవులలో క్రూరమృగాలను వేటాడుతూ, అక్కడ లభించే తేనెలు త్రాగుతూ, రాజభోగాల గురించి తలంపడు. ఇచట భరతుడు పాలించగలడు. అని పలికిన దశరథుని మాటలకు కైకేయి భయపడి, విచారిస్తూ, మహారాజుకు ఎదురుగా నిలబడి అనుభవించ వలసిన వస్తువులు, సంపదా ఏమీ లేకుండా, నిర్జనమైన రాజ్యం భరతుడికి అక్కరలేదు. అని కన్నులెఱ్ఱజేసి, సిగ్గు విడిచి మాట్లడుతున్న కైకవైపు చూసిన దశరథుడు ''ఛీ'' దుర్మార్గురాలా! నీ ముఖం నాకు చూపించకు మని చీదరించాడు. అంత మందిలో ఛీత్కారానికి గురియైన కైకేయికి చీమ కుట్టినట్లైనా లేదు. ఆ విధమైన కైకేయిదేవి చర్యను ఆమె దుర్మార్గానికి పరాకాష్టగా చెప్పవచ్చు.

## పందొమ్మిదవ అధ్యాయము

జవాబులు : 1.3. అర్హులకు దానం చేశాడు 2.1. దశరథుని
3. సుమంత్రుని ద్వారా

# అయోధ్యా కాండము

## 37, 38, 39, 40, 41, 42 సర్గలు

## ఇరువదియవ అధ్యాయము

1. ప్రశ్న : దశరథునితో శ్రీరాముడు తండ్రీ సర్వసుఖాలు వదలి వేశాను. వనాలలో ఫలమూలాలే నాకు ఆహారం. నాకిప్పు దెవరైనా వల్కలాలు తెచ్చి ఇచ్చినట్లైన వాటిని ధరించుటకు నేను సిద్ధంగా ఉన్నాను. అని పలుకగా రామ లక్ష్మణులకు వల్కలాలు అందించినది ఎవరు?

జవాబు : 1. కైకేయీ దేవి 2. సేవకుడు
3. దశరథుడు 4. సుమంత్రుడు

2. ప్రశ్న : సీతా రామ లక్ష్మణులను అడవి వరకు తీసికొని వెళ్ళడానికై రథాన్ని సిద్ధపరచమని దశరథుడు ఎవరిని ఆజ్ఞాపించాడు

జవాబు : 1. సేనాపతిని 2. సుమంత్రుడుని
3. జాబాలిని 4. ప్రతీహారిని

3. ప్రశ్న : రథారూఢులై వెళుతున్న సీతారామలక్ష్మణులను వెంబడించి కొంతదూరం వచ్చి, అత్యంత ధీనావస్థలో, నిశ్చేష్టుడై, రాముడు వెళ్ళిన వైపే చూస్తూండి పోయిన దశరథునితో, మహారాజా! ఆత్మీయులు తిరిగి మనలను చేరుకోవాలని కోరుకొందాము. అట్టి వారిని మనం ఎక్కువదూరం అనుసరించలేము కదా! అని విన్నవించినది ఎవరు?

జవాబు : జవాబుల కాలంలో ఉన్నది.

4. ప్రశ్న : శ్రీరాముని కొరకు ఆ నగర వాసులంతా ఏరీతిగా వ్యాకులపడ్డారు?

జవాబు : పురుషశ్రేష్టుడైన శ్రీరాముడు అంతఃపురాన్ని వీడివెళ్ళిన పిమ్మట అంతఃపుర స్త్రీలయొక్క ఆర్తనాదాలు తీవ్రమైనాయి. ఎవరికీ హాని తలపెట్టని శ్రీరాముడు, మా అందరికీ సర్వవిధాల రక్షకుడు, అట్టి ప్రభువు ఏనాడూ ఎవరినీ కోపించి ఎరుగడు, తన కన్నతల్లి కౌసల్యాదేవి వలె మమ్ములను ప్రేమాదరాలతో గౌరవిస్తూండే వాడు. ఇప్పుడా స్వామి ప్రయాణం ఎక్కడికి? మహారాజు మతి తప్పినవాడై వనవాసానికి పంపి మనకు దూరం చేశాడు. అని బిగ్గరగా ఏడ్చి

పెడబొబ్బలు పెట్టారు. కొడుకు ఎడబాటుకు ఎంతో విలవిల లాడుచున్న మహారాజు అంతఃపురంలో చెలరేగిన భయంకర ఆర్తనాదాలు విని ఇంకా ఎక్కువ దఃఖంతో కృంగిపోయాడు. నగరమంతా రామ విరహ బాధకులోనై యుండుటచే పౌరుల నిత్యకృత్యాలన్ని ఒక్కసారిగా స్తంభించి పోయాయి. శ్రీరాముని మిత్రులందరూ మతులు పోయినవారై, శోకభారంతో మంచం పట్టారు. ఈ రీతిగా ఆ నగర వాసులంతా వ్యాకుల పడ్డారు.

5. ప్రశ్న : సీతా రామ లక్ష్మణులు వనాలకు వెళ్ళిన పిమ్మట దశరథుడు ఏ విధంగా విలపించాడు ?

జవాబు : వనాలకు వెళుతున్న శ్రీరాముని రథచక్రాల వేగానికి ఎగసిన ధూళి కనబడేంత వరకు దశరథుడు ఆవైపే చూస్తూండి పోయాడు. ఆ ధూళికూడా కనబడక పోవటంతో, మహారాజు ఆర్తితో అలమటిస్తూ నేలపైపడి పోయాడు. అప్పుడు వెంటనే కౌసల్య రాజును లేవనెత్తుటకై ఆయన కుడిభుజాన్ని పట్టుకొన్నది. కైకేయి వచ్చి ఎడమ భుజాన్ని పట్టుకొన్నది. అప్పుడు దశరథుడు కైకేయి వైపు తిరిగి మండిపడుచు, కైకా నీవు నన్ను తాకవద్దు. నాకు నీ ముఖాన్ని చూపించకు. దుర్మార్గురాలా! అగ్నిసాక్షిగా నిన్ను నేను వివాహమాడాను. హద్దు మీరిన నీ దుశ్చర్య కారణంగా ఈరోజు నుండి నిన్ను నేను వదలి వేస్తున్నాను. ఈ అఖండ కోసల సామ్రాజ్యానికి అధర్మ మార్గాన భరతుడు అధిపతియై సంతోషిస్తే, నేను చనిపోయిన తరువాత అతడు సమర్పించే పిండోదకాలు నాకు చెందకుండును గాక! అని మహారాజు శోకావేశపరుడై మాట్లాడాడు. అనంతరం కౌసల్య దుమ్ము కొట్టుకొని యున్న మహారాజును లేవనెత్తి ఆయనతో గూడి తన గృహానికి వెళ్ళింది. దశరథుడు ముని వేషధారియైన తన కుమారునే తలచుకొంటూ పరితపించాడు. అప్పుడా రాజు రాహుగ్రస్తమైన సూర్య బింబంవలె వన్నెతరిగి యున్నాడు. శోకాతురుడైన రాజు కుమిలిపోతున్నాడు. పుత్ర దుఃఖంతో కృశించి, శయ్యపై పడుకొనియున్న మహారాజుతో కౌసల్య తాను శోకార్తియై, కుటిల బుద్ధితో కైకేయి శ్రీరాముని వనాలకు పంపించింది. భరతునికే రాజ్యాధికారాన్ని కట్టబెట్టడమే ప్రదానమైనచో కానిండు అదినాకు

సమ్మతమే. కాని నా కుమారుడు ఇచటనే ఉండి, భరతునికి దాసుడై సేవలు చేయవలసి వచ్చినా అదియు నాకు సమ్మతమే. వనవాసం కంటే అదిమేలు కదా! అప్పుడు నాబిడ్డ నా కన్నుల ముందు తిరుగుచు ఇచటనే ఉండేవాడు గదా! అని కౌసల్య శయ్యపై కుమిలి పోతున్న మహారాజుతో పలికింది. ఈ రీతిగా కౌసల్యా, దశరథులు శ్రీరాముని తలచుకొంటూ కుమిలి పోయారు.

### ఇరువదియవ అధ్యాయము

జవాబులు : 1.1. కైకేయిదేవి 2.2. సుమంత్రుడిని
3. మంత్రులు

........

## అయోధ్యా కాండము

### 43, 44, 45, 46, 47, 48 సర్గలు

### ఇరువది ఒకటవ అధ్యాయము

1. ప్రశ్న : పుత్రశోకంతో కృంగి కృశించి, శ్రీరాముడినే తలచుకొంటు విలపిస్తున్న కౌసల్యాదేవిని ఓదార్పు మాటలతో ఎవరు ఊరడించారు?

జవాబు : 1. వసిష్టుడు 2. సుమంత్రుడు
3. సుమిత్రాదేవి 4. దశరథుడు

2. ప్రశ్న : శ్రీరాముని రథాన్ని అనుసరించి, విడువక ఆయన వెంట వెళ్ళినది ఎవరు?

జవాబు : 1. సేనాపతులు 2. మంత్రులు
3. వసిష్టాదులు 4. విప్రులు, ప్రజలు

3. ప్రశ్న : సీతారామ లక్ష్మణులు వన గమనాభిలాషులై సాయంత్రం వరకు ప్రయాణించి, ఒకచోట ఆగి, ఆ రాత్రికి ఏ నదీతీరాన విశ్రమించారు?

జవాబు : జవాబుల కాలంలో ఉంది.

4. ప్రశ్న : శ్రీరాముని రథాన్ని అనుసరించి వెళ్ళిన అయోధ్యా నగర వాసులు ఎక్కడ వరకు వెళ్ళారు? పిమ్మట ఏమైనారు?

జవాబు : రాముడు వద్దని వారిస్తున్నా వినకుండా తనవెంట అనుసరించి

వస్తున్న విప్రులతోనూ, ప్రజలతోనూ కొంతదూరం ప్రయాణించి, సాయం సమయానికి తమసానదీ తీరానికి చేరుకొన్నారు. అప్పుడు రాముడు లక్ష్మణునితో ఈనాడు మన వనవాసమున మొదటి రాత్రి ఇక్కడ గడుపుదాము అన్నాడు. పిమ్మట రాముడు తమసానదీ జలాలు త్రాగి, సుమంత్రుడు, లక్ష్మణుడు చెట్ల ఆకులతో ఏర్పాటు చేసిన శయ్యపై సీతాదేవితో గూడి శయనించాడు. ఆ రాత్రికి లక్ష్మణ, సుమంత్రులు మేల్కొనే ఉన్నారు. పౌరులంతా ప్రయాణ శ్రమవలన డస్సిపోయి మైమరచి నిద్రించారు. ఆ విధంగా నిద్రిస్తున్న పౌరులను జూసి రాముడు లక్ష్మణునితో తమ్ముడూ! చెట్ల క్రిందపడి నిద్రిస్తున్న ఈ పౌరులను చూడు. వీరందరూ మన యెడలగల ఆపేక్ష కారణంగా, తమ భార్యా బిడ్డలను వదలి, మన వెంట ఇచటికి వచ్చారు. వీరు మనలను అయోధ్యకు మరలించుటకే పట్టుదలతో ఉన్నారు. అందుకై వారి ప్రాణాలు విడుచుటకైనా సిద్ధపడి ఉన్నారు. కావున వీరు నిద్రనుండి మేల్కొనక ముందే మనము రథమెక్కి ఎవ్వరూ పసిగట్టలేని మార్గాన వేగంగా పోదాం. అందువలన వీరికి మన వెంటవచ్చే అవకాశంలేక వీరువెనుదిరిగి అయోధ్యకు వెళ్ళగలరు. ప్రజల దుఃఖాన్ని తొలగించటం రాజకుమారులుగా మన ధర్మం. అని పలికిన రాముని మాటల ప్రకారం సీతారామ లక్ష్మణులు అధిరోహించిన రథాన్ని సుమంత్రుడు నడుపుకొంటూ నదిని వేరొక రేవుద్వారా దాటివెళ్ళారు. పిమ్మట చెట్ల క్రింద పడుకొని ఉన్న పౌరులు మేల్కొని శ్రీరాముడు కనబడక పోవటంచేత శోకంతో నిశ్చేష్టులై, అటు ఇటూ చూశారు. ఎంతగా గాలించినా శ్రీరాముని గానక వారు పలురీతులా ఆలోచించి, సీతారాముల దర్శనానికై తపించి విలపించారు. అనంతరమా పౌరులు తాము వచ్చిన మార్గాన్నే ప్రయాణించి అయోధ్యకు చేరుకున్నారు.

5. ప్రశ్న : అయోధ్యకు తిరిగి వచ్చిన పౌరులు తమవారిని కలిసికొని ఏ రీతిగా విలపించారు?

జవాబు : శ్రీరాముని అనుసరిస్తూ వనాలకు వెళ్ళి తిరిగి వచ్చిన ఆ నగర వాసులు తమ తమ ఇండ్లకుచేరి భార్యా పుత్రులను కలిసి కొన్నారు. ఐనను వారు దుఃఖాతిరేకం నుండి బయటపడలేక పోయారు. ఆప్తమిత్రులు వచ్చి పలకరించినా, వారి ముఖాలలో సంతోష ఛాయలు కనబడ కున్నాయి. ఇండ్లలోని స్త్రీలు వంటవార్పునకు

పూనుకొనలేదు. స్త్రీలు తమ మగవారితో ప్రస్తుత పరిస్థితులలో ఈ నగరం మంచి వారికి నివాస యోగ్యంగా లేదు. ఇచటి వారంతా శ్రీరామునిపై బెంగపెట్టుకొని యున్నారు. ఇచటనే ఉన్నచో మనకు మనశ్శాంతి ఉండదు. ఈ రాజ్యంపై అధికారం కైకేయిది. కావున ఇచట అధర్మం తాండవిస్తుంది. ఇటువంటి చోట ఉండుట నిరర్థకం. రక్షణలేనట్టి రాజ్యంలో సంపదకాని, బిడ్డలుకాని ఎందుకు? మహారాజును కీలుబొమ్మగా చేసుకొని, శ్రీరామునంతటి వానినే అంత పనిచేసిన కైక, ఇక ఎవరిని వదలిపెడ్తుంది. కైక జీవించి ఉన్నంత కాలం, ఆమె పరిపాలనలో మనం సుఖంగా జీవించలేము. ఆమె కారణంగా రాజ్యమంతా సర్వనాశన మౌతుంది. పుత్రశోకంతో దశరథ మహారాజు ఎంతో కాలం జీవించి యుండలేడు. ఆయన లేని రోజున మన అదృష్టాలు అడుగంటుతాయి. కనుక మనం కైక పేరు వినబడని చోటికి వెళ్దాం అన్నారు. ఈ విధంగా అయోధ్యా నగర ప్రజలు విలపిస్తుండగా సూర్యుడస్తమించాడు. అయోధ్యా నగరం నీరింకిపోయిన సముద్రంవలె కనబడింది.

### ఇరువది ఒకటవ అధ్యాయము

జవాబులు : 1.3. సుమిత్రాదేవి　　2.4. విప్రులు, ప్రజలు
3. తమసానదీ తీరం

.......

# అయోధ్యా కాండము

## 49, 50, 51, 52, 53, 54 సర్గలు

## ఇరువది రెండవ అధ్యాయము

1. ప్రశ్న : శ్రీరాముడు సీతా లక్ష్మణ సహితుడై రథ మధిరోహించి తమసానదిని దాటి దక్షిణ దిశగా ప్రయాణించి ఆనాటి సాయంత్రానికి ఏ పవిత్ర నదీ తీరానికి చేరాడు?

జవాబు : 1. గోదావరి　　2. కృష్ణానది
3. గంగానది　　4. సింధునది

2. ప్రశ్న : సువిశాలమైన కోసల పొలిమేరలు దాటి రాముడు శృంగ భేరిపుర

ప్రాంతానికి చేరుకొని, అచట విశ్రమించ తలంచాడు ఆ ప్రాంతానికి అధిపతి ఎవరు?

జవాబు : 1. గుహుడు 2. త్రిశంకుడు
3. కుశనాభుడు 4. విశాలుడు

3. ప్రశ్న : సుమంత్రుని రథంతోపాటు వెనుకకు పంపించి సీతారామ లక్ష్మణులు గంగను దాటి, గంగా యమునల సంగమ ప్రాంతమైన ప్రయాగను చేరుకొని, అచట ఏ మహర్షి ఆశ్రమాన్ని చేరుకొన్నారు?

జవాబు : జవాబుల కాలంలో ఉంది.

4. ప్రశ్న : నరశ్రేష్టుడైన శ్రీరాముడు గంగానదిని, జనపథాలనుదాటి వనాలలో ప్రవేశించి, ఒకచోట విశ్రమించి, లక్ష్మణునితో ఏఏ విషయాలపై చర్చించాడు?

జవాబు : శ్రీరాముడు సాయంసంధ్యో పాసనచేసి లక్ష్మణునితో తమ్ముడూ! జనపథాలను దాటి వచ్చిన మొదటి రాత్రి ఇదే. ఈరాత్రి ఏదోవిధంగా ఇచట గడుపుదాము అని తాము కల్పించుకొన్న తృణశయ్యలపై చేరి, లక్ష్మణా! మహారాజు ఈ సమయంలో నిజంగా ఎంతో పరితపిస్తూ పడియుండ వచ్చును. కైకేయి మాత్రం తన కోరిక నెరవేరినందుకు సంతోషిస్తూంటుంది. మన తండ్రి గారిని ఇప్పుడు ఆదుకొను వారెవ్వరూలేరు. పైగా ఆయన వృద్ధుడు. మన నుండి దూరంచేయ బడినాడు. అనూహ్యంగా ఏర్పడిన ఈ సంకటస్థితిని చూచి, నాకిట్లనిపిస్తూంది. నన్ను అడవులకు పంపడం, మహారాజును మృత్యు దేవతకు అప్పగించడం, తన కుమారుడైన భరతుని రాజుగా చేయడానికే కైకేయి అయోధ్యకు వచ్చిందా? ఆమెకు రాజ్యాధికారం ప్రాప్తించటం చేత, గర్వితయై మంచి చెడ్డలను మరచి, నా నిమిత్తంగా ఇప్పుడు కౌసల్యామాతను, సుమిత్రామాతను, ఇబ్బందులకు గురిచేయునేమో గదా! కావున లక్ష్మణా! నీవు వేకువజాముననే బయలుదేరి అయోధ్యకు వెళ్ళి, అచటి పరిస్థితులను చక్కబెట్టు. నేను సీతతోగూడి దండకారణ్యాలకు వెళ్తాను. అని అనేకరీతుల లక్ష్మణునితో చెప్పి రాముడు కొంతసేపు శోకించాడు. అంతట లక్ష్మణుడు తన అన్నను అనేక విధాల చెప్పి ఓదార్చాడు. అన్నా! నీవు ఈ విధంగా బాధపడుతుంటే వదిన సీతాదేవికి గాని, నాకు

గాని చాలాబాధగా ఉంటుంది. నిన్ను విడిచి నేను బ్రతకలేను. నీవుతప్ప నాకు ఎవరూ అక్కరలేదు. చివరకు నీవులేని స్వర్గాన్నైనా నేను తృణీకరిస్తాను. అని పలికిన అనంతరం లక్ష్మణుడు తయారు చేసిన తృణశయ్యపై మర్రిచెట్టు నీడన సీతారాములు శయనించారు. ఆవిధంగా వారంతా ఆ రాత్రికి కాలం గడిపారు.

5. ప్రశ్న : భరధ్వాజాశ్రమాన్ని సీతారామ లక్ష్మణులు ఏరీతిగా చేరుకొన్నారు? అచట మహర్షి సమాగమం ఏ విధంగా సాగింది?

జవాబు : శ్రీరాముడు సీతాలక్ష్మణ సమేతుడై గంగా యమునా నదుల సంగమ ప్రదేశమైన ప్రయాగను దర్శించాలని ప్రయాణం సాగించాడు. ఆ విధంగా వారు ప్రయాణిస్తు లక్ష్మణునితో శ్రీరాముడు తమ్ముడూ! ప్రయాగ పరిసరాలలో భరద్వాజ మహర్షి ఆశ్రమం ఉన్నదని నేనువిన్నాను. అని మాట్లాడుకొంటూ వారు సాయం సమయానికి భరధ్వాజ మహర్షి ఆశ్రమానికి చేరుకున్నారు. అచట మహర్షిని దర్శించి రాముడు తమనుగూర్చి తెలిపాడు. పిమ్మట ఆ భరధ్వాజ మహర్షి వారికి అతిధిపూజ జరిపించి, అడవిలో దొరికే రకరకాలైన పండ్లను, ఆహార పదార్థాలను, మధుర పానీయాలను సమకూర్చాడు. ఆత్మీయతతో వారికి నివాసాన్ని ఏర్పాటు చేశాడు. పిమ్మట ఆ మహర్షి ఓ రామా! ఎంతో కాలం నుండి నీ దర్శనభాగ్యానికై నిరీక్షిస్తూ ఉన్నాను. ఈ నాటికి నీరాకతో అది ఫలించింది. ఈ గంగా యమునా నదుల సంగమ పుణ్యక్షేత్రంలో మీరు హాయిగా ఉండవచ్చునని చెప్పాడు. అంతట శ్రీరాముడు మహర్షీ! నేనిచట ఉన్నానని కోసలదేశ ప్రజలు, ఇచటికి తరచుగా వస్తుంటారు. కావున ఇచట మేముండటం ఏమంత మంచిది కాదు. కాబట్టి మహర్షీ! జనులకు అందుబాటులో లేని ఒక ఆశ్రమ ప్రాంతాన్ని మాకు తెలపండి. మేమక్కడ హాయిగా ఉండగలము. అని పలుకగా మహర్షి రామా! ఇచటికి పదిక్రోసుల దూరంలో చిత్రకూటమనే ప్రదేశం మీరు నివశించడానికి అనువుగా ఉంటుందని తెలిపాడు. రామాదులు మహర్షి చూపిన మార్గం వెంట ప్రయాణించారు.

## ఇరువది రెండవ అధ్యాయము

జవాబులు : 1.3. గంగానది 2.1. గుహుడు

3. భరధ్వాజ మహర్షి

# అయోధ్యాకాండము

## 55, 56, 57, 58, 59, 60 సర్గలు

## ఇరువది మూడవ అధ్యాయం

1. ప్రశ్న : చిత్రకూటం దిశగా ప్రయాణిస్తున్న రామాదులతో కొంత దూరం తోడుగా వచ్చిన భరద్వాజ మహర్షి వారికి త్రోవను చూపుతూ, మీరు ఒకనదిని దాటి వెళితే చిత్రకూట పర్వత ప్రాతం వస్తుంది. అని తెలిపాడు. ఆ నది పేరేమి ?

జవాబు : 1. గంగానది 2. యమునానది
3. గోదావరినది 4. సరయూనది

2. ప్రశ్న : రామాదులు చిత్రకూట పర్వత ప్రాంతానికి చేరుకొని, ఆ ప్రాంతానికి దగ్గరలో ఉన్న ఒక మహర్షిని దర్శించుకొని, తామీప్రదేశాన ఆశ్రమాన్ని నిర్మించుకొన బోతున్నామని చెప్పుకొన్నారు. మరి ఆ మర్షి ఎవరు?

జవాబు : 1. అత్రి మహర్షి 2. భరద్వాజ మహర్షి
3. వాల్మీకి మహర్షి 4. విశ్వామిత్ర మహర్షి

3. ప్రశ్న : చిత్రకూట పర్వత ప్రాంతంలో, శ్రీరాముడు నిర్దేశించిన ప్రాంతంలో, లక్ష్మణుడు ఒక పర్ణశాలను నిర్మించాడు. పిమ్మట శ్రీరాముడు పూజచేసి, సీతారాములు పర్ణశాలా ప్రవేశం చేశారు. ఆ పూజను ఏమని పిలుస్తారు?

జవాబు : జవాబుల కాలంలో ఉన్నది.

4. ప్రశ్న : సుమంత్రుడు అయోధ్యకు చేరి, దశరథునికి రామ సందేశాన్ని ఏ విధంగా వినిపించాడు?

జవాబు : శ్రీరాముడు సీతా లక్ష్మణులతో గూడి గంగానదిని దాటి ఆవలి తీరానికి చేరి వారు కనబడునంతసేపు చూసి సుమంతుడు గుహుని వద్ద సెలవు తీసికొని తిరిగి అయోధ్యకు చేరుకొన్నాడు. అతడు రాజాంతఃపురంలో ప్రవేశించి, మహారాజును దర్శించి, ఆయనకు నమస్కరించాడు. పిమ్మట మహారాజు సుమంత్రునితో ఎండ

కన్నెరుగని నా బిడ్డలు అడవిలో ఎన్ని కష్టాలు పడుతున్నారు? వారు ఎక్కడ శయనిస్తున్నారు? వారి ఆహార విహారాలు ఏ విధంగా ఉన్నాయి? ఈ విషయాలన్ని వివరించు. నేను శ్రీరాముని కథా శ్రవణంతో కొంత శోకవిముక్తుడ నౌతాను. అని మహారాజు పలుకగా సుమంత్రుడు కన్నీరు కార్చుచూ, డగ్గుత్తికతో మహారాజా! శ్రీరాముడు చేతులు జోడించి మీకు శిరసా ప్రణమిల్లి, సుమంత్రా! ఆత్మజ్ఞాని, మహాత్ముడు అయిన మా తండ్రిగారి పాదాలకు సాష్టాంగ నమస్కారాలు తెలియజెయ్యి. అంతఃపురంలోని తల్లులందరికి నేను నమస్కరించినట్లు, వారి క్షేమాన్ని అడిగినట్లు వివరించు. ప్రత్యేకంగా మా తల్లి కౌసల్యామాతకు నా ప్రణామాలు తెలియజెయ్యి. మేమందరం క్షేమంగా ఉన్నట్లు శ్రద్ధాభక్తులతో ధర్మాన్ని ఆచరిస్తున్నట్లు తెలియజెయ్యి. మా కుశలవార్తను భరతునకు తెలియజెయ్యి. ఆయనతో తల్లులందరినీ సమదృష్టితో చూడమని నా మాటగా తెలియజెయ్యి. అని ఇంకను అనేకరీతుల రాముడు తెలిపిన పిమ్మట లక్ష్మణుడు సుమంత్రా! రాజ కుమారుడైన శ్రీరాముని అడవులకు పంపించడానికి అతడు చేసిన అపరాధమేమి? ఏది ఏమైనప్పటికి నాకు సోదరుడైనా, తండ్రైనా రాముడేనని తెలిపాడు. మహారాజా! సీతాదేవి మాత్రం నాతో ఏమీ మాట్లాడక నిశ్చేష్టురాలై పరితపిస్తూ, ఏడ్చుతూ, పదేపదే రథాన్ని, నన్నుచూస్తూ ఉండిపోయింది. అని సుమంత్రుడు శ్రీరామ సందేశాన్ని వినిపించాడు.

5. ప్రశ్న : పుత్రశోకంతో విలపిస్తున్న దశరథుని, కౌసల్యామాతను సుమంత్రుడు ఏ రీతిగా ఓదార్చాడు?

జవాబు : శ్రీరామ సందేశాన్ని సుమంత్రుని ద్వారా విన్న దశరథుడు ఓ సుమంత్రా! నేనిప్పుడు సీతారామ లక్ష్మణులను చూడ గోరుతున్నాను. కాని నా పాప ఫలితంగా అది నాకబ్బటం లేదు. అని విలపిస్తూ స్పృహను కోల్పోయాడు. అనంతరం కౌసల్యాదేవి గడగడ వణుకుతూ నీరసించి నేలపై కూలబడి పోయింది. కొంత సమయం తరువాత ఆమె సుమంత్రా! సీతారామ లక్ష్మణులు లేనిదే నేను ఒక్క

క్షణమైనా జీవించలేను. కనుక వారు ఉన్న ప్రదేశానికి నన్ను జేర్చు. అని కౌసల్య పలికిన ధీనమైన మాటలకు సుమంత్రుడు ఇంతసేపు దుఃఖించాడు. అనంతరం సుమంత్రుడు అమ్మా! రఘురాముడు ఎట్టి దిగులూ పెట్టుకోకుండా దండకారణ్యంలో ప్రశాంతంగా ఉన్నాడు. కాబట్టి నీవు శ్రీరామునకు ఏమగునోయని దిగులు పెట్టుకోవద్దు. ఆయన ఎడబాటు వలన కలిగిన దుఃఖాన్ని వదిలిపెట్టు. జితేంద్రియుడు, ధర్మజ్ఞుడు అయిన లక్ష్మణుడు వనమందు నిరంతరం శ్రీరాముని సేవిస్తూనే ఉన్నాడు. సీతాదేవి ఎల్లప్పుడూ తన భర్త చెంత ప్రేమానురాగాలు పొందుతూనే ఉంది. అమ్మా! కౌసల్యాదేవి! సీతారామ లక్ష్మణుల గురించి మీరు ఏ మాత్రమూ దిగులు చెందవద్దు. అని సుమంత్రుడు యుక్తి యుక్తములైన మాటలతో దశరథుని, కౌసల్యా మాతను ఓదార్చ ప్రయత్నించినా, వారు తమ కుమారుని ఎడబాటు శోకంతో కృశించి, రామా! రామా! అంటూ వాపోవుచూ పరతపిస్తూనే ఉన్నారు.

## ఇరువది మూడవ అధ్యాయము

జవాబులు : 1.2. యమునానది 2.3. వాల్మీకి మహర్షి
3. వాస్తుపూజ

........

# అయోధ్యాకాండము

## 61, 62, 63, 64, 65, 66 సర్గలు

## ఇరువది నాలుగవ అధ్యాయము

1. ప్రశ్న : శ్రీరాముని యెడబాటును భరించలేక కౌసల్య దశరథుని నిష్ఠూరంగా మాట్లాడిన మాటలకు తన భర్త బాధపడడాన్ని చూసి, తాను ఏ విధంగా ప్రవర్తించింది ?

జవాబు : 1. పశ్చాత్తాపపడింది 2. విసుగు చెందింది
3. ఆశ్చర్యపడింది 4. తనను తాను సమర్థించు కొన్నది

2. ప్రశ్న : కౌసల్యాదేవిని ఊరడిల్లజేసిన దశరథుడు తనకు పూర్వం వయస్సులో ఉండగా, జరిగిన సంఘటనా ఫలితంగా ప్రాప్తించిన ఒక శాపాన్ని గురించి సవివరంగా తెలుపుతూ, అది ఏ శాపంగా తాను కౌసల్యకు తెలిపాడు?

జవాబు : 1. నీవు రాజ్యభ్రష్టుడవవుతానని 2. నీ స్వర్గ భ్రష్టుడవవుతావని
3. పుత్రశోకంతో మరణిస్తావని 4. నీవు ధర్మభ్రష్టుడవవుతావని

3. ప్రశ్న : దశరథ మహారాజు బాగా ప్రొద్దుపోయి అర్ధరాత్రి గడచిన సమయంలో, అయ్యో కౌసల్యా! సుమిత్రా! క్షణక్షణానికి నా ఇంద్రియాలు పట్టుతప్పు తున్నవి. అని ఆయన ఈలోకాన్ని విడిచి వెళ్ళిపోతూ ఎవరిని స్మరించు కొంటూ ప్రాణాలు విడిచాడు.

జవాబు : జవాబుల కాలంలో ఉన్నది.

4. ప్రశ్న : దశరథ మహారాజు మృతికి, రాణులు అంతఃపుర స్త్రీలు ఏరీతిగా రోధించారు?

జవాబు : సూర్యోదయమగు నప్పటికే పరిజనమంతా మహారాజు సేవకై ఉత్సాహంతో వచ్చారు. అప్పటి వరకు దశరథుడు శయ్యా మందిరాన్నుండి బయటకు రాకపోవడంతో వారు అనుమానించి లోనికిచూసి మహారాజు హృదయస్పందన ఆగిపోయినట్లుగా గ్రహించారు. రాత్రి ప్రొద్దు పోయేవరకు శోకంతో మునిగిపోయి ఉన్న కౌసల్యా, సుమిత్రలు గాఢనిద్రలో మునిగి యుండటం వలన వారు గ్రహించలేదు. మహారాజు మరణించాడని తెలిసికొన్న అంతఃపుర స్త్రీలు ఎలుగెత్తి ధీనంగా ఏడవసాగారు. ఆ స్త్రీల రోధనా ధ్వనులకు నిద్రాభంగంకాగా, కౌసల్యా, సుమిత్రలు తటాలున మేల్కొన్నారు. అంతట ఆరాణులిద్దరూ రాజును జూసి అయ్యో! జీవితేశ్వరా! అని ఏడుస్తూ వారు నేలపై పడిపోయారు. దుఃఖాతిరేకంతో కౌసల్య నేలపై అటు ఇటు పొర్లింది. అప్పుడు ఆమె శరీరం దుమ్ముకొట్టుకొని కాంతి హీనంగా ఉంది. పిమ్మట కైకేయి మొదలగు దశరథుని భార్యలు అందరూ శోక సంతాపాలకులోనై, ఏడుస్తూ అచేతనులై పడిపోయారు. కౌసల్యాది గాగల రాణులందరి ఆక్రందనలతో ఆ రాజభవనమంతా మరలా ఒకసారి ఏడుపులతో

దద్దరిల్లింది. రాజుగారు మరణించడంతో ఆ మందిరం బయంతో తత్తరపాటుతో, కలత చెందిన పరిజనులతో నిండిపోయింది. ఈ విధంగా దశరథ మహారాజు మరణానికి రాణులు, పరిజనులు విలపించారు.

5. ప్రశ్న : దశరథ మహారాజు పార్థివ దేహాన్ని ఏవిధంగా భద్రపరిచారు? పిమ్మట అయోధ్యలోని ప్రజలు, రాణులు ఏ విధంగా పరితపించారు?

జవాబు : ప్రాణాలను కోల్పోయిన దశరథ మహారాజు శిరస్సును తన ఒడిలోనికి చేర్చుకొని కౌసల్య పరిపరి విధాల శోకించసాగింది. మహారాజులేని జీవితం నాకెందుకు నేనుకూడా రాజుగారితో సహగమనం చేస్తాను. అని తన భర్త పార్థివ దేహంపైబడి మహారాణి విలపించసాగింది. అప్పుడు పరిచారికలు ఆమెను దూరంగా తీసికొని వెళ్ళారు. అంతట వసిష్టుడు మంత్రు లందరితో ఆలోచించి, బిడ్డలెవరూ దగ్గర లేకుండా, రాజు కళేబరానికి దహన సంస్కారం చేయుటకిష్టపడక, మహారాజుగారి పార్థివ దేహాన్ని నూనెతో నింపిన తొట్టిలో భద్రపరచారు. పిమ్మట వారు సమస్త రాజకీయ వ్యవహారాలను నిర్వహించారు. మంత్రులు ఈ విధంగా రాజు శరీరాన్ని తైలద్రోణి యందుంచుట చూసి అంతఃపుర స్త్రీలు, దాసదాసీ జనం అందరూ కన్నీరు మున్నీరుగా విలపించారు. అయ్యో! మహారాజా! శ్రీరాముని దూరం చేసుకొని దుఃఖిస్తున్న మాకు, నీవుగూడ మమ్మల్ని విడిచి స్వర్గస్తుడవైనావు. మేమందరము అనాథల మైనాము. ఆ కైకాదేవి ముందు మేమెట్లు జీవించ గలము. అని ఆ మహారాణులందరూ దుఃఖిస్తూ నేలపైబడి దొర్లసాగారు. మహారాజు మరణంతో అంతఃపుర స్త్రీలు గాని, నగర ప్రజలు గాని తమ ఇండ్లు ముంగిట శుభ్రము చేయకపోవుట వలన, ఆ నగరం తేజోహీనమైంది. వారంతా ఆ రోజంతా ఆహారాన్ని స్వీకరించక పోవటం వలన తేజోహీనులైనారు. అంతలో సూర్యుడస్తమించాడు. ఆ అయోధ్యా నగర వాసులంతా మనశ్శాంతిని కోల్పోయారు.

## ఇరువది నాలుగవ అధ్యాయము

జవాబులు : 1.1. పశ్చాత్తాప పడింది 2.3. పుత్రశోకంతో మరణిస్తావు
3. శ్రీరాముడిని

# అయోధ్యా కాండము

## 67, 68, 69, 70, 71, 72 సర్గలు

## ఇరువది ఐదవ అధ్యాయము

1. ప్రశ్న : రాజులేని రాజ్యం ఉండకూడదని, ఇందును గురించి ఒక ఆలోచన చేయమని మార్కండేయాది మహర్షులు ఆ భాధ్యతను ఎవరికి అప్పగించారు ?

జవాబు : 1. కౌసల్యాదేవి 2. వామదేవుడు
3. సేనాపతికి 4. వసిష్ఠునికి

2. ప్రశ్న : భరత శత్రుఘ్నులను అయోధ్యకు రప్పించడానికై వసిష్ఠుడు దూతలను పంపిస్తూ, వారికి భరతుని మేనమామ నివసించే నగరం పేరును ఏమని వివరించాడు?

జవాబు : 1. విశాలానగరం 2. హస్తినాపురం
3. గిరివ్రజపురం 4. ద్వారక

3. ప్రశ్న : దూతల వర్తమానం అందుకొన్న భరతుడు చతురంగ బల సమన్వితుడై, శత్రుఘ్నునితో గూడి నిరవధికంగా ప్రయాణించి అయోధ్యను ఎన్ని రోజులలో చేరుకొన్నాడు?

జవాబు : జవాబుల కాలంలో ఉన్నది.

4. ప్రశ్న : వసిష్ఠుని ఆజ్ఞ ప్రకారం వెళ్ళిన దూతలు ఏవిధంగా కేకయ రాజ్యం చేరుకొన్నారు? భరతుని ప్రయాణం అయోధ్యా దిశగా ఏరీతిగా సాగింది?

జవాబు : వసిష్ఠాదేశం ప్రకారం వెళ్ళిన దూతలు కొన్ని రోజులు ప్రయాణించి కేకయరాజు రాజధానీ నగరమైన గిరివ్రజపురం చేరి, అందు యుధాజిత్తు రాజ గృహము నందు హాయిగా కాలం గడుపుతున్న భరత శత్రుఘ్నులను దర్శించు కొన్నారు. అప్పుడు భరతుడు దూతలతో మా తండ్రి దశరథ మహారాజు క్షేమమేనా? మహాత్ములైన రామ లక్ష్మణులును, మా తల్లులు ముగ్గురునూ క్షేమమే గదా! మాతల్లి కైకేయికి ఎట్టి ఆపద రాలేదు కదా! ఆమె ఏమైనా చెప్పి

పంపినదా? అని అడిగాడు. అందుకు దూతలు ఓ నరోత్తమా! అందరూ క్షేమమే. మీరు వెంటనే బయలు దేరండి. అని పలికిన దూతల మాటలకు భరతుడు ''సరే'' అని నా అయోధ్యా ప్రయాణానికి దూతలు నన్ను తొందర పెట్టుచున్నారు. మీ ఆజ్ఞ అయినచో నేను అయోధ్యకు ప్రయాణమౌతాను. అని తన మాతామహుని అభ్యర్థించి, ఆయన అనుమతితో అచట వారందరి అనుమతులను పొంది, భరతుడు చతురంగ బలాలతో అయోధ్యకు బయలుదేరి ప్రయాణం సాగించాడు. కొండలు, కోనలు, నదులు, నగరాలు, పల్లెలుదాటి ఏడురోజులు ప్రయాణించి భరతుడు ఎనిమిదవ నాటి సూర్యోదయాన కోసల రాజ్యంలో ప్రవేశించి అయోధ్యను దర్శించాడు. ఈ రీతిగా భరతుని అయోధ్యా ప్రయాణం సాగింది.

5. ప్రశ్న : భరతుడు అయోధ్యా నగరములో ప్రవేశించి తన తండ్రి గారి మరణ వార్తను ఏ విధంగా తెలుసుకొన్నాడు?

జవాబు : అయోధ్యలో ప్రవేశించిన భరతుడు రాజ భవనములో తన తండ్రి కనిపించక పోవుటచేత తల్లి కైకేయి మందిరానికి వెళ్ళాడు. ఇంతవరకు తన తాతగారి ఇంటివద్ద ఉండి వచ్చిన భరతుని జూసి కైకేయి పట్టరాని ఆనందంతో తన ఆసనము నుండి ఒక్క ఉదుటన లేచింది. వెంటనే భరతుడు తల్లి పాదములకు నమస్కరించాడు. అంతట కైకేయి నాయనా! భరతా! నీ తాతగారి ఇంటివద్ద నుండి వచ్చావు గదా! అచట మీ తాతగారు, మీ మేనమామ అందరూ క్షేమమే గదా! అని అక్కడి వారందరి క్షేమ సమాచారములను అడిగి తెలిసికున్నది. పిమ్మట భరతుడు అమ్మా! తండ్రిగారిని దర్శించడానికై నేను ఆయన భవనానికి వెళ్ళాను. ఆయన అక్కడ కనిపించలేదు. పెద్దతల్లి కౌసల్యామాత భవనములో ఉన్నాడా? అని ప్రశ్నించిన భరతునితో నాయనా! నీ తండ్రి మహాత్ముడు, సత్పురుషుల పాలిటి పెన్నిధి. సమస్త ప్రాణులు పొందే పరమగతిని పొందాడు. అని పలికిన తల్లి మాటల ద్వారా తండ్రి మరణ వార్తను విని ధారుణమైన పితృశోకానికి గురియై హా! తండ్రీ! నన్ను వదలి వెళ్ళావా? అని

దయనీయమైన ధీనమైన వాక్కులతో విలపిస్తూ నేలపైబడి దొర్లసాగాడు. అంతట కైకాదేవి తన కుమారుడిని లేవనెత్తి, అతనిని ఓదార్చింది. భరతుడు పొంగి పొరలి వస్తున్న దుఃఖంతో చాలాసేపు వెక్కివెక్కి ఏడ్చాడు. అనంతరం అతడు కొంత నిబ్బరం తెచ్చుకొని అమ్మా! మహానుభావుడైన మా తండ్రి గారి మరణానికి కారణమైన ఆ వ్యాధి ఏమిటి? అని ప్రశ్నించిన భరతునితో జరిగిన కథనంతా తల్లి తెలిపి ఓ పుత్రా! నీ శోక సంతాపాలు విడిచి ధైర్యంతో, నిష్కంటకమైన ఈ కోసల సామ్రాజ్యాన్ని పరిపాలించు అన్నది. ఆమె మాటలు విని భరతుడు నిశ్చేష్టుడయ్యాడు.

## ఇరువది ఐదవ అధ్యాయము

జవాబులు : 1.4. వసిష్టునికి 2.3. గిరివ్రజ పురం
3. ఎనిమిది రోజులలో

................

# అయోధ్యా కాండము

## 73, 74, 75, 76, 77, 78 సర్గలు

## ఇరువది ఆరవ అధ్యాయము

1. ప్రశ్న : శ్రీరాముడు వనవాసానికి వెళ్ళడానికి తన తండ్రి మరణానికి ప్రధాన కారణం తన తల్లి అని తెలుసుకొన్న భరతుడు ఆమెను అనేకరీతుల చీత్కరించి నీవు చేసిన ఈ దుర్మార్గపు పనికి నేను చేయబోయెడిది కూడా విను. అని పలికిన భరతుడు తన తల్లితో ఏమి చెప్పాడు?

జవాబు : 1. ఈరాజ్యాన్ని నీవే ఏలుకో
2. శత్రుఘ్నునికి పట్టాభిషేకం చేస్తాను
3. శ్రీరాముడునే రాజును చేస్తాను
4. ఈ రాజ్యాన్ని వసిష్టునికి అప్పగిస్తాను

2. ప్రశ్న : భరతుని రాకను తెలుసుకొని సుమంత్రుడు మొదలగు మంత్రులు కైకేయి భవనానికి వచ్చారు. అప్పటికే స్పృహను కోల్పోయి ఉన్న

భరతుడు చాలా సేపటికిగాని స్పృహలోకి రాలేదు. పిమ్మట భరతుడు శత్రుఘ్నునితో కలిసి ఎవరి వద్దకు బయలు దేరాడు?

జవాబు : 1. వశిష్టుని వద్దకు 2. కౌసల్యామాత వద్దకు
3. పౌరజానపదుల సమక్షానికి 4. సేనాపతి వద్దకు

3. ప్రశ్న : భరతుడు శోకముతో కుమిలి పోతుండగా, ఓ రాజకుమారా! ఇది శోకానికి సమయం కాదు. ఇక మహారాజుకు ఉత్తమగతులు ప్రాప్తించడానికై ఆయనకు అంత్యక్రియలు జరుపవలసి ఉన్నది. అని తెలిపినది ఎవరు?

జవాబు : జవాబుల కాలములో ఉన్నది.

4. ప్రశ్న : దశరథ మహారాజు గారికి అంత్యక్రియలు అపరక్రియలు ఏవిధంగా జరిగాయి?

జవాబు : వసిష్ట మహర్షి సూచనమేరకు భరతుడు తన తండ్రికి ప్రేత సంస్కారం చేయడానికి మనసు కుదుట పరచుకొన్నాడు. పిమ్మట దశరథుని కళేబరాన్ని తైలద్రోణి నుండి క్రిందకు దించారు. విగత జీవుడై యున్న తండ్రిని జూసిన భరతుడు శత్రుఘ్నుడు ఇంతసేపు ఏడ్చారు. అంతట వసిష్టుడు రాజపుత్రులను ఉద్దేశించి ప్రేత కార్యములను నిర్విచారంగా నిర్వహించ మని చెప్పాడు. గురుదేవుని మాటల ప్రకారం భరతుడు ఋత్విజులను, పురోహితులను, ఆచార్యులను ప్రేరేపించాడు. పరిచారకులు మహారాజు శవపేటికను పల్లకిలో ఉంచి దానిని స్మశాన వాటికకు తీసికొని వెళ్లారు. అచట చితి యందు అగరు, చందనం, గుగ్గుల పుల్లలు, సరళ, పద్మక దేవదారు చెక్కలను ఉంచారు. ఇంకనూ పలువిధాల సుగంధ ద్రవ్యాలను చల్లారు. అనంతరం ఋత్విజులు, వేదమంత్రాలు వల్లిస్తుండగా భరతుడు నిప్పంటించాడు. అప్పుడు కౌసల్యాది రాజపత్నులు పరిచారికలతో గూడి ఆ స్మశానానికి వచ్చారు. దహనక్రియ పరిసమాప్తి అయిన పిమ్మట సరయూ నదిలో స్నానము చేసి, అందరూ తర్పణాలు విడిచారు. పిమ్మట పదిరోజులు నిత్యం నేలపైనే శయనిస్తూ, భరతుడు దుఃఖాన్ని దిగమ్రింగుకొని అంత్యక్రియలు నెరవేర్చారు. అనంతరం పదకొండవ రోజు భరతుడు శుచియై శుద్ధి పుణ్యాహవచనాన్ని ఆచరించాడు. పన్నెండవ రోజు సపిండీకరణ, మొదలైన శ్రాద్ధకర్మలను పూర్తిచేసి మహారాజుకు ఉత్తమగతులు

ప్రాప్తించడానికై సమృద్ధిగా అన్నదానం చేశారు. ఇంకనూ, బంగారు ఆభరణాలు, వేలకొలది గోవులను వస్తు వాహనాలను, దానం చేశారు. ఈ విధంగా దశరథ మహారాజుగారి అంత్యక్రియలను భరత శత్రుఘ్నులు పూర్తిచేశారు.

5. ప్రశ్న : మందరను శత్రుఘ్నుడు ఏరీతిగా శిక్షించబోయాడు?

జవాబు : దశరథ మహారాజు అపరక్రియలన్నీ పూర్తిచేసుకొన్న పిమ్మట భరతుడు శ్రీరాముని వద్దకు వెళ్ళాలని ఆలోచిస్తూండగా శత్రుఘ్నుడు కూడా అక్కడ ఉన్నాడు. అప్పుడు వంటినిండా ఆభరణాలు ధరించి, ఆనందంతో మందర తూర్పు వాకిట నిలచి ఉంది. అది చూచిన ద్వారపాలకులు కొందరు ఆ మందరను పట్టుకొని శత్రుఘ్నుని వద్దకు వచ్చి రాజపుత్రా! ఇన్ని అనర్థాలకు మూలకారణం ఈ మందరయే. ఇట్టి పాపాత్మురాలిని మీ ఇష్టం వచ్చినట్లు చేయండి అన్నారు. అప్పుడు శత్రుఘ్నుడు జరిగిందంతా తెలిసికొని, అక్కడ ఉన్న పరిజనులతో ఈమె మా పట్లచేసిన దుర్మార్గానికి ఫలితం అనుభవించ వలసిందే అని ఆ మందరను గట్టిగా పట్టుకొన్నాడు. అంతటా కుబ్జ భయంతో బిగ్గరగా గోల చేసింది. దానిని పట్టుకొని శత్రుఘ్నుడు నేలపై పడద్రోసి యీడ్చాడు. ఆ సమయంలో ప్రాణ భయంతో మందర చేసే గోలకు కైకేయి ఆమెను విడిపించడానికై వచ్చింది. శత్రుఘ్నుడు ఆమెను దిక్కరిస్తూ పలికిన మాటలకు కైకేయి భయంతో భరతుని శరణు వేడింది. అంతట భరతుడు తన వద్దకు వచ్చిన తల్లిని జూచి, కోప తీవ్రతతో ఉన్న శత్రుఘ్నుని జూచి ఈమెను నేను చంపవలసి ఉంది. కాని తల్లిని చంపినవాని మొగం మన అన్న శ్రీరాముడు చూడడని నేనాగిపోయాను. అట్లాగే ఈ కుబ్జను గూడ, చంపితే, స్త్రీ హంతకులని మనలను మన అన్నగారు కన్నెత్తి అయినా చూడడు. కాబట్టి ఈమెను కూడా వదిలివెయ్య అన్నాడు. భరతుని మాట ప్రకారం శత్రుఘ్నుడు మందరను వదలి వేశాడు. భయకంపితయైన మందరను కైకాదేవి తన మందిరానికి తీసికొని వెళ్ళింది.

## ఇరుది ఆరవ అధ్యాయము

జవాబులు : 1.3. శ్రీరాముడినే రాజును చేస్తాను 2.2. కౌసల్యామాత వద్దకు
3. వసిష్టుడు

# అయోధ్యా కాండము

## 79, 80, 81, 82, 83, 84 సర్గలు

## ఇరువది ఏడవ అధ్యాయము

1. ప్రశ్న : దశరథుని అంత్యక్రియలు జరిపించిన పద్నాలుగవ రోజు ఉదయాన్నే భరతునితో ఓ రాజకుమారా! ప్రస్తుతం న్యాయ సమ్మతంగా నీవే రాజువు కాదగిన వాడివి. అని చెప్పినది ఎవరు?

జవాబు : 1. వసిష్టుడు 2. కౌసల్య
3. పౌరులు 4. మంత్రులు

2. ప్రశ్న : ఎవరి పిలుపు మేరకు సుమంత్రాది మంత్రులు, సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేశారు?

జవాబు : 1. కౌసల్య 2. కైకేయి
3. వసిష్టుడు 4. భరతుడు

3. ప్రశ్న : దశరథుని అంత్యక్రియల అనంతరం జరిగిన సర్వసభ్య సమావేశంలో, శ్రీరాముడే రాజు కాదగినవాడు. చతురంగ సపరివార బలాలతో వెళ్ళి, ఆయనను ఆహ్వానించి తీసికొనివద్దాము అని నిర్ణయించి చెప్పది ఎవరు?

జవాబు : జవాబుల కాలంలో ఉన్నది.

4. ప్రశ్న : భరతుడు శ్రీరాముని కొరకై పరిజనంతో బయలుదేరి, గంగానది వరకు జరిగిన ప్రయాణం ఏ విధంగా జరిగింది?

జవాబు : రామలక్ష్మణులను చూచు వేడుకతో భరతునితో పాటు, కౌసల్య, సుమిత్ర, కైకేయిలు కూడా సముచితమైన వాహనాలలో బయలు దేరారు. ఇంకనూ చతురంగ బలాలతోపాటు, అయోధ్య ప్రజలు అన్ని వృత్తులవారు భరతుని వెంట నడిచారు. ఈ విధంగా అయోధ్యా నగరమంతా కదిలింది. సైనికులు ఆనందంతో గుర్రాలపైనా, ఏనుగులపైనా, రథాలపైనా చాలాదూరం ప్రయాణించి శృంగభేరి పురం సమీపంలో నున్న గంగానదీ తీరానికి చేరుకొన్నారు. ఆ పురం

శ్రీరాముని మిత్రుడైన గుహుని నివాస స్థానం. పవిత్ర జలాలతోగూడి యున్న గంగానదిని జూసి, తన సేన కొంత అలసి ఉండటాన్ని జూసి భరతుడు మంత్రులతో మీ ఇష్టానుసారం ఈ ప్రదేశంలో మన సైన్యాలను నిలిపి ఉంచండి. రేపు గంగానదిని దాటుదాము. నేను మా తండ్రిగారికి గంగానది జలాలతో తర్పణాలు విడిచివస్తాను. అని భరతుడు ఆ విధంగానే చేశాడు. భరతుని ఆజ్ఞానుసారం సుమంత్రాదులు అందరూ సైన్యాలను అచట ఆపి వేర్వేరు ప్రదేశాలలో నిలిపారు. అంతట భరతుడు మహాత్ముడైన శ్రీరాముని తీసికొనివచ్చు ఉపాయాన్ని గురించి ఆలోచిస్తూ ఆ రాత్రి వారంతా అచటనే నివశించారు.

5. ప్రశ్న : గంగా తీరాన విడిది ఏర్పాటు చేసికొని యున్న భరతుడుని గుహుడు దర్శించి ఏరీతిగా సమాదరించాడు?

జవాబు : నిషాదరాజైన గుహుడు భరతుని సేనను, రథాలపై ఎగురుతున్న కోవిదార ధ్వజాన్ని చూసి, ఇది ఇక్ష్వాకు వంశపు రాజుల సేనయే. దీనినిబట్టి చూస్తే భరతుడు శాశ్వతంగా రాజ్యాన్ని సొంతం చేసుకోవడానికి శ్రీరాముడిని అడ్డు తొలగించు కోవడానికై బయలు దేరినట్లున్నాడు. అని తలంచి, ఒకవేళ భరతుడు శ్రీరాముడికి సంతోషాన్ని కూర్చే ఆలోచనతో ఉంటే, ఈ సేనను మనం సురక్షితంగా గంగానదిని దాటిద్దాం. అని తన వారిని ఆదేశించి గుహుడు తాను కొన్ని ఆహార పదార్థాలను తీసికొని భరతుని కడకు స్వయంగా వెళ్ళాడు. అక్కడ ముందుగా సుమంత్రుడు కనిపించాడు. ఆయన వలన విషయం తెలిసికొని గుహుడు సంతోషించాడు. అనంతరం గుహుడు భరతునికి నమస్కరించి ప్రభూ! మీరాక మాకు ముందుగా తెలియపరచి ఉన్నట్లైతే మీకు స్వాగత సత్కారాలు జరిపి యుండేవారము. మేమందరము మీ దాసులము. మేము సంపాదించుకొన్న పండ్లూ, కందమూలాలు, మాంసం, ఇంకా అనేకరకాలైన అడవి ధాన్యాలు తమకు సమర్పించుకొని సత్కరించు కోవాలని ఆశిస్తున్నాను అన్నాడు. అందుకు భరతుడు సోదరా! నీవు

మా అన్నగారైన శ్రీరామునకు పరమ మిత్రుడవు. నీ కోరిక మంచిదే. నీ భక్తి శ్రద్ధలూ, మంచి మాటలు నాకు సంతృప్తిని కలిగించాయి. మమ్ములను గంగను దాటించుచాలు అన్నాడు. అంతట గుహుడు రాజకుమారా! ఈ అడవి దారులన్నీ నాకుతెలుసు. నేను, నా పరిజనము మిమ్ములను గంగను దాటించి, మీకు తోడుగా వస్తాము. మీరు నిశ్చింతగా ఉండి, మీ సేనా సహితంగా ఈరోజు మా అతిధి మర్యాదలను అందుకొనండి. రేపు గంగను దాటవచ్చును. అన్నాడు. అందుకు భరతుడు అంగీకరించాడు. ఆ రాత్రికి అందరూ అచటనే విశ్రమించారు.

## ఇరువది ఏడవ అధ్యాయము

జవాబులు : 1.4. మంత్రులు　　2.3. వసిష్టుడు
3. భరతుడు

..............

# అయోధ్యా కాండము

## 85, 86, 87, 88, 89, 90 సర్గలు

## ఇరువది ఎనిమిదవ అధ్యాయము

1. ప్రశ్న : భరతుడు, గుహుడు ఆత్మీయ సంభాషణ సాగించే సమయంలో భరతుడు గుహునితో తమకు ఏ మహర్షి ఆశ్రమానికి వెళ్ళేందుకు దారిచూపు మన్నాడు?

జవాబు : 1. అత్రి మహర్షి　　2. భరద్వాజ మహర్షి
3. వాల్మీకి మహర్షి　　4. గౌతమ మహర్షి

2. ప్రశ్న : గుహుడు శ్రీరాముని గురించిన విషయాలను తెలుపుతూ, ఓ రాజకుమారా! మీ అన్నగారైన శ్రీరాముడు ఇదిగో ఈ చెట్టు క్రిందనే,

తృణశయ్యపైననే ఆ రాత్రి శయనించాడు అని తెలిపాడు. ఆ చెట్టు పేరేమి?

జవాబు : 1. గారచెట్టు 2. మర్రిచెట్టు
3. రాగిచెట్టు 4. మేడిచెట్టు

3. ప్రశ్న : భరతుని చతురంగబలాలను గుహుడు ఏ సాధనాలతో గంగను దాటించాడు?

జవాబు : జవాబుల కాలంలో ఉన్నది.

4. ప్రశ్న : భరతుడు సపరివారంగా తాను ఏరీతిగా గంగను దాటి, భరద్వాజ మహర్షి ఆశ్రమం చేరాడు?

జవాబు : గంగానదీ తీరాన శ్రీరాముడు శయనించిన ప్రదేశాననే భరత శత్రుఘ్నులు కూడా శయనించారు. సూర్యోదయానికి ముందే లేచి, గుహుడు ఏర్పాటు చేసిన ఐదువందల పడవలలో వసిష్ఠాది గురువులు, కౌసల్యాదిగాగల రాణివాసపు స్త్రీలు, సైనికులు, బంధుమిత్రులు, సకల సంభారాలను నావలపైకి చేర్చారు. కొంతమంది తమ తమ సామాన్లు ఇవినావి, ఇవినావి అని పెద్దపెద్దగా అరుస్తూ, ఎవరికి వారు కోలాహలంగా వడివడిగా వెళ్ళి నావలను ఎక్కారు. క్రిక్కరిసిన నావలలో ఎక్కువ నావలు ఆడవారితో నిండి ఉన్నాయి. మరికొన్ని నావలు అశ్వాలకే పరిమితమైనాయి. కొన్ని నావలు బండ్లతోనూ, ఎద్దులతోనూ పరిమితమై ప్రయాణించారు. క్రమంగా కొన్ని పడవలు ఆవలి తీరానికి వెళ్ళి మరలా తిరిగి వచ్చాయి. పిమ్మట కొన్ని పడవలలో భద్రగజాలను ఎక్కించారు. కొందరు పడవలపైనా, కొందరు ఈదుకొంటూ గంగను దాటారు. నదీజలాల స్నానాదులచే పవిత్రమైన ఆసేన భరతాదులతో కలిసి అచటి నుండి కొంత సమయానికి భరద్వాజాశ్రమ సమీపానికి చేరుకొంది. భరతుడు తన సేనను ఆశ్రమానికి కొంతదూరాన ఉంచి, వసిష్ఠాది ఋత్విజులతోగూడి, మహర్షి వద్దకు కాలి నడకన వెళ్ళాడు. భరద్వాజ మహర్షి ఆశ్రమం పర్ణశాలలతో చూడ ముచ్చటగా ఉంది.

5. ప్రశ్న : భరధ్వాజ మహర్షిని భరతాదులు ఏవిధంగా దర్శించి, ఆయనతో మాట్లాడారు?

జవాబు : అల్లంత దూరంలో భరధ్వాజ మహర్షిని దర్శించిన భరతుడు తనవెంట వస్తున్న వారందరిని ఆపి, తాను పురోహితుడైన వసిష్టుని ముందుంచుకొని నడిచాడు. అంతలో ఆ మహాతపస్వి వసిష్టుని చూసి ఆసనం నుండి లేచి ఎదురువచ్చాడు. అప్పుడు భరతుడును, వసిష్టుడును తమగోత్ర నామాలు చెప్పుకొని నమస్కరించారు. అంతట భరధ్వాజ మహర్షి భరతునకును, వసిష్ట మహర్షికి ఆర్ఘ్యపాద్యాలు ఇచ్చి పూజించాడు. వారిని కుశలమడిగి భరతుడిని దశరథుని కుమారునిగా గుర్తించాడు. పిమ్మట భరతునితో మీ అన్నగారైన శ్రీరాముడు అడవులకు పంపబడ్డాడు గదా! మీరిక్కడకు వచ్చేందుకుగల కారణమేమి? అన్నాడు. భరతుడు కన్నీరు కార్చుతూ విషయమంతటినీ వివరించి చెప్పాడు. అప్పుడు భరధ్వాజ మహర్షి ఓ నరోత్తమా నీవు పెట్టుకున్న లక్ష్యమూ, దీనికై నీ పూనికా అంతా మంచిదే. నీ మనసులోని సత్యసంకల్పం నాకు తెలుసు. కాని ఇది నీలో ఇంకా దృఢపడును గాక! నీ కీర్తి భూమి అంతటా వ్యాపించును గాక! ధర్మజ్ఞుడైన శ్రీరాముడు సీతా లక్ష్మణులతో కలసి చిత్రకూట పర్వత ప్రదేశాలయందు నివసిస్తున్నాడు. కావున ఓ భరతా! మీ అన్నగారైన శ్రీరాముని కడకు రేపు వెళ్ళవచ్చు. ఈరోజు నీ మంత్రులు, పరివారంతో కలిసి ఇక్కడే ఉండండి. ఇది నా కోరిక అన్నాడు. అంతట భరతుడు ఓ మునీశ్వరా! మీ ఆజ్ఞను శిరసావహిస్తాను. అనిపలికి ఆ రాత్రికి ఆశ్రమమునందే నివశించడానికి నిశ్చయించాడు.

## ఇరువది ఎనిమిదవ అధ్యాయము

జవాబులు : 1.2. భరధ్వాజ మహర్షి 2.1. గారచెట్టు
3. పడవలు

# అయోధ్యా కాండము

## 91, 92, 93, 94, 95, 96 సర్గలు

## ఇరువది తొమ్మిదవ అధ్యాయము

1. ప్రశ్న : భరతునికి, ఆయన పరివారాని కంతటికి అతిథి సత్కారాలు చేయడానికై నిశ్చయించుకొని, భరద్వాజ మహర్షి అగ్నిశాలలో ప్రవేశించి, ఆచమనం చేసి ఎవరిని మొదటగా ఆహ్వానించాడు?

జవాబు : 1. విశ్వకర్మను 2. బ్రహ్మదేవుడిని
3. పరాశక్తిని 4. అన్నపూర్ణా దేవిని

2. ప్రశ్న : భరద్వాజ మహర్షి వద్ద సెలవు తీసికొనివెళ్ళి శ్రీరాముని దర్శించాలన్న కోరికతో భరతుడు మహర్షిని దర్శించి మహాత్మా! మా అన్నగారు ఎక్కడ ఉన్నాడు? ఆ ప్రదేశం ఇక్కడికి ఎంత దూరమున్నది? అని అడిగాడు. అందుకు భరద్వాజ మహర్షి శ్రీరాముడున్న చిత్రకూటం అక్కడికి ఎంత దూరమున్నదని చెప్పాడు?

జవాబు : 1. ఐదు యోజనాలు 2. నాలుగన్నర యోజనాలు
3. మూడున్నర యోజనాలు 4. రెండు యోజనాలు

3. ప్రశ్న : శ్రీరామ దర్శన కాంక్షతో తన సేనతో గూడి భరతుడు భరద్వాజ మహర్షి చెప్పిన ఆనవాలు ప్రకారం చిత్రకూట పర్వత సానువులపై నడుస్తుండగా కొందరు సేవకులు వచ్చి భరతునితో ఒక గుర్తును చూపి, అచట శ్రీరాముడు ఉండవచ్చును అన్నారు. ఆ చిహ్నమేదై ఉండ వచ్చును?

జవాబు : జవాబుల కాలంలో ఉన్నది.

4. ప్రశ్న : భరతుడు తన వారందరితోగూడి చిత్రకూట ప్రాంతానికి వెళ్ళిన సమయంలో సీతారామ లక్ష్మణులు ఏరీతిగా ఉన్నారు?

జవాబు : సీతా లక్ష్మణులతో గూడిన శ్రీరాముడు వనవాసం ప్రారంభించి నెలరోజులు కావస్తున్నది. క్రమేణా ఆ రాముడు చిత్రకూట ప్రదేశాన ప్రకృతి అందాలనుచూసి ఆనందిస్తూ, ఆ ప్రదేశంలోని చిత్ర విచిత్రాలైన పర్వత శోభలను సీతాదేవికి చూపుతూ తానుకూడా

ఇష్టపడ సాగాడు. అప్పుడా రఘురాముడు తన భార్యతో ఓ శుభాంగీ! రాజ్యాధికారం నాకు దూరమైనప్పటికీ, నా మేలుకోరే స్నేహితులు నాకు దగ్గరగా లేనప్పటికి, ఈ చిత్రకూట పర్వతాలలోని రమణీయ దృశ్యాలను చూస్తూ, ఆనందించడంలో నిమగ్నమైన నా మనస్సును, ఆ విషయాలేవీ భాధించడం లేదు. సీతా! వనవాసం చేయడంవల్ల తండ్రి ఆ దేశాన్ని పాలించి పితృ ఋణాన్ని తీర్చుకొన్న వాడినైనాను. అదే సమయంలో తమ్ముడైన భరతునికి మంచి చేసిన వాడినైనాను. ఈ రెండు ఫలితాలు నాకు దక్కాయి. ఈ విధంగా వనవాస నియమాలను పాటిస్తూ ఈ పద్నాలుగు సంవత్సరాలు సంతోషంగా గడిపి నందువల్ల మన వంశకీర్తి ప్రతిష్టలు ఇంకా పెరుగుతాయి. అని సీతాదేవికి శ్రీరాముడు ఆ ప్రాంత శోభలను వివరిస్తూ, ఒకసారి సీతాదేవితో గూడి మందాకినీ నదీ తీరానికి వెళ్ళాడు. అక్కడ పవిత్ర జలాలతోనున్న ఆ నదిని ఆమెకు చూపించి, సీతా! ఈ మందాకినీ నదీతీరమందు ఇసుక తిన్నెలతోనూ, అందు విహరించే హంసల తోనూ, బెగ్గురు పక్షులతోనూ, ఆ నీటిలో వికసించే కమలాల తోనూ, ఎంతో చూడముచ్చటగా ఉంది. నదికి ఇరువైపులా వృక్షాలన్నీ, ఫలాలతోనూ, పుష్పాలతోనూ, ఉండటంవల్ల, ఇది కుబేరుని సౌగంధికా సరస్సును మరపించేట్లుగా ఉంది. అని మాట్లాడుతూ సీతాదేవి తోడుగా ఉండగా ఆ రఘురాముడు ఆ చిత్రకూట పర్వత ప్రదేశాలలోనూ, మందాకినీ నదీ తీరాలలోనూ విహరించ సాగాడు.

5. ప్రశ్న : భరతాదుల ఆగమనాన్ని రామలక్ష్మణులు ఏ విధంగా గుర్తించారు?

జవాబు : శ్రీరాముడు పర్ణశాలా ప్రాంతంలో ఒక సమతల ప్రదేశంలో కూర్చొని ఉండగా అచటికి చేరుతున్న భరతుని సేనల సవ్వడులును, వాటి పాదాల తాకిడికి పైకెగసిన దూళులును ఒక్కసారిగా కనిపించాయి. ఇంతలో ఆ మహాసేనల కోలాహల ధ్వనులకు వనంలోని ఏనుగులు, వన్యమృగాలు భయపడి వాటి గుంపులలో నుండి తొలగి పరుగెత్త సాగాయి. అప్పుడు శ్రీరాముడు ఆ సైన్యాల కదలికలతో ఏర్పడిన సవ్వడులు విని, లక్ష్మణుని వైపుచూసి, సౌమిత్రీ! ఎవరో రాజ

కుమారుడు ఇటుగా వస్తున్నట్లున్నాడు చూడు అన్నాడు. అన్నగారు చెప్పగానే లక్ష్మణుడు దగ్గరలో ఉన్న ఒక ఎత్తైన మద్దిచెట్టును ఎక్కి అన్నిదిక్కులనూ పరిశీలించి చూడగా ఉత్తర దిశవైపుగా ఆయనకు ఒక మహాసేన కనిపించింది. చతురంగ బలాలతో గూడిన ఆ సేన, రథాలపై ఎగురుతున్న ధ్వజ పతాకాలను పరిశీలనగా చూసి, అన్నా! భరతుడు తన సేనతో ఇటే వస్తున్నాడు. నీవు ధనుర్బాణాలు ధరించి సిద్ధంగా ఉండు. ఆతడు అయోధ్యలో పట్టాభిషిక్తుడై, రాజ్యాధికారానికి నిన్ను అడ్డుతొలగించు కోవడానికై, నిన్ను చంపడానికే ఇటు వస్తున్నాడు. అన్నయా! ఇప్పటి వరకు ఎన్నో అవమానాలు భరిస్తూ వచ్చాము. నాలో ఉన్న కోపాగ్నిని అదుపు చేసుకొంటూ వస్తున్నాను. ఇంక అతడికి నా చేతిలో చావు తప్పదు. భరతుని చంపుట దోషమని నేననుకోవడం లేదు. అని లక్ష్మణుడు కోపంతో ఊగిపోయాడు. ఈ విధంగా ఆ సమయానికి సీతారామ లక్ష్మణులు అట్లున్నారు.

## ఇరువది తొమ్మిదవ అధ్యాయము

జవాబులు : 1.1. విశ్వకర్మను   2.3. మూడున్న యోజనాలు
3. పొగలు

.............

# అయోధ్యా కాండము

## 97, 98, 99, 100, 101, 102 సర్గలు

## ముప్పదియవ అధ్యాయము

1. ప్రశ్న : భరతుడు ససైన్యంగా వస్తున్నాడు. మనం ఆయుధాలు చేతబట్టి సంసిద్ధులమై ఉండాలి. అని పలికిన లక్ష్మణునితో రాముడు అధర్మంగా ఏ పదవిని నేను ఇష్టపడను అని పలికాడు?

జవాబు : 1. రాజ పదవినైనా   2. ఇంద్ర పదవినైనా
3. దిక్పాలక పదవినైనా   4. బ్రహ్మపదవినైనా

2. ప్రశ్న : చిత్రకూట ప్రాంతానికి వచ్చిన భరతుడు తన సైన్యాలన్నిటినీ

ఒకచోట నిలిపి, తాను పాదచారియై నడచి ముందుకు సాగుతూ, శ్రీరాముని జాడను తెలిసికోవడానికై ఒక చెట్టు ఎక్కి చూశాడు. ఆ చెట్టు పేరేమి?

జవాబు : 1. మద్దిచెట్టు 2. దేవదారు చెట్టు
3. చంద్రగ చెట్టు 4. నార ఏపిచెట్టు

3. పశ్న : పర్ణశాల యందు శ్రీరాముని దర్శించిన భరత శత్రుఘ్నులు ఆయన పాదాలపైబడి నమస్కరించారు. ఆ సమయంలో రాముడు వల్కలాలు ధరించి, ఉత్తరీయంగా దేనిని ధరించి యున్నాడు?

జవాబు : జవాబుల కాలంలో ఉన్నది.

4. ప్రశ్న : శ్రీరామ భరతుల సమాగమం ఏరీతిగా జరిగింది?

జవాబు : నారబట్టగట్టి, జటాదారియై, భూమిపై సాగిలపడి నమస్కరిస్తున్న భరతుని శ్రీరాముడు లేవనెత్తి, కౌగిలించుకొని, ప్రక్కన కూర్చోబెట్టుకొని, నాయనా! భరతా! మన తండ్రిగారెక్కడ? అక్కడ ఆయనకు సేవలు చేస్తూండక నీవు ఇక్కడికెందుకు వచ్చావు? అని శ్రీరాముడు గురువులను, తల్లులను అందరి క్షేమాన్ని అడిగాడు. పిమ్మట ఆయన భరతునికి అనేక రాజ ధర్మాలను గురించి చెప్పాడు. అప్పుడు శ్రీరాముడు పలికిన మాటలు విని, భరతుడు అన్నా! నిన్ను సేవించుటే నాకు పరమ ధర్మం. దానికి దూరమైనప్పుడు నాకు ఇతర రాజధర్మాలతో పని ఏమి? అన్నయా! రాజుకు ఎంత మంది కుమారులున్నను పెద్ద కుమారుడే రాజార్హుడు. ఇదియే ఇప్పటి వరకు మన వంశంలో పరంపరగా వస్తున్న స్థిరమైన ధర్మం. జ్యేష్ఠ పుత్రుడవైన నీవు నాతో అయోధ్యకు వచ్చి పట్టాభిషిక్తుడవు కావాలి. మన తండ్రి దశరథ మహారాజు నేను కేకయ రాజ్యంలో ఉండగా, నీవు అరణ్యాలకు వెళ్ళగానే మరణించాడు. నీవు వనాలకు వెళ్ళడాన్ని తట్టుకోలేక మహారాజు స్వర్గస్తుడయ్యాడు. తండ్రి గారికి నేను, శత్రుఘ్నుడు పితృతర్పణాలు సమర్పించాము. మన తండ్రికి నీవు ప్రాణతుల్యుడవు. నిన్నే తలచుకొంటూ ఆయన ప్రాణాలు వదిలాడు. ఇష్టుడైన కొడుకు తిలాంజలులు సమర్పించినట్లైతే పితృ దేవతలకు అక్షయలోకాలు ప్రాప్తిస్తాయని పెద్దలు చెబుతారు. అని శ్రీరామ భరతులు తమ తండ్రి మరణ వార్తను గురించి చెప్పుకొన్నారు.

5. ప్రశ్న : తన తండ్రికి శ్రీరాముడు ఏ రీతిగా పిండోదకాలు సమర్పించాడు?

జవాబు : భరతుడు తెలిపిన దుఃఖకరమైన తన తండ్రి మరణ వార్తనువిని, శ్రీరాముడు నిశ్చేష్టుడయ్యాడు. హృదయ విదారకమైన ఆ వార్త వినగానే రాముడు శోకంతో వశంతప్పి నేలపై పడిపోయాడు. అప్పుడు సీతాదేవి, లక్ష్మణుడును, భరత శత్రుఘ్నులును సైత్యోపచారాలు చేశారు. ఆయన క్రమంగా స్పృహలోకి వచ్చి, కన్నీరు పెట్టుచూ, ధీనంగా విలపించ సాగాడు. శ్రీరాముడు సీతా నిన్నెంతో వాత్సల్యంతో ఆదరించే నీ మామగారు దివికేగినారు. లక్ష్మణా! మనం తండ్రి లేని వారమయ్యాము. అని రాముడు చెబుతుండగా ఆ నలుగురూ అన్నదమ్ములూ సంతత ధారగా కన్నీరు కార్చారు. అంతట భరతుడు అన్నా! మన తండ్రి గారికి జలతర్పణాలు ఆచరించు అన్నాడు. పిమ్మట శ్రీరాముడు ఏడుస్తున్న జానకిని ఓదార్చి, లక్ష్మణా! గారచెట్టు విత్తనాల తెలగపిండిని తీసికొని వస్త్రాన్ని, ఉత్తరీయాన్ని తీసికొనిరా! మనం మన తండ్రిగారికి తర్పణాలు వదలడానికి వెళ్దాం. అని సీతాదేవిని తీసికొని లక్ష్మణుడు, సుమంత్రుడు అనుసరిస్తుండగా, మందాకినీ నదికి వెళ్ళి, పవిత్ర జలాలలో స్నానాధికములు పూర్తి చేసుకొని, రామలక్ష్మణులు తండ్రీ! ఈ జలాలు నీకు తృప్తిని కలిగించును గాక! అని తర్పణాలు విడిచారు. పిమ్మట శ్రీరాముడు తండ్రికి తిలతర్పణ పూర్వకంగా పిండ ప్రధానం చేశాడు. అనంతరం శ్రీరాముడు పర్ణశాలకు వచ్చాడు. పర్ణశాలా ప్రాంతం నుండి రోధన ధ్వనులువిని సైనికులు భరతుడు శ్రీరాముడిని కలిసికొన్నాడని గ్రహించి, వారంతా ఆ ధ్వనులు వినిపించిన దిశగా వచ్చి శ్రీరాముడిని దర్శించు కొన్నారు. తన వద్దకు వచ్చిన వారందరికి శ్రీరాముడు స్వాగత మర్యాదలు చేశాడు.

## ముప్పదియవ అధ్యాయము

జవాబులు : 1.2. ఇంద్ర పదవినైనా 2.1. మద్ధిచెట్టు
3. జింక చర్మాన్ని

# అయోధ్యా కాండము

## 103, 104, 105, 106, 107, 108 సర్గలు

## ముప్పది ఒకటవ అధ్యాయము

1. పశ్న : వసిష్ఠ మహర్షితో కలిసి పర్ణశాలకు వచ్చి, పిమ్మట మందాకినీ నదీ ప్రాంతంలో, శ్రీరాముడు పితృకార్యానికై ఉంచిన గారపిండి ముద్దలను చూసి అమితంగా దుఃఖించింది ఎవరు?

జవాబు : 1. జాబాలి 2. గుహుడు
3. భరతుడు 4. కౌసల్యాదేవి

2. ప్రశ్న : భరతుడు తన అన్నగారైన శ్రీరాముడిని అయోధ్యకు వచ్చి రాజ్యాన్ని స్వీకరించమని ప్రార్థించగా, రాముడు భరతునితో పితృవాక్య పాలనం మన ధర్మం. మన తండ్రి నాకు ఎవరితో సమానుడు అని చెప్పాడు?

జవాబు : 1. ఇంద్రునితో 2. కుబేరునితో
3. బ్రహ్మదేవునితో 4. ఈశ్వరునితో

3. ప్రశ్న : భరతుడు ఎంత ప్రాధేయపడినా కూడా, రాముడు తాను పితృ వాక్యపాలనకే కట్టుబడతానని తెలుపుతూ, పూర్వకాలంలో గయాక్షేత్రంలో పితృదేవతల నుద్దేశించి యజ్ఞంచేస్తూ, తల్లి దండ్రులను పున్నామనరకం నుండి ఉద్ధరించిన వాడే కొడుకు అని పలికిన రాజు ఎవరుగా రాముడు భరతునితో చెప్పాడు?

జవాబు : జవాబుల కాలంలో ఉన్నది.

4. ప్రశ్న : తండ్రిని సత్యసంధునిగా చేయడమే మన కర్తవ్యమని ఏఏ నిరూపణలతో రాముడు భరతునికి తెలిపాడు?

జవాబు : భరతుడు ప్రార్ధనా పూర్వకంగా శ్రీరాముడిని అయోధ్యకు వచ్చి పట్టాభిషిక్తుడవు కమ్మని అభ్యర్ధించాడు. అంతట శ్రీరాముడు సోదరా! భరతా! రాజ శిరోమణియైన దశరథుని వలన కైకేయిదేవికి

నీవు కలిగావు. నీవు పలికిన మాటలన్నీ నీ స్థాయికి తగినట్లుగానే ఉన్నాయి. తమ్ముడూ! పూర్వం మన తండ్రి మీ తల్లిని వివాహం చేసుకొనే సందర్భంలో కైకేయీదేవికి కలిగిన పుత్రునకే రాజ్యాధికారం ఇస్తానని మీ తాత గారికి మాట ఇచ్చి ఉన్నాడు. అనంతరం దేవాసుర యుద్ధంలో మీ తల్లి చేసిన సేవలకు మహారాజు సంతోషించి, ఆమెకు రెండు వరాలను ఇస్తాను అని వాగ్దానం చేశాడు. ఆ ప్రకారంగా మీ తల్లి మహారాజు చేత ఒట్టు పెట్టించుకొని, నిన్ను రాజ్యాభిషిక్తునిగా చేయడం, నన్ను వన వాసానికి పంపించడం, అనే రెండు వరాలను కోరింది. అందుకు మహారాజు సమ్మతించాడు. ఇందులో మీ తల్లి తప్పేముంది? మహారాజు నన్ను ఆజ్ఞాపించాడు. నేను సీతా లక్ష్మణ సహితుడనై వనవాసానికి వచ్చాను. నీవును తండ్రి మాట శిరసావహించి, వెంటనే రాజ్యాభిషిక్తుడవు కావాలి. నా మాటను పాటించి, కైకేయీదేవి ఋణాన్నుండి మహారాజుకు విముక్తి కలిగించు. ఆయనకు నరకప్రాప్తిని కలుగకుండా చెయ్యి. అని శ్రీరాముడు అనేకరీతుల భరతునికి రాజ్యభారాన్ని వహించడమే యుక్తమని ప్రభోదించాడు.

5. ప్రశ్న : దశరథ మంత్రులలో ఒకరైన జాబాలి శ్రీరాముడిని ఒప్పించడానికై ఏ విధమైన వాదన వినిపించాడు?

జవాబు : ధర్మజ్ఞుడైన శ్రీరాముడు ఈ విధంగా భరతుని ఓదార్చు తూండగా, దశరథ మంత్రివర్గంలో ఒకరైన జాబాలి ముందుకు వచ్చి, ఓ రఘురామా! నీవు చెప్పిన విషయాలు బాగానే ఉన్నాయి. కాని నీవు ప్రజ్ఞాశాలివి, మనోబలం కలవాడవు. అజ్ఞానివలె, ఇటువంటి నిరర్థకమైన ఆలోచనలు నీ మనసుకు రానీయకూడదు. ఈ లోకంలో ఎవరు ఎవరికి బంధువు? మనుషులకుగల బంధాలన్నీ క్షణికాలే. కనుక మంచివారు ఆ అనుబంధాలపై ఆసక్తి పెంచుకొనరాదు. కనుక ఓ నరశ్రేష్టా! ఈ వనవాస జీవితం చాలా కష్టతరమైనది. కనుక నీవంటి వాడు తండ్రి నుండి వచ్చిన సంపదను వదలి, ఇటువంటి కష్టతరమైన మార్గాన్ని ఎంచుకోవడం తగదు. ఓ

బుద్ధిశాలీ! తండ్రి మాట జవదాటరానిది. అని నీవను కోకుండా, ప్రత్యక్షంగా ఉన్న రాజ్యలాభాన్ని అనుభవించు. మన ఎదురుగా కనిపించని పారలౌకిక లాభాన్ని నమ్మవద్దు. ఓ రామా! ఇహలోక సుఖాలే వాస్తవాలు. పరలోకమనేది లేనేలేదు. అని తెలిపే వారి ప్రమాణాన్ని అనుసరించు. భరతుడు ప్రాధేయ పడుతున్నట్లుగా ఈ కోసల రాజ్యాన్ని స్వీకరించు. అని జాబాలి నాస్తిక వాదాన్ని శ్రీరామునికి వినిపించాడు.

## ముప్పది ఒకటవ అధ్యాయము

జవాబులు : 1.4. కౌసల్యాదేవి 2.1. ఇంద్రునితో 3. గయుడు

...........

# అయోధ్యా కాండము

## 109, 110, 111, 112, 113, 114 సర్గలు

## ముప్పది రెండవ అధ్యాయము

1. పశ్న : జాబాలి యొక్క నాస్తికవాదాన్ని ఖండిస్తూ, శ్రీరాముడు సత్యము యొక్క వైశిష్ట్యాన్ని తెలిపి, జాబాలిని నాస్తికవాది అని అంటుండగా, ఆయన నాస్తికవాది కాదు. నిన్ను అయోధ్యకు తరలించుకొని వెళ్ళడానికే ఇట్లు మాట్లాడినాడే కాని వేరుకాదు. అని శ్రీరాముని సమాధాన పరచినది ఎవరు?

జవాబు : 1. వసిష్టుడు 2. కౌసల్యాదేవి 3. భరద్వాజ మహర్షి 4. గుహుడు

2. ప్రశ్న : వసిష్ట మహర్షి కూడా శ్రీరాముడిని అయోధ్యకు వచ్చి రాజ్యాన్ని స్వీకరించమని చెప్పాడు. కాని రాముడు అందుకు అంగీకరించ నందువల్ల భరతుడు తాను రాముని ఎదుట దర్భలను పరచుకొని, వాటిపై కూర్చుని నిరాహారదీక్ష చేస్తాను. అని దర్భలను ఎవరిని తెమ్మని చెప్పాడు?

జవాబు : 1. శత్రుఘ్ననితో 2. జాబాలితో
3. లక్ష్మణునితో 4. సుమంత్రునితో

3. ప్రశ్న : భరతుని కోరికపై రాముడు తన పాదుకలను ఇచ్చాడు. అంతట భరతుడు అన్నయా నీవు పదునాలుగు సంవత్సరాలు వనవాసం ముగించుకొని వచ్చి రాజ్యభారాన్ని స్వీకరించే వరకు నేను ఈ పాదుకల చేత రాజ్యాన్ని పాలింప జేస్తాను అని, ఆ పాదుకలకు నమస్కరించి, వాటిని స్వీకరించి, ఒక ఏనుగు అంబారీపై ఉంచి తీసికొని వెళ్ళాడు. ఆ ఏనుగు పేరేమి?

జవాబు : జవాబుల కాలంలో ఉన్నది.

4. ప్రశ్న : అయోధ్యా నగరానికి భరతుడు ఏ విధంగా తిరిగి వెళ్ళాడు?

జవాబు : ఏనుగు అంబారీలో ఉన్న పాదుకలను భరతుడు తీసికొని తన శిరసుపై ఉంచుకొని, శత్రుఘ్నుడిని, తల్లులను, గురువులను మంత్రులను, పౌరులను, సేననంతటినీ వెంట బెట్టుకొని, శ్రీరాముని వద్ద సెలవుతీసికొని అయోధ్యకు బయలుదేరాడు. చిత్రకూటానికి దగ్గరలో ఉన్న భరద్వాజ మహర్షి ఆశ్రమానికి చేరి మహర్షి పాదాలకు నమస్కరించి, చిత్రకూట ప్రాంతంలో శ్రీరాముని సన్నిధిలో జరిగిన విషయాలన్నింటిని మహర్షికి విన్నవించి, ఆయన వద్దసెలవు తీసికొని అయోధ్యాభి ముఖంగా బయలు దేరాడు. చతురంగ బలాలతో గూడిన ఆ మహా సైన్యం, పల్లకీలు, బండ్లు మొదలైన వాహనాలతో గూడి భరతుడిని అనుసరిస్తూ, వారంతా కొంత దూరం ప్రయాణించి యమునా నదినిదాటి, అనంతరం వారు పావన గంగానదిని దర్శించారు. అచటి గుహుని సహకారంతో గంగానదిని దాటి శృంగభేరిపురాన్ని చేరారు. అక్కడ గుహునికి వీడ్కోలు పలికి, శృంగభేరిపురం నుండి బయలుదేరి కొంతదూరం ప్రయాణించి అయోధ్యను చూశాడు. తండ్రి, సోదరులు లేని ఆ నగరాన్ని జూసిన భరతుడు సారథి సుమంత్రునితో సుమంత్రా! ఈ అయోధ్య పాడుబడి కళదప్పి ఉన్నది. ఇచట ప్రజలలో ఆనందమే లేదు. అని భరతుడు అయోధ్యలో ప్రవేశించాడు.

5. ప్రశ్న : అయోధ్యానగర దుస్థితిని జూచిన భరతుడు ఏ విధంగా బాధపడ్డాడు?

జవాబు : భరతుడు అయోధ్యానగరం ప్రవేశించు సమయానికి నగరం శోభాహీనంగా ఉన్నది. దశరథ మహారాజును మృత్యువు కబళించడము, శ్రీరాముడు అడవులపాలు కావటంవలన అయోధ్య దుఃఖంతో, ధీనమై, నిస్తేజమై కళావిహీనంగా ఉన్నది. మేఘాలు, చంద్రుని, నక్షత్రాలను కప్పివేయగా, తేజోహీనంగా ఉన్న ఆకాశంవలె అయోధ్య వెలవెల బోయింది. కైకేయి వరాల ధాటికి అయోధ్య చిన్నాభిన్నమైంది. రథంలో కూర్చొని రాజవీధులలో వెళ్తున్న భరతుడు సుమంత్రునితో, ఇదివరలో అయోధ్యానగర వీధులలో వెళ్తుంటే వీణా, వేణు, మృదంగ తాళాల ధ్వనులు వినబడుతుండేది. చందన, అగరు, కస్తూరి, పూల పరిమళాలతో మధురాయమానంగా ఉండేది. ఇప్పుడవేవీ లేవు. వీధులలో పల్లకీలు మోసేవారి ఘోషలు, గుర్రాల సకిలింతలు, ఏనుగుల ఘీంకారాలు, రథచక్రాల సవ్వడులు వినిపిస్తూండేవి, కాని ఇప్పుడవేవీ లేవు. ఈ అయోధ్య శోభా వైభవాలన్నీ మా అన్న రామునితో గూడి వనాలకు వెళ్ళాయి. శ్రీరాముడు వనాలనుండి తిరిగివచ్చే రోజుకోసం ఎదురు చూడడం తప్ప మనం చేయగలిగిందేది లేదు. అని భరతుడు అనేక విధాలుగా మాట్లడుతూ రాజభవనంలో ప్రవేశించాడు. అంతఃపురం బోసిపోయి ఉండగా చూసిన భరతుడు కన్నీరు కార్చాడు.

## ముప్పది రెండవ అధ్యాయము

జవాబులు : 1.1. వసిష్టుడు  2.4. సుమంత్రునితో
3. శత్రుంజయము

# అయోధ్యా కాండము

## 115, 116, 117, 118, 119 సర్గలు

## ముప్పది మూడవ అధ్యాయము

1. ప్రశ్న : తన తల్లులందరినీ అంతఃపురాలలో నిలిపి, భరతుడు శోక సంతప్తుడై గురువులైన వసిష్టుల వారితో, గురుదేవా! శ్రీరాముడు లేని అయోధ్యలో నేనుండ లేను. కనుక ఇక్కడికి దగ్గరలో ఉన్న ఒక గ్రామానికి వెళ్ళి ఈ పద్నాలుగు సంవత్సరాలు అక్కడ ఉంటాను అని చెప్పాడు. ఆ గ్రామం పేరేది?

జవాబు : 1. శృంగబేరిపురం  2. నంది గ్రామం
3. వైశాలి  4. కరూశ

2. ప్రశ్న : చిత్రకూట ప్రాంతంలో కొంత కాలము రాముడు నివశించాడు. ఆ రోజులలో ఒకనాడు ఆ పరిసరాలలో ఉన్న ఆశ్రమవాసులు, ఆ ప్రాంతాన్ని విడిచివెళ్ళాలని ఆలోచిస్తున్నట్లుగా శ్రీరాముడు గ్రహించి, వారిలో ఒక మహర్షిని కారణం అడిగాడు. అందుకాయన ఈ పరిసరాలలో రాక్షసుల బాధ ఎక్కువైంది. వారిలో ఒకడు చాలా బలవంతుడు, రామా! నీవుకూడా మాతోవచ్చి, దూరంగా వెళ్ళి ఆశ్రమాలను నిర్మించు కొందాము అని చెప్పాడు. ఆ బలవంతుడైన రాక్షసుని పేరేమి ?

జవాబు : 1. మారీచుడు  2. రావణుడు
3. సుబాహుడు  4. ఖరుడు

3. ప్రశ్న : ఋషులందరూ ఆ ఆశ్రమ ప్రదేశాలను విడిచి వెళ్ళిన పిమ్మట, శ్రీరాముడు పరిపరివిధాల ఆలోచించి, భరతుడు, కౌసల్యాదిగా గల తన వారందరూ తనను ఇచటనే కలిసికొన్నారు. వారి జ్ఞాపకాలు తనను వెంటాడుతూనే ఉన్నాయని, ఆ ప్రదేశాన్ని విడిచి వెళ్ళాలని ఆలోచించి, కొంత దూరం ప్రయాణించి, ఒక మహర్షి ఆశ్రమం చేరాడు. ఆ ఆశ్రమం ఎవరిది ?

జవాబు : జవాబుల కాలంలో ఉన్నది.

4. ప్రశ్న : సీతాదేవి తన కల్యాణ గాథను ఎవరికి ఏ రీతిగా వినిపించింది?

జవాబు : చిత్రకూట పర్వతప్రాంతం నుండి శ్రీరాముడు సీతా లక్ష్మణులతో గూడి అత్రిమహర్షి ఆశ్రమం చేరాడు. మహర్షికి నమస్కరించి, తానెవరో చెప్పుకొన్న పిమ్మట ఆ మహర్షి శ్రీరాముడిని తన కుమారుని వలె ఆదరించాడు. పిమ్మట సీతాదేవిని అత్రిమహర్షి తన భార్యయైన అనసూయాదేవికి పరిచయం చేశాడు. అనసూయాదేవి సీతాదేవిని ఎంతో ఆదరించి గౌరవించింది. మాటల సందర్భములో సీతాదేవికి అనసూయాదేవి అనేక పతివ్రతా ధర్మాలను చెప్పింది. ఆ క్రమంలో అనసూయాదేవి కోరికపై సీతాదేవి తన కల్యాణ గాథను వినిపిస్తూ, తల్లీ! మిథిలా నగరాధిపతియైన జనక మహారాజు నా తండ్రి. ఆయన సంతానార్థమై ఒక యజ్ఞము చేయడానికై భూమిని దున్నుతుండగా, నాగటి చాలులో, ఒక మంజూషలో భూమిని చీల్చుకొని నేను బయటకు వచ్చానట. ఆ స్థితిలోనున్న నన్ను ఆ జనక భూపతి చేతులలోకి తీసుకొని, ఈమె నా కుమార్తె అని, తన నిండు వాత్సల్యాన్ని కురిపిస్తూ నన్ను పెంచి పెద్దచేశాడు. నాకు యుక్తవయసు రాగానే, మా తండ్రిగారి పూర్వులైన దేవరాతుని కాలం నుండి ఉన్న శివ ధనస్సును ఎక్కుపెట్టిన వానికి నా కుమార్తెను ఇచ్చి వివాహం జరిపిస్తాను అని స్వయంవరం చాటాడు. దేశదేశాల రాజకుమారులు వచ్చి ఎక్కుపెట్టలేక వెనుదిరిగి పోయారు. పిమ్మట విశ్వామిత్ర మహర్షితో కలిసి వచ్చిన రామ లక్ష్మణులలో పెద్దవాడైన రాముడు ఆ శివధనస్సును ఎక్కుపెట్టి నన్ను వరించాడు. పిమ్మట మా మామగారైన దశరథ మహారాజును మా తండ్రి గారు పిలిపించి, శ్రీరాముడితో నా వివాహాన్ని అంగరంగ వైభవంగా జరిపించాడు. అని తన కల్యాణ గాథను సీతాదేవి అనసూయాదేవికి వినిపించింది.

5. ప్రశ్న : శ్రీరాముడు అత్రి మహర్షి ఆశ్రమాన్ని ఏ విధంగావీడి, దండకారణ్య ప్రవేశం చేశాడు?

జవాబు : సీతాదేవి తెలిపిన తన వివాహగాథను విని అనసూయాదేవి ఆనందించి, ఓ సీతా! నేను నీకు ఇచ్చిన ఈ దివ్యమైన వస్త్రాలు, ఆభరణాలు, మొదలైన వాటిని ఇప్పుడే అలంకరించుకో, ఆ విధంగా అలంకరించుకున్న నిన్నుజూసి నేను సంతోషించాలి అని పలుకగా, సీతాదేవి ఆ వస్త్రాభరణాలను, పూలదండలను ధరించి అనసూయా దేవికి నమస్కరించింది. పిమ్మట శ్రీరాముని సమ్ముఖానికి వెళ్ళిన సీతాదేవిని జూసిన రాముడు అనసూయాదేవి ప్రేమతో ఇచ్చిన కానుకలను జూసి ఎంతో సంతోషించాడు. మనుజులెవ్వరికీ జరగని సత్కారాన్ని సీతాదేవి పొందింది. అని రామ లక్ష్మణులు సంతోషించారు. అనంతరమా సీతారామ లక్ష్మణులు ఆ తాపసులు సమర్పించిన అతిథి సత్కారాలను స్వీకరించి సంతోషించి, ఆ రాత్రి అక్కడే గడిపారు. ఉదయన్నేలేచి ఆ తాపసులవద్ద సెలవు తీసికొని, దండకారణ్యానికి మార్గాన్ని అడుగగా, వారు తెలిపిన మార్గాన్నే ప్రయాణించి, శత్రుదమనుడైన శ్రీరాముడు సీతా లక్ష్మణులతో గూడి, మేఘ మండలంలో సూర్యునివలె ఆ దట్టమైన దండకారణ్య వనంలో ప్రవేశించాడు.

## ముప్పది మూడవ అధ్యాయము

జవాబులు : 1.2. నందిగ్రామం 2.4. ఖరుడు

3. అత్రిమహర్షి ఆశ్రమం

## - అయోధ్యా కాండము సమాప్తము -

# 3. అరణ్య కాండము

## 1, 2, 3, 4, 5, 6 సర్గలు

## ముప్పది నాలుగవ అధ్యాయము

1. ప్రశ్న : శ్రీరాముడు సామాన్యులు అడుగు పెట్టడానికి అసాధ్యమైన దండ కారణ్యంలో ప్రవేశించాడు. అచట ఆయనకు అనేక తాపసాశ్రమాలు కనిపించాయి. అచట యజ్ఞ కార్యకలపాలు జరుగునప్పుడు చేసే వేదఘోష ఆ ప్రదేశమంతా మారుమ్రోగుతుంది. అందువలన అది ఏ లోకంతో సమానంగా ఉన్నది.

జవాబు : 1. ఇంద్రలోకం 2. బ్రహ్మలోకం
3. వైకుంఠం 4. కైలాసం

2. ప్రశ్న : సీతారామ లక్ష్మణులు మునీశ్వరుల అతిధి సత్కారాలను అందుకొని ఆ రాత్రికి తాపసాశ్రమంలో గడిపి సూర్యోదయ సమయాన వారందరివద్ద సెలవుతీసికొని ముందుకు నడిచారు. కొంత దూరం వెళ్ళినపిమ్మట వారికి ఒక రాక్షసుడు కనిపించాడు. వాడి పేరేమి?

జవాబు : 1. కబంధుడు 2. మారీచుడు
3. విరాదుడు 4. దూషణుడు

3. ప్రశ్న : రామలక్ష్మణుల చేతిలో చావు దెబ్బలుతిన్న విరాదుడు, తాను పూర్వజన్మలో ఒక గంధర్వుడను. మీ చేత వధింపబడడం వల్ల నాకు శాపవిముక్తి కలిగింది. అని తెలిపిన విరాధుడు పూర్వజన్మలో ఏ పేరును కలిగి ఉండేవాడు?

జవాబు : జవాబుల కాలంలో ఉన్నది.

4. ప్రశ్న : శ్రీరాముడు సీతా లక్ష్మణులతోగూడి శరభంగాశ్రమానికి వచ్చిన పిమ్మట అక్కడేమి జరిగింది?

జవాబు : అత్రి మహర్షి ఆశ్రమాన్నుండి బయలుదేరిన శ్రీరాముడు వడివడిగా నడిచి సాయం సమయానికి శరభంగ మహర్షి ఆశ్రమ ప్రాంతానికి

చేరుకొన్నారు. ఆశ్రమం వెలుపల నుండియే శ్రీరాముడు శరభంగ మహర్షి ప్రక్కన ఒక అద్భుత పురుషుని చూశాడు. శ్రీరాముడు ఆ దివ్యపురుషుడు ఇంద్రుడేనని గ్రహించాడు. పిమ్మట రాముడు లక్ష్మణునితో తమ్ముడూ! నీవు మీ వదిన ఇచట ఉండండి, నేను లోపలకి వెళ్ళి ఆ దివ్య పురుషుడెవరో తెలిసికొని వస్తాను అని పలికి తాను, ఆశ్రమంలోనికి ప్రవేశించాడు. అది చూసి ఇంద్రుడు శరభంగ మహర్షితో మహర్షీ! శ్రీరాముడిటే వస్తున్నాడు. ఇప్పుడు నేనాయన కంట బడరాదు. దానికింకా కొంత సమయముంది. అని ఇంద్రుడు వెళ్ళిపోయాడు. అంతట శ్రీరాముడు సీతా లక్ష్మణులతో కలిసి శరభంగ మహర్షిని దర్శించాడు. మహర్షి వారిని సాదరంగా ఆహ్వానించి, అతిధి పూజచేశాడు. అంతటా శరభంగమహర్షి శ్రీరాముని ఈ రోజు తన ఆశ్రమము నందే నివశించమని చెప్పాడు. అప్పుడు రాముడు మహర్షీ! ఈ వనమందు మేము నివసించడానికై అనువైన ప్రదేశాన్ని తెలుపు మనగా మహర్షి! ఓ రామా! మహా తేజస్వియైన సుతీక్ష్ణ మహర్షి, ఇక్కడకు చేరువనే ఉన్నాడు. మీరాయనను కలిసి, ఆయన సూచన మేరకు మీ నివాస మేర్పరచుకో వచ్చు, అని తెలిపిన మహర్షి ఓ రామా! నీ విచటికి వస్తావని నాకు ముందే తెలుసు. నీ దర్శనం తరువాత ఈ శరీరాన్ని వదలివేద్దామని ఎదురు చూస్తున్నాను. ఇప్పుడు నిన్ను దర్శించి ధన్యుడనైనాను. అని ఆ మహర్షి అగ్నిని ప్రతిష్టించి, బ్రహ్మ వేదమంత్రాలను పఠిస్తూ అగ్నిలో ప్రవేశించాడు. ఆయన శరీరాన్ని అగ్ని దహించి వేసింది. ఆ విధమైన దృశ్యాన్ని రాముడు చూశాడు.

5. ప్రశ్న : శరభంగాశ్రమాన్నుండి రాముడు ఎక్కడికి, ఏరీతిగా వెళ్ళాడు?

జవాబు : శరభంగ మహర్షి దివంగతుడైన పిమ్మట ఆశ్రమంలో ఉన్న మునీశ్వరులంతా శ్రీరాముని కడకువచ్చి, ఓ శ్రీరామా! మేము ఆర్తులమై నిన్ను అర్థిస్తున్నాము. ఈ ప్రాంతంలోని క్రూర రాక్షసుల బాధలను మేము పడలేకుండా ఉన్నాము. నిన్ను శరణు వేడుకొంటున్నాము. ఆ రాక్షసుల బారినుండి మమ్ములను కాపాడు.

అని పలికిన వారితో రాముడు ఓ మహాత్ములారా! నేను వనవాసం కొరకే ఈ వనాన్ని ప్రవేశించాను. కాని రాక్షసులు మీకు చేసే అపకారాలను రూపుమాపుట కొరకే కాబోలు, పితృవాక్య పరిపాలనా నెపంతో ఈ వనాన్ని ప్రవేశించాను. ఈ వనానికి నారాక మీకార్య సిద్ధికి తోడ్పడడం దైవికం. అందువలన నా యీ వనవాసం మహా ఫలప్రదం అవుతుంది. తాపసుల శత్రువులైన రాక్షసులను పరిమార్చుడమే మా కర్తవ్యంగా భావిస్తాము. ఇక మీదట మా అన్నదమ్ముల పరాక్రమాన్ని మీరు చూస్తారు. అని శ్రీరాముడు ఆ తాపసులకు అభయమిచ్చి, సీతా లక్ష్మణ సమేతుడై, సుతీక్ష్ణ మహర్షి ఆశ్రమం కడకు బయలుదేరాడు.

## ముప్పది నాలుగవ అధ్యాయము

1.2. బ్రహ్మలోకం    2.3. విరాధుడు

3. తుంబురుడు

..................

# అరణ్య కాండము

## 7, 8, 9, 10, 11 సర్గలు

## ముప్పది ఐదవ అధ్యాయము

1. ప్రశ్న : సుతీక్ష్ణ మహర్షి ఆశ్రమానికి వచ్చిన శ్రీరాముడు మహర్షి ఇచ్చిన అతిథి మర్యాదలను స్వీకరించి, ఆ మహర్షిని తాము నివసించడానికి యోగ్యమైన ప్రదేశాన్ని తెలుపుమనగా సుతీక్ష్ణ మహర్షి ఏమని తెలిపాడు ?

జవాబు : 1. అత్రి ఆశ్రమానికి వెళ్ళమన్నాడు

2. తన ఆశ్రమంలోనే ఉండమన్నాడు.

3. శరభంగాశ్రమానికి వెళ్ళమన్నాడు

4. చిత్రకూటానికి వెళ్ళమన్నాడు

2. ప్రశ్న : సుతీక్ష్ణ మహర్షి ఆశ్రమాన్ని విడిచి, దండకారణ్యంలో ప్రయాణిస్తున్న రాముడికి తనకు తెలిసిన కొన్ని హితవచనాలు తెలిపింది ఎవరు?

జవాబు : 1. సీతాదేవి 2. లక్ష్మణుడు
3. మునులు 4. జటాయువు

3. ప్రశ్న : రమ్యమైన తపోవన భూములలో నడుచుకొంటూ వెళ్తున్న రాముడు సీతాదేవితో నా బొందిలో ప్రాణముండగా దేనిని విడువను అని పలికాడు?

జవాబు : జవాబుల కాలంలో ఉన్నది.

4. ప్రశ్న : సుతీక్ష్ణ మహర్షి ఆశ్రమం నుండి బయలుదేరిన సీతా రాములు ఏఏ ఆశ్రమాలను దర్శించారు?

జవాబు : దండకారణ్య ప్రయాణంలో శ్రీరాముడు తనను అనుసరిస్తున్న వారందరితో గూడి, దారివెంట పర్వత సానువులను, నదులను ఆ వనశోభను దర్శిస్తూ ముందుకు నడిచారు. కొంత దూరం ప్రయాణించిన వారికి ఒక మనోహరమైన చెరువు కనిపించింది. ఆ ప్రదేశమెంతో రమణీయంగా తోచిన రాముడు, అచట శ్రావ్యమైన సంగీతం విన్నాడు. ఇచట జనసంచారం కనిపించడం లేదు. ఈ వాద్యగోష్టికి కారణమేమి? అని తనవెంట వస్తున్న ధర్మభృతుడనే మహర్షిని అడిగాడు. అప్పుడా మహర్షి! ఓ రామా! ఈ సరస్సును 'మాడకర్ణి' అనే మహర్షి తన తపఃప్రభావంతో నిర్మించాడు. తీవ్రమైన ఆ తపః ప్రభావాన్ని భంగం చేయడానికై దేవతలు ప్రయోగించిన అప్సరసల అందాలకు వసుడైన మహర్షి తన తపోమహిమచే ఈ సరస్సులోపల ఒక గృహాన్ని ఏర్పాటు చేసుకొని అందు నివశిస్తున్నాడు. వారి ఆటపాటలే ఇప్పుడు మనం వింటున్న ఈ ధ్వనులు అని చెప్పాడు. ఆ మహర్షి చెప్పిన మాటలు వింటూ రాముడు అచట ఉన్న ఆశ్రమ ప్రదేశాన్ని కలియజూసి, ఈ ప్రదేశం మన నివాసానికి యోగ్యంగా ఉన్నది. అని ఆలోచించి, ఆ ఆశ్రమంలో సీతా లక్ష్మణులుతో గూడి, ఆ మునుల పూజలందు కొంటూ అచట సుఖంగా కొంత కాలమున్నాడు. ఆ విధంగా శ్రీరాముడు వేర్వేరు ముని ఆశ్రమాలలో హాయిగా నివసిస్తూ పది సంవత్సరాలు గడిపాడు. ఆరోజులలో ఒకనాడు శ్రీరాముడు తన

వారందరితోగూడి మరలా సుతీక్ష్ణ మహర్షి ఆశ్రమానికి వచ్చాడు. ఆ మహర్షిని దర్శించి ఆయన ఆతిథ్యాన్ని స్వీకరించి, ఆ మహర్షి ద్వారా అగస్త్య మహర్షి ఆశ్రమ మార్గాన్ని తెలిసికొని త్రోవలో అగస్త్యుని తమ్ముడైన సుదర్శన మహర్షి ఆశ్రమాన్ని దర్శించి, ఆ మహర్షి చూపిన మార్గాన బయలుదేరి అగస్త్యమహర్షి ఆశ్రమం చేరుకున్నారు.

5. ప్రశ్న : శ్రీరాముడు తన తమ్ముడు లక్ష్మణునితో వాతాపి, ఇల్వలుల కథను ఏవిధంగా తెలిపాడు?

జవాబు : శ్రీరాముడు తనవారందరితో సుదర్శన మహర్షి ఆశ్రమానికి వెళ్తూ, త్రోవలో తన తమ్ముడితో లక్ష్మణా! ఒకా నొకప్పుడు ఈ ప్రాంతాన్ని వాతాపి, ఇల్వలుడు అను సోదరులు తాపసులను తమ మాయా విద్యలచేత హతమారుస్తూండే వారు. వాతాపి మేకయై దానిని చంపి, శ్రాద్ధానికి తగినట్లుగా పక్వంచేసి, ఇల్వలుడు బ్రాహ్మణ వేషం ధరించి, శ్రాద్ధం పేరుతో బ్రహ్మణులను ఆహ్వానించి, వారికి ఆ వాతాపి మేక మాంసాన్ని వడ్డించేవాడు. ఆ తాపసులు భోజనం ముగించిన పిమ్మట ఇల్వలుడు ఓ వాతాపి బయటకు రా! అని పిలిచేవాడు. వాతాపి ఆ తాపసుల పొట్ట చీల్చుకొని బయటకు వచ్చి, ఈ చనిపోయిన బ్రాహ్మణుల మాంసాన్ని ఇద్దరూ భుజించేవారు. ఈ విషయం తెలిసికొన్న అగస్త్యుడు ఒక రోజు అదే విధంగా వాతాపి ఇంటికి శ్రాద్ధ భోజనానికై వెళ్ళాడు. భోజనానంతరం ఇల్వలుడు ఓ వాతాపి బయటకురా! అన్నాడు. అప్పుడు అగస్త్యుడు ఇంకెక్కడి వాతాపి అతడెప్పుడో జీర్ణమై యమ లోకానికి చేరాడు. అన్నాడు. అంతట ఇల్వలుడు ఆగ్రహోదగ్రుడై అగస్త్యునిపైకి వచ్చాడు. అగస్త్యుడు కోపంతో హూంకరించి కాల్చి భూడిదచేశాడు. ఆ విధంగా వాతాపి, ఇల్వలుల బాధ నుండి తాపసులను అగస్త్య మహర్షి రక్షించాడు. అని అగస్త్యుని గురించి చెప్పుకొంటూ రామలక్ష్మణులు ప్రయాణం సాగిస్తున్నారు.

## ముప్పది ఐదవ అధ్యాయము

జవాబులు : 1.2. తన ఆశ్రమంలోనే ఉండమన్నాడు. 2.1. సీతాదేవి
3. నేను చేసిన ప్రతిజ్ఞను

# అరణ్య కాండము

## 12, 13, 14, 15, 16, 17 సర్గలు

## ముప్పది ఆరవ అధ్యాయము

1. ప్రశ్న : శ్రీరాముడు అగస్త్యాశ్రమానికి వచ్చి, తాము వచ్చిన వార్తను అగస్త్య మహర్షికి ఎవరి ద్వారా తెలియపరచాడు?

జవాబు : 1. తనతో వచ్చిన ధర్మభృతుడుని 2. సీతాదేవిని
3. ఆ ఆశ్రమవాసిని 4. లక్ష్మణుడుని

2. ప్రశ్న : శ్రీరాముడు కోరినప్రకారం వారు నివశించడానికి యోగ్యమైన ప్రదేశాన్ని అగస్త్యుడు తెలిపిన ప్రదేశం పేరేమి?

జవాబు : 1. పంచవటి 2. చిత్రకూటం
3. బదరికావనం 4. సిద్ధాశ్రమం

3. ప్రశ్న : అగస్త్యుడు తెలిపిన ప్రకారం, తమకు నివాసాన్ని ఏర్పరచు కోవడానికై, రామాదులు నిర్దేశించుకొన్న మార్గాన పయనిస్తుండగా, మార్గ మధ్యలో ఒక పక్షి కనిపించి, తన్ను తాను పరిచయం చేసుకొని నేను మీ వెంటనే ఉంటాను, అని పలకింది. ఆ పక్షి పేరేమిటి?

జవాబు : జవాబుల కాలంలో ఉన్నది.

4. ప్రశ్న : పంచవటిలో రామాదులు పర్ణశాలను ఏరీతిగా ఏర్పాటు చేసికొని, అందు నివశించారు?

జవాబు : సీతారామ లక్షణులు పంచవటి ప్రాంతానికి ప్రవేశించిన పిమ్మట రాముడు లక్ష్మణా మనము అగస్త్యమహర్షి సూచించిన ప్రదేశానికి వచ్చాము. ఈ ప్రదేశం చాలా అందంగా ఉంది. మనకు ఇక్కడ నీరు, ఫల, పుష్పాదులు, అగ్ని కార్యానికి లోటురాకుండా సమిదలు, దర్భలు దొరికే ప్రదేశాన్ని, సమతలంగా ఉన్నప్రాంతాన్ని ఎంపికచేయు మనగా, లక్ష్మణుడు ఆ ప్రాంతమంతా కలయజూసి, అన్ని సౌకర్యాలతో ఉన్న తనకునచ్చిన ప్రదేశాన్ని గుర్తించాడు. ఆ ప్రదేశాన్ని తన అన్నగారికి చూపి, ఆయన అనుమతితో లక్ష్మణుడు,

ఆ గోదావరి నదీతీరాన, తాను త్రవ్వితీసిన మట్టితో గోడలను కట్టాడు. అందమైన ధృడమైన వెదురుబొంగులను స్థంబాలుగా నిలబెట్టి, వాటిపై పొడవైన వెదురు బొంగులను ఏర్పాటుచేసి, ఆ బొంగులపై, లేతలేత జమ్మికొమ్మలను పరచి, వాటిని దృఢమైన తాటి నారతోకట్టి, వాటిపై దర్భలను, రెల్లుగడ్డిని, కాకివెదురు ఆకులనుకప్పి, ఆ పర్ణశాలను బలంగా, అందంగా తీర్చిదిద్దాడు. అటు పిమ్మట నేలను బాగా చదునుచేసి రమణీయంగా తీర్చిదిద్దాడు. అనంతరమా లక్ష్మణస్వామి గోదావరి నదికి వెళ్ళి స్నానంచేసి, పువ్వులను పండ్లను సేకరించుకొని తిరిగివచ్చాడు. పిమ్మట ఆ పర్ణశాలను సీతారాములకు చూపించాడు. శ్రీరాముడు సంతోషించి, ఆ పర్ణశాలకు వాస్తుపూజచేసి సీతా లక్ష్మణులతో కలిసి ఆ పర్ణశాలా ప్రవేశం చేశాడు. ఆ పంచవటి ప్రాంతంలో పర్ణశాల యందు సీతారామ లక్ష్మణులు ప్రశాంతంగా కొంత కాలమున్నారు.

5. ప్రశ్న : పర్ణశాలా ప్రదేశంలో శూర్పణఖ అనే రాక్షసి ప్రవేశించి ఏవిధంగా ప్రవర్తించింది?

జవాబు : సీతా రామ లక్ష్మణులు పర్ణశాలలో చేరినప్పటి నుండి తమ విద్యుక్త కర్మలను నిర్వహించుకొంటూ సుఖంగా ఉంటున్న సమయంలో విధివశాన శూర్పణఖ అనే రాక్షసి ఆ ప్రదేశానికి వచ్చింది. ఆమె రావణుని చెల్లెలు. అచట మన్మథునివలె సౌందర్య నిధియైన శ్రీరామ చంద్రుడు దేవేంద్ర వైభవంతో వెలిగిపోవడాన్ని చూసి, ఆమె కామ పరవశ అయ్యింది. అంతట వెగటుగొలిపే ఆకృతిగల శూర్పణఖ ఓ సుందరా! నీవు తాపస వేషంలో ఉన్నావు. భార్యా సహితుడవై, ధనుర్బాణాలు ధరించి ఉన్నావు. రాక్షసుల నివాసస్థానమైన ఈ ప్రాంతానికి ఎందుకు వచ్చావు? అని అడిగింది. అంతట శ్రీరాముడు తన వృత్తాంతాన్ని తెలిపాడు. పిమ్మట రాముడు నీవు రాక్షస స్త్రీవి అనుకొంటున్నాను. నీవెవరు? అని అడుగగా ఆమె నాపేరు శూర్పణఖ, రాక్షస ప్రభువైన రావణుడు నాకు సోదరుడు. మహా పరాక్రమశాలి. ఈ ప్రాంతంలో తిరిగే ఖరదూషణాదులు కూడా నాకు సోదరులే. వీరు మహాబల సంపన్నులు. నేను ఎన్నో

మహిమలు, శక్తి సామర్థ్యాలు గలదానను. అద్భుతమైన నీ రూపాన్నిజూసి నేను కామపరవశనైనాను. నిన్ను భర్తగా పొంద గోరుతున్నాను. ఇంక సీతాదేవితో నీకేమి పని? ఈమె రూపం వికారంగా ఉంది. ఈ మనుష్యకాంతను నేనుతినివేస్తాను. నీ తమ్ముని కూడా అదేపని చేస్తాను. మనకు అడ్డుండరు. ఓ అందగాడా అటు పిమ్మట మన మిద్దరం కలిసి ఈ వనాలలోనూ, పర్వత శిఖరాల యందును, హాయిగా తిరుగవచ్చు. అని మత్తిల్లిన చూపులతో ఆ పర్ణశాలా ప్రదేశంలో ప్రవేశించిన రాక్షసి శూర్పణఖ ప్రవర్తించిది.

## ముప్పది ఆరవ అధ్యాయము

జవాబులు : 1.4. లక్ష్మణుని 2.1. పంచవటి
3. జటాయువు

..................

# అరణ్య కాండము

## 18, 19, 20, 21, 22, 23 సర్గలు

## ముప్పది ఏడవ అధ్యాయము

1. ప్రశ్న : సీతాదేవిని చంపి తినేస్తాను అని ముందుకు వచ్చిన శూర్పణఖను హుంకారంతో నిలిపి రాముడు లక్ష్మణా ఈమె చెడు స్వభావం గలది. ఈమెతో పరిహాస మెందుకు. ఈమెను విరూపను గావించ మన్నాడు. వెంటనే లక్ష్మణుడు అట్లే ఆమె ముక్కు చెవులు కోసాడు. ఆమె నెత్తురోడుతూ, రోధిస్తూ ఎవరిని ఆశ్రయించింది?

జవాబు : 1. మారీచుని 2. సుబాహుని
3. ఖరుని 4. సుందుడుని

2. ప్రశ్న : శూర్పణఖ మాటలు విని ఖరుడు శ్రీరాముడిపైకి ఎంతమంది రాక్షస యోధులను పంపించాడు?

జవాబు : 1. పన్నెండు మందిని 2. పదివేల మందిని
3. పద్నాలుగువేల మందిని 4. పద్నాలుగు మందిని

3. ప్రశ్న : ఖరుడు పంపించిన పద్నాలుగు మంది యోధులను శ్రీరాముడు సంహరించడాన్ని చూసిన శూర్పణఖ ఏడ్చి గగ్గోలుపెడుతూ మరలా ఎవరి వద్దకు వెళ్ళింది?

జవాబు : జవాబుల కాలంలో ఉన్నది.

4. ప్రశ్న : శూర్పణఖ మాటలు విని ఖరుడు ఏ రీతిగా ప్రవర్తించాడు?

జవాబు : సమస్త రాక్షస వినాశనానికే దాపురించిదా? అన్నట్లు శూర్పణఖ మరలా తన వద్దకు రావడాన్ని చూసి ఖరుడు, శూర్పణఖా! ఎందుకు ఏడుస్తున్నావు, నీతో పంపిన పద్నాలుగు మంది యోధులు నాతో సమానమైన వారు. అంతటి యోధులు ఏమైనారు? అని పలికిన ఖరునితో శూర్పణఖ ఓ సోదరా! నీవు పంపించిన యోధులందరిని శ్రీరాముడు సంహరించాడు. పైగా నా ముక్కు చెవులు ఖండించిన ఆ రాముడిని నీవు ఈరోజే సంహరించక పోతే నేను నీ యెదుట ప్రాణత్యాగం చేసుకొంటాను. నీవు సూరుడవని గొప్పలు చెప్పుకొంటే చాలదు. మానవ మాత్రుడైన ఆ రాముని సంహరించు అని సొమ్మసిల్లి పడిపోయిన శూర్పణఖతో సోదరీ! నీకు జరిగిన ఈ తీరని అవమానం కారణంగా నాలో క్రోధం పెల్లుబుకుతుంది. రాముడు మానవ మాత్రుడు పైగా అల్పాయుష్కుడు. నా పరాక్రమం ముందు అతడొకలెక్కా అంటూ నేనతనినే కాదు. అతని తమ్ముడిని కూడా సంహరిస్తాను. ఊరడిల్లి నీ కన్నీరు తుడుచుకో! అని పలికి ఖరుడు తన సేనాపతి దూషణుని పిలిచి ఓ దూషణుడా! వెంటనే నా రథాన్ని సిద్ధం చెయ్యి. సకల ఆయుధాలను అందుచేర్చు. యుద్ధ విద్యలలో ఆరితేరిన నేను ముందు భాగాన ఉంటాను. మనసేన లందరిని యుద్ధ సన్నద్ధులై కదలిరమ్మని ఆజ్ఞాపించు అని ఖరుడు తన సేనాపతిని ఆజ్ఞాపించి, యుద్ధ సన్నద్ధుడయ్యాడు.

5. ప్రశ్న : ఖరుడు తనవారందరితోగూడి ఏవిధంగా యుద్ధ సన్నద్ధుడై రాముడి పైకి వచ్చాడు ?

జవాబు : శత్రుభయంకరులైన పద్నాలుగువేల మంది రాక్షసయోధులు ఇనుప గుదియలు, అడ్డ కత్తులు, శూలాలులాంటి వివిధాయుధాలు చేతబట్టి, ఖరుని అనుసరించిరాగా, ఖరుడు తన రథానికి పూన్చబడిన గుర్రాలు వేగంగావెళ్తూ, చదునుగా ఉన్న రాజమార్గంలాంటి బాటన వెళ్తున్నా కూడా, ఆకస్మికంగా రథం తొట్రుపాటుకు గురియైనట్లుగా అనిపించింది. శ్యామవర్ణంగల ఆకాశంలో సూర్యుని చుట్టూ ఒక కాంతి వలయం ఏర్పడింది. రథంపై భాగాన ఎత్తైన పతాకంపై ఒక పెద్దగ్రద్ద ఒకటి ఆ పతాకంచుట్టూ తిరిగి దానిపై నిలబడింది. ఇంకను ఇటు వంటి అశుభ సూచకాలు ఖరునికి అనేకం కనిపించాయి. కాని వాటిని లెక్కచేయక ఖరుడు తన వారితో ఈ సందర్భంలో పరంపరగా వచ్చిపడిన మహోత్పాతాలు ఎంతగా వచ్చిపడినా ధైర్యశాలినైన నేను వాటిని ఏ మాత్రము లెక్కచేయను. బలగర్వితుడైన రాముని, అతని తమ్ముని తీవ్రమైన నా బాణాలతో మట్టుబెట్టి తీరతాను. నేను ఇంతకు ముందు చేసిన యుద్ధాలలో అపజయమన్నది ఎరుగను. ఇప్పుడు కూడా అట్లే జరుగును గాక! అని పలికిన ఖరుని మాటలకు తన అనుచరులందరూ సంతోషించారు. ఖరుని రథానికి చుట్టూ పన్నెండుమంది సేనానులు, స్థూలాక్షుడు, ప్రమాథి, త్రిశిరుడు, మహాకపాలుడు అను ముఖ్యసేనానులు అనుసరించారు. ఆ విధంగా రాక్షససేన సమరోత్సాహంతో వేగంగా రాజకుమారులైన రామ లక్ష్మణులను సమీపించింది.

## ముప్పది ఏడవ అధ్యాయము

జవాబులు : 1.3. ఖరుని 2.4. పద్నాలుగు మందిని
3. ఖరుని వద్దకు

# అరణ్యకాండము

## 24, 25, 26, 27, 28, 29 సర్గలు

## ముప్పది ఎనిమిదవ అధ్యాయము

1. ప్రశ్న : ఖరుడు తన సైన్యంతో రావడాన్ని గమనించిన శ్రీరాముడు లక్ష్మణునితో నీవు మీ వదిన రక్షణ భారాన్ని వహించి, ఆమెను ఏ ప్రదేశానికి తీసికొని వెళ్ళమన్నాడు?

జవాబు : 1. ఒక చెట్టు నీడకు 2. పర్ణశాల లోనికి
3. కొండ గుహ లోనికి 4. గోదావరి ప్రాంతానికి

2. ప్రశ్న : రాక్షసులు యుద్ధాన్ని ప్రారంభించి, అనేక ఆయుధాలతో విజృభించడాన్ని చూసిన రాముడు ఒక అస్త్రాన్ని ప్రయోగించాడు. దాని ప్రభావంతో వేలకొలది బాణాలు, బయల్వెడలి దిక్కులన్నింటా వ్యాపించాయి. రాముడు ప్రయోగించిన ఆ అస్త్రం పేరేది?

జవాబు : 1. అగ్నేయాస్త్రం 2. వారుణాస్త్రం
3. ఐంద్రాస్త్రం 4. గాంధర్వాస్త్రం

3. ప్రశ్న : శత్రు సంహారకుడైన శ్రీరాముని చేతిలో పద్నాలుగు వేలమంది సైనికులు, సేనాపతులు హతమైపోగా చివరగా మిగిలిన ఒక్కరు ఎవరు?

జవాబు : జవాబుల కాలంలో ఉన్నది.

4. ప్రశ్న : శ్రీరామునికి ఖరునికి ఏ రీతిగా యుద్ధం జరిగింది?

జవాబు : యుద్ధభూమి యందు దూషణుడు, త్రిశిరుడు పడిపోవడం జూసి, ఖరుడు శ్రీరాముని పరాక్రమ ప్రాభవాన్ని జూసి కొంత భయపడ్డాడు. త్రిశిర, దూషణులేగాక, జయింప శక్యంగాని అపారమైన పదునాలుగు వేలమంది రాక్షస సైన్యాన్ని శ్రీరాముడొక్కడే తన ఎదుటనే సంహరించడం జూసి అతడి గర్వమంతా అణగారి పోయింది. మరలా ధైర్యం తెచ్చుకొని ఖరుడు శ్రీరామునిపైకి విజృంభించాడు. ఆ ఖరుడు శక్తివంతమైన ధనస్సునులాగి బాణాలను

రాముడిపైకి విసిరాడు. రథమధిరోహించిన ఖరుడు తన అస్త్ర విద్యాపాటవాన్ని వివిధ మార్గాలలో ప్రదర్శించాడు. అప్పుడా రఘువీరుడు నిప్పురవ్వలు కురిపించే తిరుగులేని తన బాణాలతో ఆకాశాన్ని కప్పివేశాడు. శ్రీరాముడు ఖరుడు ప్రయోగించిన నిశితశరాలతో ఆకాశం శరమయమై పోయింది. అపారమైన రాక్షస సైన్యాన్ని సంహరించి నప్పటికి సమరంలో మహా పరాక్రమంతో స్థిరంగా ఉండడాన్ని చూసి ఖరుడు, ఈ రఘువీరుడు మహాశక్తి సంపన్నుడు అని అనుకొన్నాడు. మిడత తన వినాశనాన్ని తాను తెలిసికోలేక అగ్నివైపు దూసుకెళ్ళినట్లు ఖరుడు రామునిపైకి విజృభించాడు. పిమ్మట శ్రీరాముడు అగస్త్యమహర్షి తనకు బహూకరించిన వైష్ణవ ధనస్సును చేతబట్టి ఖరుని మీదకు విజృంభించాడు. ఈ విధంగా శ్రీరామ ఖరుల యుద్ధం జరుగుతూ ఉంది.

5. ప్రశ్న : యుద్ధ సమయంలో శ్రీరాముడును, ఖరుడును ఏ విధంగా పరుషంగా మాట్లాడుకున్నారు?

జవాబు : రథాన్ని కోల్పోయి గదను చేతబట్టిన ఖరుని జూసి శ్రీరాముడు ఓ నిశాచరా! గజాశ్వ రథబలాలతో, కాల్బలంతో ఉన్న నీవు ఘోరకృత్యాలకు పాల్పడ్డావు. నీ దుష్కర్మలు సమస్త లోకాలవారు ఏవగించు కొంటారు. సమస్త ప్రాణులకు భయాన్ని గూర్చువాడు, హింసించు వాడు, పాపకర్మలకు ఒడిగట్టువాడు, ముల్లోకాలకు అధిపతియైనా అతడు మృత్యువు నుండి తప్పించుకోలేడు. ఇంక నీవంటి అల్పుని విషయంలో చెప్పేదేముంది. లోక కంటకులైన వారిని ఎంతటి దయగల వారైనను, మీదికి వచ్చిన సర్పమును వలె చంపక మానరు. ఈ దండకారణ్యంలో ధర్మనిరతులై నివసిస్తూ తమ మానాన తాము బ్రతుకుతున్న తాపసులను చంపి నీవు బావుకున్న దేమి? పాపకర్మలుచేసే పాపాత్ములు ఐశ్వర్యములను పొందినను త్వరలోనే నశిస్తారు. ఓ రాక్షసుడా! మానవాళికి కీడును తలపెట్టుచు ఘోరమైన పాపకృత్యాలకు పాల్పడేవారి ప్రాణాలు తీయడానికే

దశరథ మహారాజు నన్ను ఈ దండకారణ్యానికి పంపాడు. అని శ్రీరాముడు పలుకగా ఖరుడు ఓ దాశరథీ! రణంలో సాధారణ సైనికులను చంపి, నీవొక మహావీరునివలె, నిన్ను గురించి నీవు గొప్పలు చెప్పుకొంటున్నావు. నిజంగా నీవు చేసింది యుద్ధమా? ఆత్మస్తుతి చేసుకోవడం నీ అల్పత్వానికి నిదర్శనం. నిశ్చలంగా నున్న పర్వతంవలె, గధాయుధాన్ని ధరించి, ఈ యుద్ధ భూమిలో నీయెదుట నిలిచియున్న నన్ను నీవు చూడడంలేదా? నీ ప్రాణాలను హరింపచేయు యమునివలె ఉన్న నేనొక్కడిని చాలు నీ ప్రాణాలు తీయడానికి అని ఖరుడు తన భుజంపై ఉన్న గధాయుధాన్ని రాముడిపైకి విసరి వేశాడు. శ్రీరాముడు తన బాణం చేత ఆయుధాన్ని తుత్తునియలు చేశాడు. ఈ విధంగా ఖరుడు, శ్రీరాముడు పురుషంగా మాట్లడుకొని యుద్ధం చేయసాగారు.

## ముప్పది ఎనిమిదవ అధ్యాయము

జవాబులు : 1.3. కొండ గుహలోనికి 2.4. గాంధర్వాస్త్రం
3. ఖరుడు

................

# అరణ్య కాండము

## 30, 31, 32, 33, 34, 35 సర్గలు

## ముప్పది తొమ్మిదవ అధ్యాయము

1. ప్రశ్న : శ్రీరాముడు ఖర దూషణాది, పద్నాలుగు వేలమంది రాక్షసులను ఎన్ని ఘడియల కాలంలో సంహరించాడు?

జవాబు : 1. ఐదు ఘడియలు కాలం 2. ఏడు ఘడియలు కాలం
3. రెండు ఘడియలు కాలం 4. మూడు ఘడియలు కాలం

2. ప్రశ్న : ఖరునితో పాటు తమ వారందరి మరణాన్ని రావణునికి మొదటగా తెలియజేసింది ఎవరు?

జవాబు : 1. అకంపనుడు 2. దూషణుడు
3. త్రిశిరుడు 4. సుబాహుడు

3. ప్రశ్న : అకంపనుని మాటలకు ఆగ్రహోదగ్రుడైన రావణుడు, శ్రీరాముని చంపడానికై దండకారణ్యం వచ్చి జనస్థానమందు ఎవరి సహాయాన్ని అర్థించాడు?

జవాబు : జవాబుల కాలంలో ఉన్నది.

4. ప్రశ్న : మారీచుని సలహాతో రావణుడు కొంత సమాధాన పడినాడు. మరలా ఆయనను శూర్పణఖ ఏ రీతిగా రెచ్చగొట్టి రామునిపైకి పంపించింది?

జవాబు : సీతాపహరణానికై తనకు సహకరించమని రావణుడు మారీచుని వద్దకురాగా, మారీచుడు ఓ రావణా! శ్రీరామునితో యుద్ధం నీకు ఉచితంకాదు. సీతారాముల విషయాన్ని నీకు తెలిపి నిన్నిట్లు పంపినవాడు నీ శ్రేయోభిలాషి కాదు. నా మాటవిను. నీ ఈ ఆలోచనను విరమించుకొని లంకకువెళ్ళి హాయిగా జీవించు మనగా, మారీచుని మాటలకు సమ్మతించి లంకకు వెళ్ళాడు. లంకలో కొలువు దీరియున్న రావణుని వద్దకు భయంతో శూర్పణఖ వచ్చింది. దండకారణ్యంలో లక్ష్మణుని వలన ఏర్పడిన తన వికృత రూపాన్ని సభలో ప్రదర్శించి, తన సోదరుడైన రావణునితో ఇట్లు పలకసాగింది. ఓ రావణా! అడ్డుచెప్పెడి వారులేక నీవు నిరంకుశుడవై నిరంతరం కామోపభోగాలలో మునిగి, కైపెక్కి యున్నావు. వినడానికి కూడా భయంకరమైన పరిస్థితి ఏర్పడింది. ఓ సోదరా! జనస్థానమందు అసంఖ్యాకులైన మన రాక్షసయోధులు రణరంగంలో ఘోరమరణం పాలైన విషయాన్ని తెలిసికొని, శత్రువులయెడ ఉపేక్ష భావంతో ఎట్లున్నావు? రావణా! అసలు జరిగినదేమంటే అంద చందాలలో దేవ, గంధర్వ, యక్ష, కిన్నెర, మానవ కాంతలలో అంతటి అందగత్తె ఎవరూలేరు. ఆమె రాముని భార్య సీతాదేవి. ఆమె నీకు భార్య కాదగినది. అని నేనాలోచించి, ఆ దిశగా ప్రయత్నిస్తుండగా, నన్ను రాముని తమ్ముడు లక్ష్మణుడు ఈ రీతిగా విరూపనుగా చేశాడు.

ఖరదూషణాది రాక్షసుల ఆత్మ శాంతించాలంటే ఆ రామ లక్ష్మణులను సంహరించ వలసిందే. అప్పుడు అనాధయైన సీతతో నీ ఇష్టానుసారం సుఖించు. అని పలికిన శూర్పణఖ మాటలు విని రావణుడు సభలోనున్న మంత్రులతో చర్చించి, తన కర్తవ్యాన్ని నిర్ణయించుకొన్నాడు.

5. ప్రశ్న : సీతాపహరణ విషయమై రావణుడు ఒక స్థిరనిర్ణయానికి వచ్చి ఏమిచేశాడు?

జవాబు : సభనుండి అంతఃపురానికి వెళ్ళిన రావణుడు, సీతాపహరణ విషయమై సాధ్యాసాధ్యాలను బాగా ఆలోచించి, తనబలాన్ని రాముని బలంతో పోల్చుకొని, చివరకు సీతాపహరణానికే నిశ్చయించుకొని, పిమ్మట అశ్వశాలకువెళ్ళి, రథాన్ని సిద్ధం చేయమని సారథితో చెప్పాడు. రాజాజ్ఞ ప్రకారం సారథి ఒక బంగారు రథాన్ని, పిశాచాకారాలుగల గాడిదలను పూన్చి, సిద్ధం చేశాడు. రావణుడు దాని నధిరోహించి సముద్ర తీరానికి వచ్చి, తన ఇచ్ఛాను సారం పయనించే రథంపై గగనమార్గాన సాగిపోయాడు. రావణుడు ఆ విధంగా ప్రయాణించి రమ్యమై, ప్రశాంతంగా నున్న ఒక ఆశ్రమాన్ని చూశాడు. అచట కృష్ణాజినం ధరించి, జటాదారియై ఆహార నియమాలు పాటిస్తూ జీవిస్తున్న మారీచుడు అనే రాక్షసుని చూశాడు. అంతట ఆ మారీచుడు వచ్చిన రావణునికి అతిథి మర్యాదలు చేశాడు. వివిధ భోగవస్తువులచే అతనిని అర్చించాడు. అంతట ఆ మారీచుడు రావణునికి స్వయంగా భోజన సదుపాయాలు ఏర్పాటు చేశాడు. పిమ్మట రాక్షస రాజా! లంక యందు అందరూ క్షేమమే గదా! మరలా ఒంటరిగా వెంటనే నీవిచటి కెందుకు వచ్చావు? అని మారీచుడు ప్రశ్నించాడు. అనంతరం రావణుడు తనకు సీతాపహరణా ఆవశ్యకతను గురించి వివరించాడు.

## ముప్పది తొమ్మిదవ అధ్యాయము

జవాబులు : 1.4. మూడు ఘడియలకాలం   2.1. అకంపనుడు
3. మారీచుని

# అరణ్య కాండము

## 36, 37, 38, 39, 40, 41 సర్గలు

## నలబదియవ అధ్యాయము

1. ప్రశ్న : సీతాపహరణకు సహకరించమని రావణుడు మారీచుని కోరుతూ, అతడిని సీతాదేవికి దగ్గరగా ఏ రూపం ధరించి తిరగమని చెప్పాడు?

జవాబు : 1. ఏనుగు 2. గుర్రం
3. లేడి (జింక) 4. కుక్క

2. ప్రశ్న : మారీచుడు రావణునికి హితవుచెబుతూ శ్రీరాముని గురించి ముఖ్యంగా ఏమని పలికాడు?

1. చపలుడు 2. నీచుడు
3. మూర్తీభవించిన ధర్మ స్వరూపుడు 4. పిరికివాడు

3. ప్రశ్న : రావణునితో మారీచుడు శ్రీరాముడు అసమాన పరాక్రమశాలి అని తనకు జరిగిన పూర్వానుభవాన్ని గురించి తెలిపాడు అది ఎక్కడ జరిగింది?

జవాబు : జవాబుల కాలంలో ఉన్నది.

4. ప్రశ్న : మారీచుని రావణుడు తనమాటలు వినేట్లుగా ఏవిధంగా లోబరచు కొన్నాడు?

జవాబు : శ్రీరాముని బలపరాక్రమాల గురించి మారీచుడు రావణునికి ఎంతగా చెప్పినా, వినకుండా రావణుడు ఓ మారీచా! నేను చేయదలచుకొన్న కార్యానికి నీ సహాయం అవసరం. అంతే గాని అది మంచిదా? చెడ్డదా? అని నేను నిన్నడగలేదు. నీవు చేయవలసిన పని చెబుతాను విను. ఓ మారీచా! నీవు వెండివలె తెల్లని చుక్కలుగల విచిత్రమైన బంగారువన్నె లేడిగా మారి, రాముని ఆశ్రమ సమీపాన తిరుగుతూండు. ఆవిధంగా స్వేచ్ఛగా తిరుగుతూ సీతాదేవిని ప్రలోభపెట్టు. అంతట ఆ వైదేహి మాయలేడిని చూసి దీనిని నాకు వెంటనే తెచ్చి 'ఇమ్ము' అని రాముడిని కోరుతుంది. ఆ రాముడు

ఆమె కోరిక ప్రకారం నిన్ను పట్టుకోవడానికై వస్తాడు. నీవు అతనిని చాలా దూరం తీసికొనివెళ్ళు. తరువాత శ్రీరాముని కంఠాన్ని అనుకరిస్తూ, హా! సీతా! హా! లక్ష్మణా అని బిగ్గరగా ఆర్తనాదం చెయ్యి. ఆ మాటలు విని సీతాదేవి దుఃఖించి లక్ష్మణుడుని ప్రేరేపించి పంపిస్తుంది. లక్ష్మణుడు అటు వెళ్ళగానే వైదేహిని నేను సులభంగానే తీసికొని వెళ్తాను. ఓ మారీచా! ఇంత మాత్రమే నీవు నాకు చేయవలసిన పని. అటు పిమ్మట నీవు యధేచ్ఛగా వెళ్ళవచ్చు. ఈ కారణంగా రాముడితో యుద్ధం చేయకుండానే ఆతనిని వంచించి సీతతో లంకకు వెళతాను. ఒకవేళ నీవు నేను చెప్పినట్లు చేయకున్నచో నిన్ను ఇప్పుడే హతమారుస్తాను. నీకు ఇష్టం లేకపోయినా నీ చేతనే ఈ పని చేయిస్తాను. నీవు మృగరూపం ధరించినా, విధి వశాన ఒకవేళ బ్రతుకచ్చు. కాని నన్ను వ్యతిరేకించినచో నీ ప్రాణాలు ఇప్పుడే పోతాయి. ఆ రెండింటిలో ఏదో ఒకటి ఆలోచించు. అని రావణుడు మారీచుని బెదిరించి తనదారికి తెచ్చుకొన్నాడు.

5. ప్రశ్న : రావణునితో మారీచుడు నీవు చేయాలనుకున్న పని మంచిది కాదు అని ఎన్నిరీతుల చెప్పాడు?

జవాబు : రాజగర్వంతో రావణుడు తనను ఆజ్ఞాపించిన తీరును మారీచుడు నిరసిస్తూ, ఓ నిశాచరా! నీవిట్లు సీతను అపహరించినచో నీవు మూలబలంతో హతమౌతావు. ఇంతకు నీకు ఈ సర్వనాశనకరమైన ఉపదేశాన్ని చేసిన దుర్మార్గుడెవరు? ఓ రాజా నీవు సుఖ సంతోషాలతో ఉండటాన్ని ఓర్వలేని ఆ పాపాత్ము డెవరు? సూటిగా నిన్నెదిరించ లేక బలహీనులైన నీ రాక్షస శత్రువులు నీకంటె బలశాలియైన శ్రీరాముని చేతిలో నీ చావును కోరుకొంటున్న వారెవరు? ఓ రావణా! ఈ దురాలోచనను నీ తలకెక్కించి నీకు హానిజరగాలని ఎదురు చూస్తున్న వాడెవడు? స్వయం కృతాపరాధం వల్లనే నిన్ను దెబ్బతీయాలని తలంచుచున్న వాడెవడైనా, ఫలితాన్ని మాత్రం నీవు అనుభవిస్తావు. ఓ రావణా! రాముడు నన్ను చంపిన కొద్దికాలానికే నిన్నును చంపుతాడు. నేను రాముని చేతిలో చస్తూ ఆ మహాపురుషుని

చూస్తూ ప్రాణాలు విడుస్తాను. నీవు సీతను అపహరించి బంధు, మిత్ర, సపరివార సమేతంగా చస్తావు. నీ ఆలోచన ప్రకారం సీతాపహరణం జరిగితే నీవూ బ్రతకవు, నేనూ బ్రతకను, రాక్షసులూ బ్రతకరు. లంకా ఉండదు. ఓ రావణా! నీమేలుకోరి చెబుతున్నా, అయినా నీవు వినడంలేదు. పోయేకాలం దాపురించినవాడు మిత్రుని మాట వినడుకదా! అట్లే నీవును ప్రవర్తిస్తున్నావు. అని మారీచుడు అనేక రీతులా రావణునికి హితవును చెప్పాడు.

### నలుబదియవ అధ్యాయము

జవాబులు : 1.3. లేడి (జింక) 2.3. మూర్తీభవించిన ధర్మస్వరూపుడు
3. సిద్ధాశ్రమంలో

..........

# అరణ్య కాండము

## 42, 43, 44, 45, 46, 47 సర్గలు

## నలుబది ఒకటవ అధ్యాయము

1. ప్రశ్న : రావణుని రథంపై బయలుచేరి వచ్చిన మారీచుడు దండకారణ్యంలో శ్రీరాముని ఆశ్రమాన్ని ఏ చెట్లు ఉండడాన్ని బట్టి గుర్తించాడు?

జవాబు : 1. శ్రీగంధపు చెట్లు 2. మద్దిచెట్లు
3. జమ్మిచెట్లు 4. అరటిచెట్లు

2. ప్రశ్న : తమ ఆశ్రమ ప్రాంతంలో తిరుగుతున్న మాయలేడిని చూసి, లక్ష్మణుడు తన అన్నగారితో ఇది మామూలు జింక కాదు. ఇది ఏ రాక్షసుని మాయ అని తెలిపాడు?

జవాబు : 1. కబందుని 2. విరాధుని
3. మారీచుని 4. అకంపనుని

3. ప్రశ్న : ధనుర్బణాలు ధరించి రాముడు మాయా జింకను వెంబడించి బహు దూరానికి వెళ్ళాడు. అక్కడ రాముని బాణపు దెబ్బకు లేడిరూపంలో ఉన్న మారీచుడు ఏరీతిగా కేకలు వేశాడు ?

జవాబు : జవాబుల కాలంలో ఉన్నది.

4. ప్రశ్న : సీతాదేవి వద్దకు రావణుడు రావడానికి ఏ రీతిగా వీలు కలిగింది?

జవాబు : శ్రీరాముడు వేసిన బాణపు దెబ్బకు లేడి రూపంలో ఉన్న మారీచుడు చేసిన ఆర్తనాదం శ్రీరాముని స్వరాన్ని పోలి ఉంది. అది విన్న సీతాదేవి రామునికి ఏదో ఆపద సంభవించి ఉండవచ్చును, అని నిర్ధారించుకొని లక్ష్మణునితో ఆ వినబడిన ఆర్తనాదం మీ అన్నగారిదే. అది విన్న క్షణంనుండి నామనసు మనసులోలేదు. నా ప్రాణాలు నిలువడంలేదు. కనుక లక్ష్మణా! నీవు వెంటనే ఆయనను రక్షించడానికై పరిగెత్తివెళ్ళు. అని ఇట్లు సీతాదేవి పలుకుతున్నా కూడా లక్ష్మణుడు అన్నగారి ఆజ్ఞ ప్రకారం కదలక అచటనే ఉన్నాడు. అంతట జానకీదేవి కోపంతో ఓ సౌమిత్రీ! నీ అన్నపై నీవు ప్రేమను నటిస్తూన్నావు. నిజానికి ఆయనపై నీకు ప్రేమలేదు. నీవు ఆయన పాలిటి శత్రువువే. ఎందుకంటే ఇటువంటి ఆపద సమయంలో కూడా నీవాయన వద్దకు వెళ్ళడంలేదు. వాస్తవానికి నీవు నాపై కోరికతో రామునికి హానిచేయడానికే ప్రయత్నిస్తున్నావు. యధార్థంగా నీకు నీ సోదరునిపై ఏమాత్రం ప్రేమ లేదు. అని ఆ సీతాదేవి లక్ష్మణుడు ఓర్చుకోలేని మాటలు మాట్లాడుతూ, తన భర్త ఆపదల పాలైనట్లుగా భావించుకొంటూ, భయకంపితయై యున్న ఆమెతో లక్ష్మణుడు అమ్మా! దేవాసురులు, నాగ, గంధర్వ, మానవులెవ్వరూ శ్రీరాముని జయించలేరు. ఇందుకు సందేహం లేదు. అని ఎన్నిరీతులా లక్ష్మణుడు సీతాదేవికి ఊరట కలిగించే మాటలు చెప్పినా, ఆమె మొండి వైఖరికికి, ఆమె పలికిన తీవ్రమైన మాటలకు నొచ్చుకొని లక్ష్మణుడు, ఆమెకు నమస్కరించి, ఆమెను విడిచి వెళ్ళుటకు మనసురాక, మనసు దిటవు చేసుకొని శ్రీరాముని సమీపానికి వెళ్ళాడు. లక్ష్మణుడటు వెళ్ళగానే అవకాశం కొరకు ఎదురు చూస్తున్న రావణుడు సన్యాసి వేషంలో సీతాదేవి ఎదుట నిలిచాడు.

5. ప్రశ్న : రావణుడు సన్యాసి వేషంలో పర్ణశాలలో ఉన్న సీతాదేవి కడకు వెళ్ళగా అచట ఏమి జరిగింది?

జవాబు : రామలక్ష్మణులు లేని ఆశ్రమంలో సన్యాసి వేషంలో రావణుడు ప్రవేశించాడు. యతివేషానికి తగ్గట్టుగా వేద మంత్రాలు చదువుతూ వెళ్ళి, అచట రామ పత్నియైన వైదేహిని చూశాడు. కామ పరవశుడై సీతాదేవితో ఓ వనితా నీవెవరు? నీ వంటి సౌందర్య రాశియైన నారీ రత్నమును నేనింతకు ముందు చూడలేదు. అని ఆమెను ఎన్నోవిధాల పొగుడుతూ ఓ తరుణీ! కామరూపులైన రాక్షసులు తిరుగాడే ఈ ప్రదేశంలో నీవెందుకున్నావు? ఓ కల్యాణీ! నీ పేరేమి? నీవెవరి దానవు? ఈ దండకారణ్యంలో ఏ కారణంగా ఉంటున్నావు? అని రావణుడు పలుకుతున్నా, సీతాదేవి మాత్రం తన భర్త శ్రీరాముడు ఇంకనూ రాలేదు అని మనసు మదనపడుతూ, రావణుని మాటలు అన్య మనస్కంగానే వింటున్నది. యతి వేషం ఉన్నందున అతనిని అతిథి మర్యాదలతో పూజించింది. రావణుడు మాత్రం ఆమెను అపహరించుకొని వెళ్ళడానికై ఆలోచిస్తున్నాడు. అప్పుడు సీతాదేవి రావణుడు అడిగిన మీదట తన వృత్తాంతాన్నంతా తెలిపింది. పిమ్మట ఓ బ్రాహ్మణోత్తమా! నీవెవరు? ఈ దండకారణ్యంలో సంచరించేందుకుగల కారణమేమి? అని అడిగిన సీతాదేవికి రావణుడు తీవ్ర స్వరంతో ఓ సీతా! నేను రావణుడను, రాక్షస రాజును. ఎందరో సుందరీ మణులను తీసికొని వచ్చాను. నీవు నన్ను భర్తగా స్వీకరిస్తే నీవు నాకు పట్టమహిషివి అవుతావు. నా భార్య లందరూ నీకు సేవలు చేస్తారు. వేల మంది దాసీలు నీకు సేవలు చేస్తారు. అని పలికిన రావణుని సీతాదేవి తృణీకరించింది. అప్పుడు రావణుడు ఆమెకు రాక్షసజాతి గురించి, తన పరాక్రమాన్ని గురించి వివరించాడు.

## నలుబది ఒకటవ అధ్యాయము

జవాబులు : 1.4. అరటిచెట్లు 2.3. మారీచుడు

3. హా! సీతా! హా! లక్ష్మణా!

# అరణ్య కాండము

## 48, 49, 50, 51, 52, 53 సర్గలు

## నలుబది రెండవ అధ్యాయము

1. ప్రశ్న : రావణుడు సీతాదేవితో తనపరాక్రమ వైభావాన్ని గురించి తెలుపుతూ, తాను కుబేరుని సోదరుడను, కాని ఆ కుబేరునితో పోరి దేనిని జయించి స్వాధీనం చేసికొన్నాను అని తెలిపాడు?

జవాబు : 1. దివ్యరథాన్ని 2. కుబేరుని భార్యను
3. పుష్పక విమానాన్ని 4. వజ్ర సింహాసనాన్ని

2. ప్రశ్న : బలవంతంగా రావణుడు సీతాదేవిని అపహరించుకొని వెళ్తుండగా, ఆతనిని అడ్డగించినది ఎవరు?

జవాబు : 1. వన దేవతలు 2. జటాయువు
3. సంపాతి 4. ఆంజనేయుడు

3. ప్రశ్న : రావణ జటాయువుల యుద్ధ సమయంలో జటాయువు దెబ్బకు రావణుని రథము, సారథి, రథానికి పూన్చిన వికృత ముఖాలుగల గాడిదలు ధ్వంసంకాగా, ఏ కారణంగా జటాయువు ఒకింత అలసట చెంది యున్నాడని రావణుడు గమనించాడు?

జవాబు : జవాబుల కాలంలో ఉన్నది.

4. ప్రశ్న : రావణుడు బలవంతంగా సీతాదేవిని ఏరీతిగా తీసికొని వెళ్ళాడు ?

జవాబు : పర్ణశాల సమీపంలో జటాయువు పడిపోవడాన్ని చూసిన రావణుడు, సీతాదేవివైపు వస్తుండగా ఆమె కొనఊపిరితో ఉన్న జటాయువును అక్కున జేర్చుకొని ఏడవసాగింది. అప్పుడు రావణుడు తన వైపురావడాన్ని చూసిన సీతాదేవి, రామా! లక్ష్మణా! అంటూ ఆక్రందిస్తూ, భయపడి ఒక చెట్టును కౌగిలించుకొని గట్టిగా పట్టుకొని రామా! రక్షించు రక్షించు అని ఏడవసాగింది. అంత ఆ రావణుడు ఏడుస్తున్న సీతను జుట్టుపట్టుకొని లాగాడు. ఆ విధంగా రావణుని

చేతిలో సీతకు కలిగిన అవమానాన్ని చూసి ప్రకృతి అజ్ఞానాంధ కారంలో మునిగిపోయింది. రామా! లక్ష్మణా! రక్షించండి అని ఆక్రందిస్తున్న జానకిని తీసికొని ఆ రాక్షసరాజు ఆకాశాన సాగిపోయాడు. మంగళ స్వరూపిణియైన సీతాదేవి ధరించిన ఆభరణాలు, పాద మంజీరాలు, గాలి తాకిడికి కొట్టుకొంటూ ఒకటొకటిగా అక్కడక్కడా పడిపోయాయి. అపహరింప బడుతున్న ఆమె కొప్పులో పూలన్నీ నేలంతా చెల్లాచెదరుగా పడిపోయాయి. ఆ విధంగా సీతాదేవి తీరని దుఃఖంతో రామా! లక్షణా! అని బిగ్గరగా జాలిగొలిపెడి స్వరంతో ఏడుస్తూ, పదేపదే నేలవైపు చూడసాగింది. అట్టి సీతాదేవిని జూసిన వన దేవతలు వణికిపోయారు. ఆమె కురులు చెదిరి పోయాయి. నొసటి తిలకం చెదరిపోయింది. అట్టి పతివ్రతను రావణుడు తన చావు దగ్గరపడినందున అపహరించాడు.

5. ప్రశ్న : రావణుడు లంకా నగరం వైపు తనను అపహరించుకు పోతుండగా సీతాదేవి ఏరీతిగా పరుషంగా మాట్లాడింది?

జవాబు : సీతాదేవి తనను ఆకాశమార్గాన తీసికొని వెళ్తున్న రావణునిపై కోపంతో, చేయునది లేక వెక్కివెక్కి ఏడుస్తూ, అతిధీనంగా విలపిస్తూ, ఓరీ నీఛ రావణా! రామ లక్ష్మణులు లేని సమయంలో వచ్చి ఒక దొంగవలె నన్ను తీసికొని పారిపోతున్నావు. ఇటువంటి పని చేయాడానికి నీకు సిగ్గుగా లేదా? ఓ దుర్మార్గుడా! నన్ను అపహరింప దలచి, నా భర్తకు భయపడి, మాయా మృగరూపంలో ఆయనను నాకు దూరంచేసి నన్ను అపహరిస్తున్నావు. నీవేమి శూరుడవు? మా మామగారి మిత్రుడైన జటాయువును వధించావు. అట్లు ఒక ముదుసలి పక్షిని చంపటం వీరత్వమా? ఓ రాక్షసాధమా! యుద్ధ రంగంలో రఘువీరునితో పోరిగెల్చి, నన్నిటు తీసికొని రాలేదుకదా! దీనిని బట్టి నీ పరాక్రమం ఎంతటిదో తెలుస్తూనే ఉంది. ఓ నీచుడా! యజమాని లేని సమయంలో అతని భార్యను అపహరించావు. అట్టి నికృష్టమైనపని, చేయడానికి నీకు సిగ్గుగాలేదా? పరాక్రమ హీనుడవై యుండి కూడా మహా వీరుడనని గొప్పలు చెప్పుకొంటూ ఉంటావు.

మహాత్ముడైన శ్రీరామునికి ఈ విధంగా అపకారం చేస్తున్నందున, కాలకూట విషంతాగిన వానివలె నీవు మరణించుట తథ్యం. తమ్ముని తోడులేకుండా తానొక్కడే పద్నాలుగువేల మందిని సంహరించిన రాముని భార్యను నీవు అపహరిస్తున్నావు. తన భార్యను అపహరించిన వానిని రాముడు వదిలిపెట్టునా? నీకు చావు దగ్గర పడింది. అని భయ శోకాకులతలకు లోనైన జానకి ఇట్లు పలువిధాలుగా పరుషవచనాలు పలుకుతూనే ఉన్నది. అయినా రావణుడు లెక్కచేయక వెళ్తూనే ఉన్నాడు.

## నలుబది రెండవ అధ్యాయము

జవాబులు : 1.3. పుష్పక విమానాన్ని 2.2. జటాయువు

3. వృద్ధాప్యం వలన

............

# అరణ్య కాండము

## 54, 55, 56, 57, 58 సర్గలు

## నలుబది మూడవ అధ్యాయము

1. ప్రశ్న : రావణుని చేత అపహరణకు గురియైన సీతాదేవి తన ఆభరణాలను, తన చీరకొంగును చించి అందులో మూటగట్టి ఒక పర్వత శిఖరంపై వానర ప్రముఖులు ఆమె కంటబడగా వారిమధ్య వదిలింది. ఆ వానర ప్రముఖులు ఎంత మంది అచట ఉన్నారు?

జవాబు : 1. ఎనిమిది మంది 2. ఏడుగురు

3. ఆరుగురు 4. ఐదుగురు

2. ప్రశ్న : రావణుడు ఆకాశమార్గాన సీతాదేవిని తీసికొనివచ్చి లంకానగరంలో మొదటగా ఎక్కడ ఉంచాడు?

జవాబు : 1. అశోక వనంలో 2. పుష్పక విమానంలో
3. తన అంతఃపురంలో 4. విభిషణుని గృహంలో

3. ప్రశ్న : రావణుడు తన సంపద, వైభవాలను చూపినా, సీతాదేవి తనను భర్తగా అంగీకరించక పోవడంతో, ఆమెను అశోక వనమందుంచి, ఒక గడువును విధించి, గడువు మీరిన పిమ్మట నిన్ను చంపివేస్తాను అని బెదిరించాడు. ఆ గడువు ఎన్ని నెలలు ?

జవాబు : జవాబుల కాలంలో ఉన్నది.

4. ప్రశ్న : శ్రీరాముడు మారీచుని చంపిన పిమ్మట ఏమి జరిగింది?

జవాబు : మృగరూపంలో ఉన్న మారీచుడు శ్రీరాముడిని బహుదూరానికి తీసికొని వెళ్ళాడు. కామరూపి అయిన మారీచుని చంపి రాముడు వెనుదిరిగి ఆశ్రమానికి బయలుదేరాడు. అంతలో ఒక నక్క తనకు వెనుక వైపున నుండి వికృతంగా అరచింది. అది విని రాముడు తన శరీరం కంపించిపోగా, ఏమి ఆపదరానున్నదో నని అనుమానిస్తూ, మారీచుడు తన కంఠస్వరాన్ని అనుకరిస్తూ హా! సీతా! హా లక్ష్మణా! యను మాటలకు ఏమి ఆపద రానున్నదోనని, అశుభకరమైన నక్క కూతను గురించి ఆలోచిస్తూ, త్వరత్వరగా వస్తున్నాడు. ఇంతలో ధీనవదనుడైన లక్ష్మణుడు ఎదురువచ్చాడు. అప్పుడు రాముడు లక్ష్మణుని ఎడమచేతిని పట్టుకొని, ఆర్తిని ప్రకటిస్తూ, లక్ష్మణా! రాక్షసుల నిలయమైన వనంలో నా అన్నవారు లేకుండా సీతను అచట ఒంటరిగా ఎట్లు వదలి వచ్చావు? అని మందలిస్తూ, నీవామెను ఒంటరిగా వదలివచ్చి పెద్ద తప్పుచేశావు. ఈ వనంలో ఉండే రాక్షసులు ఆమెను చంపియైనా ఉంటారు. లేదా ఆమెను తినివేసియైనా ఉంటారు. లక్ష్మణా! సీతను ఇంక మనం ప్రాణాలతో ఉండటం చూడగలమా? మృగరూపంలో వచ్చిన రాక్షసుడు నన్ను ప్రలోభపెట్టి చాలాదూరం తీసికొనివెళ్ళాడు. చివరికి నే నతనిని

చంపాను. అని రాముడు లక్ష్మణునితో చెబుతూ వడివడిగా నడచుకొంటూ వచ్చాడు.

5. ప్రశ్న : రామలక్ష్మణులు ఏరీతిగా ఆశ్రమాన్ని చేరారు?

జవాబు : శ్రీరాముడు కంగారుపడుతూ లక్ష్మణా! సీతను ఎక్కడ వదలి వచ్చావు? ఆమె లేనిదే నేను జీవించలేను. ఇంత వరకూ ఆమె జీవించి ఉన్నదో లేదో. నీ అజాగ్రత్త కారణంగా, ఆ ఉత్తమురాలు రాక్షసులబారిన పడిందా? ఏమి? దురాత్ముడైన రాక్షసుడు నా కంఠాన్నిపోలి అయ్యో! లక్ష్మణా! అని కేక పెట్టినందువల్ల నీవు కూడా భయపడి ఉండవచ్చు. ఆ భయం కారణంగానే వైదేహి కూడా బయపడి నిన్ను నా కొరకు పంపించి ఉండవచ్చునని నే ననుకొంటున్నాను. అని పరిపరి విధాల రాముడు లక్ష్మణునితో మాట్లాడుతూ, సీతాదేవిని గురించి చింతిస్తూ, వడివడిగా నడచి ఆశ్రమానికి చేరుకొన్నాడు. చాలాదూరం నడచి యుండటంచేత శ్రీరాముడు ఎంతో బడలిపోయాడు. ఆకలి దప్పులకులోనై యుండటంవల్ల ఆయన ముఖం శుష్కించి కళదప్పి యుండింది. అటువంటి స్థితిలో ఆయన ఆర్తితో లక్ష్మణుని మందలిస్తూ, నిట్టూర్పులు విడుస్తూ ఆశ్రమ ప్రదేశాన్నిచేరాడు. అందెచటను సీతాదేవి కనబడక పోవటంచేత, పర్ణశాలలోపల, ఆ పరిసర ప్రాంతాలతోనూ, కలయజూశారు. ఫలితం శూన్యం. రాముడు గగుర్పాటుకులోనై ఎంతో బాధపడసాగాడు.

## నలుబది మూడవ అధ్యాము

జవాబులు : 1.4. ఐదుగురు 2.3. తన అంతఃపురంలో

3. పంద్రెండు నెలలు

# అరణ్య కాండము

## 59, 60, 61, 62, 63, 64 సర్గలు

## నలుబది నాలుగవ అధ్యాయము

1. ప్రశ్న : సీతాదేవిని ఆశ్రమంలో ఒంటరిగా ఎందుకు వదలి వచ్చావు? అని అడిగిన అన్నతో లక్ష్మణుడు. అన్నయా! నా చెవులు వినరాని, నా నోటచెప్పలేని మాటలతో నన్ను మా వదిన మందలించి నందున రావలసి వచ్చింది. అనగా రాముడు ఏది ఏమైనా తమ్ముడూ! నాకు కొన్ని అపశకునాలు కనిపిస్తున్నాయి. అందువలన ఏదో జరుగరానిది జరిగి ఉంటుంది అన్నాడు. ఆ అపశకునాలలో ఒకటి ఏది?

జవాబు : 1. నా కుడి భుజం అదిరింది 2. కుడి కన్ను అదిరింది
2. నా ఎడమ కాలు అదిరింది 4. నా ఎడమ కన్ను అదిరింది

2. ప్రశ్న : ఆశ్రమానికి వచ్చిన రామ లక్ష్మణులకు సీతజాడ కనబడలేదు. అటు చూశారు. ఇటు చూశారు. రాముడి కన్నులు శోకభారంతో ఎరుపెక్కాయి. ఆ సీతాదేవి కొరకు చెట్టుని, పుట్టని, గట్టుని, కొండను కోనను, నదిని నా సీత ఎక్కడ, నా సీత ఎక్కడ, అని అడుగుతూ పరితపిస్తూన్న రాముడు అప్పుడు ఏ విధంగా ఉన్నాడు?

జవాబు : 1. ఉన్మత్తుడిలా ఉన్నాడు 2. మహావీరుడిలా ఉన్నాడు
3. మహారాజులా ఉన్నాడు 4. వనవాసిలా ఉన్నాడు

3. ప్రశ్న : సీతాదేవి కనబడక పోవటమనే బాధనుండి రాముడిని లక్ష్మణుడు ఎంత ఓదార్చినా ఊరట చెందక, లక్ష్మణునితో నేను సీతతో గూడి వనాలకు వచ్చాను. మరలా సీత లేకుండా అయోధ్యలో అడుగుపెడితే అక్కడి వారు సీత ఎక్కడ అని అడిగితే నే నేమని బదులు చెప్పను? అని ముఖ్యంగా ఎవరు ఎదురుపడి సీత ఏదని అడిగితే నేనేమని చెప్పను. అని విలపించాడు?

జవాబు : జవాబుల కాలంలో ఉన్నది.

4. ప్రశ్న : సీతాదేవిని ఏ విధంగా జ్ఞప్తికి తెచ్చుకొంటూ రాముడు బాధపడ్డాడు?

జవాబు : శ్రీరాముడు తీవ్రమైన విచారంతో, సీతా విరహం వలన పరితపిస్తూ,

లక్ష్మణా! ఈ భూ మండలంలో నా వంటి దౌర్భాగ్యుడు మరి యొకడుండడు. అంతులేని శోకపరంపర నన్ను వెంటాడుతూంది. అది నా హృదయాన్ని ముక్కలు చేస్తూంది. మనసును ముక్కలు చేస్తూంది. తమ్ముడూ! ఉత్తమురాలైన సీత భయస్తురాలు. ఎవడైనా ఆమెను బలవంతంగా అపహరించి ఆకాశ మార్గాన తీసికొనిపోయి ఉంటాడు. అప్పుడు నా జానకి ఎంత భయపడి ఉంటుందో? పరపురుషుని తాకుటకైనా ఇష్టపడని నా ధర్మపత్నిని రాక్షసులు చంపి ఆమె నెత్తురు త్రాగివుంటారు. ఆ సమయంలో ఆమె నా సహాయంకొరకు రెప్పలార్పక ఎదురుచూసి ఉంటుంది. లక్ష్మణా! మీ వదిన ఇదివరలో ఈ శిలాతలముపై నాతోగూడి కూర్చొని, మనోహరంగా నాతో ఎన్నో విషయాలు ముచ్చటించేది. ఈ గోదావరి నది ఆమెకు ఎంతో ఇష్టం. కాని, నేను లేకుండా ఆమె నదికి వెళ్ళి ఎరుగదు. ఓ సూర్య భగవానుడా! నీవు కర్మసాక్షివి. లోకంలో నీకు అన్ని విషయాలు తెలుసు. ఓ వాయుదేవుడా! లోకంలో నీకు తెలియకుండా ఏదీ జరగదు. మీరైనా నా సీత ఎక్కడ ఉందో చెప్పండి. అని రాముడు శోకపరవశుడై నిస్పృహతో విలపిస్తుండగా, లక్ష్మణుడు అన్నయా! శోకాన్ని వీడు. నిరాశపడవద్దు. ధైర్యం వహించు. ఉత్సాహంతో వెదుకుదాం. అని తన తమ్ముడు చెబుతున్నా కూడా రాముడు ధైర్యాన్ని కోల్పోయి, అంతులేని దుఃఖంలో కూరుకు పోయాడు.

5. ప్రశ్న : సీతాన్వేషణను ప్రారంభించిన రామ లక్ష్మణులు ఏమేమి మాట్లాడు కొన్నారు?

జవాబు : సీతాదేవికై పరితపిస్తూ, దుఃఖిస్తున్న రాముడు లక్ష్మణా! ఈ నదీ తీరమందు, ప్రస్రవణగిరి ప్రాంతమందు వెదుకుదాము. సీత కనబడవచ్చు. బలిష్టమైన మృగాలు నన్నేచూస్తూ, ఏదో చెప్పాలని చూస్తున్నట్లుగా ఉంది. అని ఆ మృగాలతో నా సీత యెక్కడ? అని అడిగాడు. అంతట ఆ మృగాలు వెంటనే దక్షిణ దిశవైపు ఆకాశం వైపుచూసి, ఆ దిశగా పరిగెత్తాయి. ఆ దృశ్యాన్ని చూసిన లక్ష్మణుడు సీత వెళ్ళిన దిశను అవి మనకు చూపుతున్నాయి. అన్నయా! మనం దక్షిణ నైరుతిదిశగా ప్రయాణిద్దాము. రాక్షసులకు ఆలవాలమైన ఆ

దిశయందు మా వదిన కనబడవచ్చు అన్నాడు. ఆ విధంగా మాట్లాడు కొంటూ ఆ అన్నదమ్ములిద్దరూ ఆ దిశగా అడుగులు వేస్తుండగా, దారిలో అక్కడక్కడా రాలిన పూలను చూశారు. అవి సీతాదేవి ధరించినవేనని రాముడు గుర్తించాడు. పిమ్మట ఇంకొంత దూరం ప్రయాణించగా ఒక రాక్షసుని పెద్దపెద్ద పాదాల గుర్తులను, సీతాదేవి పాదాల గుర్తులను వారు చూశారు. ఇంకా ముందుకు వెళ్ళగా అచట రక్తపు మరకలు, విరిగిపోయిన ధనస్సు, రథము, సారథి, వికృతాకారులైన గాడిదలు కనిపించాయి. అది చూసివారు ఎవరో ఇద్దరు రాక్షసులు సీతాదేవిని చూసి, ఆమెను తినడానికి ఆ రాక్షసులలో తగవు మొదలై యుద్ధం చేసి ఉంటారు. లక్ష్మణా! దేవత లెవ్వరూ నా సీతను కాపాడే ప్రయత్నం చెయ్యలేదు. యిప్పుడే నా సీతను వారు నా కప్పగించనిచో వారు నా ప్రతాపాన్ని చవిచూస్తారు అని శ్రీరాముడు రోషంతో ధనస్సును చేతబట్టాడు.

## నలుబది నాలుగవ అధ్యాయము

జవాబులు : 1.4. నా ఎడమ కన్ను అదిరింది 2.1. ఉన్మత్తుడిలా ఉన్నాడు
3. జనక మహారాజు

..................

# అరణ్య కాండము

## 65, 66, 67, 68, 69, 70 సర్గలు

## నలుబది ఐదవ అధ్యాయము

1. ప్రశ్న : సీతాదేవి యెడబాటు వలన మానసికంగా కృశించియున్న రాముడిని లక్ష్మణుడు ఓదార్చుతూ, అన్నయా! ఈ ప్రదేశ మందంతటా రథ చక్రపుటంచుల ఒత్తిడిచే నలిగిఉంది. ఇచట జరిగిన యుద్ధ చిహ్నాలను బట్టిచూస్తే ఎంత మంది ఇచట యుద్ధంచేసి ఉండవచ్చును. అని లక్ష్మణుడు రామునికి తెలిపాడు?

జవాబు : 1. ఇద్దరు 2. ఒక్కడే
2. గొప్ప సైన్యం 4. ముగ్గురు

2. ప్రశ్న : సీతాదేవికై పరితపిస్తూ, శోకిస్తున్న రాముడిని లక్ష్మణుడు శాంతపరచి, కర్తవ్యాన్ని నివేదించి, కొంతదూరం ముందుకు నడువగా, అచట అవసాన దశలోనున్న జటాయువు కనిపించి, రాముడితో సీతాదేవిని రావణుడు అపహరించుకొని వెళ్ళాడని, అడ్డగించిన తనను ఈ రీతిగా నేలపాలు చేశాడని చెప్పి, ఆ పక్షిరాజు అసువులను కోల్పోయాడు. అప్పుడా జటాయువు కళేబరాన్ని రామ లక్ష్మణులు ఏమి చేశారు?

జవాబు : 1. భూమిలో పాతిపెట్టారు 2. అచటనే వదలి వెళ్ళారు
3. దహన సంస్కారం చేశారు 4. ఒక చెట్టుకు వ్రేలాడదీశారు

3. ప్రశ్న : జటాయువు శ్రీరాముడితో జానకీదేవిని రావణుడు ఏ రీతిగా, ఏ దిశగా తీసికొని వెళ్ళాడని చెప్పాడు?

జవాబు : జవాబుల కాలంలో ఉన్నది.

4. ప్రశ్న : సీతాన్వేషణకై వెళ్తున్న రామలక్ష్మణులకు కబంధుడను రాక్షసుడు ఏ విధంగా కనబడ్డాడు?

జవాబు : రామ లక్ష్మణులిరువురూ ధనుర్బాణాలు ధరించి, సీతాదేవిని వెదకుతూ నైరుతి దిశగా ప్రయాణం సాగించారు. వారు దండకారణ్యం దాటి క్రౌంచారణ్యంలో ప్రవేశించి అటునుండి మూడు యోజనాలు ప్రయాణించి, మతంగాశ్రమానికి, క్రౌంచా రణ్యానికి మధ్య ప్రదేశానికి వచ్చేసరికి వారికి, ఒక కొండ గుహ కనిపించింది. అచటి నుండి రామ లక్ష్మణులు ముందుకు నడుస్తూ, ఒక కీకారణ్యంలో ప్రవేశించారు. అప్పుడు వారికి అడవి దద్దరిల్లే విధంగా ఒక మహాధ్వని వినిపించింది. ఆ ధ్వనివచ్చిన దిశగా నడచిన వారికి ఒక వికృతాకారుడైన రాక్షసుడు కనిపించాడు. అతని రెండు చేతులూ బహుదూరానికి వ్యాపించి ఉన్నాయి. అట్టి చేతులతో క్రూరమృగాలను సైతం ఈడ్చుకొంటూ వస్తున్నాడు. ఆ కబంధుడు రామలక్ష్మణుల దారికి అడ్డంగా నిలిచి వారిద్దరినీ పట్టుకొని తనకు దగ్గరగా లాక్కున్నాడు. అప్పుడు రాముడు తమ్ముడూ! ఎంత వెదికినా సీత కనబడటం లేదు. ఇప్పుడు మన ప్రాణాలకే ప్రమాద మేర్పడింది. ఎంతటి వారికైనా కాలప్రభావం అధిగమించ రానిది. లక్ష్మణా!

పరాక్రమ వంతులు, బలశాలురు, అస్త్ర విద్యలలో ఆరితేరిన వారుకూడ కాలప్రభావానికి వశులై కష్టాలపాలవుతారు. ఎంతటి వారినైనా శాసించడం దైవానికి కష్టంకాదు. అని లక్ష్మణునితో చెబుతూ రాముడు తన మనసును దిటవు చేసుకొన్నాడు.

5. ప్రశ్న : రామలక్ష్మణులు కబందుని ఏ విధంగా కడతేర్చారు?

జవాబు : కబందుడు తనచేతులలో చిక్కియున్న రాకుమాలను జూసి, ఓ రాకుమారులారా! నేను ఆకలిగొని యుండడాన్నిచూసి ఆ దేవుడే మిమ్ములను నాకు ఆహారంగా పంపించినాడు. ఇంక ఆలోచించి లాభంలేదు. అని పలుకుచున్న రాక్షసుని చూసి లక్ష్మణుడు అన్నా! ఈ రాక్షసుని చంపడానికి శస్త్రాలతో పనిలేదు. నీ చేతనున్న ఖడ్గంతో ఆ చెయ్యి నరికివెయ్యి. నా చేతనున్న ఖడ్గంతో ఈ చెయ్యి నరుకుతాను. అని లక్ష్మణుడు తనను పట్టుకొన్న చెయ్యిని నరికాడు. అంతట ఆ కబందుడు తన రెండు చేతులూ నరికివేయబడగా, భూమ్యా కాశాలు దద్దరిల్లే విధంగా అరిచాడు. ఆ దానవుడు నెత్తురు మడుగులో దోగుచు, దుఃఖితుడై, అయ్యా! మీరెవరు? అని అడిగాడు. అప్పుడు లక్ష్మణుడు మేము ఇక్ష్వాకు వంశస్థులము. దివ్య ప్రభావ సంపన్నుడైన ఈయన శ్రీరాముడు. నేను ఆయన తమ్ముడను, లక్ష్మణుడను అని తెలిపాడు. కారణాంతరాల వలన శ్రీరాముని భార్యను ఒక రాక్షసుడు అపహరించాడు. ఆమెను వెదకుచూ మేము ఇచటికి వచ్చాము. ఇంతకు నీవెవరు? అని సౌమిత్రి అడుగగా ఆ కబందుడు ఓ పురుష శ్రేష్ఠులారా! నా అదృష్టం పండి నాకు మీ దర్శనం లభించింది. నా భాగ్యవశంచేత మీరు నా చేతులు ఖండించారు. నేను అవినయంగా ప్రవర్తించడం వలన శాపవశుడనై ఈ వికృత రూపం ప్రాప్తించింది. అని కబందుడు తన కథను అంతా రామ లక్ష్మణులకు వివరించి చెప్పాడు.

## నలుబది ఐదవ అధ్యాయము

జవాబులు : 1.2. ఒక్కడే 2.3. దహన సంస్కారం చేశాడు

3. ఆకాశ మార్గాన, దక్షిణ దిశగా వెళ్ళాడు.

# అరణ్య కాండము

## 71, 72, 73, 74, 75 సర్గలు

## నలుబది ఆరవ అధ్యాయము

1. ప్రశ్న : రామలక్ష్మణులకు కబందుడు తన వృత్తాంతాన్ని చెబుతూ తనకు ఈ వికృత రూపంవచ్చే విధంగా శపించిన మహర్షి ఎవరు అని తెలిపాడు?

జవాబు : 1. శరభంగుడు 2. మతంగ మహర్షి
3. స్థూలశిరుడు 4. అత్రి మహర్షి

2. ప్రశ్న : కబందునికి దివ్యశరీరం ప్రాప్తించిన పిమ్మట రామలక్ష్మణులను ఎవరిని సమాశ్రయిస్తే మీ కార్యం సానుకూల మవుతుంది అని తెలిపాడు?

జవాబు : 1. వాలిని 2. హనుమంతుని
3. అంగదుని 4. సుగ్రీవుని

3. ప్రశ్న : కబందుడు చెప్పిన విధంగా రామ లక్ష్మణులు ఋష్యమూక పర్వతం దిశగా ప్రయాణిస్తూ, మార్గమధ్యలో మతంగ మహర్షి ఆశ్రమంలో ఒక వృద్ధ సన్యాసినిని చూశారు. ఆమె పేరేమి?

జవాబు : జవాబుల కాలంలో ఉన్నది.

4. ప్రశ్న : సుగ్రీవుని కలియుటకై వస్తున్న రామ లక్ష్మణులు త్రోవలో మతంగాశ్రమంలో ఎవరిని ఏ విధంగా అనుగ్రహించారు?

జవాబు : కబందుడు చెప్పిన మార్గాన్ననుసరించి, రామలక్ష్మణు లిరువురూ, ఆ వనానికి పశ్చిమ దిశగా నడవసాగారు. కొంత దూరం ప్రయాణించి వారు అచటి పర్వతశిఖరంపై ఆ రాత్రి గడిపి, మరునాటి ఉదయాన్నే పంపా సరస్సు యొక్క పశ్చిమ తీరానికి చేరారు. పిమ్మట

వారు చుట్టూ వృక్ష సంపదతో కళకళ లాడుతున్న ఆ ఆశ్రమాన్ని చేరి అందున్న శబరిని కలుసుకొన్నారు. యోగ సిద్ధిని పొందిన ఆ శబరి రామ లక్ష్మణులను చూసి కృతాంజలియై, వారికి పాదనమస్కారం చేసింది. పిమ్మట ఆ శబరి ఆ అన్నదమ్ములిద్దరిని అర్ఘ్యపాద్యాదులతో పూజించి ఫల పుష్పాదులను సమర్పించింది. అప్పుడు రాముడు ఓ తపస్సంపన్నురాలా! నీ తపో విధులకు ఎట్టి ఆటంకము కలుగడం లేదుగదా! నీవు నీ గురుసేవలో కృత కృత్యురాలవవు తున్నావు గదా! అని పలికిన శ్రీరాముని మాటలకు శబరి ఓ రామచంద్ర ప్రభూ! నిన్ను కన్నులార దర్శించడంతో నా తపస్సు సిద్ధించింది. నేను శుశ్రూషచేసిన మునులందరూ స్వర్గానికివెళ్తూ పవిత్రమైన ఈ ఆశ్రమానికి లక్ష్మణునితో కలిసి శ్రీరాముడు వస్తాడు. అతడికి సత్కారాలు చెయ్యి. ఆయన దర్శనంతో నీవు ఉత్తమ లోకాలు పొందుతావు. అని పలికి యున్నారు. ఓ పుణ్య పురుషా! మీ అనుమతి అయినచో ఈ తనువును పరిత్యజిస్తాను. మా గురువులు పుణ్యపురుషులు వారు వెళ్ళిన లోకాలకేవెళ్తాను. అందుకు నన్ను అనుమతించండి. అని పలికిన శబరి కోరిక ప్రకారం రాముడు ఓ శబరీ! నీ పూజలకు నేను సంతోషించాను. నీ ఇష్టానుసారం హాయిగా వెళ్ళవచ్చు అన్నాడు. అటుపిమ్మట రామానుమతి కాగానే ఆ శబరి యోగ సమాధిస్థితితో తన శరీరాన్ని విడిచి అక్షయలోకాలకు వెళ్లింది. పిమ్మట రామలక్ష్మణులు ఆ భక్త శబరి పార్థివదేహానికి అగ్ని కార్యాన్ని నిర్వహించి, అచట నుండి ప్రయాణం సాగించారు.

5. ప్రశ్న : శబరి ఆశ్రమాన్నుండి రామ లక్ష్మణుల ఋష్యమూక పర్వతప్రాంత ప్రయాణం ఎలా జరిగింది?

జవాబు : శబరి ఆశ్రమ సమీపంలో సప్తసాగర తీర్థంలో ఆ రామ లక్ష్మణులిద్దరూ స్నానాలు చేసి, పితృదేవతలకు తర్పణాలు విడిచారు. పిమ్మట రాముడు తమ్ముడూ! ఇంతటితో మన అశుభాలన్నీ నశించాయి. నా

మనసుకొంత ఊరట చెందింది. ఇక మనకు శుభాలే జరుగుతాయని పిస్తూంది. లక్ష్మణా! మనమిప్పుడు పంపా సరోవరతీరం వెంట వెళ్దాం. ఋష్యమూక పర్వతం ఇచటికి సమీపాన్నే ఉంది. అచట సుగ్రీవుడు తన అన్న వాలికి భయపడి నివశిస్తున్నాడు. ఆ వానర శ్రేష్టుడు మనకు సీతాన్వేషణా కార్యమున తోడ్పడగలడు. అని రాముడు పలుకుతుండగా లక్ష్మణుడు అన్నయా! నా మనసు కూడా అందుకే ఆరాట పడుతూన్నది. కావున మనము తొందరగా వెళ్లాల్సి ఉంది. అని అన్నదమ్ములిద్దరూ పంపా సరోవరతీరం వెంబడి నడవసాగారు. అప్పుడు రాముడు తమ్ముడూ! మనకు కబందుడు చెప్పిన విధంగా ఈ పంపాసరోవర ప్రాంతంలోనే ఋష్యమూక పర్వతం ఉంటుంది. లక్ష్మణా! ఇట్టి స్థితిలో సీతాదేవి నాకు తోడుగా లేకుండా నేనెట్లు జీవించగలను. అని సీతాదేవిని జ్ఞప్తికి తెచ్చుకొని బాధపడుతున్న రాముడిని ఓదార్చుతూ లక్ష్మణుడు అన్నతో కలిసి పంపా సరోవరం వెంబడి నడచాడు.

## నలుబది ఆరవ అధ్యాయము

జవాబులు : 1.3. స్థూల శిరుడు 2.4. సుగ్రీవుని
3. శబరి

## - అరణ్య కాండము సమాప్తము -

# 4. కిష్కింధా కాండము

## 1, 2, 3, 4, 5, 6 సర్గలు

## నలుబది ఏడవ అధ్యాయము

1. ప్రశ్న : శ్రీరాముడు లక్ష్మణునితో గూడి సమస్త వనాలను, సెలయేళ్ళను, పర్వత గుహలను పరికించిచూస్తూ, సీతాదేవికై వెదకుతూ, ఋష్యమూక పర్వతంపై నడుస్తున్నారు. ధనుర్ధారులైన ఆ రామ లక్ష్మణులను చూసిన వానరులలో మొదటగా భయపడింది ఎవరు?

జవాబు : 1. హనుమంతుడు 2. మైందుడు
3. ద్వివిదుడు 4. సుగ్రీవుడు

2. ప్రశ్న : రామ లక్ష్మణులు ఎటువంటివారో, వారి నిజమైన అంతర్యాన్ని తెలిసికొని రమ్మని సుగ్రీవుడు హనుమంతుని పంపిస్తూ, ఆయనను ఏ రూపంలో వెళ్ళమన్నాడు?

జవాబు : 1. మానవ రూపం 2. వానర రూపం
3. రాక్షసరూపం 4. గంధర్వుడుగా

3. ప్రశ్న : హనుమంతుడు రామలక్ష్మణులను కలిసికొని వారితో మృధు మధురంగా మాట్లాడుతూ సుగ్రీవుని వృత్తాంతాన్ని తెలుపుతూ, మా ప్రభువు సుగ్రీవుడు తన అన్నగారైన వాలి వలన రాజ్యం నుండి తరిమి వేయబడ్డాడు. సుగ్రీవుని భార్యను కూడా వాలి తన వశమందుంచు కొన్నాడు. అని తెలిపాడు. ఆ సుగ్రీవుని భార్య పేరేమి?

జవాబు : జవాబుల కాలంలో ఉన్నది.

4. ప్రశ్న : రామ సుగ్రీవుల మైత్రి ఏవిధంగా జరిగింది?

జవాబు : రామ లక్ష్మణులను హనుమంతుడు ఋష్యమూక పర్వతంపైకి చేర్చేటప్పటికి, సుగ్రీవుడు దగ్గరలో ఉన్న మలయగిరి పైకివెళ్ళి ఉన్నాడు. అప్పుడు హనుమంతుడు సుగ్రీవుని వద్దకువెళ్ళి, ఆ కపిరాజును తీసికొనివస్తూ, త్రోవలో రామ లక్ష్మణుల విశేషాలను తనకు తెలిసినదంతా చెప్పి, ఋష్యమూక పర్వతం పైకి తీసికొని

వచ్చి, రామ లక్ష్మణులను దర్శనం చేయించాడు. అంతట మారుతి ఆ సుగ్రీవునితో ప్రభూ! ఈ రామ లక్ష్మణులు ఇక్ష్వాకు వంశ రాకుమారులు. వీరు ధర్మా చరణంతో ప్రసిద్ధులు. పితృవాక్య పరిపాలనార్థం వనవాసం చేస్తుండగా ఈ రాముని భార్యను రావణుడు అపహరించాడు. అందువలన ఇతడు నీ సహాయాన్ని కోరి ఇచటికి వచ్చాడు. అని పలికిన హనుమంతుని మాటలకు సుగ్రీవుడు సంతోషించి, రామ దర్శనంతో తన భయమంతా తొలగి, ప్రభూ, నీ వంటి మహాత్ముడు వానరుడనైన నా స్నేహాన్నికోరి రావడం నిజంగా నా అదృష్టం. ఇదిగో నా స్నేహ హస్తాన్ని చాస్తున్నాను. అనగానే రాముడు సుగ్రీవుని చేతిని అందుకొని, నిర్మలమైన ఆ మైత్రిని పురస్కరించుకొని రాముడు సుగ్రీవుని కౌగిలించు కొన్నాడు. అప్పుడు హనుమంతుడు చేవగలిగిన జమ్మి కొమ్మలను తెచ్చి అగ్నిని మథించి, ప్రజ్వలింప జేసి, అగ్నిని పూలతో పూజించాడు. రామ సుగ్రీవు లిద్దరు ఒకరిచేయి ఒకరు పట్టుకొని అగ్నికి ప్రదక్షిణం చేసి, అగ్నిసాక్షిగా మిత్రులైనారు. హనుమంతుడు ఆ రామ లక్ష్మణులకు ఉచితాసనాలను ఏర్పాటు చేసి కూర్చుండ జేశాడు.

5. ప్రశ్న : సీతాదేవి నగల మూటను రామ లక్ష్మణులకు సుగ్రీవాదులు ఏ విధంగా చూపించారు?

జవాబు : సుగ్రీవుడు శ్రీరాముని ఓదార్చుతూ ఓ మహాబాహూ! నీవు త్వరలోనే భార్యా వియోగ దుఃఖము నుండి బయట పడగలవు. ఓ రామా! ఒకనాడు క్రూరాత్ముడైన ఒక రాక్షసుడు ఒక స్త్రీని తీసికొని పోతుండగా నేను చూశాను. నా ఊహ ప్రకారం ఆమె సీతాదేవియే అయి ఉండవచ్చు. ఎందుకంటే ఆమె జీరఓయిన కంఠంతో రామా! రామా! లక్ష్మణా! అంటూ బిగ్గరగా ఏడుస్తూ, నన్ను జూసి తన వస్త్రంలో కట్టిన మూటను క్రిందికి జార విడిచింది. అప్పుడు నేను నా నలుగురు మంత్రులతో గూడి కొండపై ఉన్నాను. పిమ్మట నేనా నగల మూటనుతీసి భద్రంగా ఉంచాను. అని సుగ్రీవుడు ఒక కొండ గుహలోకి వెళ్ళి, అక్కడ దాచిన నగల మూటనుతెచ్చి శ్రీరాముని ముందుంచాడు. అప్పుడు శ్రీరాముడు పవిత్రమైన ఆ నగల మూటను

విప్పి చూడబోగా, ఆయన కన్నులు అశ్రుపూరితాలై, మంచుచే కప్పబడిన చంద్రుని వలె మసకగాను, అస్పష్టంగాను కనిపించగా, రాముడు హా! ప్రియా! యని విలపిస్తూ ధైర్యంసడలి నేలపైపడి పోయాడు. కొంత సమయానికి తేరుకొని ఆ ఆభరణాలను హృదయానికి హత్తుకొని, పుట్టలోని పాము బుసలుకొట్టి నట్లు నిట్టూర్పులు విడిచాడు. అంతట శ్రీరాముడు సౌమిత్రిని జూసి ఇంతసేపు ఏడ్చాడు. పిమ్మట రాముడు లక్ష్మణునితో ఆభరణాలను చూడమన్నాడు. విచార వదనంతో లక్ష్మణుడు ఆభరణాలను చూసి అన్నా! ఈ కేయూరములు, కుండలములు నేనెరుగను, కాని నిత్యము మా వదినకు పాదాభి వందనం చేయుచుండుట వలన ఈ కాలి అందెలు మాత్రం ఆమెవే యని గుర్తిస్తున్నాను. ఆ విధంగా సుగ్రీవుడు చూపిన నగలనుచూసి రామ లక్ష్మణులు అవి సీతాదేవివే యని నిర్ధారించు కొన్నారు.

## నలుబది ఏడవ అధ్యాయము

జవాబులు : 1.4. సుగ్రీవుడు　　2.1. మానవ రూపం
3. రుమ

...........

# కిష్కింధా కాండము

## 7, 8, 9, 10, 11, 12 సర్గలు

## నలుబది ఎనిమిదవ అధ్యాయము

1. ప్రశ్న : సుగ్రీవుడు తన వృత్తాంతాన్ని శ్రీరాముడికి తెలుపుతూ, తన అన్నయైన వాలి పెట్టెడు బాధలకు ఎవరి అండదండల వలన ఇప్పటి వరకు బ్రతికి ఉన్నాను అని తెలిపాడు?

జవాబు : 1. హనుమంతాదుల　　2. అంగదాదుల
3. తారుడు　　4. జాంబ వంతాదుల

2. ప్రశ్న : శ్రీరామునికి సుగ్రీవుడు తన వృత్తాంతాన్ని తెలుపుతూ వాలి, సుగ్రీవులకు తండ్రి ఎవరుగా తెలిపాడు?

జవాబు : 1. కేసరి 2. నీలుడు
3. ఋక్షరజుడు 4. నలుడు

3. ప్రశ్న : సుగ్రీవుడు శ్రీరామునితో చెబుతూ రామా! మా అన్న వాలికి పూర్వపు శత్రువైన ఒక రాక్షసుడు, అర్ధ రాత్రివేళ యుద్ధానికి ఆహ్వానిస్తే, మేమిరువురము వెళ్ళాము. మమ్ములను చూసిన ఆ రాక్షసుడు చాలాదూరం పరుగెత్తి ఒక కొండగుహలో ప్రవేశించాడు. అని తెలిపిన ఆ గుహలో ప్రవేశించిన రాక్షసుడు ఎవరు?

జవాబు : జవాబుల కాలంలో ఉన్నది.

4. ప్రశ్న : సుగ్రీవుడు శ్రీరామునికి తన అన్న పరాక్రమాన్ని గురించి ఏరీతిగా వివరిచాడు?

జవాబు : ఓ రఘువీరా! మా అన్న వాలి మహా పరాక్రమశాలి. ఒకప్పుడు దుందుభి అనే రాక్షసుడు మహిష రూపందాల్చి వాలిపైకి యుద్ధానికి వచ్చాడు. మహా బలశాలియైన ఆ రాక్షసుడిని ఎదుర్కోవడానికి వెళ్తూ వాలి, దేవేంద్రుని అంశతో జన్మించిన కారణంగా, ఇంద్రుడు ఇచ్చిన హారాన్ని ధరించి యుద్ధానికి వెళ్ళాడు. ఆ మాలను ధరించిన వానికి ఎదుటి వారి బలమంతయు అతనిని చేరుతుంది. అది గుర్తుంచుకొని వాలి దుందుభిని ఎదుర్కొన్నాడు. పోరు ఘోరంగా జరిగి, ఆ యుద్ధంలో వాలి దుందుభిని సంహరించాడు. ఆ కళేబరాన్ని వాలి విసిరివేయగా, దుందుభి నోటినుండి వెలువడిన రక్తపు బిందువులు మతంగ మహర్షి ఆశ్రమంలో పడ్డాయి. తనపై పడిన రక్తపు మరకలను చూసిన మతంగ మహర్షి, విషయం తెలిసికొని, నేను నివశిస్తున్న ఈ ఆశ్రమాన్ని రక్తపు మరకలతో అపవిత్రం చేసిన ఆ వాలి ఈ ఋష్యమూక వనమందు నివశింపరాదు. అట్లు నివశించినచో అతనికి మరణము తప్పదు. అని శపించి అట్లు వాలియేగాక అతని అనుచరులు గూడ ఒక్క రోజులోపల ఈ ప్రాంతాన్ని వదలి వెళ్ళాలి. అట్లు వెళ్ళకున్నచో వారు వేలకొలది సంవత్సరాలు పాషాణాలై పోతారు. అని మహర్షి శపించాడు. ఆ కారణంగా అప్పటి నుండి వాలి, ఆతని అనుచరులు ఈ పర్వత ప్రాంతానికి రావడం మానివేశారు. ఓ రామా! ఆనాడు మా అన్న

విసరిన దుందుభి హస్తిపంజరం ఇచటనే పడి ఉన్నది. గమనించుమని తన అన్న వాలి పరాక్రమాన్ని గురించి సుగ్రీవుడు రాముడికి తెలిపాడు.

5. ప్రశ్న : వాలి సుగ్రీవుల యుద్ధం ఏ విధంగా జరిగింది?

జవాబు : వాలి పరాక్రమాన్ని గురించి సుగ్రీవుని ద్వారా తెలిసికొన్న రాముడు, సుగ్రీవునికి విశ్వాసం కలిగించడానికై, దన కోదండాన్ని ఎక్కుపెట్టి వాడియైన బాణాన్ని ప్రయోగించి అడ్డదిడ్డంగా ఉన్న ఏడు మద్ది చెట్లను కూల్చాడు. అది చూసిన సుగ్రీవుడు శ్రీరాముని పరాక్రమానికి అస్త్రపటిమకు ఆశ్చర్యపడి, రాముని పాదాలకు నమస్కరించాడు. ప్రభూ! ఇంతటి ప్రతిభావంతుడివైన నిన్ను రణరంగంలో ఎదిరించి నిలువగల వారెవ్వరూ లేరు. కావున ఇప్పుడే వాలిని సంహరించు అన్నాడు. అప్పుడు రాముడు సుగ్రీవా! ఇక నీవు కిష్కింధకు వెళ్ళి నిన్ను హింసించునట్టి వాలిని యుద్ధానికి ఆహ్వానించు. అని పలికిన రాముని మాటల ప్రకారం సుగ్రీవుడు కిష్కింధా నగరం వెలుపల ఉండి భయంకరంగా గర్జించి వాలిని యుద్ధరంగానికి ఆహ్వానించాడు. రాముడు అడవిలో దట్టమైన పొదలచాటున నిలిచి ఉన్నాడు. మహా బలశాలియైన వాలి తన తమ్ముడు సుగ్రీవుని గర్జనను విని కోపంతో తొట్రుపాటుతో నగరం నుండి వెలుపలికి వచ్చాడు. అప్పుడు వారిరువురు ఆ యుద్ధభూమి యందు పిడుగుపాటు వంటి అరచేతి దెబ్బలతోనూ, వజ్రాయుధం వంటి పిడికిళ్ళ గుద్దులతోనూ, పరస్పరం మోదుకొన్నారు. అప్పుడు ధనుర్ధారియైన రాముడు అశ్వనీ దేవతలవలె ఒకరితో ఒకరికి పోలిక యున్న ఆ ఇద్దరు వీరులను చూసి సుగ్రీవుని, వాలిని పోల్చుకోలేక ప్రాణాంతకమైన బాణాన్ని ప్రయోగించలేదు. వాలి చేతిలో ఎక్కువగా దెబ్బలుతిన్న సుగ్రీవుడు, తనకు రక్షకుడైన రాఘవుడు కనిపించక పోవడంచేత ఋష్యమూక పర్వతం వైపుకు పరుగులు తీశాడు. ఆ విధంగా వాలి సుగ్రీవుల యుద్ధం జరిగింది.

## నలుబది ఎనిమిదవ అధ్యాయము

జవాబులు : 1.1. హనుమంతాదుల 2.3. ఋక్షరజుడు
3. మాయావి

# కిష్కింధా కాండము

## 13, 14, 15, 16, 17, 18 సర్గలు

## నలుబది తొమ్మిదవ అధ్యాయము

1. ప్రశ్న : వాలి సుగ్రీవులు ఇరువురూ ఒక్కలాగే ఉన్నందున సుగ్రీవుని గుర్తించేందుకు శ్రీరాముని సూచన మేరకు లక్ష్మణుడు సుగ్రీవునికి దేనిని అలంకరింప జేశాడు?

జవాబు : 1. శిరస్త్రాణము 2. నడుముకు దట్టీకట్టడం వల్ల
3. భుజకీర్తులను 4. మెడలో పూలమాలను

2. ప్రశ్న : రెండవసారి సుగ్రీవుడు కిష్కింధకువెళ్ళి, గర్జనచేసి, వాలిని యుద్ధానికి ఆహ్వానిస్తూండగా, వాలి కోపంతో యుద్ధానికి బయలు దేరుతుండగా, ఆయనను యుద్ధానికి వెళ్ళవద్దు అని వారించ ప్రయత్నించింది ఎవరు?

జవాబు : 1. రుమ 2. తార
3. నీలుడు 4. అంగదుడు

3. ప్రశ్న : వాలి సుగ్రీవులు యుద్ధం చేస్తుండగా శ్రీరాముడు, ఎక్కడ ఉండి వాలిని బాణంతో కొట్టాడు?

జవాబు : జవాబుల కాలంలో ఉన్నది.

4. ప్రశ్న : యుద్ధ భూమిలో పడిపోయిన వాలి రాముడిని ఏరీతిగా అధిక్షేపించాడు?

జవాబు : వాలి సుగ్రీవులిరువురూ భయంకరంగా యుద్ధం చేస్తుండగా, క్రమేణా సుగ్రీవుని శక్తి క్షీణించ సాగింది. అది గమనించిన రాముడు విషసర్పంతో సమానమైన బాణాన్ని వదిలాడు. అది వాలి వక్షస్థలాన్ని నాటుకొన్నది. దాని తీవ్రతకు వాలి నేలకూలాడు. వాలి శరీరం నుండి ప్రవహించిన రక్తంతో అతడి శరీరం తడిసి పోయింది. వాలి అచేతనుడై పడి ఉన్నాడు. పిమ్మట ఆ వాలి తిన్నగా కన్నులు తెరచి చూస్తున్నాడు. అటువంటి వాలిని రామ లక్ష్మణులు ఆదరంతో చూస్తూ అతనిని సమీపించారు. అంతట వాలి మహా బలశాలురైన

రామ లక్ష్మణులను చూశాడు. అప్పుడతడు సవినయంగా రామునితో ఓ స్వామీ! నీవు ఒక మహారాజు కుమారుడవు. సకల ధర్మశాస్త్రాలు నేర్చిన వాడవు. ఉత్తమ వంశంలో జన్మించావు. సత్య పరాక్రమ వంతుడవు. అట్టి నీవు నే నెవరితోనో యుద్ధం చేస్తుండగా నా వక్షస్థలంపై ఎందుకు కొట్టావయ్యా! నీవు సద్వంశానికి చెందిన వాడవని, తార వద్దని వారించినా యుద్ధానికి వచ్చాను. ఇంతకు ముందెన్నడూ నేను నిన్ను చూసి యుండలేదు. నా వలన నీకేమి అపకారం జరిగి యుండలేదు. కనుక ఇతరులతో యుద్ధం చేస్తుండగా, నన్ను ధర్మాత్ముడవైన నీవు దెబ్బతీయవు అని నేను పూర్తిగా విశ్వశించాను. కాని నీ బుద్ధి ఇట్లు దారి తప్పినట్లున్నది. నీ దేశానికిగాని, నీకుగాని నేనెన్నడూ అపకారంచేసి ఎరుగను. అట్టి నిరపరాధినైన నన్ను నీవెందుకు చంపభూనావు? నేను కాయలు, దుంపలు తింటూ వనాలలో జీవించే వానరుడను. ఏనాడూ నిన్నెదిరించి యుద్ధం చేసిన వాడనుగాను. నా ఎముకలు, చర్మము, మాంసము మీకు పనికిరావు. నిరపరాదులమైన మా వంటి వారిపై నీ ప్రతాపం చూపుతావని ఊహించలేక పోయాను. ఈ నీవు చేసిన పని ఉచితమని భావిస్తే నాకు సమాధానం చెప్పు. అని వాలి గాయపడి దప్పిగొని, నోరెండిపోయి రాముడినే చూస్తూండి పోయాడు.

5. ప్రశ్న : వాలి అధిక్షేపణకు రాముడు ఏమని సమాధానం చెప్పాడు?

జవాబు : శ్రీరాముని బాణపు దెబ్బకు గురియైన వాలి రఘువరుని ఆక్షేపిస్తూ, పలికిన పిమ్మట తేజస్సులేని సూర్యునివలె ఉన్నాడు. అప్పుడు రాముడు 'వాలీ' ధర్మార్ధకామాలను, లౌకిక ఆచారాలను తెలిసికొనక అజ్ఞానంచే నీవు నన్ను ఇప్పుడు తప్పు పట్టుచున్నావు. కొండలతో, కోనలతో, అరణ్యాలతో కూడిన ఈ భూమి జంభూ ద్వీపంలోనిది. ఇది యంతయు ఇక్ష్వాకు ప్రభువుల ఆధీనంలోనిది. ఇచటి మృగాలను, పక్షులను, మనుష్యులను నిగ్రహించుటకు అనుగ్ర హించుటకు ఆ వంశపు రాకుమారులమైన మాకు సర్వాధి కారముంది. ధర్మమార్గాన్ని వీడి ప్రవర్తించు వారిని మేము తప్పక దండిస్తాము. నీవు పూర్తిగా స్వార్ధపరుడవు. భోగలాలసుడవు. రాజధర్మ శాసనాన్ని వీడి ధర్మ విరుద్ధానికి పాల్పడ్డావు. తనకంటే పెద్దవాడైన అన్న, తండ్రి, విద్యనేర్పిన గురువు ఈ ముగ్గురూ తండ్రి

సమానులు. అటువంటి ధర్మాన్ని గంగలో కలిపి, నీ తమ్ముని భార్య రుమ నీకు కోడలుతో సమానం. కోడలు కూతురుతో సమానం. నీ తమ్ముడు బ్రతికి ఉండగా నీ కూతురుతో సమానమైన రుమను, కామాతురుడవై పాపకృత్యానికి ఒడిగట్టావు. అందువలన నీకు మరణ దండన విధించవలసి విచ్చింది. నీ తమ్ముడు సుగ్రీవుడు నాకు మేలు చేయడానికి సిద్దపడ్డాడు. అతనికి ఆ సమయంలో నీ భార్యను, రాజ్యాన్ని తిరిగి పొందేట్లుగా చేస్తాను. అని వాగ్దానం చేశాను. దానిని నెరవేర్చటం నా ధర్మం కదా! అందువలన నీకు తగిన దండన విధంచ వలసి వచ్చింది. దీనిని నీవు బాగా అర్థంచేసుకో గలవు. రాజులు వేటాడే సమయంలో ఉచ్చులు వేస్తారు. వలలు పన్నుతారు. చెట్టుచాటున మాటువేసి కొడతారు. ఇవి ఏదీ అధర్మమైనవి కావు. కావున నేను చేసినది కూడా ధర్మ సమ్మతమైన పనేనని రాముడు వాలికి వివరణ ఇచ్చాడు.

## నలుబది తొమ్మిదవ అధ్యాయము

జవాబులు : 1.4. మెడలో పూలమాలను 2.2. తార
3. చెట్టుచాటున ఉండి

...........

# కిష్కింధా కాండము

## 19, 20, 21, 22, 23, 24 సర్గలు

## ఏబదియవ అధ్యాయము

1. ప్రశ్న : శ్రీరాముని బాణపుదెబ్బకు వాలి రణభూమిలో పడి ఉన్నాడని తెలిసికొన్న తార, అంగదునితో గూడి రణభూమికి వచ్చి, అచేతనుడై పడియున్న వాలిని చూసి, గుండె పగిలేలా శోక సంతప్తయై నేలపై బడింది. అది చూసిన సుగ్రీవుని మానసిక స్థితి ఏ విధంగా ఉన్నది?

జవాబు : 1. సంతోషించాడు 2. విషాదానికి లోనయ్యాడు
3. పగతో రగిలి పోయాడు 4. తనతో తాను నవ్వుకున్నాడు

2. ప్రశ్న : మొదలు నరికిన చెట్టువలె పడిఉన్న తన భర్త వాలిపైబడి తార

విలపిస్తూండగా, ఆమెను ఓదార్చడానికి ప్రయత్నించినది ఎవరు?

జవాబు : 1. సుగ్రీవుడు 2. రుమ
3. హనుమంతుడు 4. అంగదుడు

3. ప్రశ్న : అవసానదశలో ఉన్న వాలి తిన్నగా గాలి పీల్చుకొంటూ సుగ్రీవుని పిలిచి, ఆయనకు అంగదుని అప్పగించి, నాయనా సుగ్రీవువా! నా ప్రాణముండగానే ఇది తీసికో, అని దేనిని ఇచ్చాడు ?

జవాబు : జవాబుల కాలంలో ఉన్నది.

4. ప్రశ్న : చివరి సారిగా వాలి సుగ్రీవునితో ఏమి మాటలు మాట్లాడాడు?

జవాబు : కొన ఊపిరితో ఉన్న వాలి. అంతటా కలియజూసి, ముందుగా సుగ్రీవుని దగ్గరగా పిలిచి సోదరా! నీ భార్యను నా వశమందుంచు కొని, నిన్ను కిష్కింధ నుండి వెళ్ళగొట్టి నందుకు నన్ను దోషిగా తలంపవద్దు. ఇది అంతా విధి విలాసము. నేను బల గర్వితుడనై అజ్ఞానవశం చేత అట్లుచేశాను. అన్నదమ్ములమైన మనం కలిసి మెలసి హాయిగా జీవించే యోగాన్ని దైవం మన నొసట వ్రాయలేదు. కనుక అందుకు విరుద్ధంగా ప్రవర్తించాము. నేను ఇంకొక్క క్షణంలో తనువు చాలించి పరలోకానికి వెళ్ళబోతున్నాను. కావున ఈ వానర రాజ్యాన్ని నీవు స్వీకరించు. సుగ్రీవా! ఈ అవసాన దశలో నేను చెప్పే మాటలు ఆలకించు. ఈ రాజ్యానికి నీవు పట్టాభిషిక్తుడవు కమ్ము. తమ్ముడూ! నా ప్రాణానికి ప్రాణమైన నా కొడుకు అంగదుని, ఇక మీదట నీ బిడ్డగా భావించి, వాడిని చేరదీసి సంరక్షించు. సోదరా! నా భార్య తార ఎంతో సూక్ష్మబుద్ధి గలది. రాబోవు ఆపదలను పసిగట్టి సలహాలను ఇవ్వగలది. తార ఏ కార్యాన్ని గురించి చెప్పినా, ఆమె మాటలను నీవు నిస్సంశయంగా అనుసరించు. తమ్ముడూ! శ్రీరాముని కార్యాన్ని ఎట్టి సంశయము లేకుండా చెయ్యి. అట్లు చేయనిచో, నన్ను బలిగొన్న బాణం, నిన్ను శిక్షించడానికి ఎదురు చూస్తూంటుంది. సుగ్రీవా! ఇదిగో నా బొందిలో ప్రాణముండగానే ఈ దివ్యమైన బంగారుమాలను నీవు ధరించు. లేనిచో నా మరణానంతరం, ఈ మాల అజేయశక్తి నశిస్తుంది. అని పలికిన వాలి మాటలకు సుగ్రీవునికి వైరభావం పోయి అన్న చెప్పినట్లు గానే చేశాడు. పిమ్మట అంగదునితో నాయనా! నీ పినతండ్రి చెప్పినట్లుగా నడుచుకోమని చెప్పి వాలి తన ప్రాణాలను వదిలాడు.

5. ప్రశ్న : తారను, సుగ్రీవుని శ్రీరాముడు ఏరీతిగా ఓదార్చాడు?

జవాబు : భర్త మరణించడాన్ని తట్టుకోలేక బాధతో సంతతధారగా కన్నీరు గార్చుతూ, శోక సముద్రంలో మునిగియున్న తారను జూసి సుగ్రీవుడు చలించిపోయాడు. లోలోన కుమలిపోతూ శ్రీరాముని కడకు వచ్చి ప్రభూ! నీవు చేసిన ప్రతిజ్ఞను నిలుపుకొన్నావు. రాజ్య ఫలం నాకు దక్కింది. కాని నాకు ఆరాజ్య భోగాలపై మనసు పోవడం లేదు. అంతేగాదు జీవితం మీదనే నాకు విరక్తి కలిగింది. అని బాధపడుతున్న సుగ్రీవుని రాముడు ఓదార్చాడు. పిమ్మట శ్రీరాముడు తార తనను పదేపదే చూస్తుండడం గమనించాడు. శోక మగ్నయై ఆక్రందిస్తున్న తార దుఃఖాన్ని తొలగింప దలచి ఆ ప్రభువు ఆదరంతో ఆమె వైపు చూశాడు. అప్పుడు శ్రీరాముడు ఆమెవైపు రావడం చూసి, ముఖ్య సచివులు ఆమెను లేవదీసి కూర్చుండ బెట్టారు. తన భర్తను ఒకే భాణంతో హతమార్చిన వాడు. అని భావించి పరుష వచనాలను మాట్లాడు సంకల్పంతో రాముని వైపు చూసింది. కాని ఆయన దివ్య మంగళ రూపాన్ని చూసి, ఆ ప్రభావంతో ఆమెలోని తీవ్రప్రభావం తగ్గి, ఓ రామా! నీవు దేశ కాలాదులకు అతీతుడవు. నీవు ధర్మ రక్షణకై అవతరించిన వాడవు. కనుక నా భర్త వధించిన భాణంతోనే నన్ను చంపివేయి. నేను ఆయన సమీపానికి పోతాను. భార్య భర్తకు అర్ధ శరీరం కదా! నేను లేకుండా నాభర్త స్వర్గమందైనా సుఖంగా ఉండలేడు. నాలోని సగభాగం శరీరం ఒక్క భాణపు దెబ్బతో వెళ్ళి పోయింది. ఇక మిగిలిన సగభాగపు ఈ శరీరానికి నిష్కృతి కలిగించు అని తార ఈ విధంగా పలుకు తూండగా శ్రీరాముడు ఆమెను ఓదార్చుతూ ఓ వీరపత్నీ! నీవు ఇట్లు విరక్తికి లోనుకావద్దు. విధిరాతను ఎవ్వరూ తప్పించలేరు. నీ కుమారుడైన అంగదుడు త్వరలోనే యువరాజు కాగలడు. ఈ విధంగా నీకు సంతోషమే ప్రాప్తిస్తుంది. అని రాముడు యుక్తియుక్తంగా తారను ఓదార్చాడు.

## ఏబదియవ అధ్యాయము

జవాబులు : 1.2. విషాదానికి లోనయ్యాడు 2.3. హనుమంతుడు
3. దివ్యమైన బంగారు హారాన్ని

# కిష్కింధా కాండము

## 25, 26, 27, 28, 29 సర్గలు

## ఏబది ఒకటవ అధ్యాయము

1. ప్రశ్న : వాలి మరణానికి సుగ్రీవుడును, తారయు, అంగదుడును శోకిస్తుండగా, రామ లక్ష్మణులు వారిని ఓదార్చుతూ, చనిపోయిన వాలికై మీరు ఎంతగా విలపించినా ఆయన ఆత్మకు శాంతి కలుగదు. కనుక ఆ కళేబరానికి ఎటువంటి క్రియలు చేయ మన్నాడు?

జవాబు : 1. దహన సంస్కారంచేయండి
2. భూమిలో పాతిపెట్టండి
3. ఈ కళేబరాన్ని వదలి వెళ్ళండి
4. క్రూర మృగాలకు ఆహారంగా వెయ్యండి.

2. ప్రశ్న : వాలికి ఉత్తరక్రియలు నిర్వహించిన పిమ్మట శ్రీరాముడు కిష్కింధా రాజ్యానికి ఎవరిని పట్టాభిషిక్తునిగా చెయ్యమని ఆదేశించాడు?

జవాబు : 1. అంగదుని 2. తారకు
3. సుగ్రీవునికి 4. హనుమంతునికి

3. ప్రశ్న : పట్టాభిషేకం జరిగిన పిమ్మట సుగ్రీవునితో రాముడు మిత్రమా! ఇది శ్రావణ మాసం మొదలు కొని నాలుగు నెలలు వర్షాకాలం. యుద్ధానికి అనువైన కాలం కాదు. కావున, ఈ లోపల నీవు సైన్య సమీకరణ చెయ్యి. ఈ కాలంలో తాము ఎక్కడ నివాస ముంటాము అని రాముడు సుగ్రీవునితో చెప్పాడు ?

జవాబు : జవాబుల కాలంలో ఉన్నది.

4. ప్రశ్న : రామ లక్ష్మణులు ప్రస్రవణగిరిపై ఏ విధంగా కాలం గడుపుతున్నారు?

జవాబు : సుగ్రీవుడు వానరులకు ప్రభువైన పిమ్మట శ్రీరాముని వద్దకు వచ్చి ఆయన ఆశీర్వాదాన్ని తీసికొని వెళ్ళాడు. అటు పిమ్మట రామ లక్ష్మణులు ప్రస్రవణగిరికి చేరారు. ఆ గిరిపై క్రూర మృగాలతోపాటు ఎలుగు బంట్లు, కోతులు, కొండముచ్చులు, అడవి పిల్లులు తిరుగాడు తుంటాయి. అచట పొదలు, లతలు విరివిగా వ్యాపించి, మహావృక్షాలు ఏపుగా పెరిగి ఉన్నాయి. నిర్మలమైన జలాశయాలు

సమృద్ధిగా ఉన్నాయి. లక్ష్మణునితోపాటు శ్రీరాముడు ఆ గిరి శిఖరము నందు విశాలమైన ఒక కొండ గుహను నివాసంగా ఉండడానికి నిర్ణయించుకొని అందుండసాగారు. అప్పుడు రాముడు తమ్ముడూ! శరత్కాలములో సీతాన్వేషణా ప్రయత్నాన్ని ప్రారంభిస్తాము. అని సుగ్రీవునితో చెప్పాము గదా! మనం ఈ వర్షాకాలం ముగియు వరకు ఇచటనే నివశించ వలసి ఉంది. వానరు లందరూ పరమ సంతోషంతో నృత్యాలు చేస్తున్నట్లు వారు చేసే వాయిద్యాల చప్పుళ్ళు వినిపిస్తున్నాయి. సుగ్రీవునకు రాజ్యాధికారం దక్కింది. భార్యతోడైంది. బంధువులతో, సంపదలతో అతడు ఆనందంగా ఉన్నాడు. అని రామ లక్ష్మణులు అనుకొంటూ ప్రస్రవణగిరిపై దొరికే పండ్లు, పూలతో సుఖంగా ఉండాలని ప్రయత్నిస్తున్నారు. కాని రాముడికి తన భార్యయైన సీతాదేవి అపహరింపబడి, దూరంగా ఉండటం వలన, ఆమెనే స్మరించు కొంటూ, ఉండటం వలన ఈ సౌకర్యాలు, అందాలు ఏమాత్రం సంతోషాన్ని కలిగించలేక పోయాయి. అట్లు పరితపిస్తున్న అన్నను జూసి లక్ష్మణుడు కుమిలి పోతున్నాడు. అట్టి స్థితిలో సౌమిత్రి తన అన్నను ఓదార్చుటకు ప్రయత్నించే వాడు. అన్నయా! కోపాన్ని, బాధను అణచుకొని శరత్కాలము వరకు వేచి ఉందాము. వర్షాకాలం ముగియు వరకు ఈ నాలుగు నెలలు కష్టాలు సహించి మనలోని ఉత్సాహాన్ని తగ్గనీయక ఈ వనమందే మన మిద్దరం నివసించు దాము. అని వారిద్దరూ ఆ ప్రస్రవణ గిరిపైననే కాలం గడపసాగారు.

5. ప్రశ్న : శరత్కాల ప్రవేశ సమయంలో హనుమంతుడు సుగ్రీవునికి, రామకార్యాన్ని గురించి ఏ విధంగా సూచించాడు?

జవాబు : వర్షాకాలం ముగిసి శరత్కాల ప్రవేశాన్ని గమనించి హనుమంతుడు సీతాన్వేషణకు ఇది తగిన సమయమని గ్రహించి వెంటనే సుగ్రీవుని చేరి ప్రభూ! నీకు రాజ్యాధికారం ప్రాప్తించింది. కీర్తిప్రతిష్టలు వచ్చాయి. మిత్రుని కిచ్చిన వాగ్దానము ప్రకారం వారి కార్యాన్ని చక్కబెట్ట వలసి ఉంది. మిత్రులకు చేయవలసిన సహాయాన్ని సకాలంలో చేసిన సన్మార్గాన ప్రవర్తించు వారికి, రాజ్యము, యశస్సు, పరాక్రమము వృద్ధి చెందుతాయి. అట్లుగాక, ఆలస్యము అలక్ష్యము చేసిన వారికి విపరీత ఫలితాలు కలుగుతాయి. ప్రభూ! నీవు చేసిన వాగ్ధానం ప్రకారం శ్రీరాముని కార్యాన్ని సఫలం చేయాలి. ప్రభూ

శ్రీరాముడు మనకు పరమ మిత్రుడు. ఆయన దయాలబ్ధ కారణంగానే గదా! మనము అనుభవిస్తున్న ఈ సుఖభోగాలు. కావున నీవు వెంటనే ప్రత్యుపకారం చేయడానికి ప్రయత్నించు. సీతాదేవిని వెదకడానికై వానర ప్రముఖులను ఆదేశించు. అని హనుమంతుడు సకాలంలో యుక్తియుక్తంగా నివేదించిన మృధు వచనాలు విని, సత్త్వసంపన్ను డైన సుగ్రీవుడు 'నీలుడు' అనే సేనాపతిని, అన్ని దిక్కుల నుండి సమస్త వానర సైన్యాన్ని సమీకరించడానికై ఆదేశించాడు.

## ఏబది ఒకటవ అధ్యాయము

జవాబులు : 1.1. దహన సంస్కారం చేయండి 2.3. సుగ్రీవునికి
3. ప్రశ్రవణగిరిపై

..................

# కిష్కింధా కాండము

## 30, 31, 32, 33, 34, 35 సర్గలు

## ఏబది రెండవ అధ్యాయము

1. ప్రశ్న : వర్షాకాలం పోయి శరత్కాలం ప్రారంభం కావడంతో, సీతాన్వేషణకు తగిన అనుకూల వాతావరణం ఏర్పడినా కూడా సుగ్రీవుడు ఆ దిశగా ప్రయత్నించడం లేదు. లక్ష్మణా! నీవువెళ్ళి గుర్తు చేయమని రాముడు అక్కడ ఏ రీతిగా ప్రవర్తించమని చెప్పాడు?

జవాబు : 1. కఠినంగా మాట్లాడి 2. మృధువుగా మాట్లాడి
3. బ్రతిమలాడి 4. బెదిరించి మాట్లాడి

2. ప్రశ్న : శ్రీరాముని సూచనప్రకారం లక్ష్మణుడు కిష్కింధచేరి, ముఖ ద్వారంకడ నిలిచి, ఉన్నాడన్న వార్తను సుగ్రీవునికి తెలిపినది ఎవరు ?

జవాబు : 1. హనుమంతుడు 2. తార
3. నీలుడు 4. అంగదుడు

3. ప్రశ్న : సుగ్రీవుని ఆదేశం ప్రకారం అంగదుడు లక్ష్మణ స్వామిని కిష్కింధా నగరంలో సుగ్రీవుని అంతఃపురం వరకు తీసికొని వచ్చాడు. అక్కడ లక్ష్మణుని ముఖంలోని కోపతీవ్రతను గుర్తించి ఆయనను ప్రసన్నునిగాచేయ ప్రయత్నించినది ఎవరు ?

జవాబు : జవాబుల కాలంలో ఉన్నది.

4. ప్రశ్న : సుగ్రీవుని ప్రాసాదంలో ప్రవేశించిన లక్ష్మణస్వామి సుగ్రీవుని ఏ విధంగా మందలించాడు ?

జవాబు : అంగదుని ఆహ్వానం మేరకు అంతఃపుర సమీపానికి వచ్చిన లక్ష్మణస్వామి అచట తారను చూశాడు. ఆయనలోని కోపతీవ్రతను చూసిన తార ఓ రాజపుత్రా! నీవు గొప్ప పరాక్రమశాలివి. బలహీనునిపై కోపపడి ప్రయోజన మేమి? పైగా నీవు శాంతమూర్తివి. శ్రీరామ చంద్రప్రభువు పరాక్రమ మెంతటిదో నాకు తెలుసు. ఓ లక్ష్మణా! వానర ప్రభువైన సుగ్రీవుడు నీకు సోదరుని వంటివాడు. కావున నీవిప్పుడాయనను దయతో క్షమించు. సుగ్రీవుడు ఇప్పుడు సుఖాలకు దాసుడై యున్నను, మీ కార్యాన్ని సాధించడానికై ఇప్పటికే తగిన ఆజ్ఞలను ఇచ్చి యున్నాడు. అని పలుకుతూ తార లక్ష్మణ స్వామిని సుగ్రీవుని వద్దకు తీసికొని వెళ్ళింది. ఆ ప్రదేశంలో దివ్య వస్త్రాభరణాలను, పూలమాలను ధరించి తరుణీ మణుల పరివేష్టితుడై, బంగారు సింహాసనంపై కూర్చుని యున్న సుగ్రీవుని లక్ష్మణస్వామి చూశాడు. ఆ సౌమిత్రిని చూడగానే సుగ్రీవుడు కంగారుపడి, ఒక్క ఉదుటున లేచివచ్చి లక్ష్మణునికి దగ్గరగా నిలబడ్డాడు. అప్పుడు లక్ష్మణుడు ఓ వానర రాజా! మిత్రుని వలన ఉపకారము పొంది, తిరిగి వారికి ప్రత్యుపకారము చేయనివాడు కృతఘ్నుడు అతడు వధార్హుడు అంతేగాదు సకల జనులయందు అతడు మృతప్రాయుడు. సుగ్రీవా! శ్రీరాముడు ఎంతటి కార్యాలనైనా అవలీలగా చేయగలడు. ఆ స్వామి చేసిన మేలును నీవు విస్మరించినచో నేడే ఆ ప్రభువు యొక్క వాడి బాణాలు నిన్ను నీ అన్న వద్దకు పంపిస్తాయి. నీవనుభవిస్తున్న ఈ సుఖాలు శ్రీరాముని దయాలబ్ధమేనని గుర్తుంచుకో. అని లక్ష్మణస్వామి సుగ్రీవుని తీవ్రంగా మందలించాడు.

5. ప్రశ్న : లక్ష్మణస్వామి తీవ్రతను చూసిన తార ఆయనను ఏ విధంగా శాంతింప జేసింది?

జవాబు : సుగ్రీవుని తీవ్రంగా మందలిస్తున్న లక్ష్మణ స్వామినిజూసి తార ఓ రామానుజా! సుగ్రీవుడు నీకు మిత్రుడు, వానర రాజు, నీవంటి మహాత్ముని నోట ఇట్టి కఠిన వచనాలు పలుకుట ధర్మంకాదు. ఈ సుగ్రీవుడు కృతఘ్నుడు కాడు. వంచించువాడు కాడు. అబద్ధమాడు వాడును, కుటిలుడును కాడు. రణరంగంలో ఇతరులకు అసాధ్యమైన పనిని శ్రీరాముడు చేసియున్నాడు. దానిని సుగ్రీవుడు మరచిపోలేదు. ఆ రామచంద్ర ప్రభువు వల్లనే ఈ సుగ్రీవుడు ఈ వానర రాజ్యాన్ని సకల భోగాలను పొందగలిగాడు. స్వామీ! ఆహారము, నిద్ర, భయము, దాంపత్య సుఖము అనేవి ప్రాణులకు సహజమైన దేహధర్మాలు. యధార్ధ విషయాలు తెలిసికొనకుండా సామాన్యుని వలె తొందరపడి క్రోధవశుడవు కావడం ధర్మంకాదు. నాయనా! లక్ష్మణా! ఈ వానర ప్రభువు రణరంగంలో రావణుని హతమార్చి సీతాదేవిని శ్రీరామునికి తప్పక అప్పగించగలడు. లంకలో అసంఖ్యాకులైన రాక్షసవీరులతో కూడియున్న రావణుని ఈ సుగ్రీవుడొక్కడే ఎదిరించలేడు. అందువలన యుద్ధంలో తనకు సహాయపడుటకుగాను, అసంఖ్యాకమైన వానర యోధులను సమీకరించడానికై సుగ్రీవుడు, ఇంతకు ముందే అనేక మంది వానర ప్రముఖులను అన్ని దిక్కులకూ పంపించి యున్నాడు. వారి రాక కొరకు నిరీక్షిస్తూ ఈ వానర ప్రభువు ఈ నగరం నుండి కదలడం లేదు. ఓ సౌమిత్రీ! కోట్ల కొలది వానర, భల్లూక కొండముచ్చు వీరులు ఇది వరకే ఇక్కడకు రావలసి ఉంది. మాపై దయతలచి నీ కోపాన్ని వీడు. నీ కన్నులలో కనిపిస్తున్న ఎఱ్రజీరలు మమ్ములను ఆందోళనకు గురి చేస్తున్నాయి. అని తార లక్ష్మణస్వామిని శాంతింప జేసింది.

## ఏబది రెండవ అధ్యాయము

జవాబులు : 1.2. మృధువుగా మాట్లాడి 2.4. అంగదుడు
3. తార

# కిష్కింధా కాండము

## 36, 37, 38, 39, 40, 41 సర్గలు

## ఏబది మూడవ అధ్యాయము

1. ప్రశ్న : తార, సుగ్రీవుడు పలికిన మాటలకు లక్ష్మణుడు శాంతుడై సంతోషించి, సుగ్రీవుని శ్రీరామ దర్శనం చేసుకోమన్నాడు. సుగ్రీవుడు సంతోషించి భూమి నలుచెరగుల ఉన్న వానర యోధులను అతిత్వరగా కిష్కింధకు చేరునట్లుగా ఇంతకు ముందే కొందరిని పంపించి యున్నాను. వారిని ఇంకా తొందరపెట్టి ఇక్కడకు చేర్చడానికై కొందరిని పంపించమని ఎవరిని ఆదేశించాడు ?

జవాబు : 1. తారను 2. హనుమంతుని
3. అంగదుని 4. నీలుడిని

2. ప్రశ్న : లక్ష్మణుని సూచనమేరకు సుగ్రీవుడు శ్రీరాముడిని దర్శించడానికై రాజమర్యాదలతో బయలుదేరి, లక్ష్మణుడు, సుగ్రీవుడు దేనిని అధిరోహించి వెళ్ళారు ?

జవాబు : 1. ఏనుగును 2. గుర్రాన్ని
3. పల్లకిని 4. రథాన్ని

3. ప్రశ్న : తనను దర్శించ వచ్చిన సుగ్రీవునిజూసి శ్రీరాముడు సంతోషంతో మాట్లాడుతూ ఉండగా, భూమి నలుదిక్కుల నుండి వానర, భల్లూక, వీరులు కోట్లకొలదిగా అక్కడకు చేరుకొన్నారు. వారిలో తార తండ్రి కూడా ఉన్నాడు. ఆయన పేరేమి ?

జవాబు : జవాబుల కాలంలో ఉన్నది.

4. ప్రశ్న : సుగ్రీవుడు తన సేననంతటిని శ్రీరామునికి చూపగా ఆయన సుగ్రీవునికి ఏ రీతిగా జరుగవలసిన కర్తవ్యాన్ని ఉపదేశించాడు ?

జవాబు : ప్రశ్రవణగిరిపై రామ సుగ్రీవులు మాట్లాడు కొంటుండగా అపారమైన వానర సైన్యం వచ్చి ఆయా ప్రాంతాలలో ఉన్నట్లుగా సుగ్రీవుడు

గ్రహించి, శ్రీరామునితో ప్రభూ! శక్తిశాలురైన వానర ప్రముఖులు ఇచటికివచ్చి తమకు అనువగు ప్రదేశాలలో నిలిచియున్నారు. వారందరూ మదపుటేనుగుల వలె మహా బలశాలురు. కామరూపులు. వీరంతా ధైత్య, దానవులతో సమానులు. ఇది యంతయు నీ సైన్యమే. ఇది నీ ఆధీనములో ఉంటుంది. నీ ఇష్టాను సారం వీరిని ఆజ్ఞాపించు. అని పలుకుచున్న సుగ్రీవుని ఆ దాశరథి ప్రీతితో చూసి, ఓ ప్రజ్ఞాశాలీ! ఇంతవరకు, సీతాదేవి జీవించి ఉన్నదా? లేదా? అను విషయాన్ని, రావణుడున్న ప్రదేశాన్ని తెలిసికోవాలి. అట్లు సీతాదేవి జాడను, రావణుని ఉనికిని ముందు మనం తెలిసుకోవాలి. అటు పిమ్మట కర్తవ్యాన్ని గురించి నీతో చర్చించి తగిన విధంగా నిశ్చయించు కొందాము. ఓ వానర రాజా! సీతాన్వేషణ నావలనను, లక్ష్మణునుని వలనను కానిపని. ఈ కార్యసాధకుడవు నీవే. దీని సాఫల్యం నీ చేతిలోనే ఉంది. ఇందుకు సందేహం లేదు. కనుక నీవే తగు విధంగా ఆలోచించి, నీ అనుచరులను ఆజ్ఞాపించు. అని శ్రీరాముడిట్లు యుక్తియుక్తంగా పలికిన పిమ్మట సుగ్రీవుడు తన సేనా నాయకుడైన వినతుడిని పిలిచి తగిన సేనతో తూర్పు దిక్కుకువెళ్ళు. ఆ దిక్కులో శ్రీరామపత్ని సీతాదేవిని వెదకి నెలరోజుల గడువులోపల ఇచటకు రావాలి అని ఆజ్ఞాపించి పంపించాడు. ఆ విధంగా సుగ్రీవుడు నలుదిక్కులకూ తగిన సమర్థులను సీతాన్వేషణకై పంపించాడు.

5. ప్రశ్న : సీతాన్వేషణకై సుగ్రీవుడు దక్షిణ దిక్కుకు ఎవరిని ఏ విధంగా, ఏఏ జాగ్రత్తలు చెప్పి పంపించాడు ?

జవాబు : సీతాన్వేషణకై సుగ్రీవుడు అన్నివిధాల నిగ్గుతేలిన వానరులను దక్షిణ దిశకు పంపించాడు. వారిలో నీలుడు, హనుమంతుడు, జాంబవంతుడు, సుహోత్రుడు, శరారి, శరగుల్మడు, గజుడు, గవాక్షుడు, గవయుడు, సుషేణుడు, ఋషభుడు, మైందుడు, ద్వివిదుడు, విజయుడు, గంధమాధనుడు, ఉల్కాముఖుడు, అసంగుడు మొదలైన వానర వీరులకు నాయకునిగా అంగదుని నియమించి దక్షిణ దిశగా పంపించాడు. ఆ దిశయందు ముఖ్యంగా

రావణ పాలిత లంక ఉండటం విశేషం. అతి కష్టంగానైనా అడుగు పెట్టడానికి సాధ్యపడే కొన్ని ప్రదేశాలను, సుగ్రీవుడు ఆ వానర ప్రముఖులకు వివరించి చెప్పాడు. ఆ దిక్కున వారికి తారసపడే నదులను, పర్వతాలను, నగరాలను, జనపథాలను సవివరంగా వివరించిన సుగ్రీవుడు నెలరోజులు గడువు విధించి ఈ గడువులోపల సీతామాతను చూసి వచ్చినవాడు నాకు అత్యంత ప్రీతి పాత్రుడై, నాతో సమానంగా భోగాలను అనుభవించ గలడు. అతనిలో ఎన్ని దోషాలున్నా, అతడు నాకు అత్యంత ప్రీతిపాత్రుడు, ప్రాణతుల్యుడు అవుతాడు. కనుక ఓ మిత్రులారా! మీరు సాటిలేని బలపరాక్రమాలు గలవారు. రామ కార్యానికి తగిన ప్రయత్నాన్ని ఇప్పుడే ప్రారంభించండి అని సుగ్రీవుడు అంగదాదులకు చెప్పి దక్షిణ దిక్కుకు పంపించాడు.

## ఏబది మూడవ అధ్యాయము

జవాబులు : 1.2. హనుమంతుని 2.3. పల్లకిని
3. సుషేణుడు

..........

# కిష్కింధా కాండము

## 42, 43, 44, 45, 46, 47 సర్గలు

## ఏబది నాలుగవ అధ్యాయము

1. ప్రశ్న : సుగ్రీవుడు సీతాన్వేషణకై పశ్చిమ దిశలోనున్న పర్వతాలను, నదులను, నగరాలను, జనపథాలను వివరించి చెప్పి ఎవరి నాయకత్వాన వానర యోధులను పంపించాడు ?

జవాబు : 1. శతవలి 2. హనుమంతుడు
3. నలుడు 4. సుషేణుడు

2. ప్రశ్న : శ్రీరామపత్ని సీతాదేవిని అన్వేషించడానికై సుగ్రీవుడు ఉత్తరదిశలో నున్న పర్వతాలను, నదులను, వనాలను, దుర్గాలను, జనపథాలను,

నగరాలను అన్నింటినీ తెలిపి ఎవరిని నాయకునిగాచేసి వానర యోధులను పంపించాడు ?

జవాబు : 1. జాంబవంతుడు 2. గవయుడు
3. శతవలి 4. విజయుడు

3. ప్రశ్న : దక్షిణదిక్కుకు వెళ్తున్న యోధులలోకెల్ల హనుమంతుని పిలిచి శ్రీరాముడు తన ఆనవాలుగా ఏ వస్తువును ఇచ్చి పంపించాడు ?

జవాబు : జవాబుల కాలంలో ఉన్నది.

4. ప్రశ్న : శ్రీరాముడు సుగ్రీవునితో ఈ సమస్త భూగోళ విశేషాలు నీకెట్లాతెలుసు అని ప్రశ్నించగా, సుగ్రీవుడు ఏవిధంగా ఆ స్వామికి సమాధానం చెప్పాడు ?

జవాబు : సుగ్రీవాజ్ఞ ప్రకారం వానర యోధులు నలుదిక్కులకూ వెళ్ళిన పిమ్మట శ్రీరాముడు ఈ సమస్త భూమండలాన్ని గురించి నీకెట్లా తెలుసు? అని సుగ్రీవుని ప్రశ్నించాడు. అప్పుడు ఆ వానర రాజు ప్రభూ! మా అన్నగారైన వాలి మహిషాకారంగల దుందుభి అనే రాక్షసుని తరుముకొంటూ వెళ్ళి ఒక గుహలో దూరాడు. అప్పుడు నేను మా అన్నకొరకు గుహకు వెలుపలవేచి ఉన్నాను. చాలాకాలం గడిచినా కూడా మా అన్న గుహనుండి వెలుపలికి రాలేదు. అటు పిమ్మట గుహద్వారం నుండి రక్తం ప్రవహిస్తూ వెలుపలికి వచ్చింది. ఆ రక్తం మా అన్నదేమోనని భయపడి, ఆ రాక్షసుడు వెలుపలికి వస్తే నన్ను చంపునేమోనని భావించి, ఆ గుహ ద్వారానికి ఒక పెద్ద బండరాయితో ఆ ద్వారాన్ని మూసివేసి, మా అన్న బ్రతుకుపై ఆశ వదులుకొని, ఆ రాక్షసుడు కూడా ఆ గుహలోనే మరణించెను అని ఎంచి, నేను కిష్కంధకు వచ్చాను. వెంటనే విషయం తెలిసికొని కిష్కింధా వాసులంతా నన్ను రాజునుగా చేశారు. ఇది అట్లుండగా దుందుభిని చంపిన మా అన్న కిష్కింధకు వచ్చాడు. వాలిని చూసిన నేను భయంతో సగౌరవంగా రాజ్యాన్ని ఆయనకు అప్పగించాను. కాని వాలి మాత్రం మనస్తాపానికి గురియై, క్రోధంతో ఉడికిపోతూ నన్ను చంపడానికి ప్రయత్నించాడు. అప్పుడు నన్ననుసరించి వస్తున్న మంత్రులతో గూడి నేను పారిపోయాను. ఆ విధంగా నేను ముందుగా

తూర్పు దిక్కుగా వెళ్ళాను. మా అన్న నన్ను వదలలేదు. నన్ను వెంటాడుతూనే ఉన్నాడు. ఆ విధంగా నేను నలుదిక్కులకూ వెళ్ళాను. చివరకు ఋష్యమూక పర్వతం పైకి, శాపకారణంగా వాలి రాడు అని తెలిసికొని అచట నివసించ సాగాను. ఓ నరోత్తమా! ఆ విధంగా నేను భూమి అంతా నలుదిక్కులకూ వెళ్ళి చూడడం జరిగింది. అని సుగ్రీవుడు శ్రీరామచంద్ర ప్రభువుకు తెలిపాడు.

5. ప్రశ్న : సుగ్రీవాదేశాను సారం సీతాన్వేషనకై వెళ్ళిన వానర యూథపతులు ఎవరెవరు తిరిగి వచ్చారు? వారు ఎటువంటి సమాచారాన్ని సుగ్రీవునికి వినిపించారు ?

జవాబు : వానర యూథములన్నీ సీతాన్వేషణకై సుగ్రీవాజ్ఞ ప్రకారం ఆయా ప్రదేశాలకు వెళ్ళాయి. వారు సరస్సులను, నదీతీరాలను, లతాగృహాలను, చెట్టుచేమలతో నిండిన వనాలను, ఎటువంటి గడ్డికూడా మొలవని ఎడారి ప్రదేశాలను, నదులు అడ్డంగా ఉండటం వలన సులభంగా వెళ్ళలేని ప్రదేశాలను, కొండలు, కోనలు, నగరాలు, గ్రామాలు, పర్వతాలు, దట్టమైన అడవులు నిశితంగా గాలించారు. ఆ విధంగా వారు పగలంతా వెదుకుతూ, రాత్రి వేళలందు ఒక నియమిత ప్రదేశాలయందు చేరుకొంటూ, ఆయా ప్రదేశాలలో దొరికే పండ్లను తిని తమ ఆకలి తీర్చుకొంటూ, ఆ నెల రోజులు జానకీమాతకై వెదకి, ఆమె జాడను గానక నిరాశతో ప్రస్రవణగిరికి మరలి వచ్చి కపిరాజైన సుగ్రీవుని కలిశారు. అంతట వారంతా ఓ కపిరాజా! మీరు ఆదేశించిన ప్రకారం మేము వెళ్ళిన దిక్కులందు, కాలు మోపడానికి కూడా వీలుగాని దుర్గమ ప్రదేశాల యందునుగూడా ప్రత్యంగుళము గాలించాము. కాని మా కృషి ఫలించలేదు. సీతమ్మ వారిజాడను కనుగొనలేక పోయాము. ఓ మహారాజా! అంగదుని నాయకత్వాన దక్షిణ దిశగా వెళ్ళిన హనుమంతుడు తప్పక సీతమ్మ వారి జాడను తెలిసికొని రాగలడు. ఎందుకంటే ఆదిశయందే లంకానగర మున్నది. గనుక ఆ మహానుబావుడే అమ్మవారి జాడ శుభవార్తను మనకు తెలుపగలడు. అని ఆ వానర యోధులు సుగ్రీవునకు తెలిపారు.

## ఏబది నాలుగవ అధ్యాయము

జవాబులు : 1.4. సుషేణుడు 2.3. శతవలి

3. అంగులీయకము (ఉంగరము)

# కిష్కింధా కాండము

## 48, 49, 50, 51, 52, 53 సర్గలు

## ఏబది ఐదవ అధ్యాయము

1. ప్రశ్న : అంగదుని నాయకత్వాన దక్షిణ దిక్కుకు వెళ్ళిన వానరయోధులు మొదట ఏ పర్వత ప్రదేశాన్నుండి సీతాన్వేషణను ప్రారంభించారు ?

జవాబు : 1. వింధ్య పర్వత ప్రాంతం నుండి 2. గంధమాధన ప్రాంతం నుండి 3. హిమాలయ ప్రాంతం నుండి 4. సాత్పురా పర్వతాన్నుండి

2. ప్రశ్న : హనుమదాది వానర ప్రముఖులు సీతాన్వేషణ చేస్తూ బాగాదప్పిగొని అలసి, వారు 'ఋక్షబిలము' అనే గుహలో ప్రవేశించారు. అచట వారు ఒక తేజో మయమైన ఒక యోగినిని చూశారు. ఆమె పేరేమి?

జవాబు : 1. శబరి 2. వేదవతి
3. స్వయంప్రభ 4. సింహిక

3.ప్రశ్న : ఋక్షబిలంలో ఉన్న వైభవాన్ని చూసిన మారుతి అచట ఉన్న తాపసితో అమ్మా! ఈ వనమెవరు సృష్టించారు? అని అడుగగా ఆమె ఏమని సమాధానం చెప్పింది ?

జవాబు : జవాబుల కాలంలో ఉన్నది.

4.ప్రశ్న : ఋక్షబిలంలో హనుమంతుని సందేహాలకు తాపసి, ఆ తాపసి అడిగిన దానికి హనుమంతుడు ఏ రీతిగా ప్రత్యుత్తర మిచ్చుకొన్నారు?

జవాబు : అంగదుని నాయకత్వాన సీతాన్వేషణ చేస్తున్న వానర యోధులంతా ఆకలి దప్పులకులోనై, అచట ఒక గుహ నుండి నీటితో తడిసిన రెక్కలుగల పక్షులు బయటకు రావడంచూసి, అందు నీరు దొరకవచ్చు అన్న ఆలోచనతో వారంతా ప్రవేశించడానికి కష్టంగా ఉన్నను ఓపికతో ఆ బిలంలో ప్రవేశించారు. కొంతదూరం వారు వెళ్ళేసరికి అక్కడ ఒక విశాలమైన ప్రదేశంలో భవనాలు, కందమూల ఫలాది మధురమైన ఆహార పదార్థాలు, స్వచ్ఛమైన నీరు

కనిపించాయి. ఆ భవన ప్రాంతంలో ఒక తాపసి జింక చర్మాన్ని వస్త్రంగా ధరించి ఉంది. అప్పుడు హనుమంతుడు వినయంగా అమ్మా నీవెవరు? అమిత తేజోమయమైన ఈ ప్రదేశమెవరిది? మేము ఆకలి దప్పులు భరించలేక ఈ గుహలో ప్రవేశించాము. అని అడిగిన హనుమంతునితో పూర్వం మయుడనే దానవ శిల్పి ఇచట బ్రహ్మదేవుని గురించి తపస్సు చేశాడు. అటు పిమ్మట పితామహుని అనుగ్రహంతో శిల్ప శాస్త్రాన్ని సంపాదించాడు. ఆ మయశిల్పి తాను సుఖ భోగాలనుభవించ డానికై ఈ ప్రాంతాన్ని సృష్టంచుకొని, హేమ యను అప్సరసయందు అనురక్తుడై ఇందున్నాడు. ఆ హేమ ఈ వనాలను రక్షించే బాధ్యతను నా కప్పగించింది. మీరు సంశయం లేకుండా ఈ ఆహార పదార్థాలను, నీటిని స్వీకరించండి అని అనుమతించింది. అంతట ఆ వానరయోధులంతా ఆనందంతో వారి ఆకలిదప్పులను తీర్చుకొన్నారు. పిమ్మట ఆ తాపసి తన పేరును స్వయంప్రభగా చెప్పుకొని, హనుమంతునితో మీ విశేషాలను తెలుపుమనగా, మారుతి అమ్మా! అయోధ్యనేలే దశరథుని పెద్ద కుమారుడైన శ్రీరాముడు వనవాసం చేస్తుండగా, ఆయన భార్యను రావణుడను రాక్షసుడు అపహరించాడు. ఆమె పేరు సీతాదేవి. ఆ సీతాదేవిని అన్వేషిస్తూ మేమంతా ఇటు వచ్చాము అని తమ కథనంతా వివరంగా తెలిపాడు. ఈ విధంగా స్వయంప్రభాదేవి, హనుమంతుడు ఒకరికొకరు వారి వివరాలను తెలుపుకొన్నారు.

5. ప్రశ్న : ఋక్షబిలము నుండి వానర యోధులంతా ఏవిధంగా సముద్రతీరానికి చేరారు?

జవాబు : తాపసియైన స్వయంప్రభతో హనుమంతుడు ఓ ధర్మాత్మురాలా! మేమందరము నిన్ను శరణువేడు తున్నాము. మా రాజైన సుగ్రీవుడు మాకు విధించిన గడువు ఈ బిలమునందే ముగిసినది. మేము ఒక గొప్ప కార్యాన్ని సాధించవలసి ఉంది. కాని పరిస్థితులు మాకనుకూలించ లేదు. మేము ఇక్కడ చిక్కుబడి యున్నాము. అని పలికిన హనుమంతుని మాటలకు ఆ స్వయంప్రభ ఓ వానరులారా!

ఈ బిలంలో ప్రవేశించిన వారు ఇందుండి ప్రాణాలతో బయటపడుట కష్టము. కాని నేను నియమ నిష్టలతో ఆచరించిన నా తపస్సు ప్రభావంతో మిమ్ములను ఈ బిలము నుండి ఉద్దరిస్తాను. మీరందరూ కనులు మూసుకొనండి. అనగా వారందరూ వారి రెండు చేతులతో వారి రెండుకళ్ళూ అందరూ మూసుకొన్నారు. వారు మరలా కనులు తెరచే సరికి, వారంతా దక్షిణ సముద్ర తీరం దగ్గర ఉన్నారు. అప్పుడు ఆ స్వయంప్రభ మీకు శుభమగు గాక! నేను నా భవనానికి వెళ్తున్నాను. అని చెప్పి ఆమె వెళ్ళిపోయింది. ఆ వానర ప్రముఖులంతా సముద్రఘోషను వింటూ, అచట ఉన్న మహావృక్షాల నీడన ఉన్నారు.

## ఏబది ఐదవ అధ్యాయము

జవాబులు : 1.1. వింధ్యపర్వత ప్రాంతం నుండి 2.3. స్వయంప్రభ
3. మయుడను దానవ శిల్పి

...........

# కిష్కింధా కాండము

## 53, 54, 55, 56, 57 సర్గలు

## ఏబది ఆరవ అధ్యాయము

ప్రశ్న : సముద్ర తీరాన చింతాక్రాంతులై ఉన్న వారిలో ఒకరు, వట్టిచేతులతో, సీతాదేవి జాడ తెలిసికొనకుండా మనం సుగ్రీవుని ఎదుటకు వెళితే ఆయన మనకు మరణ దండన విధిస్తాడు. ఆవిధంగా అక్కడకు వెళ్ళి మరణించడం కంటే ఇక్కడే మనం ప్రాయోపవేశం చెయ్యడం మంచిది అని పలికినది ఎవరు?

జవాబు : 1. తారుడు 2. హనుమంతుడు
3. అంగదుడు 4. జాంబవంతుడు

2.ప్రశ్న : ప్రాయోపవేశపు ఆలోచన చేస్తున్న అంగదునితో ఓ యువరాజా! నీవు మాతో కలిసివచ్చి సీతాన్వేషణను పూర్తిచేసికొని, గడువు మీరినా

రాజుదగ్గరకు మనంవెళితే మనలను ఆదరిస్తాడు. కనుక మనం సీతాన్వేషణ గురించే ఆలోచిద్దాము అని పలికినది ఎవరు?

జవాబు : 1. జాంబవంతుడు 2. సుహోత్రుడు
3. గవయుడు 4. హనుమంతుడు

3. ప్రశ్న : మారుతి ఎన్నిరీతుల ప్రయత్నించినా అంగదుడు ప్రాయోప వేశాన్నుండి మనసు మరల్చుకోకుండా, శ్రీరాముని తలచుకొని, ఆయన వనవాసాన్ని, జటాయువు మరణాన్ని, సీతాపహరణాన్ని గురించి చెప్పకొంటుండగా, ఆ ప్రక్కనే ఉండి జటాయువు మరణాన్ని గురించి వివరణ అడిగిన పక్షి పేరేమి?

జవాబు : జవాబుల కాలంలో ఉన్నది.

4. ప్రశ్న : సంపాతి తన తమ్ముని మరణవార్తను ఏవిధంగా తెలిసికొన్నాడు ?

జవాబు : ప్రాయోపవేశానికి సిద్ధంగా ఉన్న అంగదాదులకు దగ్గరలో ఒక శైలాగ్రంపై సంపాతి అనే గ్రద్ధరాజు కూర్చుని ఉన్నాడు. ఆ సమయంలో అచట ఉన్న వానర యోధులంతా ప్రాయోపవేశానికి సిద్ధపడి మరణిస్తే, నేను ఒకరి తరువాత ఒకరిని భుజించవచ్చని అనుకొంటున్నాడు. ఇంతలో అంగదుడు మారుతీ! ఇంతవరకూ శ్రీరాముని కార్యం నెరవేరలేదు. సుగ్రీవుని ఆదేశాన్ని పూర్తి చేయుటమూ జరగలేదు. లోగడ గృధ్రరాజైన జటాయువు సీతాదేవిని ఆదుకొనుటకై, ఆ రాక్షసునితో పోరి మరణించడాన్ని మీరునూ వినియే ఉన్నారు. ఈ విధంగా పశుపక్ష్యాది సమస్త ప్రాణులును, మనవలె ప్రాణాలకు తెగించి శ్రీరామునికి సహాయ పడుటకై ముందున్నాయి. మన మెన్నో అడవులను గాలించాము. అయినను సీతాదేవి జాడను తెలిసికొన లేకున్నాము. యుద్ధంలో రావణుని చేతిలో మరణించిన జటాయువు నిజంగా అదృష్టవంతుడు. అతనికి మనవలె సుగ్రీవుని బాధలేదు. పైగా పరమగతిని పొందాడు. అని పలుకుతున్న అంగదుని మాటలు విన్న సంపాతి పక్షిరాజు ఉచ్చస్వరంతో నా సోదరుడైన జటాయువు వధను గూర్చి తెలుపుతున్న ఈ వ్యక్తి ఎవరు? అతడు నా ప్రాణాధికుడు. ఈ మాటలు నాకు ఆందోళన కలిగిస్తున్నాయి. దండకారణ్యంలో నా సోదరునికి ఆ రాక్షసునికి యుద్ధమెట్లు వచ్చింది? చాలా కాలం

తరువాత నా తమ్ముడు జటాయువు పేరు వింటున్నాను. ఓ వానర యోధులారా! వయోభారంతో నా శరీరాన్ని కదల్చ లేకున్నాను. నన్ను ఈ శైలాగ్రం నుండి దించి, నా తమ్ముని గురించిన సమాచారాన్ని దయతో నాకు తెలపండి అని సంపాతి అంగదాదులను వేడుకొన్నాడు.

5.ప్రశ్న : జటాయువు మరణవార్తను, తమ సీతాన్వేషణ గాధను అంగదుడు సంపాతికి ఏరీతిగా వివరించాడు?

జవాబు : సంపాతి కోరికమేరకు అంగదుడు సంపాతి వద్దకు వెళ్ళి ఓ పక్షిరాజా! పూర్వం ఋక్షరజుడు అనే వానరరాజుకు వాలి, సుగ్రీవుడు అను ఇద్దరు కుమారులు. వారిలో వాలి కుమారుడను నేను అంగదుడను. అయోధ్యనేలే దశరథ మహారాజు పెద్దకుమారుడు శ్రీరాముడు పితృవాక్య పరిపాలనార్థమై తన భార్య సీతాదేవితోడను, తమ్ముడు లక్ష్మణునితోనూ కలిసి వనవాసానికివచ్చాడు. వారు దండకారణ్యంలో నివాసముండగా, దశరథ మహారాజుకు స్నేహతుడైన జటాయువుతో వారికి స్నేహం ఏర్పడింది. రామలక్ష్మణులు ఆశ్రమంలో లేని సమయం చూసి దుర్మార్గుడైన రావణుడను రాక్షసుడు సీతాదేవిని అపహరించ బోగా జటాయువు అడ్డగించాడు. ఆ పోరులో రావణుని చేతిలో జటాయువు మరణించాడు. సీతాదేవిని వెదకూతూ వచ్చిన రామలక్ష్మణులకు ఋష్యమూక పర్వతంపై నివసిస్తున్న సుగ్రీవునితో స్నేహం కుదిరింది. నా తండ్రి వాలి వలన తనకు జరిగిన అన్యాయాన్ని తెలిపుకొని శ్రీరాముని చేత వాలిని సంహరింప జేసి తాను కిష్కింధకు రాజయ్యాడు. సుగ్రీవునికి శ్రీరాముడు చేసిన మహోపకారం కారణంగా, మా మహారాజు సుగ్రీవుని, ఆజ్ఞానువర్తులమై మేము సీతాన్వేషణ కొరకై వెదకుచు ఇచట చేరియున్నాము. అని అంగదుడు సంపాతికి జటాయువు మరణ వార్తను, తాము ఇచటికి వచ్చిన కారణాన్ని వివరంగా తెలిపాడు.

## ఏబది ఆరవ అధ్యాయము

జవాబులు : 1.3. అంగదుడు 2.4. హనుమంతుడు
3. సంపాతి

# కిష్కింధా కాండము

## 58, 59, 60, 61, 62 సర్గలు

## ఏబది ఏడవ అధ్యాయము

1. ప్రశ్న : రామకార్యానికి నా వంతు సహకరిస్తాను. అని ఓ వానరులారా! చక్కని రూప సంపద కలిగిన ఒక స్త్రీని రావణుడు అపహరించుకొని వెళ్తుండగా నేను చూశాను. ఆ రావణుని నివాసం లంకా నగరం. ఆ లంకానగరం ఇచటికి ఎంత దూరముందని సంపాతి తెలిపాడు ?

జవాబు : 1. 70 యోజనాలు 2. 90 యోజనాలు 3. 100 యోజనాలు 4. 80 యోజనాలు

2. ప్రశ్న : సంపాతి సీతాపహరణ వృత్తాంతాన్ని తెలుపుతూ ఆ రోజులలో ఒకనాడు తన కుమారుడు ఆహారాన్వేషణకై వెళ్ళిన సమయంలో ఒక దుర్మార్గుడు ఒక స్త్రీని అపహరించుకొని వెళుతుండగా తాను చూశాను అని నాకు తెలిపాడు అని చెప్పాడు. ఆ సంపాతి కుమారుని పేరేమి ?

జవాబు : 1. అనూరుడు 2. సుపార్శ్వుడు 3. వైనతేయుడు 4. జటాయువు

3. ప్రశ్న : సంపాతి అంగదాది వానరులకు సీతాదేవిని గురించి తెలుపుతూ, ఒకప్పుడు నేను సూర్యతాపానికి గురియై నారెక్కలు కాలిపోగా, నేను వింధ్య పర్వత ప్రాంతంలో పడ్డాను అచట ఒక మహర్షిని ఆశ్రయించాను. ఆయన నన్ను ఆదరించాడు. అని తెలిపాడు. ఆయన పేరేమి ?

జవాబు : జవాబుల కాలంలో ఉన్నది.

4. ప్రశ్న : సంపాతి తన రెక్కలు దగ్ధమైన కారణాన్ని నిశాకర మహర్షికి ఏరీతిగా వివరించాడు ?

జవాబు : సూర్యతాపానికి గురియై రెక్కలు మాడిపోయిన సంపాతి వింధ్య పర్వత ప్రాంతంలో ఉన్న మహాత్ముడైన నిశాకర మహర్షిని

దర్శించాడు. అప్పుడా మహర్షి ఓ సంపాతి! మీ ఇరువురు అన్నదమ్ములు. కామరూపులు గదా! ఇది వరలో నేను మిమ్ములను చూశాను. వాయుదేవునితో సమానమైన మీకు ఈ పరిస్థితి ఎట్లు తటస్థించింది. అని అడుగగా, సంపాతి, మహర్షీ! మా అన్నదమ్ము లిరువురము బలగర్వితులమై, మా పరాక్రమాన్ని తెలిసికొన గోరి పోటీపడి ఆకాశానికి ఎగిరాము. ఆ విధంగా మేము ఆకాశానికి ఎగిరి, భూమివైపుగా చూడగా, భూమిపై గల నగరాలు, పర్వతాలు, నదులూ, సముద్రాలు చాలా చిన్నవిగా కనిపించాయి. అప్పుడు మా శరీరాలు సూర్యుని ఎండ వేడిమికి చెమర్చాయి. భయపడ్డాము. ఇంద్రియాలు, మనస్సు, పట్టు తప్పుతున్నాయి. దిక్కులు తెలియడం లేదు. అప్పుడు జటాయువు నాతో చెప్పకుండానే క్రిందకు జారి పోసాగాడు. పరిస్థితిని గమనించి, నేను నా తమ్ముని ఆదుకోవడానికై, అతని వద్దకు వచ్చి నా రెక్కలతో జటాయువును కప్పివేశాను. అందువలన అతడు సూర్యుని వేడి కిరణాలకు రక్షింపబడ్డాడు. కాని నా రెక్కలు మాత్రం కాలిపోయి నేలపై పడ్డాను. జటాయువు దండకారణ్యంలో పడి ఉంటాడని అనుకొన్నాను. నేను ఈ వింధ్య పర్వత ప్రాంతంలో పడ్డాను. నా సోదరుడు దూరమయ్యాడు. అని సంపాతి నిశాకర మహర్షికి తమ గాథను వినిపించాడు.

5. ప్రశ్న : నిశాకర మహర్షి సంపాతిని ఏవిధంగా ఓదార్చాడు ?

జవాబు : తన ఎదుట ఇంతసేపు ఏడుస్తున్న సంపాతిని చూసిన నిశాకర మహర్షి, తాను యోగ దృష్టితోచూసి, ఓ సంపాతి! దుఃఖించకు. కాలిపోయిన నీ రెక్కలు మరలా వస్తాయి. అట్లే నీ దృష్టికూడా బాగుపడుతుంది. క్షీణించిన నీ ప్రాణశక్తి, బలపరాక్రమాలు మరలా పుంజుకొంటాయి. రాబోయే కాలంలో జరిగే ఓ మహత్తర కార్యాన్ని నా దివ్యదృష్టితో తెలిసికొన్నాను. ఇక్ష్వాకు వంశపు మహారాజు దశరథుని పెద్ద కుమారుడు శ్రీరాముడు పితృవాక్య పరిపాలనార్థమై, దండకారణ్యానికి తన భార్యతోనూ తమ్మునితోనూ వస్తాడు. రావణుడనే రాక్షసుడు ఆ రాముని భార్యను అపహరిస్తాడు. ఆ

రావణుని దేవాసురులు ఏమీ చెయ్యలేరు. అటువంటి రావణుడు శ్రీరాముని చేతిలో సంహరింప బడతాడు. సకల ప్రాణికోటికి మేలు జరుగుతుంది. సీతాదేవిని వెదకుచూ వానరులు నీ చెంతకు వస్తారు. అప్పుడు నీవు ఆ రామ పత్ని సమాచారాన్ని గురించి వారికి తెలియజెయ్యి. అంతవరకు నీవు ఈ ప్రదేశాన్నుండి కదలవద్దు. దేశకాల పరిస్థితులకు ఎదురు చూస్తూండు. సీతాదేవి సమాచారాన్ని వానరులకు తెలుపగానే నీకు రెక్కలు వస్తాయి. ఓ సంపాతీ! నేను ఆ రామ లక్ష్మణులను దర్శించాలని ఉంది. కాని అప్పటి వరకు నా శరీరం ఉండడానికి సహకరించదు. కనుక ఈ తనువు త్యజించాల్సి ఉంది. అని భవిష్యద్దర్శనం చేసిన నిశాకర మహర్షి తనకు చెప్పిన విషయాన్ని సంపాతి వానర ప్రముఖులకు తెలిపాడు.

### ఏబది ఏడవ అధ్యాయము

జవాబులు : 1.3. 100 యోజనాలు   2.2. సుపార్శ్వుడు
3. నిశాకర మహర్షి

..........

# కిష్కింధా కాండము

## 63, 64, 65, 66, 67 సర్గలు

### ఏబది ఎనిమిదవ అధ్యాయము

1. ప్రశ్న : సంపాతికి ఆవానర ప్రముఖులు చూస్తుండగానే రెక్కలు వచ్చాయి. అప్పుడు సంపాతి తన రెక్కలను చూసుకొని మురిసిపోతూ, ఓ వానరులారా? నిశాకర మహర్షి చెప్పిన ప్రకారం నాకు రెక్కలు వచ్చాయి. ఆ విధంగానే సీతామాత జాడకూడా మీరు కనుగొన గలుగుతారు. అని చెప్పాడు. ఆ విధంగా వచ్చిన సంపాతి రెక్కలు ఏ రంగులో ఉన్నాయి ?

జవాబు : 1. తెలుపు   2. ఆకుపచ్చ
3. నీలిరంగు   4. ఎరుపురంగు

2. ప్రశ్న : సంపాతి వానర ప్రముఖులను ప్రోత్సహించి వెళ్ళిన పిమ్మట ఆ రాత్రి వారంతా అచటనే గడిపి, ఉదయముననే లేచి, ఓ వానర ప్రముఖులారా! ఈ వంద యోజనములు సముద్రాన్ని లంఘించి, రామకార్యాన్ని నిర్వహించగల వారెవ్వరో, వారు నాకు అభయ మివ్వండి అని అడిగినది ఎవరు ?

జవాబు : 1. అంగదుడు 2. హనుమంతుడు
3. జాంబవంతుడు 4. నీలుడు

3. ప్రశ్న : వానర వీరులంతా సముద్ర లంఘనంలో తమశక్తి సామర్థ్యాలను ప్రకటించడంలో భాగంగా, జాంబవంతుడు ఎన్ని యోజనాలు వెళ్ళగలను అని తెలిపాడు ?

జవాబు : జవాబుల కాలంలో ఉన్నది.

4. ప్రశ్న : సముద్ర లంఘనానికి హనుమంతుని ఏరీతిగా జాంబవంతుడు ఉత్తేజ పరచాడు ?

జవాబు : అనేక లక్షల కొలదిగా ఉన్న వానరసేన విషాదగ్రస్తమై ఉండటాన్ని గమనించిన జాంబవంతుడు హనుమంతుని ప్రేరేపించనెంచి ఓ ఆంజనేయా! నీవు వానరులందరిలోకి సాటిలేని వాడవు. సమస్త శాస్త్రాలు తెలిసిన వాడవు. ఓ వాయు సుతుడా! నీ తేజస్సు నందును, బలపరాక్రమాల యందును, నీవు సుగ్రీవుని కంటెను, రామ లక్ష్మణుల కంటెను ఏ మాత్రమూ తీసిపోవు. హనుమా! అప్సరసలలో శ్రేష్ఠురాలైన ''పుంజక స్థల'' శాప వశాన భూలోకంలో అంజనా దేవిగా జన్మించింది. ఆమె కేసరి అను వానర ప్రముఖునకు భార్య అయ్యింది. ఆమె కామరూపిణి గనుక మానవ రూపంతో సర్వాలంకార శోభితయై, పర్వతాగ్రంపై విహరిస్తుండగా, వాయువు ఆమెరూప యవ్వన శోభకు పరవశుడై ఆమెను కౌగిలించు కొన్నాడు. తానూహించని పరిణామానికి అంజనాదేవి భయపడింది. అప్పుడు వాయుదేవుడు ఓ సుందరీ నేను నిన్ను కౌగిలించు కొన్నప్పటికి నీకెట్టి కళంకమూ రాదు. భయపడకు. నీకు మహా పరాక్రమశాలి బుద్ధిమంతుడు అయిన ఒక కారణ జన్ముడు జన్మిస్తాడు. అని చెప్పి వెళ్ళాడు. అంతట నీ తల్లి నిన్ను కన్నది. నీవు ఉదయిస్తున్న సూర్యుని ఫలముగా భావించి వెళ్తుండగా, ఇంద్రుడు నిరోధించాడు. అందుకు కోపించిన వాయువు

లోకాలన్నింటా స్థంభింపజేశాడు. అప్పుడు దేవతలందరూ ప్రసన్నులై, నీకు అనేక విధాల వరాల నిచ్చారు. కావున ఓ హనుమా! ఇచట ఉన్నవారందరిలోకి నీవే సముద్ర లంఘనానికి తగిన వాడవు. కనుక నీవు వెంటనే విజృంభించు. అని జాంబవంతుడు హనుమంతుని ఉత్తేజపరచాడు.

5. ప్రశ్న : హనుమంతుడు సముద్ర లంఘనానికి ఏవిధంగా కృత నిశ్చయుడైనాడు?

జవాబు : నూరు యోజనాలమేర ఉన్న సముద్రాన్ని వెంటనే దాటడానికై, ఆ మారుతి తనలో పరాక్రమాన్ని గూడ కట్టుకొని, తన అద్భుత రూపాన్ని పెంచసాగాడు. అట్టి మహావీరుని జూసిన వానర సేన అంతా తమ విచారాన్ని వదిలి, హనుమంతుని ప్రస్తుతించారు. పెద్ద పెద్దగా కేకలు వేస్తూ, సంభ్రమాశ్చర్యాలతో పరమానంద భరితులయ్యారు. అప్పుడు హనుమంతుడు వానరుల ప్రశంసలకు సంతోషించి తన వాలాన్ని పైకెత్తి, ఇంకనూ శక్తిని పుంజుకుంటూ, వృద్ధి చెందసాగాడు. అప్పుడా మహానుబావుని రూపం అద్భుతంగా ఉన్నది. అంతట ఆంజనేయుడు నేను ఈ సముద్రాన్ని లంఘించి, లంకను చేరి సీతా మాతను దర్శించి వస్తాను. అందుకు మీరందరూ సంతోషిస్తారు గాక! వేలకొలది యోజనాలనైనా నేను లంఘించ గలనని నాకు నమ్మకం ఉంది. అని తేజోబల సంపన్నుడైన వానరశ్రేష్ఠుడు హనుమంతుడు పలుకగా ఆ వానరు లందరూ ఆనందాశ్చర్యాలతో ఆ స్వామివైపు తేరిపార జూశారు. అప్పుడు మారుతి జాంబవంతునితో నేను కాలుమోపి లంఘించడానికి ఈ సాదారణ భూమి తట్టుకోలేదు. కనుక నేను మహేంద్రగిరిపై కాలుమోపి అచట నుండియే సముద్రాన్ని లంఘిస్తాను. అని మహేంద్రగిరిపైకి ఎక్కి, ఏకాగ్ర చిత్తంతో మనసులో లంకను గూర్చి ఆలోచించసాగాడు.

## ఏబది ఎనిమిదవ అధ్యాయము

జవాబులు : 1.4. ఎరుపురంగు 2.1. అంగదుడు
3. తొంభై యోజనాలు

### - కిష్కింధా కాండము సమాప్తము -

# 5. సుందరా కాండము

## 1, 2, 3, 4, 5 సర్గలు

## ఏబది తొమ్మిదవ అధ్యాయము

1. ప్రశ్న : మహేంద్రగిరిపై నుండి దక్షిణదిశగా బయలు దేరిన హనుమంతుడు, గరుత్మంతుని వలె సాగిపోతున్నాడు. అది గమనించిన సముద్రుడు, ఇక్ష్వాకు వంశస్తుల కార్యార్థమై వెళ్తున్న మారుతికి కొంత విశ్రాంతి ఇవ్వనెంచి తనలో ఉన్న ఏ పర్వతాన్ని వెలుపలికి వచ్చి హనుమంతునికి ఆశ్రయం కల్పించమన్నాడు ?

జవాబు : 1. విద్య పర్వతం　　2. శేషాచల పర్వతం
3. మైనాక పర్వతం　　4. మేరు పర్వతం

2. ప్రశ్న : దేవతలు హనుమంతుని శక్తిని పరీక్షింపగోరి ఆయన గమనాన్ని నిరోధించమని ఎవరిని ఆదేశించారు ?

జవాబు : 1. దితిని　　2. అతిధిని
3. నాగమాత సురసను　　4. కాళీయుడిని

3. ప్రశ్న : హనుమంతుడు లంకానగరం వైపు సాగిపోతుండగా సముద్రంలో ఉన్న ఒక వికృత రూపిణి ఛాయాగ్రాహిణి, తన నీడను పట్టి వెనుకకు తనవైపు లాగుతూ, తనవేగాన్ని నిరోధించ సాగింది. ఆమె పేరేమి ?

జవాబు : జవాబుల కాలంలో ఉన్నది.

4. ప్రశ్న : ఆంజనేయుడు లంకలో ఏరీతిగా ప్రవేశించాడు?

జవాబు : మహా బలశాలియైన హనుమంతుడు ఇతరులకు ఎవ్వరికీ శక్యము గాని సాగరాన్ని లంఘించి తిన్నగా త్రికూట పర్వతంపై నున్న లంకానగరం మీదికి తన దృష్టి సారించాడు. ఆ త్రికూట పర్వతంపై తిరుగుతుండగా ఆయనపై అచటి అనేకరకాల వృక్షాలు పుష్పవృష్టి కురిపించాయి. అంతటి సముద్రం దాటి కూడా ఏ మాత్రమూ అలసట లేకుండా, అప్పుడు పవనసుతుడు అక్కడక్కడా తిరుగుతూ, అచటి వనాలను, ఉపవనాలను చూస్తూ, పర్వతంపై నున్న లంకా నగరాన్ని

చూశాడు. అప్పుడు హనుమంతుడు ఒక్క క్షణమాలోచించి, ముందుగా సీతాదేవి బ్రతికి ఉన్నదా? లేదా? అనేది తెలిసికోవాలి. అమిత క్రూరులు, బలిష్ఠులు అయిన రాక్షసులచే రక్షింపబడుతున్న ఈ లంకలో నేనీ రూపంలో ప్రవేశించడం కన్న, తన రూపాన్ని బాగా తగ్గించుకొని ఈ లంకలో ప్రవేశించడానికి రాత్రి సమయమే యుక్తమని, అందుకోసం కొంత సమయం నిరీక్షించసాగాడు. చీకటిపడి, గృహదీప కాంతులతోనూ, వెన్నెల కాంతులతోనూ ఆ లంకానగరం వెలిగి పోతుండగా మారుతి చూశాడు. అప్పుడు వానర శ్రేష్ఠుడైన ఆ మారుతి లంకలో ప్రవేశిస్తుండగా, ఆ లంకాదిష్టాన దేవత లంకిణి చూసి ఎట్ట ఎదుట నిలబడి, ఎవడవురా! నీవు. ఈ లంకా నగరానికి ఎందుకు వచ్చావు? నా చేతిలో నీ ప్రాణాలు పోకముందే నిజం చెప్పు. అని వికృతా కారంలో నిలబడియున్న లంకిణిని చూసి, అతి మనోహరంగా ఉన్న లంకా నగరాన్ని చూడాలని వచ్చాను అన్నాడు. ఓరి దుర్బుద్ధీ! నన్ను జయించకుండా లంకలో ప్రవేశించలేవు అని ఆ లంకిణి బలంగా మారుతిని ఒక దెబ్బ కొట్టింది. వెంటనే హనుమంతుడు పిడికిలి బిగించి, తన ఎడమ చేతి పిడిలితో ఒక్కదెబ్బ కొట్టాడు. ఆ దెబ్బకు నేల కొరిగిన లంకిణి ఓ కపివరా! పూర్వం బ్రహ్మదేవుడు చెప్పినట్లు నన్ను దెబ్బతీసిన వాని వలన లంక నాశన మవుతుంది. అని మారుతికి లంకలోకి వెళ్ళడానికి త్రోవనిచ్చింది. అప్పుడు ఆ విధంగా మారుతి లంకలో ప్రవేశించాడు.

5. ప్రశ్న : లంకలో మారుతి సీతాదేవిని ఏ రీతిగా వెదికాడు?

జవాబు : మహాతేజశ్శాలియైన హనుమంతుడు సూక్ష్మరూపం ధరించి లంకా నగరం ముఖద్వారం నుండి గాక ప్రాకారం పైనుండి దూకి, శత్రువు శిరస్సుపై తన ఎడమపాదాన్ని మోపినట్లుగా, తన ఎడమ పాదాన్ని ముందుగా మోపి లంకలో ప్రవేశించాడు. ఇరువైపులా పూలచెట్లతో అలరారుతున్న రాజమార్గం గుండా ఆ కపివరుడు వెళ్తున్నాడు. అచట గృహాలలో నుండి వివిధ వాద్యఘోషలు వినిపిస్తున్నాయి. స్వామి కార్యసాధనా దక్షుడైన మారుతి ప్రతి గృహాన్ని చూస్తూ ముందుకు

సాగుతున్నాడు. వేలకొలది రాక్షసులు రావణ మందిరాన్ని రక్షిస్తూ, అత్యంత కట్టుదిట్టమైన భద్రతా వలయం మధ్యలో నున్న రావణాంతః పురంలోకి హనుమంతుడు రహస్యంగా ప్రవేశించాడు. శరశ్చంద్రుడు ఉదయించడం వల్ల చీకటి తొలగిపోయి జనులు ఆనందిస్తున్నారు. ఆ నిశాచరులు మాంస భక్షణంతో ఆనందిస్తున్నారు. స్త్రీ పురుషులు ప్రణయ కలహంవీడి అనురాగ సౌఖ్యాలలో ఓలలాడు చున్నారు. కొందరు వీణాతంత్రులు మీటుతున్నారు. మరి కొందరు సత్ప్రవర్తన గలవారు తమ పతులతో గూడి శయ్యా సుఖాన్ని అనుభవిస్తున్నారు. ప్రజ్ఞా శాలియైన హనుమంతుడు సీతాన్వేషణకై ప్రతి గృహాన్ని పరిశీలించి చూస్తూన్నాడు. ఎన్నిచోట్ల వెదికినా శ్రీరాముని ధర్మపత్నియైన సీతాదేవి జాడను తెలిసికొనలేక పోయాడు. ఈ విధంగా హనుమంతుడు సీతాదేవి కొరకు వెదుకుతూనే ఉన్నాడు.

## ఏబది తొమ్మిదవ అధ్యాయము

జవాబులు : 1.3. మైనాక పర్వతం 2.3. నాగమాత సురసను 3. సింహిక

..........

# సుందరా కాండము

## 6, 7, 8, 9, 10, 11 సర్గలు

## అరువదియవ అధ్యాయము

1. ప్రశ్న : రావణుడు యుద్ధాలు చేసి గెలుచుకొని సంపాదించిన, వజ్ర, వైఢూర్యాది సంపదలను ఉపయోగించి నిర్మించిన ఆ రావణ మందిరాలను ఎవరిచేత నిర్మింపజేసి ఉంటాడు అని హనుమంతుడు అనుకొన్నాడు ?

జవాబు : 1. శుక్రాచార్యులచేత 2. మయబ్రహ్మచేత 3. ప్రహస్తునిచేత 4. విరూపాక్షునిచేత

2. ప్రశ్న : హనుమంతుడు అనేక ప్రాసాదాలను దర్శించిన పిమ్మట భూలోక స్వర్గంగా ఉన్న పుష్పక విమానాన్ని దర్శించాడు. దానిని రావణుడు ఎవరితో యుద్ధంచేసి గెలిచి తెచ్చాడు ?

జవాబు : 1. వరుణునితో 2. శంకరునితో
3. వాలితో 4. కుబేరునితో

3. ప్రశ్న : రావణ మహా భవనమందు వెదకుచూ, సీతాదేవికై అతి నిశితంగా పరిశీలించి చూస్తున్న మారుతి, ఒక దివ్యతల్పంపై రావణుని సరసన నిద్రిస్తున్న కొందరు దివ్య వనితలలో, ఒక ప్రత్యేక తల్పంపై నిద్రిస్తున్న ఎవరిని చూసి ఈమె సీతాదేవి అయి ఉండవచ్చు అని ఒక క్షణకాలం పాటు అనుకొన్నాడు ?

జవాబు : జవాబుల కాలంలో ఉన్నది.

4. ప్రశ్న : రావణాంతః పురంలో హనుమంతుడు సీతాదేవి కొరకై ఏ విధంగా వెదికాడు?

జవాబు : సీతాదేవి కొరకై వెదకుతూ హనుమంతుడు ఎవరికంటా బడకుండా రావణాంతఃపురంలో ప్రవేశించాడు. ఆ రావణ మందిరం అర్ధయోజనం వెడల్పు, ఒక యోజనం పొడవున్నూ కలిగి సువిశాలంగా విస్తరించి ఉంది. ఆ భవనం అనేక మంది సాయుధులైన రాక్షసులచే రక్షింప బడుతూంది. ఆ మహాప్రాసాదం రావణ పత్నులతోనూ, ఇంకనూ అతడు పరాక్రమంచే బలవంతంగా తీసికొని వచ్చిన రాజకన్యల తోనూ నిండి ఉంది. ధనపతియైన కుబేరుని సంపద్వైభవాలు, ఇంద్రునివలె ఐశ్వర్యశోభలూ ఆ రాజ భవనంలో స్థిరంగా ఉన్నాయి. అచట అనేక రహస్య గృహాలున్నాయి. పుష్పకంపై ఉన్న ఆ గృహాలలో పానీయాల నుండి, తిను బండారాల నుండి వచ్చే మధురమైన వాసనలను, అర్ధరాత్రి వరకు మధ్యపానాలతో, ఆహార పదార్థాలతో, క్రీడా వినోదాలతో, అలసిపోయి, నిద్ర కమ్ముకొని వస్తుండగా, తూలుతూ పడుకొన్న వారిని మారుతి చూశాడు. అచట రావణుడు నిద్రిస్తుండగా ఆయన కాంతులను, అచట ప్రజ్వరిల్లుచున్న దీపాలు కన్నులార్పకుండా చూస్తున్నవా? అన్నట్లున్నాయి. అచటి స్త్రీలందరిలో కొందరు రావణునిచే అపహరింప బడినవారే. కొందరు మాత్రం రావణుని మోహించి వచ్చిన వారునూ ఉన్నారు. వారందరూ రావణునిపై ఆకర్షితులై ఉన్నారు. కాని వీరందరూ సుఖంగా ఉన్నరీతిగానే, రామ పత్నియైన సీతాదేవి కూడా తన భర్తను గూడి

హాయిగా ఉన్నట్లైతే, ఈ రావణునికి మేలే జరిగి ఉండేది. కదా! అని హనుమంతునికి అనిపించింది. ఈ విధంగా హనుమంతుడు రావణ మందిరంలో సీతాదేవి గురించి ఎంత వెదకినా ఆమె జాడ కనబడలేదు.

5. ప్రశ్న : హనుమంతుడు రావణ మందిరంలో సీతాదేవి ఉన్నట్లు భ్రమించి ఏరీతిగా సంబరపడ్డాడు? పిమ్మట ఏవిధమైన ఆలోచన చేశాడు?

జవాబు : మారుతి రావణ మందిరంలో సీతాదేవి కొరకు అతి నిశితంగా వెదకుతూ ఒక తల్పాన్ని చూశాడు. అది స్పటికాలతో రత్నాలతో పొదగబడి ఉంది. ఆ ప్రదేశం వివిధ సుగంధ భరిత వాయువులతోనూ, ధూపాలతోనూ, నిండి వుంది. అచట కొందరు స్త్రీలు చామరాలను పట్టి వీస్తున్నారు. ఆ తల్పంపై నిద్రిస్తున్న మహావీరుడైన రావణుని హనుమంతుడు చూశాడు. అప్పుడు రావణుని సమీపించిన మారుతి 'ఛీ' వీడు పరస్త్రీని అపహరించుకొని వచ్చిన దుర్మార్గుడు అనుకొన్నాడు. అచట నిద్రిస్తున్న కాంతలందరిలోకి మిక్కిలి సౌందర్యము గల ఒక స్త్రీ ప్రత్యేకముగా ఏర్పరుపబడిన ఒక శయ్యపై నిద్రిస్తుండడాన్ని చూశాడు. స్వచ్ఛమైన కాంతులతో ఆమె రూపం మనోహరంగా ఉంది. ఆమెను చూసిన మారుతి పట్టరాని సంతోషంతో సీతమ్మ కనబడిందని భావించి, అమితంగా సంతోషించాడు. వెంటనే ఆ మహాకపి సీతాదేవిని గురించి తాను సరియైన ఆలోచన చేయసాగాడు. రాముని ఎడబాటుకు గురియైన సీతాదేవి ఇట్లు నిద్రించుట సాధ్యమా? ఆ స్థితిలో ఆమెకు అన్నపానాదుల మీద మనసు పోతుందా? ఆభరణాలను ధరించే ఆలోచన చేస్తుందా? పరపురుషుడు ఎంతటి వాడైనా, అతనిని ఆమె దరిజేరనిస్తుందా? మానవులే కాదు. దేవతలు కూడా రామునితో సమానులైన వారున్నారా? కనుక ఈమె సీత కాదు. అని నిశ్చయించుకొని హనుమంతుడు మరలా సీతాదేవిని వెదకాడానికై కుతూహల పడుతూ అందందు తిరుగాడ సాగాడు.

## అరువదియవ అధ్యాయము

జవాబులు : 1.3. మయబ్రహ్మచేత 2.4. కుబేరునితో
3. మండోదరిని

# సుందరా కాండము

## 12, 13, 14, 15, 16 సర్గలు

## అరువది ఒకటవ అధ్యాయము

1. ప్రశ్న : హనుమంతుడు రావణ అంతఃపురంతో పాటు లంకా నగరమంతా వెదికినా సీతాదేవి కనబడక పోవడంతో కొంత నిరాశచెంది, అయినా సీతాదేవి లంకలోనే ఉన్నది అని ఎవరు చెప్పిన మాటను జ్ఞప్తికి తెచ్చుకొన్నాడు ?

జవాబు : 1. జటాయువు 2. స్వయంప్రభ 3. సంపాతి 4. జాంబవంతుడు

2. ప్రశ్న : లంక యందంతటా వెదకి హనుమంతుడు సీతాదేవి జాడ గానక పరిపరి విధాల బాధపడి, చివరకు ఒక వనంలో ప్రవేశించాడు. ఆ వనం పేరేది ?

జవాబు : 1. అశోక వనం 2. సౌగంధికా వనం 3. చైత్ర రథవనం 4. నందనవనం

3. ప్రశ్న : మారుతి సీతాదేవి బ్రతికి ఉంటే, పవిత్ర జలాలుగల ఈ నదికి తప్పక రాగలదు. అని అనుకుంటూ ఆ వనంలో రామపత్ని దర్శనానికై నిరీక్షస్తూ, బాగుగా పుష్పించియున్న ఒకచెట్టు దట్టమైన ఆకులమధ్య దాగినవాడై నలువైపులా పరికించి చూస్తున్నాడు. హనుమంతుడు ఎక్కిన వృక్షం పేరేది ?

జవాబు : జవాబుల కాలంలో ఉన్నది.

4. ప్రశ్న : హనుమంతుడు సీతాదేవిని ఏ విధంగా గుర్తించాడు ?

జవాబు : అశోక వృక్షంపై నున్న హనుమంతుడు సీతాదేవి దర్శనానికై ఎదురు చూస్తూ, అందంతటా కలయ జూస్తూ, ఆ అశోక వనాన్ని సాకల్యంగా కలయ జూశాడు. ఆ వనంలోని కల్పవృక్షాలు, తమ చుట్టూ అల్లుకొన్న లతలతో అలంకరింప బడినట్లుగా ఉంది. అచట అన్ని ఋతువు లందునూ ఫలించే వృక్షాలు, ఫల, పుష్పాలతో నిండి, వాటి

బరువుకు వంగి ఉన్నాయి. ఆ విధంగా శోభాయమానమైన ఆ వనశోభను తిలకిస్తూ మారుతి తన చూపులను మరల్చుకొని, మలిన వస్త్రాలు ధరించి, అనువైన తను సౌభాగ్యముగల్గి, భూమిపై స్థిరంగా ఆసీనయై యున్న ఒక స్త్రీమూర్తిని చూశాడు. ఆమె చుట్టును రాక్షస స్త్రీలు చేరి ఉన్నారు. ఉపవాసాల చేత కృశించినదై, ధీనురాలై, మాటిమాటికి నిట్టూర్పులు విడుస్తూ ఉండడాన్ని అతడు గమనించాడు. అప్పుడు మారుతి తనలో తాను తర్కించుకొని ఆమెను గుర్తించడానికై పరిపరి విధాల ఆలోచించసాగాడు. ఆమె ఒకే వస్త్రాన్ని ధరించి ఉంది. అది మలినమైనను పట్టు వస్త్రం కావడం వలన కాంతి వంతంగానే ఉంది. దుఃఖ సంతప్తయై తరిగిపోయిన శరీరచ్ఛాయతో, ధ్యానస్థితిలో ఉన్నట్లై, బిడియంతో తల వంచుకొని, దుఃఖంతో, శోకిస్తూ ఆమె అతిధీనంగా ఉంది. హనుమంతుడు తాననుకొన్న కారణాలను బట్టి, కామరూపియైన రావణుడి చేత, అపహరింప బడిన ఆనాటి 'సీత ఈమె యే' - అని భావించాడు. ఋష్యమూక పర్వతంపైగా వెళ్తున్నప్పుడు, అంగన రూపురేఖలే ఈమెలో కనబడుతున్నాయి. శ్రీరాముడు తనకు తెలిసిన రూప, లావణ్య, వైభవాలన్నీ ఈమెలో కనబడుతున్నాయి. కనుక నిజంగా ఈమె సీతయే. రావణుడు సీతాదేవిని అపహరించు కొని వెళ్తున్నప్పుడు, ఋష్యమూక పర్వతంపై జారవిడువ బడిన, బంగారపు జరీ అంచు పచ్చని వస్త్రము, ఈమె ధరించిన వస్త్రము ఒక్కటియే. ఇది చాలు ఈమె సీతాదేవియే అని స్థిరంగా నిశ్చయించు కోవడానికి. అని మారుతి తాను సీతాదేవిని గుర్తించాడు.

5. ప్రశ్న : కష్టదశలో ఉన్న సీతాదేవిని చూసిన మారుతి ఏ విధంగా శోకించాడు ?

జవాబు : కటిక నేలపై కూర్చుని యున్న సీతాదేవిని జూసి హనుమంతుడు ఇట్లను కొంటున్నాడు. లోకంలోని జనులందరి చేత స్తుతింప తగినవారు, సుగుణాభి రాములైన సీతారాములను, మనసుతో ప్రశంసిస్తూ, ఒక్క క్షణకాలంపాటు ధ్యానమగ్నుడై సీతాదేవి ధీన స్థితిని చూసి కన్నీరు మున్నీరుగా విలపించసాగాడు. సద్గుణాల రాశియైన ఈమె కొరకే కదా! రాముడు వాలిని సంహరించింది. వాలినే గాదు, విరాదుడు, ఖరుడు, ఇతర పద్నాలుగు వేల మంది

రాక్షసులు నేల పాలయ్యింది కూడా ఈమె కొరకే గదా! అంతేగాదు ఈ మహా పతివ్రత కొరకు రాముడు త్రిలోకాధి పత్యాన్నైనా వదులుకో గలడు. ఏనాటికైనా తన భర్తను పొందగలను అను నమ్మకంతో ఈమె ప్రాణాలను చిక్కబట్టుకొని ఉన్నది. శ్రీరామునికడ దివ్య సుఖాలను పొందడానికి అర్హురాలైన ఈమె ఈ రాక్షస స్త్రీల మధ్య దుఃఖార్తయగుట జూసి, నా మనసుగూడ కలత చెందుతున్నది. ఇక పరమ దయాళువైన రాముని విషయం చెప్పేదేముంది. అని మహావీరుడైన హనుమంతుడు ఈ విధంగా విషయాలను సమగ్రంగా పరిశీలించిన పిమ్మట 'ఈమె సీతయే' అని గట్టిగా నిశ్చయించు కొని బాధపడుతూ ఆ చెట్టుపైనే ఆకుల మధ్య కనబడకుండా ఉన్నాడు.

### అరువది ఒకటవ అధ్యాయము

జవాబులు : 1.3. సంపాతి 2.1. అశోకవనం
3. అశోక వృక్షం

..............

# సుందరా కాండము

## 17, 18, 19, 20, 21 సర్గలు

### అరువది రెండవ అధ్యాయము

1. ప్రశ్న : నానా వికృతాకారాలు గల రాక్షసీ స్త్రీల రక్షణలో ఉన్న సీతాదేవిని చూసి, ఏది ఏమైనప్పటికి శ్రీరామ పత్నిని చూశాను. అని మారుతి సంతోషించాడు. కాని అప్పుడాయనకు సీతాదేవి పాపగ్రహాలచే చుట్టబడిన ఏ నక్షత్రంవలె ఆమె కనిపించింది ?

జవాబు : 1. చిత్తా 2. విశాఖ
3. స్వాతి 4. రోహిణి

2. ప్రశ్న : హనుమంతుడు సీతాదేవి కూర్చుని యున్న చెట్టుకు దగ్గరలో ఉన్న చెట్టు ఆకులతో నిండిన కొమ్మపై ఒదిగి, దట్టమైన పత్ర, పుష్పాలచే కప్పబడి ఉన్నాడు. రావణుడు కామాతురుడై అనేక మంది అంతఃపుర

నారీ జనం వెంటరాగా సీతాదేవి ఉన్న ప్రదేశానికి ఏ సమయంలో వచ్చాడు ?

జవాబు : 1. మధ్యాహ్నకాలం 2. ప్రాతఃకాలాన
3. సాయం సమయాన 4. అర్ధరాత్రి సమయాన

3. ప్రశ్న : రాక్షసరాజు రావణుడు తన సమీపానికి రాగేనే సీతాదేవి దుఃఖార్తయై భయపడుతూ, అంజలి ఘటించి, శ్రీరాముని వలన రావణునికి పరాభవం కలగాలని ఎవరిని ప్రార్ధిస్తున్నట్లుగా హనుమంతునికి అని పించింది?

జవాబు : జవాబుల కాలంలో ఉన్నది.

4. ప్రశ్న : చెట్టుపై ఆకుల మధ్యలో నున్న హనుమంతుడు చూస్తుండగా, రావణుడు సీతాదేవిని ఏ రీతిగా ప్రలోభపెట్ట ప్రయత్నించాడు?

జవాబు : అంతఃపుర స్త్రీ జనంతో కలిసి వచ్చిన రావణుడు సీతాదేవికి దగ్గరగా వెళ్లి, ఓ సుందరాంగీ! సీతా! నన్నుజూసి నీవు ముఖాన్ని చాటు చేసుకొంటున్నావు. ఓ విశాలాక్షి నేను నిన్ను ప్రేమిస్తున్నాను. ఓ ప్రియురాలా! నన్ను ఆదరించు. ఓ సీతా మనుష్యులు గాని, రాక్షసులు గాని, దేవగంధర్వులు గాని నన్నేమి చేయ్యలేరు. నా వలన నీకెలాంటి భయమూ అక్కరలేదు. బలాత్కారంగా పర స్త్రీలను అపహరించడం, పొందడం రాక్షసులకు స్వధర్మమే. నాలో కామ వికారం రెచ్చగొట్టబడి ఉన్నను, నాపై ప్రేమలేని నిన్ను తాకనే తాకను. నీవు భయపడ వలసిన పనిలేదు. నన్ను నమ్ము. మనస్ఫూర్తిగా నన్ను ప్రేమించు. ఓ మంగళ ప్రదురాలా! ఒకసారి ఇటు నావైపు చూసి, నా ఐశ్వర్యాన్ని, తేజస్సును, కీర్తినీ, బాగుగా పరికించి చూడు. నార చీరలు ధరించి, అడవుల పాలైన రాముని వలన నీకు ఒరిగేదేమీ లేదు. రాముడు జయాన్నీ, సంపదనూ, పోగొట్టుకొని అడవుల పాలై మునివ్రతాన్ని పాటిస్తూ, కటిక నేలపై శయనిస్తున్నాడు. ఇంతకు అతడు జీవించి ఉన్నాడో? లేడో? తెలియదు. నాచేత చిక్కిన నిన్ను తిరిగి అతడు పొందడం అసాధ్యం. నా అంతఃపురంలో సర్వసద్గుణ సంపన్నులైన కాంతలు ఎందరో ఉన్నారు. నన్ను నీవు అంగీకరిస్తే వారంతా నీకు సేవలు చేస్తారు. ఓ సుందరాంగీ! ఏ విషయమందునూ రాముడు నాతో సమానుడు కాడు. కాజాలడు. నా స్వాధీన మందున్న ధన రాసులు, సంపదను,

రాజ్యాన్ని నీకప్పగిస్తాను. నన్ను అంగీకరించు. అని రావణుడు సీతాదేవిని అనేక విధాల ప్రలోభ పెట్టడాన్ని హనుమంతుడు చూశాడు.

5. ప్రశ్న : తనను ప్రలోభ పెట్టజూసిన రావణుని సీతాదేవి ఏ విధంగా తృణీకరించి మాట్లాడింది ?

జవాబు : భయంకరంగా ఉన్న ఆ రావణుని మాటలు విని ధీనురాలైన ఆ సీతాదేవి ఏడుస్తూ, గడ్డిపోచనే బ్రహ్మాస్త్రంగా చేసి, కాకాసురునిపై ప్రయోగించిన తన భర్త శ్రీరాముడినే ధ్యానిస్తూ, ఒక గడ్డిపరకను అడ్డుంచు కొని ఓ రావణా! నీ మనస్సును నామీద నుండి తొలగించు కొని నీ కాంతలపైకి మరల్చుకో. నేను ఉత్తమమైన జనక వంశంలో జన్మించాను. పవిత్రమైన రఘువంశంలో మెట్టిన దానను. ఏక పత్నీవ్రతుడైన శ్రీరామునికి ధర్మపత్నిని. పతి వ్రతను కనుక నీవు చక్కని దృష్టికలిగి ఉండు. సత్పురుషుల నియమ పూర్వకమైన జీవన విధానాన్ని అనుసరించు. ఈ దేశంలో సత్పురుషులే లేరా? నీకు నువ్వే ఉపమానంగా చేసుకొని నీ భార్యలతో భోగించు. నీవు శ్రీరాముని చేతిలో దుర్మరణంపాలు గాకుండా ఉండాలంటే, ధర్మాత్ముడైన శ్రీరామునితో నన్ను చేర్చు. రాముడు ధర్మజ్ఞుడు. శరణాగత వత్సలుడు. నిన్ను తప్పక క్షమిస్తాడు. ఇంద్రాది దేవతలు ప్రయోగించిన ఆయుధాల నుండి నీవు తప్పించు కొన్నను, శ్రీరాముని బాణాన్నుండి నిన్నెవరూ రక్షించలేరు. శత్రుసంహారకుడైన నా భర్త నన్ను నీ నుండి త్వరలోనే తీసికొని పోగలడు. నీఛుడా! యుద్ధము నందు మా వారిని జయించలేక, రామ లక్ష్మణులు లేని సమయాన్ని కల్పించి, దొంగవలె నన్నపహరించావు. ఈ చతుర్ధశ భువనాలలో శ్రీరాముని బాణాన్నుండి నిన్నెవ్వరూ రక్షించలేరు. అని సీతాదేవి రావణుని తృణీకరించి మాట్లాడు తూండగా హనుమంతుడు విన్నాడు.

## అరువది రెండవ అధ్యాయము

జవాబులు : 1.4. రోహిణి 2.2. ప్రాతఃకాలాన

3. కులదేతను

# సుందరా కాండము

## 22, 23, 24, 25, 26 సర్గలు

## అరువది మూడవ అధ్యాయము

1. ప్రశ్న : సీతాదేవి పలికిన మాటలకు రావణుడు ఆగ్రహించి, ఓ సీతా! ఇప్పుడు నేను విధించిన ఈ గడువు లోపల నీ మనసు మార్చుకొని నా దానవు కావాలి. లేకున్న నిన్ను చంపుతాను. అని బెదిరించాడు. ఆ రావణుడు విధించిన గడువెంత కాలం ?

జవాబు : 1. ఒక నెల రోజులు　　2. రెండు నెలల కాలం
3. మూడు నెలల కాలం　　4. నాలుగు నెలల కాలం

2. ప్రశ్న : సీతాదేవి కడకు తన చుట్టూ ఉన్న రాక్షస స్త్రీలు వచ్చి ఓ సీతా! రావణుడు మిక్కిలి శ్రేష్ఠుడు, మహాత్ముడు. అతని భార్యవు కావడమే నీ అదృష్టం. కనుక నీవు రావణుని అంగీకరించు అని చెబుతూ రావణుడు ఏ వంశానికి చెందినవాడు అని వారు చెప్పారు ?

జవాబు : 1. చంద్ర వంశం　　2. భృగు వంశం
3. పులస్త్య వంశం　　4. సూర్య వంశం

3. ప్రశ్న : మానవ మాత్రుడైన రాముడు చుట్టూ సముద్రమున్న ఈ లంకకు ఎట్టి పరిస్థితులలోనూ చేరుకోలేడు. మా మాటలు విశ్వసించి, రావణుని భర్తగా అంగీకరించి రాజ భోగాలనుభవించు అని పలుకుతన్న రాక్షస స్త్రీల వేధింపులను భరించలేక సీతాదేవి అక్కడ నుండి లేచి దగ్గరలో ఉన్న ఏ చెట్టు క్రిందకు చేరింది?

జవాబు : జవాబుల కాలంలో ఉన్నది.

4. ప్రశ్న : రాక్షస స్త్రీల మాటలు భరించలేక జానకీ దేవి ఏ విధంగా విలపించింది ?

జవాబు : తనచుట్టూ ఉన్న రాక్షస స్త్రీలు పలికిన పరుషమైన మాటలు విని జానకీదేవి విలపించ సాగింది. వారి మాటలకు భయపడిన మహాసాధ్వియైన సీతాదేవి కన్నీరు కార్చుతూ గద్గద స్వరంతో

మాటలు తడబడుతూండగా, ఒక మానవ కాంత ఎన్నటికీ రాక్షసునికి భార్య కాలేదు. నన్ను మీ ఇష్టానుసారం చంపితినివేయండి అని అడవిలో తోడేళ్ళ మధ్య చిక్కుకున్న జింక పిల్లవలె సీతాదేవి శరీరాన్ని దగ్గరగా ముడుచు కొని, గడగడా వణక సాగింది. శోకంచేత మనసుకలత చెందగా ఆమె తన భర్తను తలచుకొంటూ, చింతించ సాగింది. ఆ రాక్షస స్త్రీల మాటలు శూలాలై ఆమెను బాధించసాగాయి. నా భర్తయైన శ్రీరాముని యెడబాసిన నేను తీక్ష్ణమైన విషాన్ని మింగిన దానివలె, ఇక మీదట జీవించడం మంచిది కాదు. నేను పూర్వజన్మలో ఎట్టి పాపం చేశానో, ఇప్పుడు నాకీ భయంకరమైన దుఃఖం దాపురించింది. ఈ రాక్షస స్త్రీల ఆధీనంలో నున్న నేను ఇకపై శ్రీరాముని చేరలేను. కనుక అంతులేని శోకంతో మునిగిన నేను ఈ జీవితాన్ని చాలించడం మంచిది. కాని నా జీవితం నా భర్తయైన శ్రీరాముని ఆధీనములోనిది. కనుక నా ఇష్టాను సారం దీనిని త్యజించడానికి నాకు అధికారం లేదు. అని పరిపరి విధాల జానకీ దేవి ఆలోచించ సాగింది.

5. ప్రశ్న : తానున్న కష్ట సమయంలో సీతాదేవి తన జీవిత మనుగడ గురించి ఏ విధంగా నిశ్చయించు కొన్నది?

జవాబు : నిరంతరం కన్నీరు కార్చుచూ చెట్టు నీడన విలపిస్తున్న జానకీదేవి, మతి భ్రమించిన దానివలె శోకిస్తూ, నేలపై పడిపోయింది. అయ్యో! శ్రీరాముడు చిత్రమైన లేడికొరకై వెళ్ళినప్పుడు కామ రూపియైన రాక్షసుడగు రావణుడు బలవంతంగా నన్ను అపహరించి, ఏడుస్తున్న నన్ను తీసికొని వచ్చాడు. అటు పిమ్మట ఈ రాక్షస స్త్రీలు నన్ను తమ ఆధీన మందుంచుకొని, ధారుణంగా బెదిరిస్తూన్నారు. ఇట్టి దుఃఖంలో మునిగియున్న నాకు జీవితంపై ఏమాత్రం ఆశలేదు. జగన్నాధుడైన శ్రీరామునికి ధర్మపత్నినై యుండి, నేనిట్లు దురవస్థల పాలగుటకు గల కారణమేమి? నా అదృష్టం అడుగంటిందా? మహాత్ముడైన నా ప్రభువునువీడి జీవించడంకంటే మరణమే మేలు. ఒకవేళ ఆ మహా పురుష లిరువురూ అస్త్ర, శస్త్రాలను ప్రక్కన పెట్టి

వనము లందు కందమూలాలు తింటూ మునివృత్తి చేపట్టి ఉన్నారా? ఏమి? మహావీరులైన రామ లక్ష్మణులను దుర్మార్గుడైన రావణుడు ఏదైనా కపటోపాయంతో చంపించి ఉంటాడా? ఇట్టి కష్టకాలంలో ఏవిధంగా ఆలోచించినా నాకు మరణమే శరణ్యం. కాని ఇట్టి దుఃఖంలో కూడా నాకు మరణం రావడం లేదు. ఆత్మ జ్ఞానియు, ప్రేమ స్వరూపుడును అయిన రామునకు దూరమైనాను. పాపియైన రావణుని వశంలో ఉన్నాను. ఇట్టి స్థితిలో నేను మరణించడం తప్ప వేరే మార్గంలేదు. అని సీతాదేవి తాను నిశ్చయించు కొన్నది.

## అరువది మూడవ అధ్యయము

జవాబులు : 1.2. రెండు నెలలు కాలం 2.3. పులస్త్య వంశం
3. మారుతి ఉన్న శింశుపా వృక్షం

..................

# సుందరా కాండము

## 27, 28, 29, 30, 31 సర్గలు

## అరువది నాలుగవ అధ్యాయము

1. ప్రశ్న : సీతాదేవి తన ప్రాణ త్యాగానికి సంబంధించిన మాటలు మాట్లాడుతూ ఉండగా, కొందరు రాక్షస స్త్రీలు ఆమెను బెదిరిస్తుండగా ఒక రాక్షస స్త్రీ అప్పుడే నిద్రలేచి, రాక్షస స్త్రీలను మందలించి, నాకిప్పుడొక కల వచ్చింది. ఆ కలలో రాక్షసులకు నాశనము, శ్రీరామునకు జయము కలుగును అని తెలిపిన ఆ రాక్షసి పేరేమి ?

జవాబు : 1. అజాముఖి 2. శూర్పణఖ
3. ప్రఘస 4. త్రిజట

2. ప్రశ్న : రాక్షస స్త్రీలు పెట్టే బాధలు భరించలేక సీతాదేవి తాను ఏ సాధనంతో ఉరి వేసుకొని మరిణించాలని నిశ్చయించు కొన్నది ?

జవాబు : 1. త్రాడుతో 2. తన జడతోనే
3. తన చీర కొంగుతో 4. మర్రి ఊడతో

3. ప్రశ్న : ప్రాణత్యాగానికి సిద్ధపడి వ్యధచెందుతున్న జానకీదేవి, మరికొంత సమయం గడిచిన పిమ్మట తనకు శుభం జరగబోతోందని భావించి, మనసు స్వస్థత ఏర్పడింది. ఏకారణంగా ఆమెకు అలా అనిపించింది?

జవాబు : జవాబుల కాలంలో ఉన్నది.

4. ప్రశ్న : అశోక వృక్షంపైజేరి అన్నింటిని ప్రశాంతంగా గమనిస్తున్న హనుమంతుడు ఏ విధంగా ఆలోచనలు చేయసాగాడు?

జవాబు : హనుమంతుడు చెట్టుపై నుండి అన్నింటినీ ప్రశాంతంగా గమనిస్తూ, సీతాదేవి పలికిన మాటలను, త్రిజట స్వప్న వృత్తాంతాన్ని, రాక్షస స్త్రీలు సీతను భయపెడుతూ పలికిన మాటలను పూర్తిగా విన్నాడు. పిమ్మట ఆ మారుతి సీతాదేవిని గురించి ఆలోచించ సాగాడు. ఈ సీతాదేవి జాడ తెలిసి కొనుటకై లక్షల కొలది వానరులు అన్ని దిక్కులకు వెళ్ళి ఉన్నారు. ఈమె దర్శన భాగ్యం నా కొక్కడికే దక్కింది. శత్రు బలాలను మెలకువతో సమగ్రంగా తెలిసికొనే గూఢచారి లాగా, నేను ఎవరికీ తెలియని విధంగా సంచరిస్తూ అన్ని విషయాలను పూర్తిగా తెలిసి కొన్నాను. ఈ రాక్షసుల యొక్క విశేషాలను పూర్తిగా తెలిసి కొన్నాను. లంకాపురిని పూర్తిగా చూశాను. రావణుని ప్రభావాన్ని, అతని ధోరణిని తెలిసి కొన్నాను. సీతాదేవి తీవ్రమైన శోకముల ధాటికి ఈమె మనసు తీవ్రంగా వ్యాకులమై ఉంది. నే నీమెను ఓదార్చకుండా వెళితే నా ప్రయాణానికి అర్ధమే ఉండదు. ఈమెను పలుకరిద్దామను కొంటే చుట్టూ రాక్షస స్త్రీలున్నారు. ప్రస్తుతం నేను ఓపికగా ఉండి రాక్షస స్త్రీలు ఏమరు పాటుగా ఉన్నప్పుడు, సామాన్య మానవుల రీతిలోనే నేనామెతో సరళమైన భాషలో మాట్లాడాలి. అసలే ఈ సీతాదేవి రావణ భయంతో ఉంది. నన్ను ఆమె రావణ మాయగా భ్రమించవచ్చు. అట్లు ఆమెకు భయ సందేహాలు కలుగ కుండునట్లుగా, ఈమెకు నేను కనబడకుండా, శ్రీరామగుణ కీర్తనం చేస్తూ ఈమెను ప్రసన్నురాలిగా చేసికోవాలి. అని మారుతి చెట్టుపై కొమ్మల మధ్యఉండి, సీతాదేవినే చూస్తూ, ఆమెయే వినేంత తక్కువ స్వరంతో మధురంగా మాట్లాడాలని అనుకొంటూ, ఆ దిశగా ప్రయత్నించాడు.

5. ప్రశ్న : సీతాదేవి వినేంత తక్కువ స్వరంతో హనుమంతుడు రామకథను ఏ విధంగా వర్ణించాడు ?

జవాబు : మారుతి తాను చెట్టుపై నుండి సీతాదేవి వినేంత తక్కువ స్వరంతో మాట్లాడుతూ, ఇక్ష్వాకు వంశంలో దశరథుడు అనే పేరుగల మహా రాజుండేవాడు. ఆయనకు కలిగిన నలుగురు కొడుకులలో జ్యేష్ఠుడు శ్రీరాముడు. అతడు జ్ఞానస్వరూపుడు. ధనుర్ధారులలో మేటి, ఆశ్రితులకు, సకల ప్రాణులకు, సమస్త ధర్మాలకు సంరక్షకుడు. అమిత బలపరాక్రమ సంపన్నుడు. సత్యవాది. వృద్ధుడైన తన తండ్రి ఆజ్ఞను పాటించి, శ్రీరాముడు తన భార్యయైన సీతాదేవితోనూ, సోదరుడైన లక్ష్మణుని తోనూ వనాలకు వెళ్ళాడు. ఆ మహారణ్యంలో కామరూపులైన అనేక మంది రాక్షసులను సంహరించాడు. ఈ వార్త విన్న రావణుడను రాక్షసుడు కోపంతో వచ్చి, మాయ లేడి ద్వారా శ్రీరాముని మోసగించి, సీతాదేవిని అపహరించాడు. అప్పుడు శ్రీరాముడు సీతాదేవికై వెదకుచూ ఆ వనమందు సుగ్రీవుడను వానరుని మిత్రునిగా పొందాడు. వానర రాజైన సుగ్రీవుని ఆదేశాను సారం వేలకొలది వానరులు అన్ని దిక్కుల యందు సీతాదేవిని వెదకడానికై వెళ్ళారు. వారిలో నేను 'సంపాతి' సూచనమేరకు, సీతాదేవి నిమిత్తమై, నూరు యోజనాల సముద్రాన్ని దాటి ఇచటికి వచ్చాను. సీతాదేవి ఆకారాన్ని, రూప సౌభాగ్యాన్ని, తేజో విశేషాలను, కొన్ని గుర్తులను నేను రాముని వలన విని ఉన్నాను. నేనువిన్న అట్టి శుభలక్షణాలతో ఉన్న సీతాదేవిని ఇచట చూశాను. అని హనుమంతుడు పలికిన మాటలు విని జానకీదేవి ఆశ్చర్యపడి, శ్రీరాముని స్మరిస్తూ, తానున్న చెట్టుపైకి పరిశీలనగా చూసి హనుమంతుని చూసింది.

## అరువది నాలుగవ అధ్యాయము

జవాబులు : 1.4. త్రిజట 2.2. తనజడతోనే

3. కొన్ని శుభశకునాల వలన

# సుందరా కాండము

## 32, 33, 34, 35, 36 సర్గలు

## అరువది ఐదవ అధ్యాయము

1. ప్రశ్న : కొమ్మలమధ్య, ఆకులలో కలిసిపోయి ఉన్న మారుతిని సీతాదేవి చూసి, ఇది కలకాదు, నిజమేనని నిర్ధారించుకొని శ్రీరాముని గుణకీర్తనం చేస్తూన్న ఆ వానర రూపాన్ని జానకీదేవి ఎవరుగా భావించింది ?

జవాబు : 1. కామరూపుడైన రాక్షసునిగా
2. రావణుని మారు రూపంగా
3. శ్రీరాముని పక్షంవాడుగా
4. తన్ను మోసగించ వచ్చిన వానరునిగా

2. ప్రశ్న : శింశుపా వృక్షంపై నుండి దిగిన హనుమంతుడు సీతాదేవికి నమస్కరించి, ఆమెను సీతాదేవిగా గుర్తించి, ఆమె ధీనగాథను అడిగి తెలిసికొన్నాడు. ఆ సమయంలో జానకీదేవికి కాపలా ఉన్న రాక్షస స్త్రీలు ఏమైనారు ?

జవాబు : 1. రావణుని వద్దకు వెళ్ళారు.
2. అందరూ నిదురించారు
3. హనుమంతుని చూసి పారిపోయారు
4. అందరూ ఆహారానికై వెళ్ళారు.

3. ప్రశ్న : దుఃఖ పరంపరలో కృంగిపోతున్న సీతాదేవికి దగ్గరగా వచ్చి మాట్లాడడంతో, సీతాదేవి ఆతనిని రావణుని మాయా రూపునిగా అనుమానించింది. అందుకు హనుమంతుడు ఆమెకు సందేహ నివృత్తి ఏ విధంగా చేశాడు ?

జవాబు : జవాబుల కాలంలో ఉన్నది.

4. ప్రశ్న : సీతాదేవికి మారుతి తనపై ఏ విధంగా నమ్మకం కలిగించాడు ?

జవాబు : హనుమంతుడు చెప్పిన రామకథను విని సీతాదేవి ఆనందించి ఓ హనుమంతుడా! నీకు శ్రీరామునితో పరిచయం ఎట్లా కలిగింది? వానరులైన మీతో నరులకు స్నేహం ఎట్లా కుదిరింది? రామ లక్ష్మణుల లక్షణాలను, వారి గుణ గణాలను వర్ణించి చెప్పు. నాలోని శోకం తొలగి పోతుంది. అని పలికిన జానకీ దేవితో మారుతి అమ్మా! నీ భర్త యొక్క అవయవ సౌభాగ్యాలను నీవెరుగుదువు. అయినను నీవు నన్నడగడం నా అదృష్టంగా భావిస్తాను. ఓ జానకీదేవీ! శ్రీరాముడు కమలపత్రాల వంటి కన్నులు గలవాడు. తన నిరుపమాన కాంతిచే సమస్త ప్రాణులకును ఆనందాన్ని కూర్చువాడు. పుట్టుకతోనే అతడు చక్కని దేహ సౌందర్యము, గుణ సంపదా కలవాడు. అని మారుతి శ్రీరాముని యొక్క పాదాలనుండి శిరస్సు వరకుగల సకల అంగాంగాలను వర్ణించి చెప్పాడు. పిమ్మట తల్లీ! అట్టి శ్రీరాముడు లక్ష్మణునితో గూడి నిన్ను వెదకుతూ మా సమీపానికి వచ్చారు. ధనుర్ధారులైన వారిని చూసిన మా వానర రాజైన సుగ్రీవుడు భయపడి ఉండగా, నేను వారిద్దరినీ కలిపినాను. శ్రీరామ సుగ్రీవులకు అగ్నిసాక్షిగా మైత్రి కుదిరిన పిమ్మట రాముడు సుగ్రీవుని ఓదార్చి, సుగ్రీవుని అన్నయైన వాలిని సంహరించి, సుగ్రీవుని కిష్కింధకు రాజును చేశాడు. రావణుడు నిన్నపహరించు సమయంలో నీవునీ ఆభరణాలను భూమిపై వదిలావు. అవి మాకు దగ్గరగానే పడడంతో వాటినిదాచి ఉంచిన మేము శ్రీరామునికి చూపించాము. కాని రావణుడు నిను గొనిపోయిన మార్గాన్ని మాత్రం చెప్పలేక పోయాము. సుగ్రీవుడు కిష్కింధా రాజ్యానికి రాజై మహావీరులైన వానర యోధులను రప్పించి నిన్ను వెదకడానికై అన్ని దిక్కులకూ పంపించాడు. సుగ్రీవుని ఆదేశం మేరకు అన్ని దిక్కులకూ పంపబడిన వానరులలో నేను ఒకడిని. అమ్మా! నేను శ్రీరాముని దూతను నన్ను నమ్ము! అని హనుమంతుడు సీతాదేవికి నమ్మకం కలిగే విధంగా చెప్పాడు.

5. ప్రశ్న : హనుమంతుడు సీతాదేవికి నమ్మకం కలిగించడానికై రాముడు తన ద్వారా పంపిన ఆనవాలును ఏ విధంగా ఇచ్చాడు.

జవాబు : సీతాదేవికి పూర్తిగా నమ్మకం కలిగించడానికై హనుమంతుడు ఓ మహాభాగ్య శాలినీ! నేను వానరుడను శ్రీరాముని దూతను. శ్రీరామ నామాంకితమైన ఈ ఉంగరాన్ని చూడు. నాపై నీకు విశ్వాసము కుదురుకొనడానికై మహాత్ముడైన శ్రీరాముడు ఇవ్వగా నేను తీసికొని వచ్చాను. ఊరడిల్లము తల్లీ! త్వరలోనే నీ దుఃఖములన్నీ తొలగిపోతాయి. అని మారుతి సమర్పించిన అంగులీయకమును తీసికొని తన భర్త స్పర్శకు నోచుకొన్న, ఆ ఉంగరాన్ని పరికించి చూస్తూ, భర్తను పొందిన దానివలె మహదానంద భరితురాలయ్యింది. హనుమా! నా రాముడు పితృవాక్య పరిపాలన అనే ధర్మాన్ని పాటించడానికై, రాజ్యన్ని విడిచినప్పుడు కూడా వ్యధచెందలేదు. కాని ఇప్పుడు నేను దూరమైన కారణంగా వ్యధ చెందడం లేదు కదా! రామునిపై ప్రేమకు పాత్రులైన వారిలో నాతో సమానమైన వారుగాని, అదికులుగాని ఎవ్వరూ లేరు. అని పలుకుతున్న సీతాదేవితో మారుతి అమ్మా! ప్రశ్రవణగిరిపై విరాజిల్లుచున్న రాముని నీవు అతి త్వరలోనే దర్శిస్తావు. ఆయన శరీరంపై వాలెదు అడవి ఈగలను, దోమలను, పురుగులను సైతం గమనించక నీ యందే మనసును నిలిపి శోకాకులుడై యున్నాడు. అమ్మా సీతాదేవీ! శరత్కాల మేఘాలచే కప్పబడిన చంద్రుడు మరలా ఆ చంద్రుడు మబ్బులు తొలగిపోగానే, పూర్ణచంద్రుని మాదిరి త్వరలోనే నీవు రామదర్శనంతో ఆనందిస్తావు. అని హనుమంతుడు సీతాదేవికి ఊరట కలిగించి నమ్మకం కలిగించాడు.

## అరువది ఐదవ అధ్యాయము

జవాబులు : 1.3. శ్రీరాముని పక్షం వాడుగా

2.2. అందరూ నిదురించారు

3. శ్రీరాముని గుణకీర్తనం చేశాడు.

# సుందరా కాండము

## 37, 38, 39, 40 సర్గలు

## అరువది ఆరవ అధ్యాయము

1. ప్రశ్న : హనుమంతుడు సీతాదేవిని తన వెంటరమ్మని ప్రార్థించగా ఆమె ఏమని సమాధానం చెప్పింది ?

జవాబు : 1. ఏమీ చెప్పకుండా మౌనం వహించింది
2. రాముడే వచ్చి నన్నుతీసికొని వెళ్ళడం మంచిది అన్నది
3. హనుమంతునిపై కోపగించు కొన్నది
4. హనుమంతుని రావణ మాయగా అనుమానించింది

2. ప్రశ్న : హనుమంతుడు సీతాదేవితో అమ్మా! నీవు నా వెంట రావడానికి ఇష్టం లేనిచో, శ్రీరాముడు గుర్తించగల ఏదైన ఆనవాలును నాకు ప్రసాదించు. అని ప్రార్థించగా అమ్మ వారు ఆంజనేయునికి ఏ వస్తువు నిచ్చి పంపించింది ?

జవాబు : 1. కంఠాభరణాన్ని 2. తనపాద మంజీరాలను
3. చూడామణిని 4. వడ్డాణాన్ని

3. ప్రశ్న : హనుమంతునితో సీతాదేవి ఓ కపివీరుడా! నీకు సహాయకులైన వానర భల్లూక వీరులపైన, రాజ కుమారులైన రామ లక్ష్మణులపైనా నాకొక సందేహముంది. అని పలికింది. అట్లు హనుమంతునితో ఆమె ఏ సందేహాన్ని వెలిబుచ్చింది ?

జవాబు : జవాబుల కాలంలో ఉన్నది.

4. ప్రశ్న : హనుమంతుడు శ్రీరాముని వద్దకు బయలుదేరు తున్నాడని తెలిసి సీతాదేవి ఆయనతో ఏఏ విషయాలు మాట్లాడింది ?

జవాబు : మారుతి జానకీ దేవితో అమ్మా! భల్లూక వానర వీరులతో గూడిన శ్రీరాముడు త్వరలో ఇచటికి వస్తాడు. ఆ స్వామి యుద్ధంలో

శత్రువులను దునుమాడి నీ దుఃఖాన్ని రూపుమాప గలడు. ఆయన నీ కోసం ఆ యముడినైనా ఎదుర్కోగల సమర్థుడు. నీనిమిత్తంగా ఆయనకు జయము తప్పక కలుగుతుంది. అని పలికిన హనుమంతుని సహేతుకమైన మాటలు విని సీతాదేవి ఆయనను ప్రశంసిస్తూ తన భర్తయైన శ్రీరామునిపై భక్తి పూర్ణములైన అతని మాటలను వాత్సల్యంతో అభినందించింది. ఓ కపివరా! నీకు ఇష్టమైతే ఇచట ఒకరోజు ఏదైనా రహస్య ప్రదేశంలో విశ్రాంతి తీసికో. రేపు వెళ్ళవచ్చు. నీరాక నాకు కొంత ఊరట కలిగించింది. కాని నీవు వచ్చు వరకు నా ప్రాణాలు నిలుచునో? లేదో? తెలియదు. ఓ మహావీరా! శ్రీరాముడు యుద్ధంలో రావణాది రాక్షసులను జయించి, నన్ను గ్రహించి, జయపతాకాలతో 'అయోధ్యకు వెళితే' అది నాకు శోభను చేకూర్చుతుంది. శ్రీరాముడు తన శరపరంపరచే లంకను అతలాకుతలం చేసి నన్ను తీసికొనివెళితే అది ఆయన పరాక్రమానికి వన్నెతెస్తుంది. అని పలికిన సీతాదేవితో హనుమంతుడు అమ్మా! శ్రీరామునితో స్నేహం చేసిన సుగ్రీవుడు వానర రాజ్యానికి రాజు. ఆయనవద్ద కోట్లకొలది అత్యంత శక్తివంతులైన వానర భల్లూక వీరులున్నారు. వారంతా నీ కొరకు తమ ప్రాణాలు అర్పించడానికి సిద్ధంగా ఉన్నారు. వారంతా ఇచటికి వస్తారు. రఘు వంశీయుడైన రాఘవుడు సపరివారంగా రావణుని హతమార్చి నిన్ను అయోధ్యా నగరానికి తీసికొని పోగలడు. నీకు శుభమగు గాక! నీవు త్వరలోనే రామచంద్ర ప్రభువును దర్శించగలవు. అని హనుమంతుడు జానకీ దేవికి ధైర్య వచనాలు పలికి తాను శ్రీరాముని వద్దకు బయలుదేరడానికి సిద్దంగా ఉన్నాడు.

5. ప్రశ్న : శ్రీరామునికి జానకీదేవి హనుమంతుని ద్వారా ఎటువంటి సందేశాన్ని పంపించింది ?

జవాబు : శ్రీరాముని వద్దకు బయలు దేరడానికి సిద్ధంగా ఉన్న హనుమంతుడితో జానకీదేవి ఓ వానరోత్తమా! ప్రియ భాషివైన నిన్ను చూసి నేను మిక్కిలి సంతోషిస్తున్నాను. శోకము చేత నేను కృశించి యున్నాను. యెట్లైనను మహాపురుషుడైన నా స్వామిని పొందగోరుతున్నాను. నా రామునితో నేను చెప్పినట్లుగా ఇట్లు తెలియజేయి. ఇంద్ర వరుణులతో సమానమైన పరాక్రమము గలవాడవై యుండి, నీ భార్యయైన సీత రావణాసురునిచే అపహరింపబడి రాక్షసుల మధ్య కాలం వెళ్ళబుచ్చుతూండగా నీవెట్లు ఓర్చుకో గలుగుతున్నావు. ఈ దివ్య చూడామణిని నేనింతవరకు కాపాడుకోగలుగుతూ వచ్చాను. దీనిని చూసినప్పుడల్లా నిన్నే దర్శించినట్లు సంతోషిస్తూంటాను. భయంకరమైన రాక్షస స్త్రీలు నాకు కలిగించే దుఃఖాలు భరింపరానివి. అన్నింటిని ఏనాటికైనా నీవు వచ్చి నన్ను రక్షింతువన్న నమ్మకంతో ఇంతవరకు సహిస్తూ వచ్చాను. రావణుడు విధించిన గడువులోపల నీవు రానిచో నా ప్రాణములు నిలువవు. అని నేను పలికినట్లుగా నా రామునికి తెలియజెయ్యి. ఓ హనుమంతుడా! రామ లక్ష్మణులను, సుగ్రీవాదులను కుశల ప్రశ్నలతో నేనడిగినట్లుగా తెలియజెయ్యి. అని పలికిన సీతాదేవి సందేశంతో హనుమంతుడు కృతార్థుడై పొంగిపోతూ, మిగిలిన కొద్ది కార్యాన్ని గురించి ఆలోచిస్తూ, ఉత్తర దిశగా వెళ్ళడానికి సంకల్పించాడు.

## అరువది ఆరవ అధ్యాయము

జవాబులు : 1.2. రాముడే వచ్చి నన్ను తీసికొని వెళ్ళడం మంచిది

2.3. చూడామణిని

3. మీరందరూ సముద్రాన్ని ఎట్లు దాటిరాగలరు

# సుందరా కాండము

## 41, 42, 43, 44 సర్గలు

## అరువది ఏడవ అధ్యాయము

1. ప్రశ్న : హనుమంతుడు సీతాదేవి వద్ద నుండి బయలుదేరి తన ప్రతాపాన్ని రాక్షసులకు చూపనెంచి ఏమిచేశాడు ?

జవాబు : 1. రావణుని చంపబోయాడు
2. సీతాదేవికి కాపలా ఉన్నవారిని చంపబోయాడు
3. లంకానగరాన్ని ధ్వసం చేయబోయాడు
4. అశోక వనాన్ని ధ్వసం చేయబూనాడు

2. ప్రశ్న : అశోక వనాన్ని ధ్వసం చేయడాన్ని చూసిన రాక్షసులు, రావణుని వద్దకు వెళ్ళి విషయం చెప్పారు. రావణుడు ఉగ్రుడై హనుమంతుని పైకి ఎంత మంది రాక్షస యోధులను పంపించాడు ?

జవాబు : 1. అరువది వేల మందిని 2. డెబ్బది వేల మందిని
3. ఎనుబది వేల మందిని 4. తొంబది వేల మందిని

3. ప్రశ్న : హనుమంతుడు అశోక వనాన్ని ధ్వంసం చేయడాన్ని, మహావీరుడైన వానరుని చూసిన రాక్షస స్త్రీలు ఏమి చేశారు ?

జవాబు : జవాబుల కాలంలో ఉన్నది.

4. ప్రశ్న : హనుమంతుడు చైత్యప్రాసాదాన్ని ఏ రీతిగా ధ్వంసం చేశాడు ?

జవాబు : అశోక వనంలో మారుతి రావణుడు పంపించిన రాక్షస యోధులందరిని సంహరించిన పిమ్మట అచటికి దగ్గరగా ఉన్న చైత్యప్రాసాదం అతని దృష్టిలో పడింది. అప్పుడతడు దానిని ధ్వంసం చేయడానికై దానిపైకి దూకాడు. అప్పుడు ఆ చైత్య ప్రాసాద రక్షకులు ఆయుధాలను, చిత్ర విచిత్రాలైన గదలను, అస్త్రాలను, ఈటెలను, ఖడ్గాలను, గండ్ర గొడ్డళ్ళను చేతబట్టి మారుతికి చుట్టుముట్టారు. అప్పుడా వాయుసుతుడు శ్రీరామునకు జయం అని జయఘోషలు చేస్తూ కోపంతో ఆ ప్రాసాదం యొక్క బంగారు స్థంబాలను పెకలించి గిరగిరా త్రిప్పసాగాడు. అప్పుడు దాని నుండి ఉద్భవించిన అగ్ని ఆ

ప్రాసాదాన్ని కాల్చివేసింది. అటు పిమ్మట దహింప బడుతున్న ప్రాసాదాన్ని చూస్తూ మారుతి వందల కొలది రాక్షసులను హతమార్చాడు. సర్వశక్తి సంపన్నుడైన హనుమంతుడు అంతరిక్షానికి ఎగిరి, రాక్షసులతో మేము వానర ప్రభువు సుగ్రీవుని ఆజ్ఞప్రకారం భూమి యందంతటా తిరుగు తున్నాము. వారంతా నా కంటే అధిక బలసంపన్నులు. మీరు మహాత్ముడైన శ్రీరామునితో వైరం తెచ్చుకొన్నారు. అసంఖ్యాకమైన వానర సేన సుగ్రీవుని వెంట నడిచి మిమ్ముల్నందరినీ సర్వనాశనం చేస్తుంది. మా వానరబలం చేతిలో ఈ లంకా నగరమూ, రావణుడూ ఎవ్వరూ మిగిలి ఉండరు. అని చైత్య ప్రాసాదాన్ని ధ్వంసం చేసిన హనుమంతుడు అక్కడ ఉన్న రాక్షసులను బెదిరించాడు.

5. ప్రశ్న : ఆంజనేయుడు జంబుమాలిని ఏవిధంగా హతమార్చాడు ?

జవాబు : ప్రహస్తుని కుమారుడైన జంబుమాలి మహా బలశాలి. అతడు పెద్ద పెద్దకోరలు గలిగి, ఎర్రని వస్త్రాలు, పూల మాలలు ధరించి, ధనస్సును చేతబట్టి, గాడిదలను పూన్చిన రథంపై వచ్చాడు. ఆ విధంగా వచ్చిన జంబు మాలిని చూసిన మారుతి హర్షంతో పొంగిపోయి గర్జించాడు అప్పుడు జంబుమాలి ధనష్టంకారం చేసి అర్ధచంద్రాకారం గల బాణంతో హనుమంతుని కొట్టాడు. పిమ్మట వంకరములికి గల బాణంతోనూ, ఇంకనూ పది బాణాలతోనూ హనుమంతునిపై వేసి బాధించాడు. వెంటనే మారుతి విజృంభించి ప్రక్కనే ఉన్న మద్దిచెట్టును పెకలించి, దానిని త్రిప్ప సాగాడు. జంబమాలి నాలుగు బాణాలతో ఆ సాలవృక్షాన్ని ముక్కలు చేశాడు. వెంటనే హనుమంతుడు కోపంతో ఆసాల వృక్షపు పరిఘతో జంబుమాలిని, అతని రథాన్ని, నుజ్జు నుజ్జుచేశాడు. మహా బలశాలురైన ఎనబై వేలమంది కింకరులును, జంబు మాలియు అసువులు బాశారని తెలిసి రావణుడు కోపోద్రేకంలో కన్నులెర్రజేశాడు.

## అరువది ఏడవ అధ్యాయము

జవాబులు : 1.4. అశోక వనాన్ని ధ్వసం చేయబూనాడు

2.3. ఎనుబది వేల మందిని

3. నలుదిక్కులకూ పరుగులు తీశారు

# సుందరా కాండము

## 45, 46, 47, 48 సర్గలు

## అరువది ఎనిమిదవ అధ్యాయము

1. ప్రశ్న : జంబుమాలిని సంహరించిన పిమ్మట హనుమంతునిపైకి రావణుడు ఎంత మంది మంత్రి కుమారులను పంపించాడు ?

జవాబు : 1. ఏడుగురు 2. ఎనిమిది మంది
3. తొమ్మిది మంది 4. పది మంది

2. ప్రశ్న : మంత్రి కుమారులను సంహరించిన విషయం తెలిసికొన్న రావణుడు, బాగా ఆలోచనచేసి చతురంగ బలాలను వెంట పంపుతూ ఎంత మంది సేనాపతులను హనుమంతుని పైకి పంపించాడు ?

జవాబు : 1. ఇద్దరిని 2. ముగ్గురుని
3. నలుగురిని 4. ఐదు మందిని

3. ప్రశ్న : చతురంగ బలాలతో వచ్చిన సేనాపతులందరూ హనుమంతుని చేతిలో హతులైనారని తెలిసికొన్న రావణుడు, తన కుమారుడైన అక్షకుమారుని హనుమంతునిపైకి పంపించాడు. ఆ అక్ష కుమారుడు అధిరోహించిన రథం గొప్ప తపః ఫలితంగా సంక్రమించింది. అది అంతరిక్షంలో కూడా పయనించ గలదు. ఆ రథానికి ఎన్ని గుర్రాలను పూన్చి ఉన్నారు ?

జవాబు : జవాబుల కాలంలో ఉన్నది.

4.ప్రశ్న : మారుతి అక్ష కుమారుని ఏరీతిగా వధించాడు ?

జవాబు : రావణానుమతితో చతురంగబల సమన్వితుడైన అక్ష కుమారుడు, వన ముఖ ద్వారంపై ఆసీనుడై యున్న హనుమంతుని సమీపించాడు. వెంటనే అతడు యుద్ధ సన్నద్ధుడై విల్లును ఎక్కుపెట్టి మూడు బాణాలను మారుతి పైకి వేశాడు. ఒకేసారి మూడు బాణాలు తనను దెబ్బతీయగా హనుమంతుడు, అక్ష కుమారుని దహించి వేసేట్లుగా చూశాడు. అంతట అక్ష కుమారుడు ఆకాశానికి ఎగిరి తన బాణాలకు అంద

కుండా తిరుగుతున్న హనుమంతుని తన రథంతోసహా ఆకాశంలో వెంబడించాడు. హనుమంతుడు శత్రువుకు చిక్కకుండా చిత్ర విచిత్ర రీతులతో తిరుగుతూ అక్షకుమారుని అశ్వాలను రథాన్ని ధ్వంసం చేశాడు. ధ్వంసమైన రథాన్ని వీడి ఆకాశంలో తిరుగుతున్న అశ్వ కుమారుని రెండుకాళ్ళూ పట్టుకొని హనుమంతుడు చాలసార్లు గిరగిరా త్రిప్పి యుద్ధ రంగమందు నేలకేసి కొట్టాడు. ఆ దెబ్బకు అక్ష కుమారుడు చేతులు, కాళ్ళూ, ఎముకలు నుగ్గునుగ్గై శరీరమంతా రక్తంతో తడిసి ముద్దై అతడు ప్రాణాలు విడిచాడు. ఆ విధంగా అక్ష కుమారుని చంపి మారుతి రావణునికి భయం కలిగించాడు. పిమ్మట హనుమంతుడు ఆ వనముఖ ద్వారం పైకిచేరి శత్రువులు కొరకై ఎదురు చూస్తూన్నాడు.

5. ప్రశ్న : హనుమంతునికీ ఇంద్రజిత్తుకు ఏ విధంగా యుద్ధం జరిగింది ?

జవాబు : హనుమంతుని చేతిలో అక్ష కుమారుడు హతుడయ్యాడని విని రావణుడు లోలోపల ఆందోళనపడుతూ, మనసు కుదుట పరచుకొని తన కుమారుడైన ఇంద్రజిత్తువంక చూసి, ఓ కుమారా! నీవు అస్త్రవేత్తలలో శ్రేష్టుడవు. బ్రహ్మాస్త్రాది అనేక దివ్యాస్త్రాలను సంపాదించావు. నాకు నీపై ఉన్నంత నమ్మకం ఎవరిపైనా లేదు. ఆ వానరుని ప్రశస్తమైన బుద్ధికౌశలాన్ని శారీరక బలాన్ని, పరాక్రమాన్ని దృష్టిలో ఉంచుకొని నీ బల పరాక్రమాలను గూడ చూచుకొని, కాలోచిత నిర్ణయాలను తీసికొని, బ్రహ్మాస్త్రాన్ని మననం చేసుకొంటూ వెళ్ళు. అతడు బ్రహ్మాస్త్రానికి తప్ప ఇక దేనికీ లొంగడు. అని పలికిన తండ్రికి ప్రదక్షిణ పూర్వకంగా నమస్కరించి ఇంద్రజిత్తు సేనాబలంతో, రథాన్ని అధిరోహించి యుద్ధభూమికి వెళ్ళాడు. హనుమంతుడు ఇంద్రజిత్తు రథ సవ్వడినివిని, తనకు ధీటైన వీరునితో యుద్ధం చేయవలసి వచ్చిందని సంతోషంతో యుద్ధ సన్నద్ధుడైనాడు. ఇంద్రజిత్తు ధనుష్టంకారం చేసి, బాణాలను వదిలేంతలో హనుమంతుడు దాగుడుమూత లాడినట్లు, రివ్వున ప్రక్కకు ఎగిరెడివాడు. ఇంద్రజిత్తుకు హనుమంతుని పడగొట్టడం ఎలాగో తెలియలేదు. హనుమంతునికి కూడా ఇంద్రజిత్తును పడగొట్టడం ఎలాగో తెలియ లేదు. అప్పుడు కృతనిశ్చయుడై ఇంద్రజిత్తు

హనుమంతుని చంపనెంచి బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించాడు. హనుమంతుడు బ్రహ్మాస్త్ర ప్రభావానికి కట్టుబడి నట్లుగా తెలిసికొన్నాడు. కాని బ్రహ్మదేవుని వరప్రభావంతో ఆ అస్త్ర శక్తి ఒక్కక్షణ కాలంలో తొలగిపోయింది. కాని బంధింప బడిన వానివలె నటిస్తూ, రావణుని చూడాలని ఆ రాక్షసులకు కట్టుబడ్డాడు. రాక్షసులు మారుతిని జనపనార తాళ్ళతో బంధించడం వల్ల బ్రహ్మాస్త్ర ప్రభావం పూర్తిగా పోయింది. కాని ఆ రాక్షసులు హనుమంతుడుని రావణుని ఎదుట నిలబెట్టారు. అప్పుడు రావణానుమతితో మంత్రులు హనుమంతుని నీవెవరు? అని ప్రశ్నించగా, తాను సుగ్రీవుడు పంపగా వచ్చిన దూతను అని చెప్పాడు.

## అరువది ఎనిమిదవ అధ్యాయము

జవాబులు : 1.1. ఏడుగురు 2.4. ఐదు మందిని
3. ఎనిమిది

............

# సుందరా కాండము

## 49, 50, 51, 52 సర్గలు

## అరువది తొమ్మిదవ అధ్యాయము

1. ప్రశ్న : బ్రహ్మాస్త్రం చేత బంధితుడై నట్లు నటిస్తున్న హనుమంతుని రాక్షసులు పట్టి రావణుని ఎదుట నిలబెట్టారు. ఆ సమయంలో సకల పరివార సమేతుడైన రావణుడు ఎంత మంది మంత్రులచేత పరివేష్టితుడై ఉన్నాడు ?

జవాబు : 1. నలుగురు 2. ఐదు మందిని
3. ఆరుగురు 4. ఏడుగురు

2. ప్రశ్న : తన ఎదుట నిలిచియున్న వానరుని పరిశీలనగా చూసిన రావణుడు ఈతడెవరో? నా ఈ స్వర్ణ లంకకు ఎందుకు వచ్చాడో తెలిసికొమ్మని తన మంత్రులతో ఎవరిని ఆదేశించాడు ?

జవాబు : 1. దుర్ధరుడు 2. మహాపార్శ్వుడు
3. ప్రహస్తుడు 4. నికుంభుడు

3. ప్రశ్న : ప్రహస్తుడు మారుతిని నీ వెవరు? ఇక్కడికెందుకు వచ్చావు అని అడుగగా, హనుమంతుడు నేనొక రాచకార్య నిమత్తమై వచ్చాను. అని చెబుతూ తాను ఎవరి అనుగ్రహంచేత ఏ అస్త్రానికి కట్టుబడను అని చెప్పాడు ?

జవాబు : జవాబుల కాలంలో ఉన్నది.

4. ప్రశ్న : రావణ సభలో మారుతి శ్రీరాముని ప్రభావాన్ని ఏ విధంగా వర్ణించాడు ?

జవాబు : నిండు సభ దీరియున్న రావణునితో హనుమంతుడు ఓ రాజా! సుగ్రీవుని సందేశంతో నీ లంకా నగరానికి వచ్చాను. చతురంగబల సమన్వితుడైన అయోధ్యా నగరాధిపతి దశరథ మహారాజుకు కలిగిన నలుగురు కొడుకులలో పెద్దవాడు శ్రీరాముడు. ఈయన ఆజాను బాహుడు, సర్వసమర్ధుడు, మహాపరాక్రమ వంతుడు. ధర్మమార్గాను వర్తుడై, తండ్రి ఆజ్ఞానుసారం సోదరుడైన లక్ష్మణుని తోనూ, భార్యయైన సీతాదేవి తోనూ గూడి దండకారణ్యానికి వచ్చాడు. ఆ సీతాదేవి మహాసాధ్వి. అట్టి సీతాదేవి దండకారణ్యలో అపహరింప బడింది. ఆమెను వెదకుతూ రామ లక్ష్మణులు ఋష్యమూక పర్వతానికి వచ్చి, సుగ్రీవుని కలిసి, సీతాదేవిని వెదకడానికై సుగ్రీవుడును, సుగ్రీవుని వానర రాజ్యానికి రాజునుగా చేయడానికై శ్రీరాముడును ప్రతినలు చేశారు. అనుకున్న ప్రకారం శ్రీరాముడు వాలిని చంపి సుగ్రీవుని వానర రాజ్యానికి రాజునుగా చేశాడు. వానర రాజైన సుగ్రీవుడు తన అనుచరులను, సీతాన్వేషణకై భూమి నలుచెరగులా పంపించాడు. అట్లు పంపించ బడిన వారిలో నేను ఒకడిని. నాపేరు హనుమంతుడు వాయుపుత్రుడను. సీతాదేవిని వెదకుచూ నూరు యోజనాల సముద్రాన్ని అవలీలగా దాటి ఈ లంకలో ప్రవేశించాను. సీతామాతను వెదకుచూ తిరుగుతున్న నాకు ఆమె అశోక వనంలో కనబడింది. ధర్మశాస్త్ర విరుద్ధమైనవి, వంశక్షయాన్ని కలిగించేవి అయిన ఇటు వంటి ప్రమాదకరమైన పనులు నీవంటి బుద్ధిమంతులు చేయకూడదు. కనుక నీ మేలుకోరి చెబుతున్నా. నా మాటలు ఆలకించి సీతాదేవిని

శ్రీరామునకు అప్పగించి శ్రీరాముని శరణువేడు. నీవు నీ స్వజనులతో పది కాలాలపాటు బ్రతుకగలవు. అని హనుమంతుడు రావణునికి శ్రీరాముని ప్రభావాన్ని గురించి వివరించి చెప్పాడు.

5. ప్రశ్న : సభలో హనుమంతుని సంహరించమని పలికిన రావణునితో, అది ధర్మం కాదని, ఎవరు, ఏ విధంగా రావణునికి తెలిపారు?

జవాబు : యుద్ధంలో శ్రీరాముడు చంపదలచుకొన్న వానిని బ్రహ్మదేవుడు కూడా రక్షించలేడు అని పలుకుతూన్న పలుకులు తనకు అప్రియమైనవిగా భావించిన రావణుడు కోపంతో కన్నులెర్రజేసి ''ఈ వానరుణ్ణి చంపండి'' అని ఆజ్ఞాపించాడు. ఆ మాటలు విన్న రావణుని తమ్ముడైన విభీషణుడు అంగీకరించక, తన అన్నగారి మేలు కోరినవాడై బాగా ఆలోచించి ఓ రాక్షస రాజా! క్షమించు, కోపాన్ని విడచిపెట్టు. దయ యుంచి నేను చెప్పబోవు మాటలు ఆలకించు. ఉచితానుచితాలు తెలిసిన రాజపుత్రు డెవడూ దూతను సంహరించరు. ఇది లోకమర్యాద కాదు. నీవు ధర్మమెరిగిన వాడవు. యుక్తా యుక్తములు తెలిసిన వాడవు. కావున మహారాజా! దూతను సంహరించక, అతనిని తగిన విధంగా దండించు. అని పలికిన విభీషణుడు, అన్నా! దూతను అనేక రీతుల దండించే విధానాలు పెద్దలు మనకు చెప్పియే ఉన్నారు. కాని ఎట్టి పరిస్థితిలోనూ దూతను సంహరించుట మన్నది ధర్మ విరుద్ధము. అదియును గాక ఇతనిని వదలివేస్తే, ఈతడు వెళ్ళి రామలక్ష్మణులను ఇచటికి తీసికొని వస్తాడు. అప్పుడు నీ శత్రువులను తుద ముట్టించడం సులభమవుతుంది. అని పలికిన విభీషణుని సూచనలను ఉత్తమమైనవిగా భావించిన రావణుడు మనస్పూర్తిగా తన ప్రయత్నాన్ని మానుకొన్నాడు.

## అరువది తొమ్మిదవ అధ్యాయము

జవాబులు : 1.1. నలుగురు 2.3. ప్రహస్తుడు
3. బ్రహ్మదేవుని

# సుందరా కాండము

## 53, 54, 55, 56 సర్గలు

## డెబ్బదియవ అధ్యాయము

1. ప్రశ్న : దూతను చంపడాన్ని మానుకొన్న రావణుడు హనుమంతుని శరీరం లోని ఏ భాగానికి నిప్పంటించమని ఆజ్ఞాపించాడు ?

జవాబు : 1. పాదాలకు 2. చేతులకు
3. వాలానికి 4. శిరస్సుకు

2. ప్రశ్న : లంకా దహన సమయంలో హనుమంతుడు ఎవరి గృహాన్ని కాల్చ కుండా వదిలివేశాడు ?

జవాబు : 1. ప్రహస్తుని 2. మహాపార్శ్వుని
3. వజ్రదంష్ట్రుని 4. విభీషణుని

3. ప్రశ్న : లంకను పూర్తిగా దహించి వేసిన మారుతి తన వాలాన ఉన్న అగ్నిని పూర్తిగా ఎచట చల్లార్చుకొన్నాడు ?

జవాబు : జవాబుల కాలంలో ఉన్నది.

4. ప్రశ్న : తన వాలాన్ని చల్లార్చుకొన్న పిమ్మట మారుతి ఎవరిని గురించి, ఏ విధంగా బాధపడ్డాడు.

జవాబు : ఆంజనేయుడు తన వాలానికి ఉన్న అగ్నిని సముద్రంలో చల్లార్చుకొన్న పిమ్మట సీతాదేవిని గురించి ఆలోచించ సాగాడు. అయ్యో! ఈ లంకను కాల్చివేసి నేనెంత తప్పు చేశాను. ఈ లంక పూర్తిగా కాలిపోతే సీతాదేవియు అందులో దహింప బడదా? కోపావేశానికి లోనై నేనెంత స్వామి ద్రోహానికి పాల్పడ్డాను. లంకాపుర మంతా భస్మమై పోయింది. దగ్ధము కాని చోటు లేదు. కనుక సీతాదేవియు తప్పక మరణించే ఉంటుంది. నా బుద్ధి వైపరీత్యం వల్ల నేను చేసిన కార్యం వికటించి సీతమ్మ తల్లి ప్రాణాలకే ముప్పు ఏర్పడితే, నా ప్రాణాలను త్యజించడమే మంచిది. కాకున్న, కార్యాన్ని పూర్తిగా భంగపరచి, బ్రతికి యున్న

నేను, వానర ప్రభువైన సుగ్రీవునకును, మహా పురుషులైన రామ లక్ష్మణులకును నా ముఖము ఎట్లు చూపగలను. వానర బుద్ధి నిలకడ లేనిది అని లోకప్రసిద్ధి. నా పిచ్చికోపం వల్ల వానర సహజమైన బుద్ధి చాంచల్యాన్ని ప్రదర్శించాను. అని తనలో తాను వాయు నందనుడు మదన పడుతూ ఇట్లను కొంటున్నాడు. రామ కార్యసిద్ధికై సహాయ పడడానికై సముద్రంలోని మైనాక పర్వతమే ముందుకు రాగా లేనిది, అగ్ని మహాసాధ్వియైన సీతాదేవిని దహిస్తుందా? అని అను కొంటుండగా ఆకాశమార్గాన వెళ్తున్న చారణులు, లంక అంతా కాలిపోయినా సీతాదేవి ఉన్న పరిసర ప్రాంతాలకు కూడా అగ్ని వెళ్ళక పోవటం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. ఇది ఒక అద్భుతం. అని చారణులు మాట్లాడు కొంటున్న మాటలు విన్న మారుతి పరమానంద భరితు డయ్యాడు. స్వయంగా సీతాదేవిని మరొక్క మారు దర్శించుకొని తిరుగు ప్రయాణం చేయ వచ్చునని నిశ్చయించు కొన్నాడు.

5. ప్రశ్న : ఆంజనేయుడు మరలా సముద్రాన్ని ఏ విధంగా దాటాడు ?

జవాబు : అశోక వృక్షపు నీడలో కూర్చొని యున్న సీతాదేవికి పాద నమస్కారము చేసి హనుమంతుడు అమ్మా! దైవాను గ్రహంచేత ఎట్టి అపాయము లేక సురక్షితంగా ఉన్న నిన్ను చూడ గలిగాను. అని పలికిన మారుతితో సీతాదేవి ఓ పుణ్య పురుషుడా! అసంఖ్యాకమైన వానర భల్లూక సేనలు గాని, రామ లక్ష్మణులు గాని, అపారమైన ఈ సముద్రాన్ని ఎట్లు దాటి రాగలరు? ప్రబలమైన ఈ సందేహం నన్ను విడిచి పెట్టడం లేదు. ఈ అడ్డంకిని తొలగించుటకు కార్య సాధకుడవైన నీవేమి ఆలోచిస్తున్నావు? ఇందుకు నీ సమాధానమేమి? అని అడిగిన సీతాదేవితో హనుమ అమ్మా! సీతాదేవీ కోట్లకొలది వానర భల్లూక వీరులకు ప్రభువు సుగ్రీవుడు. మహా బలశాలియైన సుగ్రీవుడు రామ లక్ష్మణులతో గూడి ఇచటికి వచ్చి లంకా నగరాన్ని ధ్వంసం చేస్తారు. శ్రీరాముడు అతి త్వరలో రావణుని బంధుమిత్ర సపరివారంగా హతమార్చి, నీతో గూడి తన నగరమైన అయోధ్యకు వెళ్తాడు. అమ్మా! ఊరడిల్లు, నీకు

శుభం కలుగుతుంది. నీవు కొద్ది కాలం ఓపిక పట్టి ఉండు. త్వరలోనే రావణుని శ్రీరాముడు చంపడం నీవు చూస్తావు. అని హనుమంతుడు సీతాదేవికి నమస్కరించి, శ్రీరాముని దర్శించాలన్న కుతూహలంతో సాగరం మీదుగా వెళ్ళడానికి నిశ్చయించు కొని, అచట దగ్గరలో నున్న 'అరిష్టగిరి' అని పేరుగల మహాగిరి పైకి ఎక్కాడు. పది యోజనాల విస్తీర్ణము, ముప్పది యోజనాల ఎత్తుగల ఆ అరిష్టగిరి హనుమంతుని పాదఘట్టనల తాకిడికి కృంగి పోయింది. ఆ లవణ సముద్రాన్ని దాటగోరిన మారుతి ఆకాశానికి ఎగిరాడు.

## డెబ్బదియవ అధ్యాయము

జవాబులు : 1.3. వాలానికి 2.4. విభీషణుని
3. సముద్రంలో

.......

# సుందరా కాండము

## 57, 58, 59, 60 సర్గలు

## డెబ్బది ఒకటవ అధ్యాయము

1. ప్రశ్న : హనుమంతుడు సముద్రాన్ని దాటి ఉత్తరతీరానికి చేరి అంగదాదులను కలుసుకొని మొట్ట మొదటగా ఆయన వారితో ఏ మాటను చెప్పాడు ?

జవాబు : 1. నేను లంకను చూశాను 2. చూశాను సీతను
3. నేను రావణుని చూశాను 4. లంకా దహనం చేశాను

2. ప్రశ్న : హనుమంతుని చూసిన వారంతా పరమ సంతోషంతో, మారుతీ! నీవు సీతాదేవిని ఎట్లు తెలిసికొన్నావు? ఆ సాధ్వి ఎట్లున్నది? అని సీతాదేవిని గురించిన సమాచారాన్ని మాకు తెలుపుమని హనుమంతుని ఎవరు అడిగారు ?

జవాబు : 1. జాంబవంతుడు 2. అంగదుడు
3. నీలుడు 4. నలుడు

3. ప్రశ్న : అంగదాదులకు తన సీతాన్వేషణా కార్యాన్ని గురించి మాట్లాడుతూ, తాను లంకను ఏ సమయానికి చేరుకున్నానని చెప్పాడు ?

జవాబు : జవాబుల కాలంలో ఉన్నది.

4. ప్రశ్న : సీతాదేవి దురవస్థను గురించి హనుమంతుడు అంగదాదులకు ఏ రీతిగా వివరించి చెప్పాడు ?

జవాబు : హనుమంతుడు అంగదాదులతో సీతాదేవిని దర్శించిన విషయాన్ని, ఆమె దురవస్థను గురించి తెలుపుతూ ఓ వానర ప్రముఖులారా! శ్రీరాముని ప్రయత్నం సఫలమైంది. సుగ్రీవుని ప్రతిజ్ఞ నెరవేరింది. సీతాదేవి సౌశీల్య ప్రభావానికి నా మనసు భక్తి ప్రపత్తులతో, పరవశమైంది. ప్రాతివ్రత్య నిష్టలో ఆమెకు ఆమెయే సాటి. రాక్షస రాజైన రావణుడు తపోబల సంపన్నుడు. అతడు ఆమెను తాకినను, తన తపోబలం చేతనే నశింపలేదు. నేను లంకలోని విశేషాలన్నీ తెలిసికొని యున్నాను. మన మందరము కలిసి వెళ్ళి లంకను నాశనం చేసి, రాక్షసులను సంహరించి సీతా సాధ్విని శ్రీరామునకు అప్పగించ వచ్చు. రావణుని అశోక వనంలోని శింశుపా వృక్షపు నీడలో సీతా మహాసాధ్వి, దైన్యంతో ఉంది. ఆమె చుట్టూ రాక్షస స్త్రీలు చేరి కాపలాగా ఉన్నారు. ఆమె పూర్ణ చంద్ర శోభలు గలదేయైనను, ఆమె మేఘాలచే కప్పబడిన చంద్రరేఖవలె తేజోహీనంగా ఉంది. బలగర్వితుడైన రావణుడు ఆమెను ఎంతగా నిర్బందించినా సౌందర్యవతియు, పతివ్రతా లలామయు యైన జానకీదేవి అతనిని ఏమాత్రమూ లెక్కచేయలేదు. శుభలక్షణ సంపన్నయైన సీతాదేవి త్రికరణ శుద్ధిగా శ్రీరాముని యందే అనురక్తురాలై ఉంది. సీతాదేవి అపహరింప బడిన నాడు ధరించిన వస్త్రాన్నే ఇప్పటి వరకు ధరించి ఉంది. శరీరం ధూళి దూసరితాలతో నిండి, మలినమై, శోక సంతాపాలతో ధీనయై ఉంది. అని మారుతి సీతాదేవి ధీనగాథను తన వారందరికీ వివరించి చెప్పాడు.

5. ప్రశ్న : హనుమంతుని మాటలు విని, అంగద, జాంబవంతులు తమ అభిప్రాయాలను ఏ విధంగా తెలియజేశారు ?

జవాబు : మారుతి తెలిపిన మాటలు విని అంగదుడు ఓ వానర వీరులారా! సీతాదేవి జాడ తెలిసికూడా, ఆమె లేకుండా మనము శ్రీరాముని సన్నిధికి వెళ్ళడం సరియైన పద్ధతికాదు. ఆకాశానికి ఎగరడంలోనూ, పరాక్రమం లోనూ, మనకు సాటిరాగల వారెవరూ లేరు. మనము లంకకు వెళ్ళి రాక్షసులను జయించి జానకీదేవిని తీసికొని రావడమే మంచిదని నా అభిప్రాయము. అని పలికిన అంగదునితో జాంబవంతుడు ప్రజ్ఞాశాలియైన అంగదా! నీవు చెప్పిన మాట సముచితంగా కనబడటం లేదు. వానర ప్రభువైన సుగ్రీవుడును, మహాత్ముడైన శ్రీరాముడును మనలను దక్షిణ దిశయందు సీతాదేవిని వెదకాడానికై పంపించారు. కాని ఆమెను తీసికొని రమ్మనలేదు. ఏ విధంగా నైనా సీతాదేవిని మనం తీసికొనివెళ్ళడం శ్రీరామునికి ఇష్టం కాక పోవచ్చు. శ్రీరాముడు తన పరాక్రమం చేతనే సీతాదేవిని తీసికొని వస్తాడు. కాని ఇతరులపై ఆధారపడడు. ఆ ప్రభువు వానరు లందరి సమక్షంలో శత్రువును జయించి సీతను తీసికొని వస్తాను అని ప్రతిజ్ఞ చేసి యున్నాడు. ఆయన తన ప్రతిజ్ఞా భంగానికి ఎట్లు ఇష్టపడతాడు. అప్పుడు మన ప్రయత్న మంతా విఫల మవుతుంది. అందువల్ల మన మంతా వెళ్ళి, ఇంతవరకు జరిగిన విశేషాలను, సుగ్రీవునకును, రామ లక్ష్మణులకు తెలుపుదాము. అని జాంబవంతుడు తన అభిప్రాయాన్ని తెలిపాడు.

## డెబ్బది ఒకటవ అధ్యాయము

జవాబులు : 1.2. చూశాను సీతను 2.1. జాంబవంతుడు

3. ప్రొద్దుగ్రుంకు సమయానికి

# సుందరా కాండము

## 61, 62, 63, 64 సర్గలు

## డెబ్బది రెండవ అధ్యాయము

1. ప్రశ్న : అంగద, ఆంజనేయాదులు జాంబవంతుని సూచనలను మన్నించి ఆ ప్రకారంగా వారు సుగ్రీవ, రామ లక్ష్మణులను దర్శింప నెంచి తిరుగు ప్రయాణంలో ఆనందంతో కేరింతలతో ఏ వనంలో ప్రవేశించారు ?

జవాబు : 1. అశోక వనం 2. దండక వనం
3. సౌగంధికావనం 4. మధువనం

2. ప్రశ్న : హనుమదాదులు ప్రవేశించిన వనం సుగ్రీవుని స్వాధీనము లోనిదే, అయినప్పటికి ఆ వానరులు పెట్టిన బాధలు భరించలేక సుగ్రీవుని వద్దకు వెళ్ళిన ఆ వనపాలకు డెవరు ?

జవాబు : 1. తారుడు 2. దధిముఖుడు
3. సుషేణుడు 4. శతవలి

3. ప్రశ్న : అంగదాదులు మధువనంలో ప్రవేశించి ఏమి చేశారు ?

జవాబు : జవాబుల కాలంలో ఉన్నది.

4. ప్రశ్న : మధువనాన్ని హనుమదాదులు ద్వంసం చేసిన వార్తను దధిముఖుడు తెలుపగా సుగ్రీవుడు ఏమిచేశాడు ?

జవాబు : మహావీరుడైన దధిముఖుడు సుగ్రీవుని వద్దకు వచ్చి ఆయన పాదాలకు నమస్కరించి, అచట హనమదాదులు మధువనాన్ని ధ్వంసం చేసినారని చెప్పాడు. అప్పుడు లక్ష్మణుడు వనపాలకుడైన ఈ వానరుడు ఇచటికి రావడానికి గల కారణమేమి? ఎందుకు దుఃఖిస్తున్నాడు? అని అడిగాడు. అప్పుడు సుగ్రీవుడు ఓ లక్ష్మణా! ఈ దక్షిణ దిక్కుకు సీతాన్వేషణకై వెళ్ళిన అంగదాది ప్రముఖ వీరులు మధువనంలో ప్రవేశించి, ఫలాలను తింటూ, మధువును త్రాగుతూ, వనాన్ని ధ్వంసం చేస్తున్నారని ఈ దధిముఖుడు చెబుతున్నాడు. ఇది

సంతోషకరమైన వార్త, ఎందుకంటే తాము వెళ్ళిన కార్యం సఫలం కాకుండా, ఇటువంటి పనులు చేయడానికి వారు పూనుకోరు, నేను విధించిన గడువు పూర్తి అయినా వారు ధైర్యంగా మధువనంలో ప్రవేశించి, సంతోషంగా విహరిస్తున్నారంటే వారు వెళ్ళిన కార్యం సఫలమై ఉంటుంది. సీతాదేవి వారికి కనబడియే ఉంటుంది. అందుకు సందేహం లేదు. ఈ కార్యసాధకుడు హనుమంతుడే అయ్యి ఉండవచ్చు. అని సుగ్రీవుని నోటివెంట వెలువడిన, వీనుల విందు గావించు ఈ మాటలు విని, ధర్మాత్ములైన రామ లక్ష్మణులు మహదానంద భరితులయ్యారు. అప్పుడు సుగ్రీవుడు దధిముఖునితో మామా! నీవు మాకు తెలిపినది శుభవార్తయే. గనుక నీవు వెళ్ళి హనుమదాదులను త్వరగా ఇచటికి పంపించు. వారినోట సీతాన్వేషణా విశేషాలను వినడానికి నేను రామ లక్ష్మణులు మిక్కిలి కుతూహలంతో ఉన్నాము. అని సుగ్రీవుడు దధిముఖుని ఆజ్ఞాపించాడు.

5. ప్రశ్న : అంగదాదులు కిష్కింధకు వచ్చి సీతా సందర్శన వార్త ఏ విధంగా తెలిపారు ?

జవాబు : సుగ్రీవాజ్ఞ పొందిన దధిముఖుడు వెంటనే మధువనానికి వెళ్ళి అంగదునితో ఓ యువరాజా! మా దోషాలను మన్నించు. నేను మీ పిన తండ్రి సుగ్రీవుని వద్దకు వెళ్ళి, ఇచట జరిగిన విశేషాలను తెలిపాను. వారంతా సంతోషించి, మిమ్ముల నందరినీ త్వరగా కిష్కింధకు వెంటనే పంపించమని ఆదేశించి యున్నాడు. అని పలికిన దధిముఖుని మాటలు విని అంగదుడు తన సహచరులతో ఓ వానర యోధులారా! కార్యసిద్ధియైన పిమ్మట ఇచట మనం ఒక్కక్షణమైనా నిలువరాదు. మనకు బడలిక కూడా తీరింది. ఇంక సుగ్రీవుని యొద్దకు వెళ్ళడమే మిగిలి ఉంది. అని అంగదుని మాటల ప్రకారం వానరులంతా సర్లే అట్లే వెళదాము అని వారంతా ఆకాశానికి ఎగిరి కొంతదూరం ప్రయాణించి, సుగ్రీవుడు, రామ లక్ష్మణులున్న ప్రదేశానికి వచ్చారు. వారంతా అంగదుని, హనుమంతుని ముందుంచుకొని శ్రీరాముని

దర్శించాలన్న కోరికతో అచటికి వచ్చారు. వారు వచ్చే విధానాన్ని చూసిన సుగ్రీవుడు వీరు రామకార్యాన్ని సాధించుకొనే వచ్చి వుంటారని సంతోషించాడు. అప్పుడు మహాబాహువైన హనుమంతుడు శ్రీరామునికి సాష్టాంగ నమస్కారం చేసి ''చూశాను సీతమ్మను'' అని అమృత తుల్యమైన మాటలను తెలిపాడు. హనుమంతుని నోటి వెంట విన్న రామ లక్ష్మణులు పరమానంద భరితులయ్యారు. హనుమంతుడే కార్యాన్ని సాధించగలడన్న నమ్మకంతో నున్న సుగ్రీవ, రామ లక్ష్మణులు మారుతిని గౌరవ భావంతో చూశారు.

### డెబ్బది రెండవ అధ్యాయము

జవాబులు : 1.4. మధువనం 2.2. దధిముఖుడు

3. మధువును త్రాగి, ఫలాలను భుజించారు

..........

## సుందరా కాండము

### 65, 66, 67, 68 సర్గలు

### డెబ్బది మూడవ అధ్యాయము

1. ప్రశ్న : శ్రీరామునకు హనుమంతుడు సీతాదేవి వృత్తాంతాన్నంతా తెలిపి ఆమె తనకు ఆనవాలుగా ఏ వస్తువును ఇచ్చినట్లు తెలిపాడు ?

జవాబు : 1. హారాన్ని 2. చూడా మణిని
3. మణి కంకణాన్ని 4. పాద మంజీరాలను

2. ప్రశ్న : సీతాదేవి వృత్తాంతాన్ని శ్రీరామునకు తెలుపుతూ హనుమంతుడు, ఆమె తాను ఎంతకాలం వరకు జీవించి ఉంటాను అని తెలిపింది, అని తెలిపాడు ?

జవాబు : 1. ఒక సంవత్సర కాలం 2. ఆరు నెలల కాలం
3. మూడు నెలల కాలం 4. ఒక నెలరోజుల కాలం

3. ప్రశ్న : సీతాదేవి హనుమంతుని ద్వారా పంపిన దివ్య చూడామణిని చూడగానే

శ్రీరాముడు దానిని తన హృదయానికి హత్తుకొని దానిని సీతాదేవికి ఎవరు కానుకగా ఇచ్చారని గుర్తు చేసుకొన్నాడు ?

జవాబు : జవాబుల కాలంలో ఉన్నది.

4. ప్రశ్న : సీతాదేవి సందేశాన్ని శ్రీరామునికి హనుమంతుడు ఏ విధంగా వివరించాడు ?

జవాబు : మహానుబావుడైన శ్రీరామునితో హనుమంతుడు ప్రభూ! జానకీదేవి ఇదివరలో చిత్రకూటంలో జరిగిన వృత్తాంతాన్ని మీకు గుర్తు చేయడానికై యధాతథంగా నాకు తెలిపింది. ఓ రామచంద్రా! నీతోగూడి హాయిగా నిద్రిస్తున్న జానకీ దేవి ముందుగా మేల్కొనెనట. ఆ సమయంలో ఒక కాకి ఆమె వక్షస్థలాన్ని గాయపరచెనట. అది తెలిసి నిద్రమేల్కొన్న నీవు ఆకాకాసురునిపై ఒక దర్భపై బ్రహ్మాస్త్రాన్ని అభిమంత్రించి వదలగా, ఆ అస్త్ర తీవ్రతకు ఆకాకి లోకాలన్ని తిరిగి చివరకు నిన్నే శరణు వేడినదట. ఆకాకము చంపదగినదే అయినప్పటికి శరణు కోరిన ప్రాణిని రక్షించే సహృదయుడవైన నీవు, ఆ బ్రహ్మాస్త్ర ఉపశమనానికై ఆ కాకి కుడికంటిని తొలగించినావట. ఓ రామా! మానవోత్తములైన రామ లక్ష్మణులు మహాబల సంపన్నులు, అగ్నివలె తేజస్సంపన్నులు. దేవతలకును అజేయులు, అటువంటి మహావీరులు నన్నెందుకు ఉపేక్ష చేస్తున్నారు. కారణం నా వలన ఏదైనా దోషమున్నదా? అని ఆ వైదేహి కన్నీరు కార్చుచు పలికిన జాలిగొలుపు మాటలు విని నేను అమ్మా! జానకీదేవి! నేను ఒట్టుపెట్టుకొని చెప్పుచున్నాను. శ్రీరాముడు నీకై శోకిస్తూ ఏమితోచని స్థితిలో ఉన్నాడు. ఆయన దుఃఖంలో మునిగి యుండడం వల్ల, లక్ష్మణుడు పరితపిస్తున్నాడు. ఎట్టకేలకు నేను నిన్ను చూడగలిగాను. ఇది దుఃఖించ వలసిన సమయంకాదు. అమ్మా! త్వరలోనే నీ కష్టాలన్ని తొలగిపోతాయి. శ్రీరాముడు రావణ సంహారంచేసి నిన్ను అయోధ్యకు తీసికొని పోతాడు. ఇది నిజం. అని ఇంకనూ ఆమె నాతో మీకు విన్నవించమని అనేకరీతుల తన సందేశాన్ని వినిపించింది. కనుక ప్రభూ! నేను చెప్పిన ఈ మాటలు తెలిసికొని, ఆమె భద్రంగా ఉన్నదని విశ్వసించు. అని హనుమంతుడు శ్రీరామచంద్ర ప్రభువుకు సీతమ్మ సందేశాన్ని వినిపించాడు.

5. ప్రశ్న : లంకలో జానకీదేవి సందేహాలను హనుమంతుడు ఏమేమి మాటలు చెప్పి తీర్చాను అని రామచంద్రునికి తెలిపాడు ?

జవాబు : శ్రీరామునితో ఆంజనేయుడు సీతాదేవి సందేహాలకు తాను చెప్పిన మాటలను తెలియజేస్తూ, ఓ నరశ్రేష్టుడా! జానకీదేవి నాతో మాట్లాడుతూ మారుతీ! నీవు సర్వసమర్థుడవే. నీ విషయమటుంచు, ఇతర వానర, భల్లూక వీరులు, రామ లక్ష్మణులు, దాట శక్యముగాని ఈ మహా సముద్రాన్ని ఎట్లుదాట గలరు? వారంతా ఈ మహా సముద్రాన్ని దాటడానికి నీవేమి ఆలోచిస్తున్నావు. నాకు తెలియజేయి. నాయనా! హనుమా! ఈ కార్యాన్ని సాధించడానికి నీ ఒక్కడివే చాలుదువు. కాని శ్రీరాముడు సమస్త బలగాలతో వచ్చి రణ రంగంలో రావణుని హతమార్చి విజేతయై అయోధ్యా నగరానికి నన్ను తీసికొని వెళితే అది ఆ ప్రభువుకు గాని, నాకు గాని యశస్కరము. శ్రీరాముడు మహావీరుడు. నేను వీరపత్నిని. శ్రీరాముడు తన భుజబలంతో లంకను ధ్వంసంచేసి, నన్ను తీసికొని వెళ్ళే విధంగా, కార్యసాధనా రీతిని నీవు రూపొందించు. అని జానకీ దేవి నాతో పలికింది. ఓ రామా! అర్థవంతములైన హేతుబద్ధములైన విషయాలతో గూడిన ఆమె మాటలకు నేను అమ్మా! వానర భల్లూక వీరులకు సుగ్రీవుడు అదిపతి. ఆయన సంకల్పం కలిగినంతనే వారంతా ఇచటికి వాలతారు. అమ్మా! సింహ పరాక్రములైన రామ లక్ష్మణులు త్వరలోనే లంకా ద్వారము కడ నిలవడాన్ని నీవు చూస్తావు. అని సీతాదేవికి అనేక విధాల ధైర్యం కలిగించాను. ప్రభూ! నా తల్లి మైధిలీదేవికి, అనేక ధైర్య వచనాలతోనూ, శుభకరమైన మాటలతోనూ ఆమెను ఓదార్చి, ప్రసన్ను రాలినిగా చేశాను. అప్పుడా తల్లి నా సమక్షంలోనే శాంతిని పొందింది. అని హనుమంతుడు శ్రీరామునకు సీతాదేవి సందేహాలను తీర్చిన వైనాన్ని తెలియజేశాడు.

## డెబ్బది మూడవ అధ్యాయము

జవాబులు : 1.2. చూడామణిని 2.4. ఒక నెలరోజులకాలం
3. తన మామగారైన జనక మహారాజు

## - సుందరా కాండము సమాప్తము -

# 6. యుద్ధ కాండము

## 1, 2, 3, 4 సర్గలు
## డెబ్బది నాలుగవ అధ్యాయము

1. ప్రశ్న : హనుమంతుడు సీతాదేవిని చూసి వచ్చిన కథ అంతావిన్న రాముడు ఎంతో సంతోషించి, పులకించి అంతటి మేలు చేసిన హనుమంతునికి రాముడు ఏమిచ్చాడు ?

జవాబు : 1. మెచ్చుకొన్నాడు 2. ఒక హారాన్ని బహూకరించాడు
3. ఆలింగన సౌఖ్యాన్నిచ్చాడు 4. ఆశీర్వదించాడు

2. ప్రశ్న : శ్రీరాముడు సముద్ర లంఘనాన్ని గురించి దీర్ఘంగా ఆలోచిస్తూ, బాధపడసాగాడు. అప్పుడు ఆయనకు సముద్రముపై సేతువును నిర్మించుకొని లంకలో ప్రవేశించుదాము అని మొదటగా తెలిపినది ఎవరు ?

జవాబు : 1. సుగ్రీవుడు 2. హనుమంతుడు
3. జాంబవంతుడు 4. అంగదుడు

3. ప్రశ్న : శ్రీరాముడు సకల ప్రయోజనాలు దెబ్బతీసే వ్యాకుల పాటుకులోనై ఉండగా, సుగ్రీవుడు ఆయనను వ్యాకులపాటును వదలిపెట్టి దేనిని వహించమని సలహా చెప్పాడు ?

జవాబు : జవాబుల కాలంలో ఉన్నది.

4. ప్రశ్న : శ్రీరాముని కోరికపై లంకానగర రక్షణ వ్యవస్థను హనుమంతుడు ఏరీతిగా వివరించి చెప్పాడు ?

జవాబు : లంకానగర రక్షణ వ్యవస్థను గురించి శ్రీరాముడు అడిగిన మీదట హనుమంతుడు ప్రభూ! లంకానగర వాసులందరూ ఆనందంతో హాయిగా ఉన్నారు. ఆ నగరం మదపుటేనుగులతోనూ, అసంఖ్యాకమైన రథాలతోనూ, రాక్షస సేనతోనూ నిండి ఉంది. అందువల్ల శత్రువులకది చేధింప నలవికానిది. ఆ నగరానికి నలువైపులా నాలుగు ద్వారాలున్నాయి. అవి విశాలముగను, ఎత్తుగనూ, నిర్మించబడ్డాయి. వాటిచుట్టూ అగడ్తలున్నాయి. ద్వారాలపై శక్తివంతములైన,

యంత్రాలను అమర్చబడి ఉన్నాయి. అవి బాణాలను, శిలలనూ వర్షించగలవు. ఆ నగరంపై దాడిచేసిన శత్రుసైన్యాలను అవి నిలువరించగలవు. ఆ ద్వారాలకడ అనేక మంది రాక్షసయోధులు వందలకొద్దీ శతఘ్నులను ఏర్పరచి యున్నారు. అవి లోహాలచే నిర్మింపబడి ఉన్నాయి. ఆ నగరం చుట్టూ ఉన్నప్రాకారం బంగారంతో నిర్మించబడి ఉంది. ప్రాకారంచుట్టూ అగడ్తలలో నిండియున్న నీటిలో మొసళ్ళులాంటి జలజంతువులు సంచరిస్తూంటాయి. ప్రభూ! రావణుడు నిరంతరం యుద్ధోత్సాహంతో ఉంటాడు. తన సేనలను పర్యవేక్షించడంలో తాను ఎల్లప్పుడూ జాగరూకుడై ఉంటాడు. లంకానగరంపై దాడిచేయడం అసాధ్యమైన పని. అందు దేవతలు కూడా ప్రవేశించలేరు. అసంఖ్యాకమైన రాక్షససేన నాలుగువైపుల ఉన్న ద్వారాలను రక్షిస్తూ ఉంటారు. ప్రభూ! నేను అచటి పరిఘలపై గల వంతెనలను, అగడ్తలను, రాళ్ళతోనూ, ఇటుకలతోనూ నింపివేశాను. ప్రాకారాలను చాలావరకు నేలమట్టం చేశాను. రాక్షస సేనలోని నాలుగవ వంతున్న వారిని నాశనం చేశాను. ఆ లంకానగరాన్ని అగ్నికి ఆహుతిచేశాను. ఏదైనా ఉపాయంతో మన సేనతో లంకానగరంలో ప్రవేశించగలిగితే విజయం మనలనే వరిస్తుంది. కావున ప్రభూ! సర్వసన్నద్ధులమై మనం బయలు దేరడానికి ఒక సుముహూర్తాన్ని నిర్ణయించి, సుగ్రీవ అంగదాదులను ఆజ్ఞాపించండి. అని హనుమంతుడు చెప్పిన దానిని శ్రీరాముడు శ్రద్ధతో విన్నాడు.

5. ప్రశ్న : శ్రీరాముని ఆదేశానుసారం వానరసేన ఏ రీతిగా సముద్ర తీరానికి చేరింది?

జవాబు : హనుమంతుడు తెలిపిన లంకానగర విశేషాలను విని శ్రీరాముడు సుగ్రీవునితో ఓ వానరశ్రేష్టా! దుర్మార్గుడైన రావణపాలిత లంకను గురించి విన్నాము గదా! ఇక వెంటనే దానిని ధ్వంసం చేద్దాము. ఇప్పుడు సూర్యుడు ఆకాశమధ్య భాగానికి చేరియున్నాడు. ఇదే విజయ ముహూర్తము. ప్రశస్తమైన ఈనాడు ఉత్తర ఫల్గుణీ నక్షత్రము. ఇది ప్రయాణానికి, విజయానికి తగిన రోజు. కనుక ఇప్పుడే బయలు దేరడం మేలు. అని పలికిన రాముని మాటలకు లక్ష్మణుడు, సుగ్రీవుడు

సంతోషించి, ప్రయాణ సన్నద్ధులై, ఆయా సేనా విభాగాలకు తగిన వారిని సేనా నాయకులుగా నియమించి, వారిని సక్రమమైన మార్గంలో, శ్రీరాముడు నిర్దేశించినట్లుగా, నగరాలు ఇతర జనావాసాలు తగలకుండా మంచి రుచికరమైన ఫలాలు, స్వాదు జలాలు దొరికే ప్రదేశాల మీదుగా ప్రయాణాన్ని సాగించే విధంగా సుగ్రీవుడు వానరసేనా నాయకులను ఆదేశించాడు. ఆ విధంగా వారు సాగిపోతుండగా వారికి సహ్యాద్రి కనబడింది. త్రోవలో బాగా వికసించిన పూలతో కళ కళలాడుచున్న సరస్సులు, తటాకములు, వనాలు వారికి గోచరించాయి. ఆ విధంగా వారంతా సంతోషంతో ప్రయాణిస్తూ, దక్షిణ దిశగా శ్రీరాముని వెంట నడచి, సకల జలచరాలతో నిండియున్న సముద్ర తీరానికి చేరుకొన్నారు.

### డెబ్బది నాలుగవ అధ్యాయము

జవాబులు : 1.2. ఆలింగన సౌఖ్యాన్నిచ్చాడు 2.1. సుగ్రీవుడు
3. శత్రువుపై క్రోధాన్ని వహించమని

..........

# యుద్ధ కాండము

## 5, 6, 7, 8 సర్గలు

### డెబ్బది ఐదవ అధ్యాయము

1. ప్రశ్న : వానర సేనతోగూడి సముద్ర తీరానికిచేరిన రాముడు లక్ష్మణునితో తమ్ముడూ! సీతాదేవి యెడబాటు వలన కలిగిన ఎటువంటి అగ్ని నన్ను నిలువునా కాల్చివేస్తున్నది అని తెలిపాడు ?

జవాబు : 1. బడబాగ్ని 2. విరహాగ్ని
3. క్రోధాగ్ని 4. అసూయాగ్ని

2. ప్రశ్న : లంకానగరంలో హనుమంతుడు విధ్వంసం చేసివెళ్ళిన తరువాత ఏమిచేస్తే బాగుంటుంది? అని రాక్షస సభనుద్దేశించి ప్రసంగించింది ఎవరు ?

జవాబు : 1. ఇంద్రజిత్తు 2. విభీషణుడు
3. కుంభకర్ణుడు 4. రావణుడు

3. ప్రశ్న : రావణుని పరాక్రమాన్నిచూసి, ఆయనకు తన కూతురు మండోదరి నిచ్చి వివాహం చేసిన దానవ ప్రముఖు డెవరు ?

జవాబు : జవాబుల కాలంలో ఉన్నది.

4. ప్రశ్న : రావణునికి తన మంత్రులు ఏరీతిగా ధైర్యవచనాలు చెప్పారు ?

జవాబు : హనుమంతుడు లంకానగరాన్ని విధ్వంసం చేసివెళ్ళిన పిమ్మట రావణుడు తన మంత్రులతో సభ దీర్చి, వారి నుద్దేశించి ఓ రాక్షస ప్రముఖులారా! ఇటువంటి విపత్కర పరిస్థితులలో మనం మనలను, మన లంకా నగరాన్ని కాపాడు కోవడానికై, మీరందరూ బాగా ఆలోచించి తగిన సూచనలు చేయు మనగా వారంతా ఒకరి తరువాత ఒకరు ఆ ప్రభువుకు అంజలి ఘటించి ప్రభూ! మనవద్ద అపారమైన సైనిక బలముంది. ఆయుధ సంపదలోనూ అందుకు తగినట్లుగానే ఉన్నది. ఇట్టి స్థితిలో నీవెందుకు విచార పడుతున్నావు? నీవు గతంలో యక్షులను నాగులను దానవులను యుద్ధాలలో ఓడించి, వారిని చిత్ర హింసలకు గురిచేసి యున్న సందర్భాలను మరచావా? అంతియేగాక ఈ భూమండలంలో మహాపరాక్రమ వంతులైన ఎందరో రాజులను జయించావు. ఆ రాజుల ముందు ఈ రాముడు ఎందుకూ సరిపోలడు. అట్టి రాజులనే జయించిన మీకు ఈ రాముడొక లెక్కయా? మహారాజా! నీవు శ్రమ పడవలసిన పనిలేదు. మహాబాహువైన నీ కుమారుడు ఇంద్రజిత్తు ఒక్కడే చాలు ఆ వానర సేననంతటినీ సంహరించడానికి. ఈ ఇంద్రజిత్తు పరమేశ్వరునికి ప్రీతి కలిగించడానికై అనేక యజ్ఞాలు చేసి, ఇతరు లెవరికీ సాధ్యపడని వరాలను పొంది ఉన్నాడు. ప్రభూ! ఇంతకు ముందు మనం జయించిన వారి తేజస్సు కంటే హనుమంతుని బలం చాలాతక్కువ. అతణ్ణి అతడి పరాక్రమాన్ని అతిగా గౌరవించడం తగదు. ఓ రాజా! నీవు తప్పక రాముణ్ణి చంపగలవు. వారిపై విజయాన్ని సాధించగలవు. అని రావణుని మంత్రులు ఆతనితో విన్నవించారు.

5. ప్రశ్న : రావణుని యెదుట ఆతని సేనాపతులు ఏరీతిగా ప్రగల్భాలు పలికారు?

జవాబు : రావణసభలో మంత్రులు మహారాజైన రావణునికి ధైర్య వచనాలు పలికిన పిమ్మట, ఆతని సేనాపతులైన ప్రహస్తుడు, దుర్ముఖుడు, వజ్రదంష్ట్రుడు, నికుంభుడు, వజ్రహనువు అనువారు ఒకరి తరువాత ఒకరు మహారాజా! దేవదానవులు, గంధర్వ, పిశాచ, నాగులు, పక్షిరాజులు నిన్నేమి చెయ్యలేక పోయారు. ఇక వానరులు నిన్నేమి చేస్తారు? మనకు ఏ మాత్రం శత్రుభయం లేదన్న నమ్మకంతో, ఏమరుపాటుతో ఉన్నాము. అందువల్ల హనుమంతుడు మనపై దెబ్బతీశాడు. లేకుంటే ఆ వానరుడు ప్రాణాలతో లంకను వీడివెళ్ళి ఉండేవాడు కాడు. అని ఒక సేనాని పలుకగా, ఇంకొక సేనాని ప్రభూ! మన అనుమతి లేకుండా అంతఃపురంలో ప్రవేశించడం, లంకా నగరాన్ని దహించడం ఇవి అన్నీ మహారాజుకు అవమానకరాలు, కావున నేను ఒక్కడినే వెళ్ళి ఆ వానరు లందరిని హతమారుస్తాను. అని పలుకగా వేరొక సేనాని పండ్లు పటపటా కొరుకుతూ భయంకరమైన పరిఘను ఒకదానిని పట్టుకొని ప్రభూ! మనకు సుగ్రీవ, లక్ష్మణులతో కూడిన రాముడే మనకు శత్రువు. వారిని నేనొక్కడినే వెళ్ళి సంహరించి వస్తాను అన్నాడు. వెంటనే వేరొక సేనాని మహారాజా! నీవును, ఈ రాక్షససేన అట్లుండనిండు. రామ లక్ష్మణులను, సుగ్రీవుని హనుమంతుని, వానర సేన నంతటిని నేనొక్కడినే సంహరించగలను అన్నాడు. అటు పిమ్మట ఇంకొక సేనాని కోపంతో ఊగిపోతూ ఓ రాక్షస సార్వభౌమా! మీరందరూ నిబ్బరంతో కమ్మని మధువు త్రాగుతూ ఆనందంగా ఉండండి. నేనొక్కడినే వెళ్ళి మన శత్రువులైన ఆ రామాదు లందరినీ సంహరించి వస్తాను. అని రావణ సేనానులందరూ తలొక విధంగా ప్రగల్భాలు పలికారు.

## డెబ్బది ఐదవ అధ్యాయము

జవాబులు : 1.2. విరహాగ్ని 2.4. రావణుడు
3. మయుడు

# యుద్ధ కాండము

## 9, 10, 11, 12 సర్గలు

## డెబ్బది ఆరవ అధ్యాయము

1. ప్రశ్న : విభీషణుడు రావణునికి శ్రీరాముని పరాక్రమాన్ని గురించి తెలపిన పిమ్మట, రావణుడు సభను వీడి ఎక్కడికి వెళ్ళాడు ?

జవాబు : 1. అశోక వనానికి 2. కోప గృహానికి
3. తన భవనానికి 4. ఇంద్రజిత్తు భవనానికి

2. ప్రశ్న : రావణుని మేలుకోరి విభీషణుడు తన అన్నను చేరి రాముడికి సీతాదేవిని అప్పగించడమే మేలని హితవు పలుకగా, రావణుడు, రాముడు ఎవరితో కలిసి వచ్చినా నా ముందు నిలవలేడు అని చెప్పాడు ?

జవాబు : 1. ఇంద్రాది దేవతలతో 2. సుగ్రీవాదులతో
3. బ్రహ్మాదులతో 4. ప్రపంచ ప్రజలందరితో

3. ప్రశ్న : రావణుడు తాను ముఖ్యమైన మంత్రులతోనూ, మిత్రులతోనూ సంప్రదించాలన్న సమయం ఆసన్నమైనదని తలంచి ఎచటికి వెళ్ళాడు ?

జవాబు : జవాబుల కాలంలో ఉన్నది.

4. ప్రశ్న : రావణుడు తనకు ముఖ్యమైన వారందరినీ ఏ రీతిగా పిలిపించాడు ?

జవాబు : రావణుడు సీతాదేవిని అపహరించుకొని రావడమనే పాపకృత్యాన్ని చేసిన దుర్మార్గుడు. అతని మేలుగోరి విభీషణాది బంధుమిత్రులు ఎంతగా మంచి మాటలు చెప్పినా, సీతాదేవిపై గల కోరికచేత వారందరి మాటలు త్రోసిపుచ్చాడు. తాను ఏమి చెయ్యడానికి దిక్కుతోచక బాధపడుతూ నీరసించి ఉన్నాడు. యుద్ధం తప్పదని తెలుస్తూంది. ఆపత్సమయం ముంచు కొస్తూంది. అందువల్ల రావణుడు తనకు ముఖ్యమైన మంత్రులతోనూ, మిత్రులతోనూ లోతుగా ఆలోచించ వలసిన సమయం వచ్చింది. అని అనుకొన్నాడు.

వెంటనే ఒక అద్భుతమైన రథాన్ని అధిరోహించి ఆలోచనా మందిరానికి వెళ్ళాడు. వెంటనే అచట ఉన్న దూతలతో, మనశక్తి సామర్థ్యాలను చూపవలసిన సమయం ఆసన్నమైనది. కనుక మీరు వెంటనే బయలుదేరి మన నగరంలోని ప్రముఖ రాక్షసు లందరినీ తీసికొనిరండు. అని ఆజ్ఞాపించాడు. వెంటనే ఆ రాక్షస భటులు లంకానగర మందంతటా తిరిగి, ఎటువంటి సంకోచమూ లేకుండా, విహార, శయన మందిరాల యందును, ఉద్యానవన ప్రదేశాల యందును ప్రవేశించి, రాక్షస ప్రముఖు లందరికి ప్రభువు యొక్క ఆదేశాన్ని వినిపించారు. అటు పిమ్మట రాజాజ్ఞను విన్న వెంటనే వారంతా వారి వారికి సంబంధించిన రథాలపైనా, ఏనుగులపైనా, గుర్రాలపైనా, కాలినడకనా పరుగు పరుగునా వచ్చారు. మహారాజు నివశించి యున్న సభా భవనానికి అల్లంత దూరంలో వారివారి వాహనాలను నిలిపి ఉంచి, వారంతా కాలినడకన ఆభవనంలో ప్రవేశించి రావణుని దర్శించారు. వచ్చిన తన వారందరికి ఆరాజు స్వాగతం పలికాడు. ఆ విధంగా వారంతా రాజాజ్ఞకై నిరీక్షిస్తూన్నారు.

5. ప్రశ్న : రావణ సభలో చేరిన వారందరిలోకి కుంభకర్ణుడు రావణునితో ఏ విధంగా సంభాషించాడు ?

జవాబు : సభకు విచ్చేసిన వారందరితో రావణుడు సభికులారా! యుద్ధం అనివార్యమని తెలుస్తూంది. రాముని భార్యయైన సీతాదేవి సౌందర్యానికి ముగ్ధుడనై నే నామెను అపహరించుకొని వచ్చాను. ఈ రెండింటినీ దృష్టిలో ఉంచుకొని నాకే విజయం లభించే విధంగా సూచన లివ్వండి. నా తమ్ముడు కుంభకర్ణుడు నిద్ర నుండి మేల్కొని ఇప్పుడే సభకు వచ్చి యున్నాడు. కాని కుంభకర్ణుడు ఇప్పటి వరకు నిద్రలో మునిగి యున్నందున ఆతనితో ఈ విషయాలన్ని చర్చించలేక పోయాను. అని పలుకుతున్న కామాతురుడైన రావణుని పరివేదనను విని కుంభకర్ణుడు కోపంతో ప్రభూ! రామ లక్ష్మణులను వంచించి వారి ఆశ్రమం నుండి సీతాదేవిని అపహరించు కొని రాక మునుపే మాతో ఒకసారి సంప్రదించి నిర్ణయం తీసికొని యుంటే బాగుండేది.

అన్నా! ధర్మ విరుద్ధమైన కర్మలను చేయకూడని పద్ధతులలో చేస్తే, అవి అనర్థాలను తెచ్చిపెడతాయి. నేనే బలవంతుడను అని విర్రవీగుతూ తొందరపాటుతో ప్రవర్తించే చపలచిత్తుని లోపాలు వైరిపక్షంవారు గమనించి అవలీలగా ఆతనిపై దెబ్బతీస్తారు. అనాలోచితంగా నీవు చేసిన పనివలన ఇప్పుడు ఆలోచించవలసి వచ్చింది. అయినా సరే నీవు బాధపడవద్దు. నేను వారిని సంహరించి ఆ ప్రమాదం నుండి నిన్ను కాపాడతాను. నేను జీవించి ఉండగా నీకు భయమెందుకు? రామ లక్ష్మణులను చంపి, వానరులను తినివేస్తాను. నా చేతిలో రాముడు హతమైపోగా సీతాదేవి నీకు శాశ్వతంగా వశమవుతుంది. అని కుంభకర్ణుడు తన అన్నగారితో చెప్పాడు.

## డెబ్బది ఆరవ అధ్యాయము

జవాబులు : 1.3. తనభవనానికి 2.1. ఇంద్రాది దేవతలతో
3. ఆలోచనా మందిరానికి

............

# యుద్ధ కాండము

## 13, 14, 15, 16 సర్గలు

## డెబ్బది ఏడవ అధ్యాయము

1. ప్రశ్న : రావణుడు పరస్త్రీని బలవంతంగా అనుభవిస్తే ఆతని తలపగిలి మరణిస్తాడని శపించింది ఎవరు ?

జవాబు : 1. ఇంద్రుడు 2. పుంజకస్తల
3. సీతాదేవి 4. బ్రహ్మదేవుడు

2. ప్రశ్న : రావణునికి కోపం రావడాన్ని గమనించిన మహాపార్శ్వుడు తన రాజుతో చతురోపాయాలలో దేనిని అనుసరిద్దాం అని చెప్పాడు ?

జవాబు : 1. సామోపాయం 2. దానోపాయం
3. భేదోపాయం 4. దండోపాయం

3. ప్రశ్న : రావణుని శాప వృత్తాంతాన్ని, అతనికి మేలు చేకూర్చే మాటలను చెప్పినది ఎవరు?

జవాబు : జవాబుల కాలంలో ఉన్నది.

4. ప్రశ్న : ఆలోచనా మందిరంలో విభీషణుని మాటలకు ఇంద్రజిత్తు ఏరీతిగా సమాధానం చెప్పాడు ?

జవాబు : రావణుని మేలుగోరి అపర బృహస్పతియైన విభీషణుడు పలికిన మాటలు అయిష్టంతో విన్న ఇంద్రజిత్తు ఆ ఆలోచనా మందిరంలో ఓ పిన తండ్రీ! నీవు ఒక పిరికి వానివలె నిరర్థకమైన మాటలు మాట్లాడుతున్నావు. మన పౌలస్త్య వంశంలో నీవంటివాడు ఇంతకు ముందు పుట్టియుండ లేదు. పిరికి వాడవైన ఓ విభీషణా! మానవ మాత్రులైన ఆ రాజకుమారులు మనముందెంత? మనలో ఒక సామాన్య రాక్షసుడు చాలు వారిని చంపడానికి. నీవు భయపడుటమే గాక, మమ్ములను ఎందుకు భయపెడు తున్నావు? నేను త్రిలోకాధిపతి ఇంద్రుని రాజ్యభ్రష్టుని చేశాను. అటువంటి మహా వీరుడనైన నాకు ఒక మానవ మాత్రుడైన రాజ కుమారుడొక లెక్కయా? అని పలికిన ఇంద్రజిత్తుతో విభీషణుడు నాయనా! ఇంద్రజిత్తూ! నీవు ఇంకనూ బాలుడవు. నీకిప్పుడు కర్తవ్యా కర్తవ్యాలను నిర్ణయించే శక్తిలేదు. నీవిట్లు అర్థ రహితములైన మాటలు మాట్లాడి నందువల్ల రావణునకు వినాశనము తప్పదు. అని విభీషణుడు ఇంద్రజిత్తుకు సమాధానం చెబుతూండగా అక్కడి వారందరూ విన్నారు.

5. ప్రశ్న : ఆలోచనా మందిరం నుండి విభీషణుడు ఎందుకు వెళ్ళిపోయాడు?

జవాబు : తన మేలుకోరి చెప్పిన విభీషణుని మాటలు లెక్కచేయక, మృత్యు ప్రేరితుడైన రావణుడు ఓరి! రాక్షసా! ప్రాణాపాయ కరమైన మహా విష సర్పంతోనైన కలిసి నివశించ వచ్చుగాని, స్నేహితునివలె ప్రవర్తిస్తూ, పక్షపాత బుద్ధిగల నీవంటి బంధువుతో ఎన్నడూ నివశింప రాదు. సకల లోకముల యందలి దాయాదుల స్వభావాలు నాకు బాగా తెలుసు. ఈ బంధువులంతా తమ దాయాదులు దుఃఖాలపాలైతే ఎంతో సంతోషపడతారు. లోకంలో దాయాదులు తమకంటే ఉన్నత స్థితికి చేరిన వానిని కార్యదక్షుని, విద్వాంసుని, ధర్మ స్వభావము గల వానిని, శూరుని అవమానిస్తూంటారు. అంతేగాక అవకాశం దొరికి

నప్పుడల్లా కించపరుస్తూంటారు. ఈ దుర్మార్గులు వారికి సహాయం చెయ్యకపోగా ద్రోహాన్ని తలపెడు తూంటారు. ఆ విధంగానే నా దాయాదివై నీవు సంకటస్థితిలో నున్న మమ్ములను దెబ్బతీయ జూస్తున్నావు. ఓ విభీషణా! నేను అన్ని లోకాలలోనూ గౌరవాదరాలను పొంది యున్నాను. ఐశ్వర్య వంతుడను. ఉత్తమ వంశంలో జన్మించిన వాడను. శత్రువులను పాదాక్రాంతం చేసుకొన్న వాడను. ఇట్టి ఔన్నత్యాన్ని జూచి నా దాయాదివైన నీవు అసూయ పడుతున్నావు. ఓరీ కులద్రోహి! నీవు రాక్షస వంశంలో చెడబుట్టావు. నీవు దప్ప మరి యొకడు ఈ విధంగా మాట్లాడి ఉంటే వాడి ప్రాణాలు తీసి ఉండేవాడిని. తమ్ముడ వైనందుకు బ్రతికి పోయావు. అని రావణుడిట్లు దురుసుగా మాట్లాడగా, ధర్మవర్తనుడైన విభీషణుడు, ఇక ఇచట ఉండరాదని భావించి, తన గదను చేతబట్టి ఆకాశానికి ఎగిరాడు. తనతోపాటు తన అనుచరులైన నలుగురు మంత్రులు కూడా విభీషణుని అనుసరించారు.

## డెబ్బది ఏడవ అధ్యాయము

జవాబులు : 1.4. బ్రహ్మదేవుడు　　2.4. దండోపాయం
3. విభీషణుడు

.......

# యుద్ధ కాండము

## 17, 18, 19, 20 సర్గలు

## డెబ్బది ఎనిమిదవ అధ్యాయము

1. ప్రశ్న : శ్రీరాముని ఆశ్రయించడానికి వచ్చిన విభీషణునికి ఆశ్రయమియ్య వద్దని, ఈతడు శత్రు పక్షంవాడని శ్రీరామునికి మొదటగా తెలిపినది ఎవరు ?

జవాబు : 1. హనుమంతుడు　　2. సుగ్రీవుడు
3. అంగదుడు　　4. జాంబవంతుడు

2. ప్రశ్న : విభీషణుడు ఆశ్రయమియ్య దగినవాడే నని నమ్మదగిన వాడేనని శ్రీరామునికి తెలియజేసినది ఎవరు ?

జవాబు : 1. జాంబవంతుడు 2. నలుడు
3. నీలుడు 4. హనుమంతుడు

3. ప్రశ్న : ఏ మహర్షి చెప్పిన ప్రబోధాత్మకమైన మాటలను చెప్పి, రాముడు సుగ్రీవునితో, విభీషణునికి ఆశ్రయ మివ్వడమే ధర్మమని చెప్పాడు ?

జవాబు : జవాబుల కాలంలో ఉన్నది.

4. ప్రశ్న : తన పాదాలను ఆశ్రయించిన విభీషణుని ద్వారా రాముడు రాక్షసుల బలా బలాలను ఏ రీతిగా తెలిసుకొన్నాడు ?

జవాబు : శ్రీరాముడు అభయ మిచ్చాడని తెలియగానే విభీషణుడు రాముని పాదాల చెంతచేరి నమస్కరించాడు. అప్పుడు రాముడు విభీషణా! లంకలోని రాక్షసుల బలాబలాలు నాకు తెలుపుమన్నాడు. అంతట విభీషణుడు ఓ రాజకుమారా! రావణుడు బ్రహ్మదేవుడి నుండి అసాధారణమైన వరాలను పొందియున్నాడు. వాటి ప్రభావంతో దేవ గంధర్వ యక్షరాక్షసుల యందెవరి చేతను వధింపబడడు. రావణుని తమ్ముడు నాకు అన్నగారైన కుంభకర్ణుడు గొప్ప యోధుడు. యుద్ధం చేయడంలో ఇంద్రుని యంతటివాడు. రావణుని కుమారుడు ఇంద్రజిత్తు యుద్ధ సమయాలందు అభేద్యమైన కవచాన్ని ధరించి, ధనుర్ధారియై శత్రువులకు కనబడకుండా యుద్ధం చేస్తుంటాడు. అతడు యజ్ఞం చేసి, అగ్నిదేవుని సంతృప్తి పరచి అమితమైన శక్తిని సంపాదించాడు. ఇంకను ఓ రామచంద్రా! రావణుని మంత్రులు, సేనానులు భూమియందు దిక్పాలురతో సమానంగా యుద్ధం చేస్తారు. లంకాపురిలో నివసించునట్టి కోట్ల కొలదిగాగల రాక్షససేన, రక్త మాంసాలు తింటారు. వారిలో కొందరు కామరూపులు అని తెలిపిన విభీషణునితో రాముడు విభీషణా! నీవు వాస్తవాలను తెలిపావు. వాటన్నింటినీ నేను గ్రహించాను. నేను రావణుని ఆతని బంధుమిత్రులను రణభూమికి బలియిచ్చి నిన్ను లంకకు రాజునుగా చేస్తాను. అని పలికిన రామునికి విభీషణుడు శిరసువంచి నమస్కరించాడు.

5. ప్రశ్న : రావణుని దూతగా సుగ్రీవాదులున్న చోటికి శుకుడు వచ్చి ఏ విషయాల గురించి మాట్లాడాడు?

జవాబు : రావణుని ఆజ్ఞానుసారం శుక రాక్షసుడు కామరూపి గనుక చిలుక రూపం ధరించి సముద్రానికి ఆవలి తీరాన ఉన్న శ్రీరాముని సేననుచేరి, ఆకాశ మందుండియే, సుగ్రీవునితో రావణుని సందేశాన్ని వినిపించదలచి సుగ్రీవునితో ఓ వానర రాజా! నీవు మహా బలశాలియైన వాలికి తమ్ముడవు. కనుక నీవు మా మహారాజుకు కూడా సోదర సమానుడవే. కనుక నీవు రాముని పక్షాన్ని వీడి నా పక్షాన్నిచేరు. రాముని పక్షాన యుద్ధం చేసిన నీకు కలుగు ప్రయోజన మేముంది. నేను శ్రీరాముని భార్యయైన సీతాదేవిని అపహరించిన మాట నిజమే. కాని దాని వలన నీకేమి నష్టము. ఆలోచించుకో. నీవు వానరుడవు. అతడు నరుడు. మీ ఇరువురికి ఎట్టి సంబంధమూ లేదు. కనుక నీవు కిష్కింధకు వెళ్ళిపో. మీరందరూ ప్రయత్నించినా సముద్రాన్ని దాటి లంకను చేరడం సాధ్యంకాని పని, అని మా మహారాజుగారు నీకు వినిపించమన్న సందేశాన్ని వినిపించాను. అని శుకుడు పలుకుతుంగా, అది వింటున్న కొందరు వానర వీరులు ఆకాశానికి ఎగిరి ఆ శుకరాక్షసుని పట్టుకొని క్రిందికిదించి, పిడిగుద్దులు గుద్దుచూ, ఆ చిలుక రూపంలో ఉన్న శుకుని ఈకలను పెరికి వేయసాగారు. అప్పుడు ఆ శుక రాక్షసుడు భయపడి శ్రీరాముని శరణువేడి ప్రభూ! నన్ను రక్షించు. దూతను చంపడం ధర్మం కాదు. అని అన్నాడు. అంతట రాముడు ఆ శుకరాక్షసునిపై దయతలచి ఆతనిని విడిచిపెట్టండని ఆదేశించాడు. రామాజ్ఞను శిరసావహించి వారట్లే చేశారు.

## డెబ్బది ఎనిమిదవ అధ్యాయము

జవాబులు : 1.2. సుగ్రీవుడు　　2.4. హనుమంతుడు
3. కందు మహర్షి

# యుద్ధ కాండము

## 21, 22, 23, 24 సర్గలు

## డెబ్బది తొమ్మిదవ అధ్యాయము

1. ప్రశ్న : శ్రీరాముడు తన సేనతో లంకను చేరడానికై సముద్రుని ప్రసన్నుని చేసికోదలచి దీక్షతీసికొని ఏ శయ్యపై మూడు రోజులు పడుకొని ఉన్నాడు ?

జవాబు : 1. దర్భశయ్యపై 2. తృణశయ్యపై 3. పర్ణశయ్యపై 4. శిలావేదికపై

2. ప్రశ్న : సముద్రునిపై ఆగ్రహించిన రాముడు తాను ప్రయోగించ భూనిన ఏ అస్త్ర ప్రభావాన్ని తెలిసికొని సముద్రుడు ప్రసన్నుడయ్యాడు ?

జవాబు : 1. వారుణాస్త్రము 2. ఆగ్నేయాస్త్రము 3. బ్రహ్మాస్త్రము 4. ఐంద్రాస్త్రము

3. ప్రశ్న : సముద్రుడు శ్రీరామునికి ఏ ఉపాయంతో సముద్రాన్ని దాటి లంకకు వెళ్ళవచ్చు అని చెప్పాడు?

జవాబు : జవాబుల కాలంలో ఉన్నది.

4. ప్రశ్న : లక్ష్మణునికి శ్రీరాముడు తనకు కనిపించిన ఎటువంటి ఉత్పాద శూచకాలైన శకునాల గురించి తెలిపాడు ?

జవాబు : సముద్రముపై వారధిని నిర్మించి, తన వారందరితో గూడి లంకను చేరి, అచట విడిదులను ఏర్పాటు చేసుకొని ఉన్న రాముడు లక్ష్మణునితో తమ్ముడూ! చల్లని జలసమృద్ధి కలిగి, ఫల వృక్షాలతో నిండి యున్న ఈ ప్రదేశం మన సేనకు బాగా అనుకూలంగా ఉంది. ఇచట నుండియే యుద్ధానికి సరియైన వ్యూహరచనతో ముందుకు సాగుదాం. మనకు కనిపించే ఉత్పాదకాలను బట్టి తీవ్రమైన భయావహ పరిస్థితి ఏర్పడ వచ్చునని నేనను కొంటున్నాను. ముఖ్యంగా రాక్షస ప్రముఖులకు ఇది వినాశన హేతువవు తుంది. కాగా మన వానర భల్లూక వీరులకు కూడా ప్రమాదం పొంచి ఉన్నదని అనిపిస్తూంది. అకస్మాత్తుగా ధూళి రేణువులతో గూడి, కలుషితమైన గాలులు వీస్తున్నాయి. భూమి

కంపిస్తూంది. పర్వతాలు కూడా స్వల్పంగా కంపిస్తున్నాయి. మేఘాలు కర్ణకఠోరంగా గర్జిస్తూ భయాన్ని కలిగిస్తూన్నాయి. సంధ్యా సమయం ఎఱ్ఱ చందనాన్ని పూసుకొన్నట్లుగా మిగుల భయానకంగా ఉంది. క్రూరమృగాలు, పక్షులు ధీన వదనాలతో సూర్యునివైపు జూస్తూ, క్రూరంగా అరుస్తున్నాయి. ఇది అంతా ఒక భయావహ పరిస్థితులకు సూచన. అని శ్రీరాముడు తమ్మునితో ఇక మనం వెంటనే లంకానగరం పైకి దాడికి సిద్ధంగా ఉండాలి అన్నాడు.

5. ప్రశ్న : యుద్ధనీతి ననుసరించి శ్రీరాముడు తనసేనను ఏ విధంగా విభజించాడు ?

జవాబు : శ్రీరాముడు యుద్ధనీతి ననుసరించి, తన సేనను విభజించి ఇట్లు శాసించాడు. పరాక్రమ శాలియైన అంగదుడు, నీలునితో సేనయొక్క వక్షస్థల భాగాన నిలవాలి. కపివరుడైన ఋషభుడు తన సైన్యంతో గూడి కుడిపార్శ్వాన ఉండాలి. బలశాలియైన గంధమాధనుడు సేనయొక్క ఎడమ పార్శ్వాన ఉండాలి. నేనును, లక్ష్మణుడును మన బలాలతో గూడి సేన యొక్క మూర్ధస్థానాన సావధానులమై ఉంటాము. యుద్ధం చేయడంలో సమర్థులైన జాంబవంతుడు, సుషేణుడు, వేగదర్శి అను వానర భల్లూక వీరులు సేన కుక్షిభాగాన నిలిచి దానిని రక్షిస్తూండాలి. వానరులకు ప్రభువైన సుగ్రీవుడు సేనకు వెనుక భాగాన ఉండి. సేనను రక్షిస్తూండాలి. అప్పుడు గరుడ వ్యూహాన్నను సరించి, చక్కగా విభక్తమై, ప్రముఖ వానర, భల్లూక వీరులతో రక్షింపబడెడి ఆ సేన మేఘావృత మైన ఆకాశంవలె ఉంది. యుద్ధభూమి యందు శత్రువులను మట్టికరిపించ డానికై ఆరాటపడుతున్న ఆ వానర సేనలోని యోధులు, పర్వత శిఖరాలను, మహా వృక్షాలను చేతబట్టి లంకను ముట్టడించారు. వారంతా లంకను నుగ్గునుగ్గు చేస్తాము అని దృఢ నిశ్చయులై ఉన్నారు.

## డెబ్బది తొమ్మిదవ అధ్యాయము

జవాబులు : 1.1. దర్భశయ్యపై 2.3. బ్రహ్మాస్త్రము

3. సేతుబంధనం ద్వారా

# యుద్ధ కాండము

## 25, 26, 27, 28, 29 సర్గలు

## ఎనుబదియవ అధ్యాయము

1. ప్రశ్న : శ్రీరాముడు తన సేనతో గూడి లంకనుచేరి యుండగా రావణుడు శత్రుసేన బలాబలాలను తెలిసికొని రమ్మని ఎవరిని పంపించాడు ?

జవాబు : 1. ప్రహస్తుని 2. వజ్రదంష్ట్రుని 3. నికుంభుని 4. శుకసారణులను

2. ప్రశ్న : తన దూతలు తిరిగివచ్చి చెప్పిన మాటలువిని రావణుడు శుకసారణులతో గూడి రాముడి సేనను చూడగోరి ఎచటికి చేరాడు ?

జవాబు : 1. పర్వతాగ్రంపై 2. తన భవనంపైకి 3. లంకానగరం వెలుపలికి 4. అశోకవనంలోకి

3. ప్రశ్న : రాముని సేనను చూపిస్తూన్న శుకసారణులలోని సారణుడు రావణునికి భల్లూక వీరుల గురించి తెలుపుతూ ముఖ్యంగా ఎవరి గురించి ప్రస్తుతించాడు.

జవాబు : జవాబుల కాలంలో ఉన్నది.

4. ప్రశ్న : వానర సేన గురించి రావణునికి తెలుపుతూ శుకుడు హనుమదాదుల బలపరాక్రమాల గురించి ఏ రీతిగా తెలిపారు ?

జవాబు : రావణుడు తన భవనంపై నుండి వానర సేనను చూస్తుండగా, శుకుడు తాను కామరూపిగా వెళ్ళి తెలిసికొని వచ్చిన విషయాలను ఆ రాక్షస ప్రభువుకు తెలుపుతూ ప్రభూ! శత్రుపక్ష మందలి మహావీరులను ఒక్కసారి చూడు. వారు మదపుటేనుగుల వలె మహా బలవంతులు. యుద్ధంలో దేవతలవలె పరాక్రమించగలరు. కావున వారిని ఎదుర్కోవడం అసాధ్యం. వీరంతా సుగ్రీవుని అనుచరులు. దేవ గంధర్వుల అంశలలో జన్మించారు. అదిగో ప్రభూ! అచట నిలబడియున్న ఇద్దరు యువకులు మైందుడు, ద్వివిదుడు. వారు దివ్యమైన స్వరూపాలు గలిగిన వారు. రాజా! నేను బాగా విచారించగా తెలిసిన విషయం హనుమంతునికి మించిన బలవంతుడు గాని అతనికి మించిన శరీరాకృతిగాని, మాట నేర్పరితనం గాని మరెవ్వరికీ లేదు. అతడు మరెవ్వరి సహాయం లేకుండా లంకానగరాన్ని నాశనం

చెయ్యాలను కొంటున్నాడు. ప్రభూ హనుమంతుని సమీపాన శ్యామ వర్ణంలో నున్న మహాశూరుడే శ్రీరాముడు. ఈయన ధర్మాన్ని ఎన్నడూ అతిక్రమించడు. బ్రహ్మాస్త్రం ప్రయోగ ఉపసంహారాలలో సమర్థుడు. వేదవిద్య నేర్చినవాడు. ఆయనకు కుడి ప్రక్కన ఉన్నవాడు రాముని తమ్ముడు లక్ష్మణుడు. ఈతడు శ్రీరామునికి కుడి భుజంగా ఉంటాడు. ఆయనకు ఎడమవైపున ఉన్నవాడే మీ తమ్ముడు విభీషణుడు. విభీషణునకు శ్రీరామునకు మధ్యలో ఉన్నవాడు సుగ్రీవుడు. వీరందరూ లంకపైకి యుద్ధోత్సాహంతో ఉవ్విళ్ళూరు తున్నారు. అని శుకుడు తన ప్రభువైన రావణునితో తెలిపాడు.

5. ప్రశ్న : శుకసారణులను రావణుడు ఏ విధంగా మందలించాడు ?

జవాబు : శుకసారణులు తెలిపిన విధంగా రావణుడు లంకాభిముఖులై నిలిచియున్న వానర సేనాపతులను, రామాదులను చూసి మనసులో కొంచెం భయపడ్డాడు. శుకసారణులు శత్రువులను ప్రశంసిస్తూ పలికినందుకు కోపగించి వారిని మందలించాడు. వారు భయంతో తలవంచుకొని, చేతులు కట్టుకొని నిలబడ్డారు. శుకసారణులారా! రాజు నిగ్రహానుగ్రహ సమర్థుడు. అతని దయకు పాత్రులై యుండే మంత్రులు గాని, మరెవ్వరైనా, ఆయనకు అప్రియమైన మాటలు మాట్లాడ కూడదు. మనపైకి యుద్ధానికి వస్తున్న శత్రుపక్షం వారిని మీరిట్లు ప్రస్తుతి చేయడం సమంజసమా? మీకు రాజనీతి శాస్త్రాల గురించి తెలుసు. అయినా మీరిట్లు మాట్లడారంటే, మీలోని అజ్ఞానమే ఇందుకు కారణం. ఇటువంటి మూర్ఖులైన మంత్రులతో రాజ్యమేలు తున్నానంటే అది నా గొప్పదనం. రాజు అయినవాడు నిగ్రహానుగ్రహ సమర్థుడు. నేనిప్పుడు మిమ్ములను శిక్షించకుండా వదలి వేస్తున్నానంటే అందుకు కారణం, ఇదివరలో మీరు చేసిన ఉపకారాల వలన నా కోపం తగ్గింది. అని రావణుడిట్లు పలుకగా శుకసారణులు సిగ్గుతో తలలు వంచుకొని ''రావణునకు జయముగు గాక'' అని అచటి నుండి వెళ్లిపోయారు.

## ఎనుబదియవ అధ్యాయము

జవాబులు : 1.4. శుకసారణులను 2.2. తనభవనంపైకి
3. జాంబవంతుని

# యుద్ధ కాండము

## 30, 31, 32, 33, 34 సర్గలు

## ఎనుబది ఒకటవ అధ్యాయము

1. ప్రశ్న : శుకసారణుల అనంతరం రావణుడు ఎవరిని గూఢచారులుగా పంపి, శ్రీరాముని బలగాల గురించి తెలిసికొని రమ్మని పంపించాడు ?

జవాబు : 1. వజ్రదంష్ట్రుని 2. ఇంద్రజిత్తుని
3. శార్దూలాదులను 4. ప్రహస్తుని

2. ప్రశ్న : రావణుడు సీతాదేవిని భయపెట్టి, మోసగించి జయంచాలని, శ్రీరాముని శిరస్సును సృజించమని ఎవరిని పురమాయించాడు ?

జవాబు : 1. విద్యుజ్జిహ్వుడిని 2. శార్దూలుడిని
3. ప్రహస్తుని 4. అక్షకుమారుడిని

3. ప్రశ్న : మాయానిర్మితమైన శ్రీరాముని శిరస్సును చూపి రావణుడు సీతాదేవిని నీవు నా స్వాధీనవు కమ్మని అడుగు తూండగా, ద్వారపాలకుడు వచ్చి రావణునితో ఎవరు తన దర్శనార్థమై వచ్చియున్నాడు అని తెలిపాడు ?

జవాబు : జవాబుల కాలంలో ఉన్నది.

4. ప్రశ్న : మాయా నిర్మితమైన శ్రీరాముని శిరస్సును చూసి పరితపిస్తున్న సీతాదేవిని ఎవరు ఏ విధంగా ఊరడించారు ?

జవాబు : రావణుడు సీతాదేవిని రక్షించడానికై ఏర్పరచిన రాక్షస స్త్రీలలో ''సరమ'' అనే రాక్షస స్త్రీకూడా ఉంది. ఆమె విభీషణుని భార్య. ఆమె దయగలది. రావణుడు పన్నిన మాయకులోనై భ్రమపడి పరితపిస్తున్న సీతాదేవి కడకు సరమ వచ్చింది. స్పృహలేని స్థితిలోనున్న సీతాదేవిని ఓదార్చింది. లోగడ తనకు సీతాదేవితో ఉన్నమైత్రి కారణంగా, చొరవ జూపి, అమ్మా! సీతాదేవి! ఊరడిల్లు, ధైర్యంగా ఉండు. రావణుడు నీతో మాట్లడిన మాటలు నేను చెట్టుచాటున ఉండి విన్నాను. నాకు ప్రాణలపై తీపిలేదు. నేను బయట ఎవరికీ కనబడకుండా ఉండి వారి విషయాలను తెలిసికొని వచ్చాను. నీకు చూపించిన శ్రీరాముని శిరస్సు రావణుని మాయా నిర్మితము. ఆ రాక్షసరాజు నీపై తన మాయను ప్రయోగించాడు. అమ్మా! శ్రీరాముడు ఇప్పుడు వానర సేనతో గూడి వారధి ద్వారా సముద్రాన్ని దాటాడు. శ్రీరాముడు బలపరాక్రమ సంపన్నులైన వానరుల రక్షణలోనూ, విభీషణుని, లక్ష్మణుని రక్షణలోనూ ఉన్నాడు. వారి కాపలా పరిధిలో ఉన్న

రాముని కన్నెత్తి చూడడానికి కూడా ఎవరికీ సాధ్యం కాదు. రావణుడు మ్రోగింపజేసే యుద్ధభేరీలు విన్నావుకదా! శ్రీరాముని చంపడమే నిజమైతే, రావణునికి ఈ యుద్ధ ప్రయత్నా లెందుకు. ఓ సీతా! రాక్షసులకు భయం పట్టుకుంది. త్వరలోనే నీవు శుభవార్తను వింటావు. అని సరమ సీతాదేవిని ఊరడించింది.

5. ప్రశ్న : సీతాదేవి కోరిక మేరకు సరమ ఆ జానకీదేవికి ఏఏ విశేషాలను తెలియ జేసింది?

జవాబు : కడు సమర్థురాలైన సరమతో సీతాదేవి సఖీ నీవు నాకు మేలు చేయాలని గట్టిగా నిశ్చయించు కొంటే, నీవు రావణుని వద్దకు వెళ్ళి అతడేమి చేస్తున్నాడో తెలిసికొని వచ్చి నాకు తెలపాలి. ఆ మాయావి వలన నాకు ఎప్పుడేమి జరుగుతుందో నన్న భయసందేహాలతో నా మనసుకు స్వస్థత లేకుండా ఉంది. అతని వలన నేనిక్కడ భయంతో గడగడ వణకి పోతున్నాను. అని పలికిన సీతాదేవితో సరమ అమ్మా! నేనిప్పుడే బయలుదేరు తున్నాను. అచట శత్రువుల యొక్క ప్రయత్నాలను, ఆలోచనలను పూర్తిగా తెలిసికొని వస్తాను అని పలికి సరమ వెంటనే రావణుని సమీపానికి వెళ్ళింది. రావణుడు తన మంత్రులతో మాట్లడుతూండగా ఒక స్థంభం చాటున ఉండి, అతని రహస్యా లోచనలను గ్రహించింది. వెంటనే సీతాదేవి కడకు వెళ్ళి వైదేహీ! రావణుని తల్లియైన కైకసియు, లంకాధిపతికి చాలా దగ్గర బంధువు, వృద్ధ మంత్రియు అయిన 'అవిద్ధుడు' అను నాతడును, సీతాదేవిని శ్రీరామునకు అప్పగించమని సుధీర్ఘంగా హితవు చెప్పారు. వారు దండకారణ్యంలో సంఘటనను బట్టి రాముని పరాక్రమాన్ని, అపారమైన సముద్రాన్ని దాటి, అశోకవనంలో నున్న సీతాదేవిని దర్శించి, యుద్ధంలో అనేక మంది రాక్షసులను హనుమంతుడు సంహరించడాన్ని ఉదాహరణగా చూపి, ఆ రాక్షస రాజును అనేక విధాల నచ్చజెప్ప జూశారు. కాని లోభియైన రావణుడు నిన్ను విడుచుట కిష్టపడడం లేదు. అతడు శ్రీరాముని తీవ్రమైన బాణాల ధాటికి యుద్ధ భూమిలో పడిపోయిననాడే నిన్ను శ్రీరాముడు సురక్షితంగా అయోధ్యకు తీసికొని పోగలడు. అని సరమ సీతాదేవికి రావణాంతః పురంలో తాను చూసిన విశేషాలను తెలియజెప్పింది.

## ఎనుబది ఒకటవ అధ్యాయము

జవాబులు : 1.3. శార్దూలాదులను 2.1. విధ్యుజ్జిహ్వుడు
3. ప్రహస్తుడు

# యుద్ధ కాండము

## 35, 36, 37, 38, 39 సర్గలు

## ఎనుబది రెండవ అధ్యాయము

1. ప్రశ్న : రావణుడు తన మంత్రులతో కొలువుదీరి యుండగా, ఓ రాజా! బలవంతుడైన శ్రీరామునితో సంధి చేసుకోవడమే మేలు అని నాకనిపిస్తూంది అని రావణునికి హితోపదేశం చేసిన, రావణుని దగ్గరి బంధువు ఎవరు ?

జవాబు : 1. ప్రహస్తుడు 2. మాల్యవంతుడు
3. ఇంద్రజిత్తు 4. వజ్రదంష్ట్రుడు

2. ప్రశ్న : రావణుడు తన హితాన్ని కోరి చెప్పిన ఎవరి మాటలను లెక్కించక, యుద్ధానికే సిద్ధపడి మొదటగా తూర్పు ద్వారంకడ ఎవరిని రక్షణ కొరకై నియమించాడు ?

జవాబు : 1. విద్యుజ్జిహ్వుడు 2. ఇంద్రజిత్తును
3. ప్రహస్తుని 4. మాల్యవంతుని

3. ప్రశ్న : విభీషణుని సలహా ప్రకారం శ్రీరాముడు లంకను ముట్టడించ డానికై తూర్పు ద్వారంకడ ఎవరిని నిలిచి ఉండి అక్కడి వారిని ఎదుర్కొనమని చెప్పాడు ?

జవాబు : జవాబుల కాలంలో ఉన్నది.

4. ప్రశ్న : లంకను ఛేధించడానికై శ్రీరాముడు వ్యూహరచన చేసిన నాటి రాత్రికి వారంతా ఎచట ఏ విధంగా గడిపారు ?

జవాబు : లంకను జయించడానికై శ్రీరాముడు ఎవరు ఏ ద్వారముకడ ఎదుర్కొవాలో నిర్ణయించి చెప్పి, విభీషణునితో వానరులు కామ రూపులు. అయినప్పటికి వారు యుద్ధ సమయాలలో మానవరూపాలు ధరించ కూడదు. మనం చేయబోయె యుద్ధంలో వానర బలములే మనకు గుర్తుగా ఉండగలవు. మన పక్షం వారిని గుర్తించడానికి ఇదియే మనకు కొండగుర్తు. ఇక యుద్ధ సమయంలో నేను, లక్ష్మణుడు

నా మిత్రుడవైన నీవు, నీ అనుచరులు నలుగురు మొత్తం ఏడుగురము మాత్రమే మానవ రూపాలలో ఉంటాము. అని శ్రీరాముడు తన వారందరిని ఉద్దేశించి విభీషణునితో పలికాడు. పిమ్మట శ్రీరాముడు సుగ్రీవ, విభీషణులతో, లక్ష్మణ సహితుడై తన వారందరితో గూడి మిత్రులారా! ఇప్పుడు మన మందరం మనోహరమైన ఈ సువేల పర్వతము అనేక గైరికాది ధాతువులతో నిండి ఉంది. మన మందరం ఈ పర్వతము మీదికిచేరి, ఈ రాత్రిని అచటనే గడుపుదాము. అని తన వారందిరితో గూడి శ్రీరాముడు సువేల పర్వతంపైకి చేరి ఆ రాత్రికి హాయిగా గడిపాడు.

5. ప్రశ్న : సువేల పర్వతంపై నుండి రామాదులు లంకను ఏ విధంగా తిలకించారు ?

జవాబు : శ్రీరామునితో గూడిన వానరసేన అంతా ఆ రాత్రికి సువేలపర్వతంపై హాయిగా గడిపారు. అటు పిమ్మట వారంతా త్రికూట పర్వతంపై నున్న లంకానగర అందాలను ఆస్వాదించారు. అందలి వనాలను, ఉపవనాలను, మిట్టపల్లాలు లేని సమతల ప్రదేశాలను దర్శించారు. త్రికూట పర్వతానికి, సువేల పర్వతానికి మధ్యలో నున్న అనేక సుందర ప్రదేశాలను రకరకాలైన చెట్లతోనూ, పూలచెట్లతోనూ, దివ్య వృక్షాలతోనూ, వాటికి అల్లుకున్న వివిధ రకాలైన తీగలతోనూ, చెట్ల పైభాగాన వికసించిన పూలతోనూ ఉన్న దృశ్యాలు చూడ ముచ్చటగా ఉన్నాయి. ఇట్లు సుశోభితమైన లంక ఇంద్రుని అమరావతి వలె విరాజిల్లటాన్ని చూసి వారంతా ఆశ్చర్యపోయారు. ఆ లంక యందలి రాజ్యప్రాసాదం వేయి స్థంభాలతో నిర్మించబడి, ఆకాశాన్ని తాకుతూ కైలాస శిఖరంవలె ఉంది. ఆ భవనం లంకా నగరానికే అలంకారంగా ఉంది. అద్భుతమైన అడవులతో నున్న ఆ లంకా నగరం, వివిధా కారాలుగల రాక్షసులకు నివాస స్థానము. ధనధాన్యాది. సర్వ సంపదలతో తుల తూగుతూన్న ఆ రావణ లంకానగరాన్ని మహా తేజస్వియైన శ్రీరాముడు తన వారందరితో గూడి తిలకించి ఆశ్చర్యపోయాడు.

## ఎనుబది రెండవ అధ్యాయము

జవాబులు : 1.2. మాల్యవంతుడు 2.3. ప్రహస్తుని

3. నీలుని

# యుద్ధ కాండము

## 40, 41, 42, 43, 44 సర్గలు

## ఎనుబది మూడవ అధ్యాయము

1. ప్రశ్న : రావణ సుగ్రీవుల యుద్ధంలో రావణుడుచేయ బూనుకున్న ఏ ప్రయోగాన్ని గమనించి సుగ్రీవుడు వెళ్ళిపోయాడు ?

జవాబు : 1. బ్రహ్మాస్త్రం 2. వారుణాస్త్రం
3. మాయాశక్తిని 4. ఆగ్నేయాస్త్రం

2. ప్రశ్న : శ్రీరాముడు లంకానగరాన్ని నలువైపులా ముట్టడించి, యుద్ధనీతి ననుసరించి రావణుని కడకు ఎవరిని రాయభారిగా పంపించినాడు ?

జవాబు : 1. జాంబవంతుని 2. అంగదుని
3. సుగ్రీవుని 4. విభీషణుని

3. ప్రశ్న : శ్రీరాముడు లంకను నలువైపులా ముట్టడించిన విషయం తన భటుల ద్వారా తెలుసుకొన్న రావణుడు ఆ దృశ్యాన్ని ఎక్కడకు వెళ్ళి పరిశీలించి చూశాడు ?

జవాబు : జవాబుల కాలంలో ఉన్నది.

4. ప్రశ్న : వానర రాక్షసుల మధ్య తొలినాటి యుద్ధం ఏ విధంగా జరిగింది?

జవాబు : వానర రాక్షస యోధుల నడుమ ఘోరసంగ్రామం జరుగు చుండడం వల్ల, రెండు పక్షాల వీరులు ధారుణమైన కోపావేశానికి లోనయ్యారు. క్రూరులైన రాక్షస వీరులు రావణునికి జయాన్ని కోరుతూ, బంగారు ఆభరణాలతో అలంకరింప బడిన, గుర్రాలతోనూ, ఏనుగులతోనూ, రథాలతోనూ ధ్వజాలతోనూ, కవచాలతోనూ, దిక్కులదిరే విధంగా యుద్ధనాదాలు చేశారు. వానరుల యొక్క అపారమైన సేన జయేచ్ఛతో, కామరూపులైన రాక్షసుల మీదికి పరుగులు తీసింది. అప్పుడా వానర రాక్షసుల మధ్య ద్వంద యుద్ధం చెలరేగింది. ఆ సమయంలో వానర రాక్షసులు ఎవరికి తగిన వీరులతో వారు పోరాడుతున్నారు. రాక్షసులు వారివారి ఆయుధాలతోనూ, వానరులు వాడియైన గోళ్ళతోనూ, పండ్లతోనూ, చెట్లతోనూ యుద్ధం చేయసాగారు. ఈ విధంగా వానర రాక్షస వీరులకు జరిగిన ద్వంద్వ యుద్ధంలో, దేవదానవ సంగ్రామంలో వలె, వానరుల దెబ్బకు రాక్షసులు మట్టి కరిచారు. పోరు ఘోరంగా జరిగిన ఆ యుద్ధంలో ఖడ్గాలు, గదలు, బల్లేలు, ఇనుప గుదియలు,

అడ్డకత్తులు, రణభూమిలో పడిపోయాయి. ముక్కలై పడిపోయిన రథాలు, చచ్చిపడిపోయిన గుర్రాలు, ఏనుగులు, వానరుల యొక్క, రాక్షసుల యొక్క కళేబరాలు, రథ చక్రాలు, ఇరుసులు, కాడిమ్రానులు, అంతటా చెల్లా చెదురుగా కనబడుతున్నాయి. శవాలను పీక్కు తినడానికై నక్కలు గుంపులు గుంపులుగా చేరాయి. ఆ స్థితిలో సూర్యాస్తమయం తరువాత రాక్షసులకు బలం పెరుగుతుందన్న ఆశతో రాక్షసులు ఆ సమయం కోసం నిరీక్షించసాగారు.

5. ప్రశ్న : వానర రాక్షస వీరుల రాత్రివేళ యుద్ధం ఏవిధంగా జరిగింది ?

జవాబు : వానర రాక్షసులు యుద్ధం చేస్తుండగా సూర్యుడస్తమించి చీకట్లు కమ్ముకున్నాయి. అయినా యుద్ధం ఆపకుండా రాక్షస, వానర వీరులు పరస్పరం ఎవరికి వారు తామే జయించాలన్న పట్టుదలతో ఉన్నారు. ఆ చీకట్లలో రాక్షసులు వానరులపై బడి వారిని చంపి బక్షించసాగారు. అప్పుడు వానరులు కూడా తగ్గకుండా తమ దంతాలతో రాక్షసులను చీల్చి చెండాడ సాగారు. వీరావేశంతో రాక్షసులను క్షోబకు గురి చేయసాగారు. అప్పుడు రామ లక్ష్మణులు కనిపించిన రాక్షసులను, కనిపించని వారిని కూడా తమ బాణాలతో చంపసాగారు. ఆ ఘోర సంగ్రామ ప్రదేశంలో భయంకరంగా రక్తపుటేరులు ప్రవహించాయి. తీవ్రంగా గాయపడి గగ్గోలు పెడుతున్న రాక్షసుల అరుపులను, రక్తసిక్తమైన వానరుల యొక్క ఆర్తనాదాలును అచట ఎంతో దారుణంగా వినిపించ సాగాయి. అంగదుడు తనకు ప్రతి వీరుడైన ఇంద్రజిత్తును, చంపడానికై యుద్ధ రంగంలో వీరవిహారం చేశాడు. అతని ధాటికి ఇంద్రజిత్తు గాయపడ్డాడు. రథాశ్వాలు మృతి చెందాయి. సారథి నేలకూలాడు. అప్పుడా ఇంద్రజిత్తు చేసేదిలేక రథాన్నివీడి కనబడకుండా పోయాడు. అంగదుని రణ కౌశలాన్ని రామ లక్ష్మణులు మెచ్చుకొన్నారు. అంగదుని చేతిలో పరాభవింపబడిన ఇంద్రజిత్తు బ్రహ్మదేవుడిచ్చిన వరప్రభావంతో అంతర్ధాన విద్యతో ఎవరికీ కనబడకుండా యుద్ధం చేయసాగాడు. కోపంతో ఇంద్రజిత్తు రామ లక్ష్మణులపై నాగాస్త్రాన్ని ప్రయోగించాడు. దాని వలన వారిద్దరి శరీరాలు గాయపడి, ఆ నాగాస్త్రంతో బంధింపబడి మూర్ఛిల్లారు. ఆ స్థితిలోఉన్న రామ లక్ష్మణులను వానర ప్రముఖులు చూశారు. ఆ విధంగా ఆనాటి రాత్రి యుద్ధం జరిగింది.

## ఎనుబది మూడవ అధ్యాయము

జవాబులు : 1.3. మాయాశక్తిని  2.2. అంగదుని

3. తనభవనంపై నుండి

# యుద్ధ కాండము

## 45, 46, 47, 48, 49 సర్గలు

## ఎనుబది నాలుగవ అధ్యాయము

1. ప్రశ్న : రామ లక్ష్మణులు నాగాస్త్ర బంధితులై ఉండడాన్ని చూసి సుగ్రీవుడు భయపడు తూండగా ఆయనను ఓదార్చినది ఎవరు ?

జవాబు : 1. అంగదుడు 2. జాంబవంతుడు
3. హనుమంతుడు 4. విభీషణుడు

2. ప్రశ్న : రామ లక్ష్మణులు తనచేత చంపబడ్డారని ఇంద్రజిత్తు పరమానందంతో లంకకు చేరి ముందుగా ఎవరికి చెప్పాడు ?

జవాబు : 1. ప్రహస్తుడికి 2. రావణుడికి
3. వజ్రదంష్ట్రుడికి 4. మండోదరికి

3. ప్రశ్న : నాగాస్త్ర బంధితులైన రామ లక్ష్మణులను రావణాజ్ఞ ప్రకారం సీతాదేవికి రాక్షస స్త్రీలు చూపించగా అంతులేని శోకంతో బాధపడుతున్న ఆమెను ఓదార్చింది ఎవరు?

జవాబు : జవాబుల కాలంలో ఉన్నది.

4. ప్రశ్న : రామ లక్ష్మణులు నాగాస్త్ర బంధితులైన విధానాన్ని చూసిన సీతాదేవిని కాపలాగా ఉన్న రాక్షస స్త్రీలలో ఎవరు ? ఏ విధంగా ఓదార్చారు ?

జవాబు : రణభూమిలో నాగాస్త్ర బంధితులైన ఉన్న రామ లక్ష్మణులను రావణుని ఆదేశానుసారం సీతాదేవిని రాక్షస స్త్రీలు పుష్పక విమానంపై తీసికొని వచ్చి చూపించారు. ఆ దృశ్యాన్ని చూసిన సీతాదేవి రామ లక్ష్మణులు మరణించినారని అంతులేని శోకంతో విలపించ సాగింది. నా శరీరంలోని కాళ్ళు చేతలు, ఇతర అవయవ నిర్మాణాలను బట్టి, ఇట్టి శుభలక్షణ సంపన్నయైన స్త్రీ తన భర్తతోగూడి పట్టాభిషిక్తు

రాలవుతుంది. అని దైవజ్ఞులు చెప్పిన మాట వృధా అవుతుందా? అని అమితంగా పరితపిస్తున్న జానకీ దేవిని, తనకు కాపలాగా ఉన్న రాక్షస స్త్రీలలోని త్రిజట అనునామె సీతాదేవిని ఓదార్చుతూ, దేవీ! నీవు దుఃఖించవలసిన పని లేదు. నీ భర్త జీవించియే ఉన్నాడు. రామ లక్ష్మణు లిరువురూ ప్రాణాలతోనే ఉన్నారు. లేకున్న ఓ వైదేహీ! భర్తను కోల్పోయిన స్త్రీని ఈ దివ్య విమానం తీసికొని రాదు. దేవీ! ఇంకనూ నా స్వప్న వృత్తాంతాన్ని బట్టి రామ లక్ష్మణులు మరణించడం అసంభవం. కనుక నీవు శోకించడం, పిచ్చిపిచ్చిగా ఆలోచించడం మానుకో. అని త్రిజట చెప్పిన అమృత తుల్యమైన మాటలను విని సీతాదేవి కృతజ్ఞతతో అంజలి ఘటించి త్రిజటా! నీవు చెప్పిన మాటలు నిజమగు గాక! అన్నది. అటు పిమ్మట దీనురాలైన జానకీదేవి త్రిజట మొదలైన రాక్షస స్త్రీలతోగూడి పుష్పక విమానంలో అశోక వనం చేరింది. పిమ్మట ఆమె తన మనస్సులో రామ లక్ష్మణులను గూర్చియే ఆలోచిస్తూ తీవ్రమైన విషాదానికి లోనయ్యింది.

5. ప్రశ్న : నాగాస్త్ర బంధితుడైన శ్రీరాముడు స్పృహలోకి వచ్చిన పిమ్మట ఆయన ఏమని తలపోశాడు ?

జవాబు : రామ లక్ష్మణులు భయంకరమైన నాగపాశాలతో బంధితులై నిట్టూర్పులు విడుస్తున్నారు. సుగ్రీవాది వానర శ్రేష్ఠులు వారిరువురి చుట్టూచేరి శోకిస్తున్నారు. మహా పరాక్రమ శాలియైన శ్రీరాముడు నాగపాశబద్ధుడై నప్పటికి ధీరుడు, బలశాలి, దృఢమైన శరీర స్రౌష్టవం కలిగినవాడు కావటం వలన కొంతసేపటికి స్పృహలోకి వచ్చి కండ్లు తెరచి చూశాడు. అప్పుడాయనకు గాయాలపాలై నెత్తురోడుతున్న లక్ష్మణుడు కనిపించాడు. ఆయనను చూసి శ్రీరాముడు అయ్యో నా ప్రాణానికి ప్రాణమైన లక్ష్మణుడు యుద్ధంలో పారాజితుడై నేలపై పడియున్నాడే, నేను బ్రతికి యుండగా నా తమ్ముని ఈ స్థితిలో

చూడవలసి వచ్చింది గదా! నేనెవరి కోసం బ్రతకాలి. నాకిక సీత ఎందుకు? నేను బ్రతకడ మెందుకు? నాకు జీవితేచ్ఛ సన్నగిల్లు తున్నది. నేనిక్కడే నా దేహాన్ని త్యజించడం మేలు. నా వలననే గదా! ఇప్పుడీతడికీ పరిస్థితి వచ్చింది. అని ఆలోచిస్తూ శ్రీరాముడు సుగ్రీవుని పిలిచి ఓ కపివరా! సుగ్రీవా! నేను ప్రాణాలను వదలి వేస్తాను. నేను లేనప్పుడు రావణుడు నిన్ను బలహీనునిగా ఎంచి, తరిమికొట్ట గలడు. కనుక నీవు వెంటనే ఇచటి నుండి కిష్కింధకు మరలివెళ్ళు. నీ నీ అనుచరులు ప్రాణాలకు తెగించి నా కొరకు పోరాడారు. అందుకు నేను సంతుష్టుడను. సుగ్రీవా! మానవు లెవరైనా విధి నిర్ణయాన్ని దాటలేరు. నీవు నాకు చేయవలసింది అంతా చేశావు. ఈ వానర యోధులంతా కలిసి నాపై అభిమానంతో ఇప్పటి వరకు అద్భుతంగా యుద్ధం చేశారు. ఇక మీరు మీ ఇష్టానుసారం మీమీ ప్రదేశాలకు వెళ్ళవచ్చు. అని మాట్లాడుతున్న శ్రీరాముని పలుకులు విన్న వానరులంతా దుఃఖంతో ఎర్రబారిన కనుల నుండి అశ్రువులను రాల్చారు. అనంతరం విభీషణుడు గదాపాణియై అచటికి వచ్చి శ్రీరాముని చూశాడు.

## ఎనుబది నాలుగవ అధ్యాయము

జవాబులు : 1.4. విభీషణుడు 2.2. రావణుడికి

3. త్రిజట

# యుద్ధ కాండము

## 50, 51, 52, 53, 54 సర్గలు

## ఎనుబది ఐదవ అధ్యాయము

1. ప్రశ్న : రామ లక్ష్మణులు నాగాస్త్ర బంధనాల నుండి విముక్తం కావడానికి కారణం ఎవరు ?

జవాబు : 1. జాంబవంతుడు 2. హనుమంతుడు
3. విభీషణుడు 4. గరుత్మంతుడు

2. ప్రశ్న : నాగాస్త్ర బంధనాల నుండి విముక్తమైన రామ లక్ష్మణులు, మునుపటి కంటె తేజోవంతులైన విషయాన్ని తెలిసికొన్న రావణుడు యుద్ధభూమికి ముందుగా ఎవరిని పంపాడు ?

జవాబు : 1. ఇంద్రజిత్తును 2. ధూమ్రాక్షుని
3. నికుంభుని 4. ప్రజంఘుని

3. ప్రశ్న : ధూమ్రాక్షుడు అను రాక్షసుడు ఎవరి చేతిలో మరణించాడు ?

జవాబు : జవాబుల కాలంలో ఉన్నది.

4. ప్రశ్న : అంగదుడు యుద్ధభూమికి వచ్చిన వజ్రదంష్ట్రుని ఏ విధంగా ఎదుర్కొన్నాడు ?

జవాబు : ధూమ్రాక్షుడు యుద్ధ భూమిలో పడిపోయిన విషయం తెలిసికొన్న రావణుడు, మహాబలశాలి, శూరుడు మాయావి అయిన వజ్రదంష్ట్రుని పిలిచి ఓ వీరుడా! నీవు తగినంత రాక్షస సేనతో రణభూమికి వెళ్ళి, అచట రామ లక్ష్మణులను, సుగ్రీవుని ఇతర వానరవీరులను సంహరించి రమ్ము, అని పలికి సమర భూమికి పంపించాడు. కర్రలు, చిన్నచిన్న ఈటెలు, చిత్రములైన శూలాలు, రోకలి బండలు, బల్లెములు, పాశములు, అడ్డకత్తులు, ఖడ్గాలు, చక్రాలు, గదలు, గండ్ర గొడ్డళ్ళు, మొదలైన వివిధాయుధాలు చేతబట్టి కాల్బలముల వారు తమ సేనాపతి వజ్రదంష్ట్రుని అనుసరించి, అంగదుడు నిలిచి యున్న దక్షిణ ద్వారము కడకు వచ్చారు. ఆ సమయంలో రాక్షసులకు

కొన్ని అపశకునాలు కనిపించాయి. అయినా వాటిని లెక్కచెయ్యక వారంతా రణోత్సాహంతో ముందుకు సాగారు. భయంకరా కారులు సాహస వీరులు అయిన వానర వీరులకు, రాక్షస వీరులకు సంకుల సమరం ప్రారంభ మయ్యింది. ఆ యుద్ధంలో ఉభయ పక్షాల మధ్య జరిగినపోరు ఘోరంగా జరగడంచేత ముక్కలైన రథాలతో, పడిపోయిన గుర్రాలతో చిత్ర విచిత్రంగా పడియున్న ధ్వజాలతో, వానర, రాక్షసుల, కళేబరాలతో రణభూమి నిండిపోయింది. అచటి నేల అంతా చనిపోయిన వీరుల రక్తంతో తడిసి పోయింది. సమరయోధుల హాహాకారాలతో ఆ రణభూమి శరత్కాల రాత్రివలె ఉంది. అంగదుడు తిరుగులేని పరాక్రమంతో ఆరాక్షస బలగాలను హడలెత్తించాడు.

5. ప్రశ్న : వజ్రదంష్ట్రుని వధ ఏ విధంగా జరిగింది ?

జవాబు : మహా బలశాలియైన వజ్రదంష్ట్రుడు విలువిద్యలో ఆరితేరినవాడు. వెంటనే అతడు విల్లును ఎక్కుపెట్టి వానర సైన్యంపై బాణవర్షం కురిపించాడు. శూరులైన రాక్షస యోధులు కూడా వివిధాయుధాలతో యుద్ధం చేస్తూనే ఉన్నారు. వానరులలో శ్రేష్టులైన వారంతా మహాశిలలను చేతబట్టి, అన్ని వైపుల నుండి యుద్ధాన్నిచేస్తున్నారు. ఆ సమయంలో రాక్షస వీరులు, కపియోధులపై వేలకొలది ఆయుధాలను ప్రయోగించారు. వానర వీరులు కూడా చెట్ల కొమ్మలతోనూ, రాళ్ళతోనూ రాక్షసుల పైకి విరుచుకు పడుతున్నారు. అందరి దేహాలు రక్తధారలతో నిండి ఉన్నాయి. అచట వానరులు, రాక్షసులు ఆ యుద్ధంలో తగిలిన దెబ్బలకు తాళలేక పడిపోయారు. అచట కళేబరాలను తినడానికై రాబందులు, గ్రద్దలు, కాకులు, నక్కలు గుంపులు గుంపులుగా చేరుతున్నాయి. ఇదంతా చూస్తున్న వజ్రదంష్ట్రునికి కోపం కట్టలు తెంచుకొని, పదునైన బాణాలను వానరులపై వేస్తున్నాడు. అప్పుడు తిరుగులేని పరాక్రమ శాలియైన అంగదుడు ఒక వృక్షాన్ని చేతబట్టి వజ్రదంష్ట్రుని పైకి విసిరాడు. తనపైకి వస్తున్న వృక్షాన్ని వజ్రదంష్ట్రుడు తన బాణాలతో ఛేధించాడు. అదిచూసి అంగదుడు ఒక మహాశిలను చేతబట్టి, వజ్రదంష్ట్రుని పైకి

విసిరాడు. తనపైకి వస్తున్న శిలాతాకిడిని తప్పించు కోవడానికి ఆ రాక్షసుడు గదను చేతబట్టి రథంపై నుండి క్రిందికి దూకాడు. ఆ శిలాదాటికి రథం ధ్వంసమైంది. అప్పుడు అంగదుడు ఇంకొక రాయిని విసిరాడు. అది తగిలి వజ్రదంష్ట్రుడు స్పృహను కోల్పోయాడు. కొంతసేపటికి ఆ రాక్షసుడు తేరుకొని అంగదునిపైకి వచ్చి ముష్టి యుద్ధం చేశాడు. ఆ యుద్ధంలో ఒకరినొకరు మోకాళ్ళతో కుమ్ము కుంటూ, అలసి ఇద్దరూ నేలపై పడిపోయారు. వెంటనే తేరుకొని అంగదుడు వజ్రదంష్ట్రుని చేతనున్న ఖడ్గాన్ని లాగికొని దానితో ఆరాక్షసుని శిరస్సును రెండుగా చీలిపోయేట్లుగా కొట్టాడు. దానితో వజ్రదంష్ట్రుడు అంగదుని చేతిలో మరణించాడు.

## ఎనుబది ఐదవ అధ్యాయము

జవాబులు : 1.4. గరుత్మంతుడు    2.2. ధూమ్రాక్షుని

3. హనుమంతుని

.........

# యుద్ధ కాండము

## 55, 56, 57, 58, 59 సర్గలు

## ఎనుబది ఆరవ అధ్యాయము

1. ప్రశ్న : అంగదుని చేతిలో వజ్రదంష్ట్రుడు మరణించిన పిమ్మట రావణుడు ఎవరి నాయకత్వాన రాక్షస సేనను నడిపించాడు ?

జవాబు : 1. ప్రహస్తుడు    2. అకంపనుడు

3. ధూమ్రాక్షుడు    4. ఇంద్రజిత్తు

2. ప్రశ్న : హనుమంతుని చేతిలో అకంపనుడు మరణించిన పిమ్మట రణరంగాన ఎవరి నాయకత్వాన రాక్షసవీరులు ప్రవేశించారు ?

జవాబు : 1. వజ్రదంష్ట్రుడు    2. రావణుడు

3. ప్రహస్తుడు    4. కుంభకర్ణుడు

3. ప్రశ్న : రావణుని సేనాపతియైన ప్రహస్తుని రణరంగంలో నిలువరించింది ఎవరు ?

జవాబు : జవాబుల కాలంలో ఉన్నది.

4. ప్రశ్న : రాక్షస సేనానాయకుడు ప్రహస్తుడు ఎవరి చేతిలో ఏ విధంగా వధింప బడ్డాడు ?

జవాబు : రణభూమికి ప్రహస్తుడు రావడాన్ని చూసిన శ్రీరాముడు చిరునవ్వుతో విభీషణుని చూసి మహాబాహూ! గొప్ప సైన్యంతో అటు కోపంతో వస్తున్న ఈతడెవరు? అని అడిగాడు. అప్పుడు విభీషణుడు ప్రభూ! ఇతడు లంకాధిపతి రావణుని సర్వసైన్యాధ్యక్షుడు ప్రహస్తుడు. మిగల బలశాలి. శౌర్యవంతుడు. అని చెబుతుండగా ప్రహస్తుడు గర్జిస్తూ వానర సేనవైపు వస్తున్నాడు. రాక్షస సేన వివిధ రకాలైన ఆయుధాలను పట్టి వస్తున్నారు. తమ వైపుగా వస్తున్న రాక్షస సేనను చూసిన వానరసేన కూడా వృక్షాలను, వృక్షశాఖలను, పెద్ద పెద్ద బండరాళ్ళను పట్టుకొని సర్వసన్నద్ధులై ఉన్నారు. ఇరు పక్షాలవారికి సంకుల సమరం ప్రారంభమయ్యింది. రాక్షస యోధులు పెక్కుమంది వానర యోధులను హతమార్చారు. వానర ప్రముఖులు ఆ యుద్ధభూమి యందంతటా రాక్షసులను వృక్షాలతోనూ, పెద్దపెద్ద బండరాళ్ళనూ పిండి పిండి చేస్తున్నారు. అటు పిమ్మట ప్రహస్తుని మంత్రులైన నరాంతకుడు, కుంభహనుడు, మహానాదుడు, సమున్నతుడు అను నలుగురు రాక్షసయోధులు వానరులను చావు దెబ్బతీస్తున్నారు. అదిచూసిన వానర యోధులు, ద్వివిదుడు, జాంబవంతుడు, తారుడు, దుర్ముఖుడు అను వానర యోధులు నలుగురూ వచ్చి ఆరాక్షస యోధుల నలుగురుని చంపారు. అది చూసిన ప్రహస్తుడు ఆగ్రహంతో తన రథ మందుండియే బాణ పరంపరచే వానర యోధులను హతమారుస్తున్నాడు. అది చూసిన నీలుడను వానర యోధుడు ప్రహస్తుని ఎదుర్కొన్నాడు. తన దగ్గరలో ఉన్న ఒక మద్దిచెట్టును పెకలించి నీలుడు ప్రహస్తుని రథాన్ని, అశ్వాలను, రథ సారథిని ధ్వంసం చేశాడు. వెంటనే నీలుడు ప్రహస్తుని చేతిలో నున్న ధనస్సును బలప్రయోగంతో లాగికొని, దానిని ముక్కలుగా విరిచి వేశాడు. ప్రహస్తుడు నేలపైకి దూకాడు. తనపైకి వేగంగా వస్తున్న ప్రహస్తుని

నీలుడు ఒక పెద్ద బండరాయితో తల పగులగొట్టి చంపాడు. ఆ విధంగా ప్రహస్తుడు నీలుని చేతిలో రమణించాడు.

5. ప్రశ్న : మొదటగా రామ రావణ యుద్ధం ఏరీతిగా జరిగింది ?

జవాబు : రాక్షసుల సర్వ సైన్యాధిపతియైన ప్రహస్తుడు వానర యోధుడైన నీలుని చేతిలో మరణించిన విషయాన్ని తెలిసికొన్న రావణుడు మేలుజాతి గుర్రాలను భూన్చిన రథాన్నధిరోహించి రణభూమికి వెళ్ళాడు. తనను అనుసరించి వస్తున్న రాక్షస ప్రముఖుల కొందరిని నగర రక్షణ కొరకై వెనుకకు పంపించాడు. వానర సేన వైపుగా వస్తున్న రావణునిపైకి సుగ్రీవుడు ఒక్క పర్వత శిఖరాన్ని విసిరాడు. రావణుడు తన బాణప్రయోగంతో దాని నుండి తప్పించుకొన్నాడు. పిమ్మట క్రోధావేశంలో రావణుడు వేసిన బాణపు దెబ్బకు సుగ్రీవుడు స్పృహ కోల్పోయి రణభూమి యందు పడిపోయాడు. అంతట వానర యోధులు శ్రీరాముని శరణు వేడారు. వెంటనే రాముడు ధనస్సును చేతబట్టి బయలు దేరుతూండగా లక్ష్మణుడు తాను వెళ్ళి రావణుని అంతమొందిస్తాను అన్నాడు. రాముని అనుమతితో వెళ్ళిన లక్ష్మణుడు కొంతసేపు రావణునితో యుద్ధం చేసి, రావణుడు ప్రయోగించిన శక్తి ఆయుధ ప్రహారానికి స్పృహను కోల్పోయాడు. అంతట హనుమంతుడు కోపంతో రావణుని మీదికి విజృంభించాడు. ఆ మారుతి తన పిడికిలి బిగించి రావణుని వక్షస్థలంపై కొట్టిన దెబ్బకు రావణుడు స్పృహను కోల్పోయాడు. ఆ సమయంలో హనుమంతుడు స్పృహను కోల్పోయి ఉన్న లక్ష్మణుని ఎత్తుకొని శ్రీరాముని వద్దకు తీసికొని వెళ్ళాడు. అప్పుడు రాముడు హనుమంతుని భుజాలపై ఎక్కి కూర్చుని యుద్ధానికి వెళ్ళాడు. కొంతసేపు రావణునితో యుద్ధం చేసిన రాముడు, రావణుడు బాగా అలసి తేజోహీనంగా ఉండడాన్ని చూసి, రావణా! ప్రస్తుతం నీవు బాగా అలసి ఉన్నావు. కనుక నీవింక నగరానికి వెళ్ళి, తిరిగి రేపురా! అప్పుడు నా బల మెంతటిదో తెలిసివస్తుంది. అన్నాడు. రావణుడు శ్రీరాముని మాటల ప్రకారం యుద్ధాన్నిమాని నగరానికి వెళ్ళాడు.

## ఎనుబది ఆరవ అధ్యాయము

జవాబులు : 1.2. అకంపనుడు 2.3. ప్రహస్తుడు

3. నీలుడు

# యుద్ధ కాండము

## 60, 61, 62, 63, 64 సర్గలు

## ఎనుబది ఏడవ అధ్యాయము

1. ప్రశ్న : రావణుడు శ్రీరాముని చేతిలో తనకు జరిగిన అవమానాన్ని, ప్రహస్తుని మృతిని గుర్తుకు తెచ్చుకొని, పిమ్మట యుద్ధంలో ఎవరిని ప్రవేశపెట్టాలని ఆలోచించాడు ?

జవాబు : 1. ఇంద్రజిత్తుని 2. కుంభకర్ణుడుని 3. త్రిశిరుడుని 4. మహోదరుడుని

2. ప్రశ్న : కుంభకర్ణుని రణ ప్రవేశాన్ని చూసి, అతని వృత్తాంతాన్ని శ్రీరాముడు ఎవరిని అడిగాడు ?

జవాబు : 1. ఆంజనేయుడిని 2. సుగ్రీవుడిని 3. విభీషణుడిని 4. జాంబవంతుడిని

3. ప్రశ్న : అతికష్టం మీద నిద్రలేచిన కుంభకర్ణుడు తన అన్నగారైన రావణునితో నీకు ఎవరి వలన భయం ఉంది? అని అడుగగా రావణుడు ఎవరి పేరు చెప్పాడు ?

జవాబు : జవాబుల కాలంలో ఉంది.

4. ప్రశ్న : యుద్ధ రంగంలో ప్రవేశించక ముందు కుంభకర్ణుడు తన అన్నగారైన రావణునితో ఏరీతిగా సంభాషించాడు ?

జవాబు : చాలాకాలం నిద్రలో నుండి లేచిన కుంభకర్ణుడు రావణాంతః పురంలో ప్రవేశించి, నవ్వుచూ ఓ రాజా! ఇదివరలో మేము కొంత మందిమి నీ నిర్ణయంలో ఉన్న దోషాన్ని గురించి ప్రస్తావించి, నీ మేలుకోరి చెప్పిన మాటలు నీవు పెడచెవిని పెట్టావు. దాని ఫలితమే ఈ యుద్ధం, నీవు చేసిన పాపఫలం తొందరగానే అనుభవానికి వచ్చింది. మహారాజా! సీతాపహరణకు ముందే ఈ కార్యము యొక్క మంచి చెడ్డలు ఆలోచించవలసి ఉంది. కాని కేవలం నీ బల గర్వంతోనే దానిని గురించి ఆలోచించలేక పోయావు. ఎంతటి బలగర్వితుడైనా, తాను

చేయబోయే కార్యాన్ని గురించి ముందు వెనుకలు ఆలోచించాలి. అట్లు చేయనప్పుడు ఫలితం అనుభవించ వలసిందే. అని పలికి కుంభకర్ణునితో రావణుడు కుంభకర్ణా! ఇప్పుడా గతాన్ని గురించి ఆలోచించి ప్రయోజనం లేదు. ఇప్పుడు జరుగవలసిన దానిని గురించి ఆలోచించు ప్రస్తుతం ఏమి చేస్తే మనకు మేలు కలుగుతుందో? అది నాకు చెప్పు. జరిగిందేదో జరిగి పోయింది. నేను చేసిన తప్పును నీ సామర్థ్యంచేత చక్కబరచు అని పలికిన రావణునితో కుంభకర్ణుడు మహారాజా! మన సోదరుడు విభీషణుడు చెప్పిన విధంగా సీతాదేవిని రామునకు అప్పగించడం నీకు ఇష్టం లేదు. కాబట్టి ఇక నీవు నిర్విచారంగా ఉండు. రోషాన్ని వదలి, మనసు దిటవు చేసికో. నా బొందిలో ప్రాణముండగా నీవు ఆందోళన చెందవలసిన పనిలేదు. శ్రీరాముని గురించియే గదా నీవు ఆలోచించునది. అతనిని నేను హతమార్చి తీరతాను. ఇక రణరంగంలో నేను శ్రతువుపై పరాక్రమించి, శ్రీరాముని చంపి, అతని శిరస్సును యుద్ధభూమి నుండి తీసికొనివస్తాను. అదిచూసి నీవు సంతోషిస్తావు. అని కుంభకర్ణుడు యుద్ధ సన్నద్ధుడయ్యాడు.

5. ప్రశ్న : ఎటువంటి మాయోపాయాన్ని మహోదరుడు రావణునికి తెలిపాడు ?

జవాబు : కుంభకర్ణుడు రావణునితో నేనొక్కడినే వెళ్ళి రాముణ్ణి చంపుతాను. అని పలికిన పిమ్మట అచటనే ఉన్న మహోదరుడు రావణునితో ప్రభూ! రాముణ్ణి యుద్ధంలో జయించడం కన్న నాకు తెలిసిన ఉపాయ మొకటి చెబుతాను మీకు ఉత్తమ మనిపిస్తే దానిని అనుసరించు. మహారాజా! సీతాదేవిని నీవు కావాలని తెచ్చుకొన్నావు. నీవు కావాలను కొంటే నీ వశమవుతుంది. నా ఉపాయ మేమంటే, నేను కుంభకర్ణుడు, విద్యుజ్జిహ్వుడు, సంహ్రాది, వితర్ధనుడు, అను ఈ ఐదుగురము రాముని వధించడానికై యుద్ధభూమికి వెళ్తాము. రాముణ్ణి మేము జయిస్తే, ఏ ఉపాయమూ అవసరం లేదు. ఒక వేళ రాముడే మమ్మలను జయిస్తే, మేము రాముని బాణాలచే కొట్టబడి, రక్తశిక్తమైన శరీరాలతో వచ్చి నీ పాదాలపైబడి, రామ లక్ష్మణులను మేము చంపి తినివేశాము అని

చెబుతాము. అప్పుడు నీవు లంకా నగరంలో రామ లక్ష్మణులు యుద్ధభూమిలో మరణించారని చాటింపు వేయించు. ఈ విషయం లంకానగర మంతా తెలిసి, సీతాదేవికి కూడా తెలుస్తుంది. అటు పిమ్మట నీవు అశోకవనంలో ప్రవేశించి సీతాదేవిని అనునయ వాక్యాలతో ప్రలోభపెట్టి ఆమెను వశపరచుకోవచ్చు. ఈ విషయం తెలిసికొన్న రాముడు యుద్ధం ఆపుచేయిస్తాడు. ఇక నీవు యుద్ధం చేయవలసిన అవసరం ఉండదు. కనుక మహారాజా! నా బుద్ధికి తోచిన ఉపాయం చెప్పాను. దీని వలన నీకు మేలు కలుగు తుందనిపిస్తే నీవు ప్రయత్నించవచ్చు. అని మహోదరుడు రావణునికి తనకు తోచిన ఉపాయాన్ని తెలిపాడు.

## ఎనుబది ఏడవ అధ్యాయము

జవాబులు : 1.2. కుంభకర్ణుడుని 2.3. విభీషణుడిని

3. శ్రీరాముని వలన

..........

# యుద్ధ కాండము

## 65, 66, 67, 68, 69, 70 సర్గలు

## ఎనుబది ఎనిమిదవ అధ్యాయము

1. ప్రశ్న : రావణానుమతితో యుద్ధభూమికి వెళ్తున్న కుంభకర్ణుడు తన వెంట వస్తున్న రాక్షస సేనతో తాను ముందుగా ఎవరిని చంపుతాను అని చెప్పాడు ?

జవాబు : 1. విభీషణుడు 2. సుగ్రీవుడు

3. శ్రీరాముడు 4. హనుమంతుని

2. ప్రశ్న : రణభూమిలో ప్రవేశించిన కుంభకర్ణుని ఆకారాన్ని, గర్జనలను చూసి భయపడి పారిపోతున్న వానరులను ఎవరు అనునయ వాక్యాలతో నిలువరించారు ?

జవాబు : 1. శ్రీరాముడు 2. నీలుడు
3. విభీషణుడు 4. అంగదుడు

3. ప్రశ్న : సమరరంగాన వీర విహారంచేస్తూ, వానరులను భయ కంపితులను చేస్తున్న కుంభకర్ణుని ఎవరు వధించారు ?

జవాబు : జవాబుల కాలంలో ఉన్నది.

4. ప్రశ్న : కుంభకర్ణుని మరణవార్త విని రావణుడు ఏరీతిగా విలపించాడు ?

జవాబు : శ్రీరాముని చేతిలో కుంభకర్ణుడు మరణించిన వార్తను రాక్షసులు, రావణునికి నివేదించారు. ఆ వార్త విన్న రావణుడు అంతులేని శోకంలో మునిగి స్పృహతప్పి పడిపోయాడు. రావణుని కుమారులైన దేవాంతకుడు, నరాంతకుడు, త్రిశిరుడు, అతికాయుడు అనువారు తమ పిన తండ్రి మరణవార్త విని కొంతసేపు దుఃఖించారు. రావణుడు అయ్యో! కుంభకర్ణా! నీవు మహా బలశాలివి. అనేక మంది శత్రువులను హతమార్చిన వాడవు. మహావీరుడవైన నీవు ఆపదలో నున్న నన్ను ఒడ్డుకు చేర్చక ముందే అందరినీ విడిచి, నీవు ఒంటరిగా వెళ్ళిపోయావా? తమ్ముడూ! నీవు నాకు కుడిభుజం వంటి వాడవు. నీవు నాకు అండగా ఉన్నంతకాలం నేను సురాసురులకు సైతం బయపడి ఎరుగను. నీవిట్లు నేల కూలడంతో నేనుండీ లేనట్లే గదా! మహా వీరుడవైన నీవు ఇంద్రుని వజ్రాయుధపు దెబ్బలకు కూడా భయపడ లేదే! మరి రాముడి చేతిలో ఎట్లు చంపబడ్డావు? ఋషులతో కూడిన దేవతలందరూ, నీవు రణరంగంలో పడిపోవడాన్ని తెలిసికొని పరమ సంతోష పడతారు. తమ్ముడూ! కుంభకర్ణా! ఇంతకు ముందు విభీషణుడు చెప్పిన మంచి మాటలు నా మూర్ఖత్వం చేత పెడచెవిని బెట్టాను. దాని ఫలితం ఇప్పుడు ప్రత్యక్షంగా కనబడుతుంది. అని పరిపరి విధాల రావణుడు నేలపైబడి విలపించ సాగాడు.

5. ప్రశ్న : రావణుని కుమారులైన త్రిశిరుడు, దేవాంతకుడు, మహోదరుడు, మహాపార్శ్వాదులు సమరభూమిలో ఎవరిచేత ఏ విధంగా వధింప బడ్డారు ?

జవాబు : అంతులేని శోకంతో పరితపిస్తున్న రావణుని చూసి అతని కుమారులైన త్రిశిరాదులు నలుగురు తండ్రితో మహారాజా! మహావీరుడైన మా పిన తండ్రి ఇట్లు హతుడు కావడం విధినిర్ణయం. నీ వంటి సత్పురుషులు ఇట్లు విలపించ కూడదు. నీవు ముల్లోకాలను పాలించ సమర్థుడవు. బ్రహ్మదేవుని అనుగ్రహంతో నీవు వివిధాయుధ సంపన్నుడవు. కావున రాముని నీవు అవలీలగా జయించ గలవు. మహారాజా! నీ ఆజ్ఞ అయితే మేము యుద్ధానికి వెళతాము. నీవు నిశ్చింతగా ఉండు. అని పలికిన కుమారుల మాటలకు రావణుడు కొంత ఊరట చెంది, వారిని ఆశీర్వదించి, తన కుమారులకు రక్షణగా తన సోదరులైన మహాపార్శ్వుడు, మహోదరుడు అను వారిని వారి వెంట పంపించాడు. విధి ప్రేరణచేత రావణ కుమారులు త్రిశిరుడు, దేవాంతకుడు, నరాంతకుడు, అతికాయుడును, రావణుని తమ్ములు మహాపార్శ్వుడు, మహోదరుడు మొత్తం ఆరుగురు మహావీరులు రణ భూమికి వెళ్ళారు. వీరంతా ఆకాశము నందు సంచరించగల మాయో పాయములు ఎరిగినవారు. సమరరంగాన వారంతా వానర వీరులతో ఎవరికి తగిన వీరులతో వారు వారి శక్తిమేరకు పోరాడుతూ, నరాంతకుడు అంగదుని ముష్టి ఘాతానికి బలి అయ్యాడు. హనుమంతుని పిడికిలి పోటుకు దేవాంతకుని తల బద్దలై యుద్ధభూమి యందు పడిపోయాడు. నీలుడు విసిరిన శిలాఘాతానికి మహోదరుని తలపగిలి నేలకూలి హతు డయ్యాడు. త్రిశిరుని ఖడ్గాన్ని తాను లాగికొని ఆ ఖడ్గంతో మారుతి త్రిశిరుని శిరస్సును ఖండించాడు. కాగా ఋషభుడను వానర ప్రముఖుని చేతిలో మహాపార్శ్వుడు నేలకూలాడు. ఆ విధంగా రావణ కుమారులు, తమ్ములు వానర ప్రముఖుల చేతిలో హతులయ్యారు.

## ఎనుబది ఎనిమిదవ అధ్యాయము

జవాబులు : 1.3. శ్రీరాముడు 2.4. అంగదుడు

3. శ్రీరాముడు

# యుద్ధ కాండము

## 71, 72, 73, 74, 75 సర్గలు

## ఎనుబది తొమ్మిదవ అధ్యాయము

1. ప్రశ్న : రావణుని కుమారుడైన అతికాయుడు లక్ష్మణునిచే ప్రయోగించబడిన ఏ అస్త్రంచే నేలకూలాడు ?

జవాబు : 1. బ్రహ్మాస్త్రం 2. వారుణాస్త్రం
3. ఆగ్నేయాస్త్రం 4. పాశుపతాస్త్రం

2. ప్రశ్న : రావణుడు తన కుమారులు, తన తమ్ములు కుంభకర్ణాదులు రణభూమికి బలికావడాన్ని జీర్ణించుకోలేక, రాముడు సామాన్యుడుకాడు. ఆయనను ఎవరి అవతారంగా తలపోశాడు ?

జవాబు : 1. బ్రహ్మదేవునిగా 2. పరమశివునిగా
3. ఇంద్రునిగా 4. శ్రీమన్నారాయణునిగా

3. ప్రశ్న : రణ భూమికి తన వారందరూ బలికావడాన్ని తలచుకొని రావణుడు దుఃఖిస్తుండగా ఆయనను ఒదార్చి ఇంద్రజిత్తు యుద్ధ భూమికి వెళుతూ తన రథానికి ఏ జంతువులను పూన్చాడు ?

జవాబు : జవాబుల కాలములో ఉన్నది.

4. ప్రశ్న : రామ లక్ష్మణులు ఎందుకు స్పృహను కోల్పోయారు? హనుమంతుడు సంజీవి పర్వతాన్ని ఏ రీతిగా తీసికొని వచ్చాడు ?

జవాబు : బ్రహ్మదేవుని నుండి వరాలను పొందిన ఇంద్రజిత్తు ఎవరికీ కనబడకుండా ఆకాశము నందుండి ఆయుధాలను ప్రయోగిస్తూ, వానర ప్రముఖు లందరినీ దెబ్బతీశాడు. అటు పిమ్మట రామ లక్ష్మణులపై బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించాడు. అది గమనించిన రాముడు లక్ష్మణునితో తమ్ముడూ, ఈ రాక్షస వీరుడు మనపై బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించాడు. దాని శక్తి ఊహల కందనిది. కావున మనం యుద్ధం నుండి నివృత్తుల మైనట్లుగా పడి ఉందాము అని వారట్లే చేశారు. అది చూసి ఇంద్రజిత్తు రామ లక్ష్మణులతో సహా వానర వీరులందరూ యుద్ధభూమి యందు పడిపోయారని సంతోషించి, లంకానగరానికి వెళ్ళి, తండ్రికి విషయ మంతా చెప్పి సంతోషించాడు. అటు పిమ్మట

యుద్ధ భూమిలో విభీషణునితో జాంబవంతుడు హనుమంతుని పిలిపించి, మారుతీ! నీవు విజృంభించ వలసిన సమయమిదే. నీవు వెంటనే సముద్రము మీదుగా వెళ్ళి, హిమవత్పర్వత ప్రాంతంలో నున్న 'వృషభగిరి' అనే ప్రాంతానికి దగ్గరలో కైలాసగిరి అనే పర్వత ప్రాంతంలో, 'మృతసంజీవని, విశల్య కరణి, సంధానకరణి, సావర్ణ్యకరణి' అనే పేర్లతో ఉన్న నాలుగు ఓషదులను తీసికొని వెంటనే రావాలి. అని హనుమంతుని పంపించాడు. జాంబవంతుని మాటల ప్రకారం మారుతి హిమాలయ ప్రాంతంలో ఉన్న కైలాసగిరిని దర్శించాడు. కాని ఓషదులను గుర్తించలేక, ఆ ఓషదీ పర్వతాన్ని చేతబట్టుకొని వానర సేనల మధ్యలో దిగాడు. ఆ ఓషదుల వాసన తగలగానే కొన ఊపిరితో ఉన్న వానరులంతా రామ లక్ష్మణులు అందరూ నిద్రనుండి లేచిన వారివలే లేచి తేజోవంతులైనారు.

5. ప్రశ్న : సంజీవినీ ఓషదుల కారణంగా తేజోవంతులైన వానర సేనతో సుగ్రీవుడు ఏ విధంగా లంకను ముట్టడించాడు ?

జవాబు : సుగ్రీవుడు ఇంత వరకు జరిగిన విషయాలను ఇక ముందు జరుగవలసిన విశేషాలను శ్రీరామునకు విన్నవించి హనుమంతునితో మారుతీ! కుంభకర్ణుడూ, రావణుని కుమారులు, ఆత్మీయుల మృతికి కృంగిపోయి ఉన్న ఆ రాక్షసరాజు ప్రస్తుత స్థితిలో యుద్ధానికి రాడు. కాబట్టి మన వానర యోధులు కాగడానుబట్టి లంకను కాల్చివేయుదురు గాక! అన్నాడు. సుగ్రీవాజ్ఞ ప్రకారం వానర ప్రముఖులు కాగడాలను చేతబట్టి ఆరాత్రి ప్రధమ యామంలో లంక ద్వారాలకు, రాజ భవనాలకు, రాక్షసుల గృహాలకు నిప్పు పెట్టారు. ఆ అగ్నికి అచటి మహోన్నతములైన మేడలు, అమిత విలువైన వస్తువులు, ధన ధాన్యాలు దహింపబడ్డాయి. అప్పుడు రావణుడు కుంభకర్ణుని కుమారులైన కుంభుని, నికుంభుని యుద్ధానికి పంపుతూ యూపాక్షుని, శోణితాక్షుని, ప్రజంఘుని, కంపనుని వారికి తోడుగా పంపి వానరుల జయించమని రణభూమికి పంపించాడు. వారంతా రాక్షస సేనతో గూడి యుద్ధభూమికి వెళ్ళి, వానర వీరులతో ఘోర యుద్ధం కొనసాగించారు.

## ఎనుబది తొమ్మిదవ అధ్యాయము

జవాబులు : 1.1. బ్రహ్మాస్త్రం 2.4. శ్రీమన్నారాయణునిగా

3. మేలుజాతి గాడిదలను

# యుద్ధ కాండము

## 76, 77, 78, 79, 80, 81 సర్గలు

## తొంబదియవ అధ్యాయము

1. ప్రశ్న : సుగ్రీవాజ్ఞ మేరకు వానర యోధులు లంకను అగ్నికి ఆహుతి చేసిన పిమ్మట జరిగిన పోరులో కంపనుడనే రాక్షస ప్రముఖుడు ఎవరి చేతిలో మరణించాడు ?

జవాబు : 1. హనుమంతుడు 2. మైందుడు
3. ద్వివిదుడు 4. అంగదుడు

2. ప్రశ్న : తన సోదరుడైన కుంభుడు సుగ్రీవుని చేతిలో చనిపోవడాన్ని చూసిన, నికుంభుడు చెలరేగి యుద్ధం చేయసాగాడు. ఈ నికుంభుడు ఎవరి చేతిలో మరణించాడు ?

జవాబు : 1. సుగ్రీవుడు 2. నీలుడు
3. హనుమంతుడు 4. జాంబవంతుడు

3. ప్రశ్న : కుంభనికుంభులు రణభూమికి బలియైన వార్తను విన్న రావణుడు ఎవరిని యుద్ధభూమికి పంపించాడు ?

జవాబు : జవాబుల కాలంలో ఉన్నది.

4. ప్రశ్న : శ్రీరాముడు మకరాక్షుని ఏరీతిగా సంహరించాడు?

జవాబు : ఖరుని కుమారుడైన మకరాక్షుడు రాక్షస సేనతో యుద్ధభూమికి వచ్చి వానర సేనపై విరుచుకు పడ్డాడు. మకరాక్షుడు తన బాణ పరంపరతో వానర వీరులను దెబ్బతీయ సాగాడు. అంతట ఆ కపివీరులు దిగ్భ్రాంతికిలోనై పారిపోసాగారు. అట్లు పారిపోతున్న వానరులను చూచి జయోత్సాహంతో ఉన్న రాక్షసులంతా సంతోషంతో సింహనాదాలు చేశారు. ఆ విధంగా వానర యోధులు చెల్లాచెదురై పోవడాన్ని చూసిన శ్రీరాముడు తన బాణ పరంపరతో రాక్షస యోధులను నిలువరించాడు. శ్రీరాముని ధాటికి తట్టుకోలేక ఆగిపోయిన రాక్షస వీరులను చూసి, మకరాక్షుడు కోపంతో ఊగిపోతూ

ఓ రామా! నీవు నాతో స్వయంగా యుద్ధం చేయడానికి తలపడు. నేను ధనుర్ధారినై నిశితములగు శరములతో నీ ప్రాణాలు తీస్తాను. నీవు ఆ నాడు నా తండ్రిని దండకారణ్యంలో హతమార్చావు. అటు వంటి నీవు ఇప్పుడు నా కంట బడటంతో నాలో రోషం పెల్లుబుకు తూంది. అని ప్రగల్భాలు పలుకుతున్న మకరాక్షునితో రాముడు ఓ రాక్షసా! యుద్ధంలో విజయం ప్రగల్భాలతో సిద్ధించదు. యుద్ధ పటిమ వల్లనే ప్రాప్తిస్తుంది. అని పలికిన శ్రీరామునిపై మకరాక్షుడు తన బాణాలను ప్రయోగించాడు. అంతట రాముడు తన బాణ పరంపర చేతవాటిని చిన్నాభిన్నం చేశాడు. ఆ విధంగా వారిరువురూ కొంతసేపు యుద్ధం చేసిన పిమ్మట, రాముడు కోపంతో ఆ మకరాక్షుని ధనస్సును, రథ సారథిని, రథాన్ని ద్వంసం చేశాడు. చేసేది లేక మకరాక్షుడు నేలపై నిలబడి తన చేతనున్న శూలాన్ని రాముడిపైకి విశిరాడు. శ్రీరాముడు మూడు బాణాలతో దానిని ముక్కలుచేసి, పిమ్మట ఆగ్నేయాస్త్రంతో మకరాక్షుని నేలకూల్చాడు. అది చూసిన వానరులు సంతోషించారు.

5. ప్రశ్న : తండ్రి ఆజ్ఞానువర్తియైన ఇంద్రజిత్తు రణభూమికివెళ్ళి తన మాయోపాయలను ఏ విధంగా ప్రదర్శించాడు ?

జవాబు : మకరాక్షుడు నేలకూలిన వార్తవిని రావణుడు యుద్ధభూమికి ఇంద్రజిత్తును పంపించాడు. ఇంద్రజిత్తు యజ్ఞభూమికి వెళ్ళి, అగ్నిని వ్రేల్చి, నల్లమేకను బలిఇచ్చి, దేవతలను తృప్తిపరచి, అంతర్ధానమయ్యే శక్తిని సంపాదించాడు. పిమ్మట సకల ఆయుధాలను అమర్చిన రథాన్నధిరోహించి రణభూమికి వెళ్ళాడు. వెంటనే అంతర్ధానమై ఎవరికీ కనబడకుండా, ఆకాశం నుండి శరపరంపరను కురిపిస్తున్నాడు. రామ లక్ష్మణులను దెబ్బతీస్తున్నాడు. ఆ బాణపు దెబ్బలకు గురి అవుతూ రామ లక్ష్మణులు ధనస్సులను ఎక్కుపెట్టి దివ్యాస్త్రాలను ప్రయోగించారు. కాని ఆ అస్త్రాలేవీ ఇంద్రజిత్తుపై పనిచేయడం లేదు. ఇంద్రజిత్తు ప్రయోగించే బాణాలకు అనేక మంది వానర ప్రముఖులు నేలకూలుతున్నారు. అప్పుడు లక్ష్మణుడు తన అన్నతో బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగిస్తాను అన్నాడు. అందుకు రాముడు తమ్ముడూ! ఆ అస్త్రప్రయోగం వలన సకల రాక్షస లోకము నశిస్తుంది.

కావున ఒక్క ఇంద్రజిత్తును చంపడానికై అస్త్రాలను ప్రయోగిద్దాము అన్నాడు. ఇంతలో ఇంద్రజిత్తు మాయా సీతను సృష్టించి తీసికొని వచ్చి యుద్ధ భూమిలో నున్న హనుమంతుని ఎదుట, సీతాదేవి జుట్టుపట్టుకొని తన చేతనున్న పదునైన ఖడ్గంతో ఆమెశిరస్సును ఖండించాడు. అదిచూసిన హనుమంతుడు నిజమైన సీతాదేవిని ఇంద్రజిత్తు చంపివేశాడని శోకానికి లోనయ్యాడు.

## తొంబదియవ అధ్యాయము

జవాబులు : 1.4. అంగదుడు 2.3. హనుమంతుడు

3. మకరాక్షుని

.........

# యుద్ధ కాండము

## 82, 83, 84, 85, 86, 87 సర్గలు

## తొంబది ఒకటవ అధ్యాయము

1. ప్రశ్న : హనుమంతాదులకు ఇంద్రజిత్తు తన మాయాశక్తి చేత సీతాదేవిని చంపినట్లుగా చూపించి వెళ్ళి, తాను ఏ హోమాన్ని చేయబూనాడు ?

జవాబు : 1. విశ్వజిత్యాగం 2. అశ్వమేధం

3. ఇష్టిహోమం 4. నికుంబిలా హోమం

2. ప్రశ్న : సీతాదేవిని ఇంద్రజిత్తు తన ఎదుటనే సంహరించాడని మారుతి శ్రీరామునికి తెలుపగా, ఆయన పరిపరి విధాల బాధపడుతూండగా శ్రీరాముడిని ఓదార్చింది ఎవరు ?

జవాబు : 1. లక్ష్మణుడు 2. సుగ్రీవుడు

3. జాంబవంతుడు 4. హనుమంతుడు

3. ప్రశ్న : ఇంద్రజిత్తు చంపినది నిజమైన సీతాదేవి కాదని మాయా సీతయని, శ్రీరామునికి తెలిపినది ఎవరు?

జవాబు : జవాబుల కాలంలో ఉన్నది.

4. ప్రశ్న : ఇంద్రజిత్తును సంహరించడానికై లక్ష్మణస్వామిని విభీషణుడు ఏరీతిగా సమరోత్సాహాన్ని కలిగించాడు ?

జవాబు : ఇంద్రజిత్తు సీతాదేవిని సంహరించినాడని మారుతి వలన విన్న రాముడు శోకంలో మునిగి యుండగా, విభీషణుడు శ్రీరాముని వద్దకువచ్చి ప్రభూ! సీతాదేవిని ఇంద్రజిత్తు సంహరించడం నిజం కాదు. అది కేవలం మాయ మాత్రమే. మనలను ఇట్లు విచారంలో ముంచి, ఇంద్రజిత్తు నికుంబిలా హోమం చేయడానికి వెళ్ళాడు. ఇంద్రజిత్తు నికుంబిలా హోమం పూర్తి అయితే అజేయు డవుతాడు. కావున ఇప్పుడు అతనిని వధించడానికి నావెంట లక్ష్మణ స్వామిని పంపించండి. అతనిని లక్ష్మణస్వామి తప్పక సంహరించ గలడు. అని పలికిన విభీషణుని మాటలకు శ్రీరాముడు సంతసించి లక్ష్మణుని వైపు తిరిగి లక్ష్మణా! నీవు సుగ్రీవుని ఇంకనూ కొంత వానర బలగాలను భల్లూక బలగాలతో పాటు జాంబవంతుని కూడా వెంటబెట్టుకొని, విభీషణుని అనుసరించి వెళ్ళి, ఆ మాయలమారి ఇంద్రజిత్తును జయించు. ఆ ప్రాంత ఆనుపానులన్ని విభీషణునకు బాగా తెలుసు. అతడును తన మంత్రులతో నిన్ననుసరిస్తాడు. అని పలికిన తన అన్నగారి ఆదేశానుసారం లక్ష్మణుడు విభీషణునితో గూడి, శ్రేష్టమైన తన ధనస్సును చేతబట్టి కవచధారియై, ఖడ్గాన్ని ధరించి, శ్రీరాముని పాదాలకు నమస్కరించి, అన్నా! నేడు నేను ప్రయోగించే బాణాలు ఆ రావణ సుతుని చీల్చి చెండాడు గాక! అని విభీషణుని అనుసరించి వెళ్ళి, ఇంద్రజిత్తు బలగాలను చూశాడు.

5. ప్రశ్న : లక్ష్మణ ఇంద్రజిత్తుల యుద్ధం ఏవిధంగా జరిగింది? ఇంద్రజిత్తు, విభీషణుల వివాదాన్ని వివరించండి?

జవాబు : విభీషణుని అనుసరించి నికుంబిలా చైత్యానికి చేరిన లక్ష్మణునితో విభీషణుడు రామానుజా! ఇదిగో కనిపించే రాక్షస సేనను మట్టి

కరిపించనిదే అభిచార హోమంచేస్తున్న ఇంద్రజిత్తు వెలుపలికి రాడు. కావున ముందుగా ఈ రాక్షస సేనను చెల్లాచెదరు చెయ్యాలి అన్నాడు. వెంటనే లక్ష్మణుడు రాక్షససేనపై శరవర్షాన్ని కురిపించాడు. వృక్షాలు, పర్వత శిఖరాలు తీసికొని వానరసేన రాక్షస సేనను తీవ్రంగా ఎదుర్కొన్నది. అంతట రాక్షస సేన తమ చేతులలో నున్న ఆయుధాలతో వానర భల్లూక వీరులను ఎదుర్కొన్నారు. వానర వీరుల ధాటికి భయపడి చెల్లా చెదరవుతున్న తన సేనను చూసి ఇంద్రజిత్తు అభిచార హోమాన్ని ఆపివేసి, రథా రూడుడై యుద్ధసన్నద్ధు డయ్యాడు. అప్పుడు హనుమంతుడు ఒక మహావృక్షాన్ని పెకలించి రాక్షసుల పైకి విసిరాడు. ఇంద్రజిత్తు హనుమంతుని చంపడానికై కృతనిశ్చయుడైన విషయాన్ని గమనించి విభీషణుడు లక్ష్మణునికి తెలిపాడు. లక్ష్మణుడు ఇంద్రజిత్తును ఎదుర్కోవడానికై ముందుకు వచ్చాడు. అది గమనించిన ఇంద్రజిత్తు విభీషణునితో ఓ రాక్షసుడా! నీవు ఈ గడ్డపై పుట్టి పెరిగావు. మా తండ్రికి సాక్షాత్తు తమ్ముడవు. నాకు పిన తండ్రివి. ఇంతటి అనుబంధము గలవాడవై యుండి, నీవు నాకు ఇంతటి ద్రోహానికి పాల్పడు తున్నావు. దుర్బుద్ధీ! నీవు పులస్త్య వంశము వాడవన్న సంగతినే మరచిపోయావు. అని పలికిన ఇంద్రజిత్తు మాటలకు విభీషణుడు ఓ రావణ కుమారా! నీవన్నట్లు నేను క్రూరకర్ములైన రాక్షస కులంలో జన్మించినది వాస్తవమే. అధర్మ కార్యాలు నాకు రుచించవు. కాని తన తమ్ముని స్వభావం తనకు వ్యతిరేక మయినంత మాత్రాన, ఆ అన్న తమ్ముని ఇంటి నుండి వెళ్ళగొట్టవచ్చునా? ఈ కారణంగా నేనీ విధంగా ప్రవర్తించ వలసి వచ్చింది. అని విభీషణుడు ఇంద్రజిత్తుకు సమాధానం చెప్పాడు.

## తొంబది ఒకటవ అధ్యాయము

జవాబులు : 1.4. నికుంబిలా హోమం 2.1. లక్ష్మణుడు

3. విభీషణుడు

# యుద్ధ కాండము

## 88, 89, 90, 91, 92, 93 సర్గలు

## తొంబది రెండవ అధ్యాయము

1. ప్రశ్న : లక్ష్మణ ఇంద్రజిత్తుల మధ్య ఘోరయుద్ధం జరుగుతుండగా ఇంద్రజిత్తు రథాన్ని అధిరోహించి యున్నాడు. మరి లక్ష్మణుడు ఎక్కడ ఉండి యుద్ధం చేశాడు ?

జవాబు : 1. నేలపై నిలబడి 2. హనుమంతుని భుజాలపై నుండి
3. సుగ్రీవుని భుజాలపై నుండి 4. రథము పైనుండి

2. ప్రశ్న : ఇంద్రజిత్తు లక్ష్మణుల మధ్య జరిగిన ఘోర యుద్ధం కారణంగా ఆ ఇరువురి దేహాలు గాయాలపాలై అలసట చెందియుండగా, లక్ష్మణునకు మేలు చేయడానికై, ఎవరు ముందుకు వచ్చారు ?

జవాబు : 1. సుగ్రీవుడు 2. విభీషణుడు
3. హనుమంతుడు 4. జాంబవంతుడు

3. ప్రశ్న : రావణుని బలగాలన్ని నశించి పోయాయి. ఇప్పుడు మిగిలి ఉన్నది ఈ ఒక్క ఇంద్రజిత్తు ఒక్కడే. ఇతనిని సంహరిస్తే మనకు విజయం లభించినట్లే నని వానర సేనను ఉత్తేజపరచింది ఎవరు ?

జవాబు : జవాబుల కాలంలో ఉన్నది.

4. ప్రశ్న : ఇంద్రజిత్తును లక్ష్మణుడు ఏ విధంగా సంహరించాడు ?

జవాబు : మహావీరులైన లక్ష్మణ ఇంద్రజిత్తు లిరువురూ యుద్ధరంగంలో పోరాడుతూ, ఒకరిపై ఒకరు బాణాలవర్షాన్ని కురిపించు కుంటున్నారు. అటువంటి ఘోర సమరం సాగిస్తూన్నప్పుడు ఎవరిని ఎవరు దెబ్బ తీస్తున్నారో తెలియడం లేదు. విజయం ఎవరిని వరిస్తుందో నిర్ణయించడానికి వీలులేకుండా ఉంది. ఆ సమయంలో ఇంద్రజిత్తు రథానికి పూన్చిన నాలుగు గుర్రాలను లక్ష్మణుడు బాణాలతో తీవ్రంగా కొట్టాడు. పిమ్మట ఆ రామానుజుడు అత్యంత శక్తివంతమైన భాణంతో ఆ రాక్షస సారథి శిరస్సును ఖండించాడు. అప్పుడు ఇంద్రజిత్తు తన

రథాన్ని తానే నడుపుకొంటూ, యుద్ధం చేస్తున్నాడు. పిమ్మట పెల్లుబికిన ఉత్సాహంతో ప్రమాది, శరభుడు, రభసుడు, గంధమాధనుడు అనునలుగురు వానరయోధులు ఇంద్రజిత్తు గుర్రాలను చంపివేశారు. చేసేదిలేక ఇంద్రజిత్తు నేలపై నుండియే యుద్ధం చేయసాగాడు. ధనుర్ధారులైన లక్ష్మణ ఇంద్రజిత్తు లిరువురూ ఒకరినొకరు చంపుకోదలచి యున్నారు. ఆ సమయంలో ఇంద్రజిత్తు రాక్షసులతో నేనిప్పుడే లంకకువెళ్ళి మరొక రథంలో వస్తాను. అని చెప్పి అంతవరకు మీరు ధైర్యంతో పోరాడుతూ ఉండండి. అని ఇంద్రజిత్తు లంకకువెళ్ళి మరొకరథంపై యుద్ధరంగానికి వచ్చాడు. ఆ విధంగా వచ్చిన ఇంద్రజిత్తు, లక్ష్మణునికి విభీషణునికి ఎదురు నిలిచాడు. సమరావేశంతో ఉన్న ఇంద్రజిత్తు తన పిన తండ్రి విభీషణునిపై బాణాలను వేసి బాధించాడు. విభీషణుడు తన చేతనున్న గదా యుధంతో ఇంద్రజిత్తు రథాశ్వాలను సారథిని కొట్టి చంపాడు. అంతట ఇంద్రజిత్తు నేలపై దిగి లక్ష్మణునితో అతిఘోరంగా యుద్ధం చేస్తున్నాడు. ఆ ఇరువురు యోధులు అస్త్ర, శస్త్రాలను ప్రయోగించు కొంటూ సాగించిన సమరంలో చివరకు ఐంద్రాస్త్రంతో లక్ష్మణుడు ఇంద్రజిత్తును సంహరించాడు.

5. ప్రశ్న : ఇంద్రజిత్తు మరణా నంతరం రామ రావణులు ఏమి చేశారు ?

జవాబు : యుద్ధంలో గాయపడి వళ్ళంతా రక్తధారలతో నున్న లక్ష్మణుడు, విభీషణ, హనుమదాదులతో గూడి తన అన్నను చేరి వినయంగా ఇంద్రజిత్తు హతుడైన విషయాన్ని తెలిపాడు. అంతట విభీషణుడు శ్రీరామునితో ఇంద్రజిత్తు శిరస్సును ఖండించింది లక్ష్మణుడేనని తెలిపాడు. అందుకు శ్రీరాముడు ఎంతో సంతోషించి, లక్ష్మణుని ప్రశంసించి, ఇంక మనం రాక్షసులను జయించి నట్లేనని సంతోషించాడు. ఇది ఇట్లుండగా లంకలో రావణుని కుమారుడు ఇంద్రజిత్తు మరణ వార్తను తన మంత్రులు విని రణభూమికి వెళ్ళి, విగత జీవుడైయున్న ఇంద్రజిత్తును జూసి, ఇంతసేపు ఏడ్చారు. పిమ్మట వారు రావణునికి ఇంద్రజిత్తు మరణ వార్తను తెలిపారు. ఆ వార్తను విన్న రావణుడు స్పృహను కోల్పోయాడు. పుత్ర దుఃఖంతో

విలవిల లాడుచున్న రావణునికి, ఆలోచించే కొద్ది సీతను వధించుటయే మేలని పించింది. వెంటనే రావణుడు ఎంత మంది తన శ్రేయోభి లాషులు వద్దని వారిస్తున్నా వినకుండా, ఖడ్గధారియై అశోకవనానికి వెళ్ళాడు. అప్పుడు రావణుని మంత్రులలో బుద్ధిశాలియైన సుపార్శ్వుడు మహారాజా! నీ వంటి పరాక్రమశాలి ఒక స్త్రీని చంపటం మంచిది కాదు. నీ కోపం యుద్ధ భూమిలో రామునిపై చూపించు. అతనిని జయిస్తే సీతాదేవి ఎలాగూ నీవశమవుతుంది కదా! అని అనేక అనునయ వాక్యాలతో రావణుని సీతను చంపే ప్రయత్నాన్నుండి విరమింప జేశాడు.

## తొంబది రెండవ అధ్యాయము

జవాబులు : 1.2. హనుమంతుని భుజాలపై నుండి 2.2. విభీషణుడు

3. విభీషణుడు

..........

# యుద్ధ కాండము

## 94, 95, 96, 97, 98, 99 సర్గలు

## తొంబది మూడవ అధ్యాయము

1. ప్రశ్న : ఇంద్రజిత్తు మరణవార్త విన్న రావణుడు శోక వ్యాకులుడై, తన వెంట ఉన్న రాక్షస యోధులందరినీ మీరందరూ వెళ్ళి శ్రీరాముని సంహరించండి అని యుద్ధ భూమికి పంపించాడు. ఆనాడు జరిగిన పోరులో శ్రీరాముడు వీరవిహారం చేసి సాయం సమయానికి రాక్షసులందరినీ నేల పడగొట్టాడు. అప్పుడు రాముడు హనుమంతాదులతో ఈ దివ్యాస్త్ర బలం నాకునూ, మరి ఇంకొకరికి మాత్రమే ఉంది అని చెప్పాడు. శ్రీరాముడు తెలిపిన ఆయన ఎవరు ?

జవాబు : 1. పరమశివుడు 2. దేవేంద్రుడు

3. విశ్వామిత్రుడు 4. దశరథుడు

2. ప్రశ్న : రావణుడు పంపించిన చతురంగ బలగాలన్ని శ్రీరాముని చేతిలో

మరణించారని తెలిసి, రాక్షస స్త్రీలు విలపిస్తూ అసలు దీనికంతటికీ కారణం ఎవరుగా వారు తలపోశారు ?

జవాబు : 1. సీతాదేవి 2. ఖరుడు
3. శూర్పణఖ 4. రావణుడు

3. ప్రశ్న : రాక్షసస్త్రీలు తమ వారందరూ రణ భూమిలో పడిపోయారని విలపిస్తూండగా, యుద్ధ భూమికి ఎవరు బయలుదేరి వెళ్ళారు ?

జవాబు : జవాబుల కాలంలో ఉన్నది.

4. ప్రశ్న : విరూపాక్ష మహోదరులు ఎవరిచేతిలో ఏవిధంగా మరణించారు ?

జవాబు : రావణుడు యుద్ధ భూమికి బయలుదేరే సమయంలో లంకలో మిగిలియున్న రాక్షస వీరులందరూ ఆయనను అనుసరించి వచ్చారు. వారిలో విరూపాక్షుడు, మహోదరుడు, మహాపార్శ్వుడు కూడా ఉన్నారు. రణభూమి యందు రావణుని వీరవిహారానికి వానరులలో కొందరికి శిరస్సులు తెగిపడ్డాయి. కొందరి వక్షస్థలం బద్ధలయ్యింది. ఇంకొకరి శరీర భాగాలు తెగిపడు తున్నాయి. ఈ విధమైన పరిస్థితి చూసిన సుగ్రీవుడు సేనా శిబిర రక్షణ బాధ్యతను సుషేణునకు అప్పగించి తాను రావణునితో యుద్ధంచేయ సంకల్పించి, ఒక మహా వృక్షాన్ని చేతబట్టి వచ్చాడు. అది చూసి విరూపాక్షుడనే రాక్షసుడు రథం నుండి దిగి ఏనుగునెక్కి, భయంకరంగా గర్జిస్తూ, రణభూమి యందు సుగ్రీవునిపై బాణాలను ప్రయోగించాడు. ఆ బాణాల ధాటికి సుగ్రీవుడు గాయపడ్డాడు. వెంటనే తేరుకొని సుగ్రీవుడు క్రోధావేశంతో గర్జిస్తూ ఒక మహావృక్షాన్ని చేతబట్టి, దానితో కొట్టాడు. ఆ దెబ్బకు విరూపాక్షుడు ఎక్కి ఉన్న ఏనుగు కూలబడింది. వెంటనే విరూపాక్షుడు కత్తి, డాలును చేతబట్టి, సుగ్రీవునిపైకి వచ్చాడు. ఆ విధంగా సుగ్రీవుడు, విరూపాక్షుడు మధ్య జరిగిన సంకుల సమరంలో సుగ్రీవుని దెబ్బకు విరూపాక్షుడు రక్తసిక్తమైన దేహంతో నేలపై పడగా అతని నవరంధ్రాల నుండి రక్తం జలధారలవలె ప్రవహించగా విరూపాక్షుడు మరణించాడు. ఆ విధంగా విరూపాక్షుడు పడిపోవడాన్నిచూసిన రావణుడు, సుగ్రీవునిపైకి మహోదరుని పంపించాడు. ఆ మహోదరుడు

కూడా విరూపాక్షునిలాగే సుగ్రీవునితో కొంతసేపు పోరాడి చివరకు సుగ్రీవుని చేతిలో శిరస్సు ఖండింపబడి చనిపోయాడు.

5. ప్రశ్న : మహాపార్శ్వుడు ఎవరి చేతిలో ఏ విధంగా మరణించాడు ?

జవాబు : సుగ్రీవుని చేతిలో మహోదరుడు, విరూపాక్షుడు మరణించడాన్ని చూసిన అతిబలశాలియై మహాపార్శ్వుడు కోపంతో కన్నులెర్రన జేసి, భయంకరంగా ఉన్న వానర సేనతోనున్న అంగదుని, అతని సేనను తన బాణాలతో బాధించ సాగాడు. ఆ నిశాచరుని భాణాల ధాటికి, వానర సేనలోని వానర ప్రముఖుల శిరస్సులు తెగిపడి పోసాగాయి. ఆ విధంగా తన బలములుతగ్గి పోవడాన్ని చూసిన అంగదుడు, తన ప్రక్కన పడియున్న ఇనుపగుదియ నొకదానిని చేతబట్టి, ఆ మహాపార్శ్వుని తీవ్రంగా కొట్టాడు. ఆ దెబ్బకు ఆ రాక్షసుడు, తన సారథితో సహా స్పృహదప్పి, రథముపై నుండి నేలపై బడ్డాడు. అప్పుడు జాంబవంతుడు, గవాక్షుడు పెద్ద బండ రాళ్ళను చేతబట్టి మహాపార్శ్వుని రథాశ్వాలను, రథాన్ని ధ్వంసం చేశారు. అంతట స్పృహ నుండి కోలుకొన్న మహాపార్శ్వుడు అంగదుని బాణాలతో కొట్టాడు. పిమ్మట అంగదుడు ఒక పరిఘా యుధాన్ని చేతబట్టి, మహాపార్శ్వునిపైకి విసిరాడు. ఆపరిఘాయుధ దెబ్బకు మహాపార్శ్వుని ధనుర్బాణాలు, శిరస్త్రాణము నేలపై పడిపోయాయి. అంతట మహాపార్శ్వుడు ఒక గండ్ర గొడ్డలిని అంగదుని పైకి విసిరాడు. ఆ వాలి సుతుడు ఆ దెబ్బనుండి తప్పించుకొని, వజ్రతుల్యమైన తన పిడికిటి పోటుతో మహాపార్శ్వుని వక్షస్థలం బద్దలు చేసి చంపాడు. ఆ విధంగా మహాపార్శ్వుడు అంగదుని చేతిలో మరణించాడు.

## తొంబది మూడవ అధ్యాయము

జవాబులు : 1.1. పరమశివుడు    2.3. శూర్పణఖ

3. రావణుడు

# యుద్ధ కాండము

## 100, 101, 102, 103, 104, 105, 106 సర్గలు

## తొంబది నాలుగవ అధ్యాయము

1. ప్రశ్న : తన వారందరూ రణభూమిలో సమసిపోగా రావణుడు, శ్రీరాముడితో యుద్ధం చేయడానికై యుద్ధ భూమికి వచ్చి మొదటగా వానరులపై ఏ అస్త్రాన్ని ప్రయోగించాడు ?

జవాబు : 1. తామసాస్త్రము　　2. ఆగ్నేయాస్త్రము
3. వారుణాస్త్రము　　4. బ్రహ్మాస్త్రము

2. ప్రశ్న : రామ రావణ యుద్ధంలో రావణుడు ఏ ఆయుధంతో లక్ష్మణుని స్పృహకోల్పోయేట్లుగా కొట్టాడు ?

జవాబు : 1. మోదకి ఆయుధం　　2. ముసలా యుధం
3. తామసాస్త్రం　　4. శక్తి ఆయుధం

3. ప్రశ్న : రావణుని ఆయుథంతో చైతన్యాన్ని కోల్పోయిన లక్ష్మణుడు మరల ఏవిధంగా చైతన్యవంతుడయ్యాడు ?

జవాబు : జవాబుల కాలంలో ఉన్నది.

4. ప్రశ్న : రామ రావణుల యుద్ధం తీవ్రస్థాయికి చేరిన సమయంలో దేవేంద్రుడు శ్రీరాముడికి ఏ విధంగా సహాయం చేశాడు ?

జవాబు : రామ రావణులిద్దరూ చేస్తున్న భీకరమైన పోరులో అస్త్ర, ప్రత్యస్త్రాలతో ఒకరినొకరు చంపుకోవాలని తీవ్ర ప్రయత్నాలు చేసుకొంటున్నారు. ఆ సమయంలో భూమిమీద నుండి శ్రీరాముడు, బంగారు రథంపై నుండి రావణుడు యుద్ధం చేస్తున్నారు. అంతట దేవతల ప్రభువైన దేవేంద్రుడు తనరథాన్ని తీసికొనిపోయి, శ్రీరామునికి అప్పగించమని తన సారథియైన మాతలిని ఆదేశించాడు. అప్పుడు వెంటనే సారథి రాముని సమక్షంలో రథాన్ని నిలిపి, శ్రీరామునకు నమస్కరించి, రామా! ఈ యుద్ధంలో నీకు విజయాన్ని కలిగించడానికై దేవేంద్రుడు ఈ రథాన్ని పంపించాడు. అంతేగాక దివ్యమైన ఒక మహాధనస్సును,

కవచాన్ని, బాణాలను, వాడియైన శక్తి అనే బల్లాన్ని ఆ ప్రభువే నీకు సమర్పించాడు. మహా వీరుడవైన ఓ ప్రభూ! ఈ రథాన్ని అధిరోహించు. నేను నీకు సారథ్యం వహిస్తాను. అని మాతలి విన్నవించిన పిమ్మట శ్రీరాముడు ఆ రథానికి ప్రదక్షిణ పూర్వక నమస్కారం చేసి దానిని అధిరోహించాడు. అప్పుడా రామ రావణులకు అద్భుతమైన సంకుల సమరం జరిగింది. ఒకరిపై ఒకరు మహా దివ్యాస్త్రాలను ప్రయోగించు కొంటూన్న సమయంలో రావణుడు ప్రయోగించిన తీవ్రమైన త్రిశూలాయుధం తనపైకి రావడాన్ని చూసిన రాముడు దానిని నిరోధించడానికై తన శర పరంపరచే నివారించ బోయాడు. కాని రావణుని త్రిశూలాయుధ తీవ్రతకు అవి నిర్వీర్యమై పోవడాన్ని చూసిన రాముడు వెంటనే ఇంద్రుడు పంపించిన శక్తి ఆయుధాన్ని ప్రయోగించాడు. అప్పుడు శక్తి ఆయుధ ప్రభావంతో రావణుని శూలాయుధం నిర్వీర్యమై పోయింది. ఈ విధంగా దేవేంద్రుడు శ్రీరామునికి తనకు తగిన సహాయం చేశాడు.

5. ప్రశ్న : రామ రావణుల పోరు తీవ్రస్థాయికి చేరుకొన్న సమయంలో రావణుని సారథి తన రథాన్ని ఎందుకు ప్రక్కకు మళ్ళించాడు? అందుకు రావణునికి సారథి ఏమి వివరణ ఇచ్చాడు ?

జవాబు : రణభూమిలో శ్రీరాముని చేతిలో దెబ్బలు తిన్న రావణుడు రోషంతో, క్రోధమూర్తియై కన్నుల నిండా నిప్పులు రాల్చుతూ శ్రీరాముని బాగా దెబ్బతీశాడు. అంతట శ్రీరాముడు తన ఎదుట సమీపాన్నే ఉన్న రావణునిపై శరవర్షం కురిపించాడు. యుద్ధమందు శత్రువును వధింపగోరు శ్రీరామునికి తన అస్త్రపాటవము, శౌర్య పరాక్రమము, రణోత్సాహము రెట్టింపయ్యాయి. ఆ మహా పురుషునికి అస్త్రాలన్నీ వెంట వెంటనే జ్ఞాపకానికి రాసాగాయి. అది గమనించిన రాముడు రావణుని తీవ్రంగా కొట్టసాగాడు. వానర యోధుల శిలాప్రహారాలకు శ్రీరాముని శరపరంపరకు బాగా దెబ్బతిన్న రావణుడు, తన మనస్సు వికలం కాగా, తన ధనస్సును లాగి అస్త్ర, శస్త్ర ప్రయోగాలు చేసి ఎదిరింపలేక పోయాడు. ఓపిక చేసుకొని బాణాలను ప్రయోగిస్తున్నప్పటికి, ఆ రావణునికి అవసానదశ దగ్గర పడటంతో

అవి ఏమాత్రమూ ప్రయోజనాన్ని కూర్చలేక పోయాయి. అది గమనించిన రావణుని రథసారథి అతని దురవస్థ జూచి సావధానుడై నెమ్మదిగా రథాన్ని మరొక వైపునకు మళ్ళించాడు. అందుకు ఆగ్రహించిన రావణునితో సారథి ప్రభూ! గుర్రాలు దప్పికగొని యున్నాయి. మీకు కొంతసేపు విశ్రాంతి అవసరమై ఉందని గమనించి నేను రథాన్ని ప్రక్కకు మళ్ళించాను. అంతే గాని మరి ఏమీలేదు. ఇప్పుడు మీ ఆజ్ఞానుసారం రాముని ఎదుట రథాన్ని నిలుపుతాను అని ఆ సారథి ఆవిధంగానే చేశాడు.

## తొంబది నాలుగవ అధ్యాయము

జవాబులు : 1.1. తామసాస్త్రము  2.4. శక్తి ఆయుధం

3. హనుమంతుడు తెచ్చిన సంజీవిని ద్వారా

........

# యుద్ధ కాండము

## 107, 108, 109, 110, 111 సర్గలు

## తొంబది ఐదవ అధ్యాయము

1. ప్రశ్న : యుద్ధంచేసి చేసి అలసియున్న శ్రీరాముడిని, ఆకాశమందు దేవతలతో పాటు చూస్తున్న అగస్త్య మహర్షి, రాముడి విజయాన్ని ఆశించి ఆయనకు ఏ మంత్రాన్ని ఉపదేశించి, ఉపాసించ మని చెప్పాడు ?

జవాబు : 1. శివ మంత్రాన్ని  2. నారాయణ మంత్రాన్ని
3. ఆదిత్య హృదయ మంత్రాన్ని  4. నరసింహ మంత్రాన్ని

2. ప్రశ్న : రావణుడు మరలా యుద్ధ సన్నద్ధుడై రావడాన్ని చూసిన మాతలి శ్రీరాముని సూచన మేరకు, తన రథాన్ని రావణుని రథానికి ఎటువైపుగా పోనిచ్చి నిలిపాడు ?

జవాబు : 1. కుడి వైపుగా  2. ఎడమ వైపుగా
3. వెనుక వైపుగా  4. చాలా దూరం

3. ప్రశ్న : రామ రావణ యుద్ధం తీవ్రదశకు చేరుకున్న సమయంలో వారిరువురు ప్రయోగించు కొంటున్న అస్త్ర శస్త్ర పరంపర అంతా భౌతికమైనదా ? లేక మాయా కల్పితాలా ?

జవాబు : జవాబుల కాలంలో ఉన్నది.

4. ప్రశ్న : రావణ సంహారాన్ని గురించి శ్రీరాముడు ఎందుకు దీర్ఘాలోచనలో పడ్డాడు ?

జవాబు : రామ రావణులిరువురూ తమ తమ రథాల నుండి ఒకరిపై ఒకరు క్రోధంతో యుద్ధభూమి యందు పరస్పరము కవ్వించుకొంటూ, ఒకరిని ఒకరు వధించ దలచుకొని పోరాడుతూన్న వారి రూపాలు అతిభీకరంగా ఉన్నాయి. వారు చేస్తున్న యుద్ధాన్ని మానివేసి వానరులు, రాక్షసులు కన్నులప్పగించి చూడసాగారు. ఆ విధంగా రామ రావణ యుద్ధం ఒక రాత్రి పగలు అవిచ్ఛిన్నంగా జరిగింది. అప్పుడు శ్రీరాముడు అమిత రోషంతో మహావిష సర్పంవలె తీక్షణమైన బాణాన్ని సంధించి, రావణుని శిరస్సును ఛేదించాడు. ధగధగ మెరుస్తున్న కుండలాలు గలిగిన రావణుని శిరస్సు నేలపై పడడాన్ని సకలలోకాల వారు చూశారు. మరుక్షణమే ఆ శిరస్సు వంటిదే మరొకశిరస్సు రావణుని దేహం నుండి మొలచింది. వెంటనే రాముడు ఒడుపుగా మరొక బాణంతో ఆ శిరస్సును కూడా ఖండించాడు. వెంటనే ఎప్పటిలాగే రావణునికి శిరస్సు మరలా మొలిచింది. పిమ్మట శ్రీరాముని బాణాల ధాటికి ఖండింప బడిన ఎన్నో శిరస్సులు సమాన తేజస్సుతో వెంటనే మొలవడంతో ఆ రావణుడు హతుడు కాలేదు. కౌసల్యా నందవర్ధనుడైన రాముడు సర్వాస్త్ర ప్రయోగాలను ఎరిగిన మహావీరుడు. అనేక అస్త్రాలు కలిగి యున్నవాడు. అటు వంటి శ్రీరాముడు ఆ రాక్షస రాజును వధించే విషయంలో దీర్ఘాలోచనలో పడ్డాడు. దీనిని రథసారథి మాతలి గమనించాడు.

5. ప్రశ్న : రావణ సంహారం ఏ విధంగా జరిగింది ?

జవాబు : ఆ రామ రావణ యుద్ధంలో రావణుడు వేసిన బాణాలను రాముడు

నివారిస్తున్నాడే గాని అతనిని వధించ డానికి ఎందుకు పూనుకోవడం లేదు? అని మాతలి ఆలోచించి, ఓ రఘువీరా! ఏమీ ఎరుగని వానివలె నీవు అతనిని అనుసరిస్తున్నావు. ఇతడు మానవుని చేతిలో మరణిస్తాడు. కనుక నిన్నాశ్రయించి యున్న బ్రహ్మాస్త్రంతో ఇతనిని వధించు. అని పలికిన సారథి మాటలకు శ్రీరామునికి బ్రహ్మాస్త్ర విషయం స్ఫురణకు వచ్చింది. వెంటనే ఆ మహావీరుడు బుసలు కొట్టుచున్న మహా సర్పంవలె వెలుగులు చిమ్ముతున్న ఒక బాణాన్ని చేభూని, మహాబల పరాక్రమ శాలియైన శ్రీరాముడు వేద మంత్రాలతో విద్యుక్తంగా అభి మంత్రించి, ఆ బ్రహ్మాస్త్రాన్ని ధనస్సు నందు ఎక్కుపెట్టి, ఆకర్ణాంతము లాగి, ఆయువు పట్టులను ఛేదించ గలిగే బ్రహ్మాస్త్రాన్ని రావణునిపై ప్రయోగించాడు. వెంటనే ఆ అస్త్రం రావణుని వక్షస్థల మందు నాటుకొని హృదయాన్ని చీల్చివేసింది. మరుక్షణమే రావణుని ప్రాణాలను హరించిన ఆ అస్త్రం భూమికి తగిలి, తన కర్తవ్యాన్ని ముగించుకొనిన వినమ్ర సేవకునివలె తిరిగి శ్రీరాముని తూణీరాన చేరింది. అప్పుడా రావణుని హస్తమందున్న బాణ సహితమైన ధనస్సు అతని ప్రాణాలతో పాటు నేల పాలయ్యింది. మహా బలశాలియు, తేజశ్వియు అయిన ఆ రాక్షసరాజు తన ప్రాణాలను కోల్పోయి, వజ్రాయుధం దెబ్బకు హతుడైన వృత్రాసురుని వలె రథం నుండి రణభూమి యందు పడిపోయాడు. అంతట సకలభూతకోటి సంతోషించింది. సుగ్రీవుడు, విభీషణుడు, లక్ష్మణుడు తమ అనుచరులతో గూడి శ్రీరాముడిని ఆ రణభూమి యందు విద్యుక్తంగా పూజించి ప్రశంసించారు.

## తొంబది ఐదవ అధ్యాయము

జవాబులు : 1.3. ఆదిత్యహృదయ మంత్రాన్ని 2.1. కుడివైపుగా
3. మాయాకల్పితాలే

# యుద్ధ కాండము

## 112, 113, 114, 115, 116 సర్గలు

## తొంబది ఆరవ అధ్యాయము

1. ప్రశ్న : శ్రీరాముని చేతిలో హతుడై భూమిపై పడియున్న తన అన్నయైన రావణుని జూసి విభీషణుడు శోకంతో కృంగి పోతుండగా ఆయనను ఎవరు ఊరడించారు ?

జవాబు : 1. లక్ష్మణుడు 2. సుగ్రీవుడు
3. హనుమంతుడు 4. శ్రీరాముడు

2. ప్రశ్న : రావణ మరణవార్తను విని అంతఃపుర స్త్రీలందరూ శోకిస్తూ, జనులు వారిని వారిస్తున్నా వినకుండా, యుద్ధభూమికి వెళ్ళాలని ఏ ద్వారం గుండా వెలుపలికి వచ్చారు ?

జవాబు : 1. దక్షిణ ద్వారం 2. ఉత్తర ద్వారం
3. తూర్పు ద్వారం 4. పశ్చిమ ద్వారం

3. ప్రశ్న : రణభూమియందు రావణుని దేహాన్నిచూసి విలపిస్తున్న స్త్రీలలో ఉన్న మండోదరి రావణునికి ఎన్నో భార్య ?

జవాబు : జవాబుల కాలంలో ఉన్నది.

4. ప్రశ్న : శ్రీరాముడు విభీషణునికి లంకారాజ్య పట్టాభిషేకాన్ని ఏ రీతిగా నిర్వహింప జేశాడు ?

జవాబు : యుద్ధం పరిసమాప్తం అయిన పిమ్మట రాముడు తనకు ఇంద్రునిచే పంపబడిన రథాన్ని తీసికొని వెళ్ళుటకు మాతలికి మర్యాద పూర్వకంగా అనుమతి నిచ్చాడు. పిమ్మట శ్రీరాముడు సుగ్రీవుని తన అక్కున చేర్చుకొని, ఆయనకు తన గాఢాలింగన సౌఖ్యాన్ని అనుగ్రహించాడు. అనంతరమా ప్రభువు సౌమిత్రి సూచన మేరకు అందరితో గూడి సైనిక శిభిరాలకు వెళ్ళాడు. అటు పిమ్మట శ్రీరాముడు తన చెంతనే ఉన్న లక్ష్మణుని జూసి తమ్ముడూ! విభీషణుడు నాపై అనురాగము గలవాడు. పరమ భక్తుడు. ఈ యుద్ధంలో మనకు

మిగుల తోడ్పడిన వాడు. అటువంటి సత్పురుషుని లంకా రాజ్యానికి రాజుగా పట్టాభిషిక్తుని గావించు అని రామచంద్రుడు ఆదేశించగా లక్ష్మణుడు సంతోషంతో సుగ్రీవాది వానర ప్రముఖుల తోనూ, విభీషణునితోనూ గూడి లంకా నగరంలో ప్రవేశించాడు. అంతట లక్ష్మణుడు మహా వేగంతో వెళ్ళే వారిని ఎంపిక చేసి, వారికి బంగారు పాత్రను ఇచ్చి సముద్రాల నుండి జలాలను తెప్పించాడు. అనంతరమా లక్ష్మణుడు విభీషణుని సింహాసనంపై కూర్చుండ బెట్టాడు. ఆ రాజసభ విభీషణుని మిత్రులతోనూ, వానర ప్రముఖుల తోనూ, కిటకిట లాడింది. అప్పుడు పెద్ద లందరూ, వేదోక్త ప్రకారంగా సింహాసనంపై నున్న విభీషణునికి సప్త సముద్ర జలాలతో అభిషేకించారు. అప్పుడు వారంతా అక్షతలు, పేలాలు, మోదకాలు, పుష్పాలు సుగంధ ద్రవ్యాలు ఆ రాక్షస ప్రభువుకు సమర్పించారు. శ్రీరాముడు చేసిన ప్రతిజ్ఞ మేరకు రామానుగ్రహంతో విభీషణుడు లంకకు రాజయ్యాడు.

5. ప్రశ్న : యుద్ధానంతరం హనుమంతుడు సీతాదేవిని దర్శించగా, ఆమె మారుతి ద్వారా ఏ విధమైన సందేశాన్ని శ్రీరామునికి పంపించింది ?

జవాబు : శ్రీరాముని ఆదేశం ప్రకారం మారుతి లంకలో ప్రవేశించి, విభీషణుని అనుమతితో అశోకవనంలో ఉన్న సీతాదేవిని దర్శించాడు. హనుమంతుడు తన సమీపానికి రాగా జూసి, ఆయనను మారుతిగా గుర్తించిన సీతాదేవి సంతోషాతి రేకంతో ఏమీ మాట్లడలేక పోయింది. అప్పుడు హనుమంతుడు తనరాకతో ప్రసన్నంగా ఉన్న ఆమె ముఖాన్ని జూసి, రాముని సందేశాన్ని వినిపించసాగాడు. అమ్మా! వైదేహి! రాముడును, లక్ష్మణుడును క్షేమంగా ఉన్నారు. యుద్ధానికి తోడ్పడిన, సుగ్రీవ, విభీషణాదులు అందరూ క్షేమంగా ఉన్నారు. లోక కంటకుడైన రావణుని సంహరించిన రామచంద్ర ప్రభువు నీక్షేమ సమాచారాన్ని గూర్చి అడిగాడు. అమ్మా! నీకు అమిత సంతోషాన్ని కలిగించే ఈ ప్రియ వచనాలను తెలిపాను. ఓ సాధ్వీ! నీవింత వరకు ప్రాణాలను నిలుపుకొని యుండుటం నా అదృష్టం. లేనిచో నా యీ విజయానికి అర్థమే ఉండదు. అమ్మా! ఇంకనూ ఎందుకు చింతిస్తున్నావు. నాతో మాట్లాడవేమి? అని పలికిన హనుమంతునితో అమ్మవారు పరమ

ప్రీతితో గద్గద స్వరంతో మారుతీ! నా పతి దేవుడు విజయాన్ని సాధించినాడన్న వార్తను విని సంతోషంతో క్షణకాలం మాట్లాడలేక పోయాను. అని పలికిన జానకీదేవి ఎదుట ప్రాంజలియై నిలిచిన మారుతి ఓ పూజ్యరాలా! ఇంక నేనా ప్రభువు వద్దకు వెళ్తాను. నీ సందేశాన్ని అనుగ్రహించు మనగా, ఆ జానకీ దేవి వానరోత్తమా! నేను నాపతిదేవుని చూడగోరు తున్నాను. అని చెప్పింది. అంతట హనుమంతుడు ఆమె అనుమతితో వేగంగా వెళ్లి శ్రీరాముని ఎదుట నిలిచాడు.

### తొంబది ఆరవ అధ్యాయము

జవాబులు : 1.4. శ్రీరాముడు 2.2. ఉత్తర ద్వారం

3. మొదటి భార్య

............

# యుద్ధ కాండము

## 117, 118, 119, 120, 121 సర్గలు

## తొంబది ఏడవ అధ్యాయము

1. ప్రశ్న : రామాజ్ఞ ప్రకారం విభీషణుడు సీతాదేవిని శ్రీరాముని వద్దకు ఏ విధంగా తీసికొని వచ్చాడు ?

జవాబు : 1. ఏనుగుపై ఎక్కించుకొని 2. రథముపై

3. పల్లకిలో 4. పుష్పక విమానంలో

2. ప్రశ్న : శ్రీరాముడు సీతాదేవితో రావణుని పాపపు చూపులచే నీవు చూడబడ్డావు. కనుక నిన్ను సందేహించ వలసి వస్తూంది. ఇక మీదట నీవీ దశదిశలలో ఎక్కడికైనా వెళ్ళి ఉండవచ్చును. అన్నప్పుడు ఆమె ఏమి నిర్ణయం తీసికొన్నది ?

జవాబు : 1. అగ్ని ప్రవేశం చేయడానికి 2. విభీషనుని ఆశ్రయించి ఉండడానికి

3. సుగ్రీవుని ఆశ్రయించి ఉండడానికి 4. హనుమంతుని ఆశ్రయించి ఉండడానికి

3. ప్రశ్న : ఏ భయంతో శ్రీరాముడు సీతాదేవితో కఠినపు మాటలు మాట్లాడాడు ?

జవాబు : జవాబుల కాలంలో ఉన్నది.

4. ప్రశ్న : సీతాదేవి అగ్నిప్రవేశం చేసిన సమయంలో బ్రహ్మదేవుడు ప్రత్యక్షమై ఏ మాటలు మాట్లాడాడు ?

జవాబు : సీతాదేవి అగ్ని ప్రవేశం చేసిన సమయంలో వానర రాక్షసుల హాహాకారాల ధ్వనులు విని, ధర్మాత్ముడైన శ్రీరాముడు ఎంతో దుఃఖితుడై వ్యాకులతతో కన్నీరు గార్చుచూ, క్షణకాలం పాటు ఆలోచనలో పడ్డాడు. ఇంతలో బ్రహ్మాది దేవతలు ప్రత్యక్షమై రామా! నీవు సర్వశ్రేష్ఠుడవు. జ్ఞానులలో అగ్రేసరుడవు. సీతాదేవి అగ్ని ప్రవేశం చేస్తుండగా ఎట్లు ఉపేక్ష చేస్తున్నావు? నీవు సర్వదేవతా శ్రేష్ఠుడైన శ్రీమన్నారాయణుడవు. ఆ విషయాన్ని నీవు గ్రహించ లేకున్నావు అని పలికాడు. అప్పుడు బ్రహ్మాది దేవతలకు శ్రీరాముడు నమస్కరించి, దశరథ మహారాజు కుమారుడైన శ్రీరాముడిగా, సామాన్య మానవునిగా నన్ను గురించి నేనను కొంటున్నాను. కాని నేనెవరినో? ఎవరి వాడనో? ఎందుకు వచ్చానో? బ్రహ్మదేవుడు నాకు వివరించ ప్రార్థన అన్నాడు. అప్పుడు బ్రహ్మదేవుడు సత్య పరాక్రమా! రామా! యథార్థాన్ని చెబుతాను విను. నీవు జగత్కారణుడవైన నారాయణుడవు. షడ్గుణైశ్వర్య సంపన్నుడవు. ఈ సీతాదేవియే లక్ష్మీదేవి. లోకకంటకు డైన రావణుని వధించడానికై భూలోకంలో మానవునిగా అవత రించావు. ధర్మ సంస్థాపనం చేసి దేవకార్యాన్ని నెరవేర్చావు. నిన్ను స్తుతించడం వలన కోరిన కోరికలు నెరవేరతాయి. అని బ్రహ్మదేవుడు స్వయంగా రామచంద్రునితో తెలిపాడు.

5. ప్రశ్న : అగ్నిప్రవేశం చేసిన సీతాదేవిని అగ్నిదేవుడు శ్రీరామునికి ఏ విధంగా అప్పగించాడు ?

జవాబు : బ్రహ్మదేవుని శుభ వచనాలు వినినంతనే అగ్నిదేవుడు తండ్రి వలె సీతాదేవిని వెంట బెట్టుకొని అగ్ని గుండం నుండి పైకివచ్చి, మండుతున్న సమిధలను ప్రక్కకు తొలగించి, వెలుపలికి వచ్చి నిలబడ్డాడు. అద్వితీయమైన రూప వైభవములు గల ఆ సీతాదేవిని అగ్నిదేవుడు శ్రీరామునకు అప్పగించాడు. అప్పుడు లోక సాక్షియైన ఆ

అగ్నిదేవుడు రామచంద్ర ప్రభూ! నీ ధర్మపత్నియైన ఈ వైదేహి యందు ఎట్టిదోషమూ లేదు. ఈమె త్రికరణ శుద్ధిగా ఎల్లప్పుడూ నిన్నే ధ్యానిస్తూంటుంది. ఈమె యందు ఎట్టి దోషమూ లేదు. అని పలికిన అగ్నిదేవుని మాటలు విని రాముడు అయ్యో! ఇట్టి ఉత్తమురాలిని అన్యాయముగా కఠినమైన మాటలతో నొప్పించానే, అని తలపోస్తూ వ్యాకులపాటుతో కంట తడిపెట్టాడు. క్షణకాలం పాటు ఆలోచించిన పిమ్మట ఆ దేవతా శ్రేష్టునితో 'హవ్యవాహనా!' సీతాదేవి యందు ఎట్టి దోషమూలేదు. ఈమె పవిత్రురాలు కాని రావణ నగరమందలి అశోక వృక్షపు నీడలో చాలాకాలం ఉన్నందున త్రిలోకాల వారును ఈమెను శంకించకుండా ఉండేందుకు గాను ఈ పరీక్షను నిర్వహించవలసి వచ్చింది. ఈ అయోనిజ యొక్క పవిత్రతను వెల్లడి కావడానికై ఎటువంటి పరీక్షను పెట్టకుండా నేను పరిగ్రహిస్తే లోకులు దశరథ రాముడు కామాతురుడు, మూర్ఖుడు అని నన్ను నిందిస్తారు. సర్వదా సత్యవ్రతుడనైన నేను సీతాదేవి యొక్క శీలాన్ని ముల్లోకాల వారును విశ్వసించడానికై ఆమె అగ్నిప్రవేశం చేస్తున్నను ఉపేక్ష వహించాను. అని శ్రీరాముడు సీతాదేవిని దగ్గరకు తీసికొని సుఖంగా ఉన్నాడు.

### యుద్ధ కాండము – తొంబది ఏడవ అధ్యాయము

జవాబులు : 1.3. పల్లకిలో 2.1. అగ్నిప్రవేశం చేయడానికి

3. లోకాపవాద భయంతో

......

# యుద్ధ కాండము

## 122, 123, 124, 125, 126 సర్గలు

## తొంబది ఎనిమిదవ అధ్యాయము

1. ప్రశ్న : సకల దేవతలతో పాటు ప్రత్యక్షమైన శంకరుడు రామా! ఇదిగో ఆకాశమందున్న దివ్య విమానంలో ఆశీనుడై యున్న ఈ మహా పురుషుని చూడు అన్నాడు. ఆ మహా పురుషుడు ఎవరు ?

జవాబు : 1. నారాయణుడు 2. దశరథుడు
3. బ్రహ్మదేవుడు 4. ఇంద్రుడు

2. ప్రశ్న : రామచంద్ర ప్రభువు భరతుని ప్రతిజ్ఞను ఎవరికి వివరించి చెప్పాడు ?

జవాబు : 1. హనుమంతునికి 2. సుగ్రీవునికి
3. విభీషణునికి 4. జాంబవంతునికి

3. ప్రశ్న : శ్రీరాముని కోరికపై దేవేంద్రుడు మృతులై పడియున్న వానరులను ఏమి చేశాడు ?

జవాబు : జవాబుల కాలంలో ఉన్నది.

4. ప్రశ్న : శ్రీరాముడు తనవారందరితో గూడి అయోధ్యకు ఏరీతిగా బయలు దేరాడు ?

జవాబు : విభీషణుడు కోరిన ప్రకారం స్నానాధికములను కూడా నిర్వహించ డానికి ఇష్టపడని శ్రీరాముడు, ఓ రాక్షస రాజా! పదునాలుగు సంవత్సరాల నా వనవాస దీక్ష పూర్తి అయిన తరువాత కూడా నేను ఇక్కడ ఆలస్యం చేయడం మంచిది కాదు. నా కొరకై నా తమ్ముడు భరతుడు ఎదురు చూస్తూంటాడు. ఈ వనవాస దీక్షతోనే నేను అయోధ్యకు వెళ్ళాలి. కాని అయోధ్యా నగరం చాలా దూరంలో ఉన్నది. ప్రయాణం కష్టమవు తుందని భావిస్తున్నాను. అని పలికిన శ్రీరాముని మాటలు విన్నంతనే విభీషణుడు మహారాజా! మిమ్ములను ఒక్క రోజులోనే అయోధ్యకు చేర్చగలిగే పుష్పక విమానముంది. దానిని రావణుడు కుబేరుని జయించి తెచ్చినది. అని పలికిన విభీషణునితో రాముడు వెంటనే విమానాన్ని సిద్ధపరచి, నాకు వెళ్ళడానికి అనుమతించు. అని శ్రీరాముని మాటలతో విభీషణుడు అందంగా అలంకరింప బడిన పుష్పక విమానాన్ని శ్రీరామునికి సమీపాన ఉంచి, వినయంగా నిలబడ్డాడు. అప్పుడు రాముడు సుగ్రీవునితో మిత్రమా! ఒక స్నేహితుడికి సహృదయంతో చేయ వలసిందంతా నీవు నాకు చేశావు. ఇంక నీవు నీ సైన్యంతో కిష్కింధకు వెళ్ళండి. ఇంకనూ వానరోత్తములారా! మీ మిత్రుడైననాకు మీరెంతో సహాయ పడ్డారు. ఇక మీదట మీరంతా మీ ఇష్టానుసారం మీ మీ స్థానాలకు వెళ్ళవచ్చును. మిత్రమా విభీషణా! నా తోడ్పాటు వలన నీకు లభించిన ఈ లంకా రాజ్యంలో హాయిగా నివశించు. ఇదే నేను మీకు వీడ్కోలు పలుకు తున్నాను. అని పలికిన శ్రీరాముని మాటలకు సుగ్రీవ, హనుమంతాది వానరోత్తములును, విభీషణుడును అంజలి ఘటించి స్వామీ! మేమును నీతో అయోధ్యకు రావడానికి

అనుమతించండి. అని అడిగిన వారి ప్రార్థనలను మన్నించి రామచంద్ర ప్రభువు అంగీకరించాడు. అందరూ విమానాన్ని ఎక్కి కూర్చున్నారు. ఈ విధంగా శ్రీరాముడు తన వారందరితో గూడి అయోధ్యకు బయలుదేరాడు.

5. ప్రశ్న : పుష్పకముపై ప్రయాణిస్తున్న శ్రీరాముడు సీతాదేవితో ఏ విధంగా ముచ్చటించాడు ?

జవాబు : శ్రీరాముని అనుమతితో విమానం బయలు దేరగానే ఆ కోదండ రాముడు భూమివైపు తన చూపులను ప్రసరింపజేసి జానకీదేవితో వైదేహీ! ఇదిగో లంకానగరం, ఇదిగో రణభూమి మాంస ఖండాలతో రక్త ప్రవాహాలతో బురదగట్టి యున్నది. వేల కొలది స్త్రీలతో గూడివచ్చిన మండోదరి తన భర్త మృతికై విలవిల లాడుచూ కన్నీరు గార్చినది ఇక్కడే. సీతా! ఇదిగో ఈ సముద్ర తీరం చూడు. అపార జలరాశితో నున్న ఈ సముద్రముపై సేతువును నిర్మించాము. వైదేహీ! ఇదిగో! చిత్ర విచిత్రములైన వనాలతో మధువనము, పంపాతీర వనాలు మొదలైన వాటితో కనబడు తున్నదే అదే కిష్కింధ. ఈ నగరం సుగ్రీవునిది. అని పలుకుతున్న శ్రీరామునితో స్వామీ! కిష్కింధలో సుగ్రీవునకు సంబంధించిన స్త్రీలను కూడా అయోధ్యకు తీసికొని వెళ్ళిన బాగుండును అని అడిగిన సీతాదేవి కోరిక ప్రకారం శ్రీరాముడు అట్లే చేశాడు. పిమ్మట ప్రయాణం సాగిస్తూ శ్రీరాముడు సీతాదేవికి, ఋష్యమూక మహాగిరిని, జటాయువు నివశించిన వటవృక్షాన్ని, శరబంగాది మహర్షుల ఆశ్రమాలను, గంగానదిని, శృంగబేరి పురాన్ని చూపించాడు. ఈ విధంగా శ్రీరాముడు సీతాదేవితో విమానంలో ముచ్చటించాడు.

## తొంబది ఎనిమిదవ అధ్యాయము

జవాబులు : 1.2. దశరథుడు 2.3. విభీషణునికి

3. సజీవులనుగా చేశాడు

...........

# యుద్ధ కాండము

## 127, 128, 129, 130, 131 సర్గలు

## తొంబది తొమ్మిదవ అధ్యాయము

1\. ప్రశ్న : అయోధ్యకు మూడు యోజనాల దూరంలో పుష్పక విమానాన్ని దించి, శ్రీరాముడు ఏ మహర్షి ఆశ్రమంలో ప్రవేశించాడు ?

జవాబు : 1. అగస్త్య మహర్షి 2. భరద్వాజ మహర్షి
3\. వసిష్ట మహర్షి 4. విశ్వామిత్ర మహర్షి

2\. ప్రశ్న : ఆశ్రమంలో మహర్షి ఏర్పాటుచేసిన ఆతిథ్యాన్ని స్వీకరించిన శ్రీరాముడు ముందుగా భరతుని వద్దకు ఎవరిని పంపించాడు?

జవాబు : 1. సుగ్రీవుడిని 2. విభీషణుడిని
3\. హనుమంతుడిని 4. అంగదుడిని

3\. ప్రశ్న : శ్రీరాముని వనవాస చరిత్రను మొదటగా భరతునికి తెలిపినది ఎవరు?

జవాబు : జవాబుల కాలంలో ఉన్నది.

4\. ప్రశ్న : భరతుడు శ్రీరామునికి స్వాగత ఏర్పాట్లను, పట్టాభిషేక ప్రయత్నాలను ఏరీతిగా నిర్వహించాడు ?

జవాబు : హనుమంతుని మాటలు విన్నంతనే భరతుడు సంతోషంతో, శత్రుఘ్నుని వైపు చూసి తమ్ముడా! మన అన్నగారైన రామచంద్ర ప్రభువు తెల్లవారే సరికల్లా ఇచటికి వస్తున్నాడు. ఈ రాత్రికిరాత్రే అయోధ్యా నగరాన్ని సుందరంగా అలంకరించు. అని ఆజ్ఞాపించి నంతనే, అయోధ్యా పౌరులు ఆనాటి తెల్లవారు జాముకల్లా అయోధ్యా నగరాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. అటు పిమ్మట తెలతెలవారు తుండగా, రాజమాతలు, గురువులు, మంత్రులు, సైన్యాధ్యక్షులు, పురప్రముఖులు, ధ్వజపతాకాలను చేతబట్టిన సైనికులు, పురోహితుల తోడను, వివిధ వృత్తులవారి తోనూ, పూల మాలలతోనూ మధుర పదార్థాలను చేతబట్టి వసిష్టాదులు వెంటరాగా, శ్రీరామచంద్రుని శుభాగమనానికి సంతుష్టుడైయున్న భరతుడు ఆ స్వామి పాదుకలను శిరసునదాల్చి, రాజ మర్యాదలతో ఎదురు

చూస్తుండగా, అల్లంత దూరాన దివ్యమైన పుష్పక విమానం కనబడింది. ఆ విమానం వారికి దగ్గరగానే క్రిందికి దిగగానే, అచటివారంతా విమానమందున్న రామచంద్ర ప్రభువును దర్శించారు. అప్పుడు భరతుడు శ్రీరామునిచేరి అన్నయా! మా అమ్మమాటలను ఆమోదించి, నీవు న్యాసముగా నాకు ఇచ్చిన ఈ రాజ్యాన్ని తిరిగి ఇప్పుడు నీకప్పగిస్తున్నాను. కావున ప్రభూ! ఈ రాజ్యానికి పట్టాభిషిక్తుడవై, నీ భక్తులము, భృత్యులము అయిన మమ్మలను పాలించు. నీ పట్టాభిషేక మహోత్సవం చూసి ఈ జగత్తంతా సంతోష భరితంకావాలి. అని చెప్పిన భరతుని మాటలకు శ్రీరాముడు అటులనే జరుగునుగాక! అన్నాడు. అటు పిమ్మట భరతుడు పట్టాభిషేకానికి కావలసిన ఏర్పాట్లను ఎవరికి తగిన పనిని వారికి అప్పగించాడు.

5. ప్రశ్న : శ్రీరామ పట్టాభిషేకం ఏ విధంగా జరిగింది?

జవాబు : నందిగ్రామం నుండి అందరూ ఊరేగింపుగా అయోధ్యను చేరిన పిమ్మట, శ్రీరామునికి పట్టాభిషేకం జరిపించే రత్న సింహాసనం ఉన్న వేదికను అన్ని విధాలుగా అలంకరించారు. ఆ పట్టాభిషేకాన్ని తిలకించ డానికి వచ్చిన మంత్రులతో సహా, సకల ప్రభుత్వోద్యోగులు, పురప్రముఖులు, ఎవరి స్థాయికి తగిన ఆసనాలలో వారు ఆసీను లయ్యారు. అనంతరం వంశ పురోహితులైన శ్రీ వసిష్టులు ఋత్విజుల వేద మంత్రోచ్చారణల నడుమ సర్వాలంకార భూషితులైన శ్రీ సీతా రామచంద్ర ప్రభువులను రత్న సింహాసనముపై కూర్చుండ జేశారు. అనంతరం మంగళ వాయిద్యాలతో, వేదమంత్రాలతో వసిష్టుడు, వామదేవుడు, జాబాలి, మొదలగు మహర్షులు, పురుషోత్తముడగు శ్రీరామచంద్ర ప్రభువును నిర్మలమైన సుగంధ జలాలతో, వసువులు దేవేంద్రునివలె అభిషేకించారు. పిమ్మట వేదమంత్ర పూర్వకంగా వివిధ రకాలైన ఓషధీ రసాలతో కలిపిన పవిత్ర జలాలతో సీతా రాములను అభిషేకించారు. అటు పిమ్మట, మొట్టమొదట మనువు పట్టాభిషేక సమయంలో ఆయనకు ధరింపజేసిన రత్న కిరీటాన్ని

వంశక్రమాను సారంగా, అయోధ్యాధి పతులందరూ ధరించిన ఆ కిరీటాన్ని, రత్న సింహాసనంపై ఆశీనుడైయున్న రామచంద్ర ప్రభువుకు, వేద మంత్ర పూర్వకంగా శ్రీ వసిష్టమహర్షి ధరింపజేశాడు. పిమ్మట ఋత్విక్కులు కూడా ఆ ప్రభువును ఇతర ఆభరణాలతో అలంకరింప జేశారు. అటుపిమ్మట శ్రీరామచంద్ర ప్రభువు చక్రవర్తియై భరతుడిని యువరాజుగా జేసుకొని, అశ్వమేధాది అనేక యాగాలు చేస్తూ, ప్రజలను కన్నబిడ్డలవలె చూసుకొంటూ అనేక సంవత్సరాలు రాజ్యాన్ని పరిపాలించాడు.

## తొంబది తొమ్మిదవ అధ్యాయము

జవాబులు : 1.2. భరద్వాజ మహర్షి 2.3. హనుమంతుడుని
3. హనుమంతుడు

## శ్రీరామాయణము - ప్రశ్నావళి
## సంపూర్ణము

**పురాణం అంటే తరతరాల సంస్కృతిని, సంప్రదాయాలను తెలియజెప్పే చారిత్రక విజ్ఞాన సర్వస్వం. శ్రీమద్ వాల్మీకి మహర్షిచే రచింపబడిన ఈ అద్భుత కావ్యాన్ని ప్రాంతీయ బాషలకనుగుణంగా రచించినవారికి వినిపించిన వారికి, విన్న వారికి పాపరాశి తొలగి పుణ్యం ప్రాప్తించి, తత్కారణంగా వైకుంఠుని చరణ సన్నిధానం దక్కుతుంది.**

సర్వేజనాః సుఖినోభవంతు
సమస్త సన్మంగళా నిబంతు
ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః